సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 179

బుధవారం 15-3-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'




**చీరకట్టులో వరల్డ్ టూర్**

నౌవారీ చీరలో 40 దేశాలు బైక్‌పై చుట్టి రానున్న రమాబాయి - 11లో



**నాలుగో రోజూ నష్టాలే..**

ఐదు నెలల కనిష్టానికి నిఫ్టీ.. 58 వేల దిగువకు సెన్సెక్స్ - 13లో



**ఏనుగమ్మ.. ఏనుగు**

మనుషులకు, ఏనుగులకు మధ్య ఘర్షణ ఎందుకు? దేశంలో గజరాజుల సంరక్షణకు ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి?

వివరాలు 6లో ▸



**యూఎస్ డ్రోన్‌ను ఢీకొట్టిన 'రష్యా'**

రష్యా యుద్ధ విమానం నల్ల సముద్రంపై అమెరికా నిఘా డ్రోన్‌ను ఢీకొట్టడం సంచలనాత్మకంగా మారింది.

వివరాలు 6లో ▸



**పర్యాటకానికి దారులు తెరిచిన చైనా**

దాదాపు మూడేళ్ల తర్వాత చైనా.. పర్యాటకులకు ద్వారాలు తెరుస్తోంది. అన్ని రకాల వీసాలు జారీ చేయాలని నిర్ణయించింది.

వివరాలు 6లో ▸



**నేటి నుంచి 'పంచ్' సమరం**

మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ బుధవారం ఢిల్లీలో ప్రారంభం కానుంది. 12 కేటగిరీల్లో పోటీలు జరుగుతాయి.

వివరాలు 12లో ▸

## న్యూస్‌రీల్

### 'మార్గదర్శి'పై ఈడీ విచారణ చేపట్టాలి



మార్గదర్శి చిట్స్‌కు సంబంధించి గతంలో రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ తనకిచ్చిన సమాచారాన్ని సీఐడీకి పంపుతున్నానని.. ఆ వివరాలను 'ఈడీ'కి పంపి విచారణ చేపట్టాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ కోరారు. రామోజీరావు తప్పుచేశాడని తాను నిరూపిస్తానని.. చేసిన తప్పు ఒప్పుకునే ధైర్యం రామోజీకి ఉందా? అని ప్రశ్నించారు.

వివరాలు 5 ▸

### నేటి నుంచి వర్షాలకు అవకాశం



రాష్ట్రంలో బుధవారం నుంచే వర్షాలు మొదలు కానున్నాయి. కోస్తాంధ్ర, రాయలసీమల్లో నాలుగు రోజులపాటు వర్షాలకు ఆస్కారముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఉరుములు, మెరుపులతోపాటు కొన్నిచోట్ల పిడుగులు కూడా పడే అవకాశముందని వెల్లడించింది.

వివరాలు 2 ▸

### హాట్‌కేకుల్లా 'విశాఖ' వన్డే టికెట్ల విక్రయం




విశాఖలో ఈనెల 19న భారత్, ఆస్ట్రేలియా మధ్య రెండో వన్డే జరగనుంది. ఈ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లను మంగళవారం విక్రయానికి పెట్టగా, క్రికెట్ అభిమానులు పెద్ద సంఖ్యలో బారులుతీరి.. వాటిని దక్కించుకున్నారు.

వివరాలు 2 ▸

# సంక్షేమం తోడుగా అభివృద్ధి

## రాష్ట్ర ఉభయ సభల సంయుక్త సమావేశంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

- కులం, మతం, ప్రాంతం, రాజకీయాలు చూడకుండా సంక్షేమ ఫలాలు
- 45 నెలల్లో డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.1.97 లక్షల కోట్లు
- సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా పారదర్శకంగా సేవలు
- 80 లక్షల మంది పిల్లల చదువులకు చేయూతగా 'అమ్మ ఒడి'
- నాడు–నేడుతో పాఠశాలల ఆధునికీకరణ, ఇంగ్లిష్ మీడియం
- సున్నా వడ్డీ, చేయూత, కాపు నేస్తం పథకాల ద్వారా మహిళలకు బాసట.. సామాజిక న్యాయంలో సరికొత్త విప్లవం
- ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా నాణ్యమైన వైద్యం.. రైతన్నలకు అన్ని విధాలా భరోసా
- జీఐఎస్‌లో రూ.13.42 లక్షల కోట్ల పెట్టుబడులు.. 378 ఒప్పందాలు
- ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి నిరంతరం కృషి



ఉభయ సభల సంయుక్త సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్. చిత్రంలో మండలి చైర్మన్ మోషేన్‌రాజు, స్పీకర్ తమ్మినేని సీతారాం

సాక్షి, అమరావతి: సమాజంలో ఏ ఒక్కరూ వెనుకపడకూడదనే లక్ష్యంతో నవరత్నాలనే గొడుగు కింద సమ్మిళిత పాలన నమూనాతో సంక్షేమ వ్యవస్థను ప్రభుత్వం రూపొందించిందని గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ అన్నారు. అన్ని వర్గాల వారి అభ్యున్నతే లక్ష్యంగా, రాష్ట్ర సుస్థిర ప్రగతే ప్రభుత్వ అగ్రప్రాధాన్యతగా ఉందని చెప్పారు. 2023–24 రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలిరోజు మంగళవారం ఆయన ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రసంగించారు. రాష్ట్రంలో గడిచిన 45 నెలల్లో డీబీటీ విధానం ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు రూ.1.97 లక్షల కోట్ల మొత్తాన్ని జమ చేశామని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ క్రియాశీల నాయకత్వంలో 5 కోట్ల మంది రాష్ట్ర ప్రజల

మిగతా 2వ పేజీలో ▶

### ఈనెల 24 వరకు అసెంబ్లీ

- 16న బడ్జెట్.. బీఏసీ భేటీలో నిర్ణయం.. శని, ఆదివారాలు కూడా సమావేశాలు
- ఉగాదిని పురస్కరించుకుని 21, 22 తేదీల్లో సెలవు

2 లో

### గవర్నర్ ప్రసంగం మధ్యలోనే టీడీపీ వాకౌట్

సభా సంప్రదాయాలను అపహాస్యం చేసిన ప్రతిపక్షం

# అవ్వాతాతలకు 3న పింఛన్లు..

## ఏప్రిల్ ఆరంభంలో వరుసగా 2 రోజులు సెలవులే కారణం

- లబ్ధిదారులకు ముందే చెప్పాలని అధికార యంత్రాంగానికి ఆదేశం
- ప్రభుత్వ విశ్వసనీయతకు అద్దం పట్టిన విశాఖ జీఐఎస్ సదస్సు
- సీఎం వైఎస్ జగన్ కృషిని అభినందిస్తూ తీర్మానానికి ఏకగ్రీవంగా కేబినెట్ ఆమోదం
- సంక్షేమ హాస్టళ్లపై అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ల పర్యవేక్షణ
- నూతన పారిశ్రామిక విధానం 2023–27కి గ్రీన్ సిగ్నల్
- పలు ముసాయిదా బిల్లులు, కీలక నిర్ణయాలకు ఆమోదం
- ఆస్కార్ సాధించిన ఆర్ఆర్ఆర్ బృందానికి మంత్రివర్గం అభినందనలు



సాక్షి, అమరావతి: ఆర్బీఐ (రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా) ఏప్రిల్ 1వ తేదీని సెలవు దినంగా ప్రకటించడం, ఆ మరుసటి రోజు ఏప్రిల్ 2 ఆదివారం కావడంతో అవ్వాతాతలకు ఏప్రిల్ 3న పింఛన్లు పంపిణీ చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ విషయాన్ని పెన్షన్ లబ్ధిదారులకు ముందుగా తెలియజేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. మంగళవారం

మిగతా 10వ పేజీలో ▶

### జూలై నుంచి విశాఖ వేదికగా పాలన

- మంత్రివర్గ సమావేశంలో ప్రస్తావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి
- పార్టీ ఎమ్మెల్యేలంతా నిబంధనల మేరకు ఓటు వేసేలా చూడాలి

2 లో

ఈసారి అసెంబ్లీలో అడుగు పెట్టేలా మా ప్రణాళిక

# బాబు సమర్థుడు

- జనసేన వార్షికోత్సవ సభలో పొత్తులపై పవన్‌కళ్యాణ్ నర్మగర్భ వ్యాఖ్యలు
- వైఎస్సార్‌సీపీ ఏదైతే జరగకూడదనుకుంటుందో అదే జరుగుతుంది
- తెలంగాణలో పోటీ చేస్తానంటే బీజేపీ నేతలు ఆంధ్రా వాడివన్నారు



సాక్షి, అమరావతి: 'జనసేన పార్టీ దమ్ముంటే 175 స్థానాల్లో పోటీ చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు అంటున్నారు. వైఎస్సార్‌సీపీ ఒకటి జరగకూడదని కోరుకుంటోంది. కానీ అదే జరుగుద్ది. ఈసారి ఎన్నికల్లో జనసేన బలిపశువు కాబోదు.ఈ ఎన్నికల్లో మా ఓటును వృథా కానివ్వం. ఈసారి అసెంబ్లీలో అడుగు పెట్టేలా మా ప్రణాళిక ఉంటుంది. పవన్‌కళ్యాణ్‌తో సహా నిలబడ్డవారందరూ గెలిచే తీరాలి. జనసేన సత్తా చాటుతాం' అని ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ నర్మగర్భ వ్యాఖ్యలు చేస్తూ పొత్తులపై స్పష్టత ఇచ్చారు. జనసేన పార్టీ పదవ వార్షికోత్సవం సందర్భంగా మచిలీపట్నంలో మంగళవారం రాత్రి బాగా పొద్దుపోయాక ఏర్పాటు చేసిన బహిరంగ సభలో

మిగతా 10వ పేజీలో ▶

# అది దూషణల సభ

- చంద్రబాబు సేవ కోసమే పవన్ పార్టీ పెట్టాడు.. ఇప్పటం సభకు, బందరు సభకు తేడాలేదు
- కాపులను బాబు దగ్గర తాకట్టు పెట్టడానికే పవన్ తాపత్రయం
- జనసేన ఆవిర్భావ సభపై మాజీ మంత్రి పేర్ని నాని



సాక్షి, అమరావతి: జనసేన సభ కేవలం చంద్రబాబు, పవన్‌ల తస్మదీయ దూషణల సభ మాత్రమేనని మాజీ మంత్రి పేర్ని నాని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మనం ఏం చేశాం, మన లోపాలేంటి అనేది చర్చించుకోవడం రాజకీయ పార్టీ లక్షణమని.. కానీ, చంద్రబాబు సేవ కోసమే పవన్ రాజకీయ పార్టీ పెట్టాడని

మిగతా 10వ పేజీలో ▶

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఏప్రిల్ 4 వరకు నిర్వహణ.. హాజరుకానున్న 10,03,990 మంది విద్యార్థులు.. రాష్ట్రవ్యాప్తంగా 1,489 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- వీటన్నింటిలో తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లతో వైద్య సిబ్బంది
- ప్రశ్నపత్రాల లీకేజీ, మాల్‌ప్రాక్టీస్ వంటి వదంతులు సృష్టించకుండా పటిష్ట చర్యలు.. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు
- పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, డిజిటల్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలపై నిషేధం

14 లో



# తేనె పూసిన కత్తులు!

వలపు వలలో చిక్కితే అంతే సంగతులు

అన్ని రంగాలకూ విస్తరిస్తున్న హనీ ట్రాప్‌ల ముప్పు

- గతంలో రక్షణ రంగానికే పరిమితమైన హనీట్రాప్‌లు
- ఇప్పుడు తమకు కావాల్సిన పని చేయించుకునేందుకూ వలలు
- సోషల్ ప్రొఫైలింగ్ ద్వారా బలహీనతలు గుర్తిస్తున్న కి'లేడీ'లు
- టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఉదంతంలోనూ హనీ ట్రాప్!
- ముందే గుర్తించవచ్చంటున్న సైబర్ క్రైమ్ నిపుణులు



సాక్షి, హైదరాబాద్: హనీట్రాప్ (వలపు వల). ఎదుటివారిని తమ వైపు ఆకర్షింపజేసుకుని, తమకు కావాల్సిన పని చేయించుకునేందుకు యువతులు/యువతుల పేరిట కేటుగాళ్లు వాడుతున్న అస్త్రం. గతంలో దేశ సరిహద్దుల రక్షణలో ఉండే కీలక అధికారులను లొంగ తీసుకునేందుకు శత్రుదేశాల గూఢచారులు ఈ విధమైన వల విసిరేవారు. ఇప్పుడిది అన్నిరకాల పనులకూ విస్తరిస్తోంది. తాజాగా తెలంగాణలో టీఎస్‌పీఎస్సీ టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పేపర్ లీకేజీ ఉదంతంలో కూడా ఇదే తరహాలో టీఎస్‌పీఎస్సీ సిబ్బందిని ట్రాప్ చేసినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే ఈ విధమైన వలపు వలలను ముందుగానే గుర్తించవచ్చని, తగిన జాగ్రత్తలు పాటిస్తే చిక్కుల్లో పడకుండా తప్పించుకోవచ్చని సైబర్ భద్రత నిపుణులు చెబుతున్నారు. సోషల్ మీడియా ఉపయోగిస్తున్న వారు సోషల్ ప్రొఫైలింగ్‌కు గురికాకుండా జాగ్రత్త పడాలని హెచ్చరిస్తున్నారు.

### హనీ ట్రాప్‌లు.. ఎన్నో రకాలు

- **సోషల్ మీడియా ఆధారిత ట్రాప్‌లు:** అందమైన యువతుల ఫొటోలు, పేర్లతో ఫేక్ ప్రొఫైల్స్ క్రియేట్ చేసి వాటిని సోషల్ మీడియా ఖాతాల్లో ఉంచడం ద్వారా పలువురిని ట్రాప్ చేస్తున్నారు.
- **ఆన్‌లైన్ వీఓఐపీ కాల్స్ (ఇంటర్నెట్ కాల్స్)తో వల:** వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రొటోకాల్ టెక్నాలజీ ఆధారిత కాల్స్ చేసి హనీ ట్రాప్‌కు పాల్పడతారు. తర్వాత వాట్సాప్, ఇతర యాప్స్ ద్వారా వ్యక్తిగత, వృత్తిపరమైన సమాచారం సేకరిస్తారు.
- **ఇన్‌స్టంట్ మెసేజ్ ప్లాట్‌ఫాంల ద్వారా:** ఆన్‌లైన్‌లో రియల్ టైం టెక్స్ట్ చాటింగ్ యాప్‌ల ద్వారా మెసేజ్‌లు పెడుతూ పరిచయం పెంచుకుని సైబర్ నేరగాళ్ల వలపు వలలోకి దించుతారు.
- **అశ్లీల వెబ్‌సైట్‌ల ఆధారిత హనీ ట్రాప్‌లు:** అశ్లీల వెబ్‌సైట్లు, అశ్లీల వీడియోలు, ఫొటోల లింక్‌లు పంపి, వాటి ద్వారా ఎదుటి వారిని లోబరుచుకుంటారు.
- **డేటింగ్ యాప్‌లతో:** డేటింగ్ యాప్‌లలో నగ్న వీడియో కాల్స్, ఫొటోలు పంపి ఆకర్షిస్తారు. ఎదుటి వారి నగ్న వీడియోలు, ఫొటోలు సేకరించి ఆ తర్వాత బ్లాక్ మెయిల్ చేస్తారు.
- **ఈ మెయిల్‌లో లింక్‌ల ద్వారా..:** ఈ మెయిల్స్‌లో లింక్‌లు పంపుతారు. క్రమంగా పరిచయం పెంచుకుని కావాల్సిన కీలక సమాచారాన్ని సేకరిస్తారు.

**ఇటీవల జరిగిన కొన్ని హనీ ట్రాప్‌లు**

- భారతీయురాలి పేరిట పాకిస్తాన్ నుంచి వాడుతున్న ఓ ఫేస్‌బుక్ అకౌంట్‌తో.. సరిహద్దుల్లో అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న భారత సైన్యంలోని 60 మంది జవాన్లు టచ్‌లో ఉన్నట్టు ఇండియన్ మిలిటరీ ఇంటిలిజెన్స్ గుర్తించింది.
- పాకిస్థాన్ ఏజెంట్ల హనీట్రాప్‌లో చిక్కి భారత నౌకాదళ సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్న 13 మంది ఇండియన్ నేవీ అధికారులను ఏపీ ఇంటెలిజెన్స్, నేవీ ఇంటిలిజెన్స్ అధికారులు సంయుక్త ఆపరేషన్‌లో పట్టుకున్నారు. వీరందరినీ అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి**

అపరిచితుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు అంగీకరించవద్దు. పనిచేసే కార్యాలయం వివరాలు, వృత్తిపరమైన అంశాలు సోషల్ మీడియా ఖాతాల్లో పంచుకోవద్దు. ఫొటోలు పెట్టకపోవడమే ఉత్తమం.

# బీసీలపై బాబు కపట ప్రేమ

- వెనుకబడిన వర్గానికి చెందిన మహిళకు ఓడిపోయే ఎమ్మెల్సీ సీటు
- గెలిచే అవకాశమే లేకున్నా పంచుమర్తి అనూరాధను నిలబెట్టిన వైనం
- అధికారంలో ఉన్నప్పుడు ఆమెకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వని బాబు
- ఇప్పుడు తన రాజకీయం కోసం మహిళా నేతతో ఆటలు
- గతంలో వర్ల రామయ్య, జేఆర్ పుష్పరాజ్‌లకు అవమానాలు

3 లో





### పార్లమెంట్‌లో రెండో రోజూ అదే తీరు

భారత్‌లో ప్రజాస్వామ్యం గురించి బ్రిటన్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై పార్లమెంట్ ఉభయ సభలు మంగళవారం కూడా స్తంభించాయి. రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాల్సిందేనని అధికార బీజేపీ సభ్యులు డిమాండ్ చేయగా.. అదానీ వ్యవహారంపై తక్షణమే జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. ఇరు పక్షాల మధ్య వాగ్వాదాలు, నినాదాలతో సభా కార్యకలాపాలు సజావుగా సాగే పరిస్థితి లేకపోవడంతో లోక్‌సభ, రాజ్యసభ బుధవారానికి వాయిదా పడ్డాయి.

- వివరాలు 6లో

# మరిన్ని ఈ–బస్సులు

## ఆగస్టు నాటికి వెయ్యి విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టనున్న ఆర్టీసీ



- విశాఖ, కాకినాడ, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు నుంచి సర్వీసులు
- ఏటా తగ్గనున్న 51వేల మెట్రిక్ టన్నుల కర్బన ఉద్గారాలు.. ఆ తర్వాత మూడు దశల్లో మరో 3 వేల ఈ–బస్సులు
- ఇకపై విద్యుత్ బస్సులనే కొనాలని ప్రభుత్వ నిర్ణయం
- అద్దె ప్రాతిపదికన మాత్రమే డీజిల్ బస్సులు

3 లో



## ఇదండీ సంగతి



ఏ దేశంలో ఉన్నాయని ఎలా చెప్పగలుగుతాం సార్! అన్ని దేశాల నుంచి మనకు ఫండ్స్ వస్తున్నప్పుడు!!

## నేటి నుంచి వర్షాలకు అవకాశం

### 17 నుంచి భారీ వర్షాలు

**సాక్షి, విశాఖపట్నం/గుంటూరు రూరల్:** రాష్ట్రంలో బుధవారం నుంచే వర్షాలు మొదలు కానున్నాయి. భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ముందుగా అంచనా వేసినట్టుగా ఈ నెల 16 నుంచి కాకుండా ఒకరోజు ముందుగానే వానలు కురవనున్నాయి. జార్ఖండ్ నుంచి ఛత్తీస్‌గఢ్ మీదుగా తెలంగాణ వరకు ఒక ద్రోణి కొనసాగుతోంది. దీని ఫలితంగా కోస్తాంధ్ర, రాయలసీమల్లో బుధవారం నుంచి 4 రోజులపాటు వర్షాలకు ఆస్కారం ఉంది. పలుచోట్ల తేలికపాటిగాను, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ మంగళవారం వెల్లడించింది. 17, 18, 19 తేదీల్లో శ్రీకాకుళం, విశాఖ, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పు గోదావరి, అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, కర్నూలు, వైఎస్సార్, తిరుపతి జిల్లాల్లో పలు చోట్ల వర్షాలకు ఆస్కారం ఉందని పేర్కొంది. ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలకు అవకాశం ఉందని తెలిపింది. గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. పంటలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించింది. కర్నూలు జిల్లా మంత్రాలయంలో 40.65, నంద్యాల జిల్లా గాజులపల్లిలో 40.61, అవుకులో 40.53, గోనవరంలో 40.1 డిగ్రీల చొప్పున మంగళవారం ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఇటీవల కాలంలో ఏపీలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇదే తొలిసారి.

## ఈసారి వడగాడ్పుల తీవ్రత ఎక్కువ!



**సాక్షి, అమరావతి:** ఈ వేసవిలో వడగాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరించినందున.. ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను విపత్తుల నిర్వహణ సంస్థ ఆదేశించింది. మంగళవారం తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులతో సంస్థ ఎండీ అంబేడ్కర్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 2020వ సంవత్సరం నుంచి రాష్ట్రంలో వడగాడ్పుల మరణాలు లేవని.. ఈ ఏడాది కూడా అదే విధంగా చర్యలు తీసుకోవాలని, జిల్లా, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. వడగాడ్పుల తీవ్రత ఆధారంగా పాఠశాలల సమయాలను మార్చాలని ఆదేశించారు. అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే విభాగాన్ని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసులో ఏప్రిల్‌లో సాక్షుల విచారణ

- షెడ్యూల్ ప్రకటించిన ఎన్ఐఏ న్యాయస్థానం

**సాక్షి, అమరావతి :** సీఎం వైఎస్ జగన్ ప్రతిపక్ష నేతగా ఉండగా 2018లో విశాఖ విమానాశ్రయంలో ఆయనపై జరిగిన హత్యాయత్నం కేసులో సాక్షుల విచారణ షెడ్యూల్‌ను విజయవాడలోని ఎన్ఐఏ న్యాయస్థానం మంగళవారం ప్రకటించింది. ఈ కేసులో బాధితుడైన సీఎం జగన్, ఆయన పీఏ కె.నాగేశ్వర్ రెడ్డిలను సాక్షులుగా ఏప్రిల్ 10న విచారణకు హాజరుకావాలని చెప్పింది. ఇతర సాక్షులను ఏప్రిల్ 11, 12, 13, 17 తేదీల్లో విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. ఈ కేసులో విశాఖ విమానాశ్రయంలో అప్పటి సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ దినేశ్ కుమార్‌ను ఎన్ఐఏ కోర్టు మంగళవారం విచారించింది. ఆ హత్యాయత్నానికి సంబంధించిన మెటీరియల్ ఎవిడెన్స్‌ను ఆయన కోర్టులో గుర్తించారు.

## మరో అంతర్జాతీయ సదస్సుకు విశాఖ ఆతిథ్యం

- ఈ నెల 28 నుంచి 30 వరకు జి–20 సదస్సు
- తొలిరోజు హాజరుకానున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

**మహారాణిపేట (విశాఖ దక్షిణ):** ఈ నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జి–20 సదస్సులో భాగంగా రెండో మౌలిక సదుపాయాల కార్యవర్గ సమావేశాలకు ఆతిథ్యం ఇవ్వడానికి విశాఖపట్నం నగరం సిద్ధంగా ఉందని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున చెప్పారు. విశాఖలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023 విజయవంతంగా నిర్వహించామన్నారు. జి–20 సదస్సులో భాగంగా రెండో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమావేశంలో రేపటి ఫైనాన్సింగ్ సిటీలు అన్న అంశంపై చర్చ జరుగుతుందని తెలిపారు. 40 దేశాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటారని చెప్పారు. ఈ నెల 28న ప్రతినిధుల ప్రణాళిక చర్చలు ఉంటాయని, అదేరోజు అతిథులకు డిన్నర్ ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్ పాల్గొంటారని చెప్పారు. అనంతరం టీ షర్ట్‌లను ఆవిష్కరించారు.

## సభ్యుల ప్రశ్నలకు సకాలంలో సమాధానాలు

- వారి పిటిషన్లనూ సత్వరమే పరిష్కరించాలి
- ఇందుకు వీలుగా ప్రత్యేక యాప్ రూపొందించండి
- స్పీకర్ తమ్మినేని, మండలి అధ్యక్షుడు మోషేను రాజు సూచన

**సాక్షి, అమరావతి :** ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అడిగే పలు ప్రశ్నలకు సకాలంలో సమాధానాలు ఇచ్చేందుకు, వారి పిటిషన్లను సత్వరమే పరిష్కరించేందుకు ఆన్‌లైన్ ద్వారా వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రత్యేక యాప్‌ను రూపొందించాలని అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేనురాజు సీఎస్ డా.కేఎస్ జవహర్‌రెడ్డిని కోరారు. బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని డీజీపీకి వారు సూచించారు. బడ్జెట్ సమావేశాలు మంగళవారం ముగిసిన అనంతరం ఏపీ అసెంబ్లీ కమిటీ హాల్‌లో పలు శాఖల కార్యదర్శులు, పోలీసు అధికారులతో వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో వారిరువురూ పాల్గొని సభ్యుల ప్రశ్నలకు సరైన సమాధానాలు అందజేయడం, బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షించారు.

**ప్రశ్నలను జీరో స్థాయికి తేవాలి**

తమ్మినేని, మోషేనురాజు మాట్లాడుతూ.. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలన్నింటికీ సకాలంలో సరైన సమాధానాలను అందజేసి జీరో స్థాయికి తీసుకురావాలన్నారు. గౌరవ సభ్యులు పలు ప్రజా సమస్యలపై ప్రశ్నలు అడుగుతుంటారని, వాటికి సకాలంలో సమాధానాలు అందజేసినట్లయితే, ఆ వివరాలను ప్రజలకు వివరించుకునే అవకాశం గౌరవ సభ్యులకు ఏర్పడుతుందన్నారు. హిమాచల్‌ప్రదేశ్, యూపీ, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో ఇప్పటికే ప్రత్యేక యాప్ అమల్లోకి వచ్చిందని.. అదే తరహాలో ఏపీలో కూడా త్వరగా అమల్లోకి తేవాలని వారు కోరారు. క్షేత్రస్థాయిలో ప్రొటోకాల్ అమలు విషయంలో ఫిర్యాదులు వస్తున్నాయని, సభ్యుల హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లకుండా క్షేత్రస్థాయి అధికారులకు తగు ఆదేశాలు జారీచేయాలని వారు సూచించారు. పోలీస్ అధికారులతో శాంతిభద్రతల అంశాన్ని సమీక్షిస్తూ.. ప్రశాంత వాతావరణంలో బడ్జెట్ సమావేశాలు కొనసాగేలా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లను చేయాలని డీజీపీకి వారు సూచించారు. సచివాలయం చుట్టూ ఖాళీ ప్రాంతం ఎక్కువగా ఉన్నందున అధునాతన సమాచార, సాంకేతిక వ్యవస్థతో పటిష్టమైన నిఘా ఏర్పాట్లుచేయాలన్నారు.

## గవర్నర్‌ల వ్యవస్థను గవర్నరే అవమానించారు

- టీడీపీ ఎమ్మెల్యేలు పయ్యావుల, గోరంట్ల, నిమ్మల

**సాక్షి,అమరావతి:** గవర్నర్ అబ్దుల్ నజీర్ గవర్నర్‌ల వ్యవస్థను అవమానించేలా వ్యవహరించారని టీడీపీ ఎమ్మెల్యేలు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బెందాళం అశోక్ విమర్శించారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత వారు మీడియాతో మాట్లాడుతూ గవర్నర్ స్థాయిని తగ్గించేలా కొత్త గవర్నర్ వ్యవహరించారన్నారు. గవర్నర్‌తో సీఎంని పొగిడించడం దుర్మార్గమని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ గవర్నర్‌కు స్వాగతం పలకలేదని, సీఎం కోసం గవర్నర్ వేచి ఉండేలా చేశారని ఆరోపించారు. నాలుగేళ్లలో జగన్ సాగించిన పాలనపై రాసిచ్చిన అబద్ధాలు చదవలేక గవర్నర్ చాలాసార్లు తడబడ్డారని పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగం పూర్తిగా అసత్యాలు, అబద్ధాలతో సాగిందన్నారు.

# జూలై నుంచి విశాఖ వేదికగా పాలన



**సాక్షి, అమరావతి:** పరిపాలనా రాజధాని విశాఖ నుంచే త్వరలో పాలన సాగిస్తామని ఢిల్లీలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్ సన్నాహక సదస్సులో సీఎం వైఎస్ జగన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటీవల విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులోనూ ఇదే అంశాన్ని పునరుద్ఘాటించారు. తాజాగా మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలోనూ ఈ విషయాన్ని సీఎం జగన్ ప్రస్తావించినట్లు తెలిసింది. జూలై నుంచి విశాఖ నుంచే పరిపాలన సాగిస్తానని సీఎం జగన్ స్పష్టం చేసినట్లు సమాచారం. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో సీఎం జగన్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సమావేశంలో అజెండా అంశాలపై చర్చ ముగిశాక అధికారులు నిష్క్రమించారు. సమకాలీన రాజకీయ పరిస్థితులపై మంత్రులతో సీఎం జగన్ చర్చించారు.

**దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి..**

ఎమ్మెల్యేల కోటాలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో సంఖ్యా బలం లేకపోయినా టీడీపీ అభ్యర్థిని బరిలోకి దించడాన్ని సీఎం జగన్ ప్రస్తావించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలంతా ఓటు హక్కును వినియోగించుకుని నిబంధనల మేరకు తమకు నిర్దేశించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేసేలా చూడాల్సిన బాధ్యత మంత్రులదేనని స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూసుకోవాలని జాగ్రత్తలు సూచించారు. రాష్ట్రంలో గత 45 నెలలుగా జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు చాటిచెప్పాలని మంత్రులకు సీఎం జగన్ దిశా నిర్దేశం చేశారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని రీతిలో సామాజిక న్యాయం చేస్తున్న తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అత్యంత పారదర్శకంగా పరిపాలన చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా సాగిస్తున్న దుష్ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని దిశానిర్దేశం చేశారు. ఐదేళ్ల చంద్రబాబు పాలనలో టీడీపీ అరాచకాలను ఎండగట్టడంతోపాటు ఇప్పుడు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందచేస్తున్న తీరును ప్రజలకు వివరించాలని మంత్రులకు సూచించారు.

## హాట్‌కేకుల్లా 'విశాఖ' వన్డే టికెట్ల విక్రయం

**విశాఖ స్పోర్ట్స్:** భారత్, ఆస్ట్రేలియా సిరీస్‌లో భాగంగా ఈనెల 19న విశాఖలోని వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరగనున్న రెండో వన్డేకు సంబంధించిన టికెట్లు మంగళవారం హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. స్టేడియం సామర్థ్యం 27 వేలు కాగా.. పేటీఎం సంస్థ ఈ నెల 10, 11, 12 తేదీల్లో రూ.600 నుంచి రూ.6 వేల వరకు వివిధ విభాగాల్లో 70 శాతం టికెట్లను ఆన్‌లైన్‌లో విక్రయించింది. మిగిలిన 30 శాతం టికెట్లను స్థానిక అభిమానులను దృష్టిలో పెట్టుకొని వైఎస్సార్ స్టేడియంతో పాటు మరో రెండు సెంటర్లలో ఏసీఏ నిర్వాహక కమిటీ మంగళవారం అందుబాటులో పెట్టింది. వీటి కోసం తెల్లవారుజాము నుంచే క్రికెట్ అభిమానులు 'క్యూ'లు కట్టారు. దీంతో టికెట్లన్నీ హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. కాగా, సిరీస్‌లో తొలి వన్డే 17వ తేదీన ముంబైలో, మూడో వన్డే 22న చెన్నైలో జరగనుంది.

# సంక్షేమం తోడుగా అభివృద్ధి

▶ మొదటి పేజీ తరువాయి

ఆకాంక్షలను నెరవేర్చే ప్రయాణంలో నాలుగేళ్లు పూర్తయిందని చెప్పారు. ఈ క్రమంలో సమర్థవంతమైన ప్రభుత్వ విధానాల అమలుతో 2021–22లో 11.43 శాతం జీఎస్‌డీపీ వృద్ధి రేటు సాధించామన్నారు. ఇది దేశంలోని అన్ని రాష్ట్రాలకంటే అత్యధికం అని స్పష్టం చేశారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు, నాడు–నేడు కింద మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టామన్నారు. 15,004 సచివాలయాల ద్వారా పాలనలో పారదర్శకత, వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టామని, ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలను అందించామని చెప్పారు. 2022–23 ముందస్తు అంచనాలు ప్రస్తుత ధరలలో 16.22 శాతం సమగ్ర వృద్ధిని సూచిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుత ధరలలో రాష్ట్ర తలసరి ఆదాయం 2021–22లో రూ.1,92,517 నుంచి 14.02 శాతం ప్రోత్సాహక వృద్ధిరేటుతో రూ.2,19,518కు చేరిందన్నారు. ఈ సమావేశంలో గవర్నర్ ఇంకా ఏమన్నారంటే..



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం జగన్

> కులం, మతం, ప్రాంతం, రాజకీయం చూడకుండా డీబీటీ విధానం ద్వారా పారదర్శకంగా అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేసిందని చెప్పడానికి సంతోషంగా ఉంది. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి ఫలాలు అందించడమే లక్ష్యంగా, రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా మా ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది.
>
> – గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్

### విద్యా సంస్కరణలతో బంగారు బాట

- 2020 జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా పాఠ్యప్రణాళిక సంస్కరణలను అమలు చేస్తున్నాం. 2020–21 నుంచి మన బడి నాడు–నేడు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. రూ.3,669 కోట్లతో తొలి దశలో 15,717 పాఠశాలలను, రెండో దశ కింద రూ.8 వేల కోట్లతో 22,344 పాఠశాలలను అభివృద్ధి బాట పట్టించాం. మూడేళ్లలో రూ.16,021.67 కోట్లతో 57,189 పాఠశాలలు, 3,280 ఇతర విద్యా సంస్థలలో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నది మా ప్రభుత్వ యోచన.
- 'జగనన్న అమ్మ ఒడి' పథకం కింద 84 లక్షల మంది పిల్లలను పాఠశాలలకు పంపడానికి 44.49 లక్షల మంది తల్లులకు రూ.19,617.60 కోట్ల మొత్తాన్ని అందించాం. ప్రతి తల్లికి ఏటా రూ.15 వేల చొప్పున ఇస్తున్నాం.
- రూ.690 కోట్ల విలువైన బైజూస్ కంటెంట్ ప్రీలోడ్ చేసిన ట్యాబ్‌లను 4.60 లక్షల మంది విద్యార్థులు, 60 వేల మంది టీచర్లకు పంపిణీ చేశాం. ఆరో తరగతి, ఆపై తరగతుల వరకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌ను ప్రవేశపెట్టాలని యోచిస్తున్నాం. ఈ ప్యానెల్స్‌ను 5,800 పాఠశాలల్లోని 30,213 తరగతి గదుల్లో నెలకొల్పేందుకు ప్రణాళిక రూపొందించాం. ఇంగ్లిష్ మీడియం అమలు చేయడంతో పాటు ద్విభాషా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశాం. ఇంగ్లిష్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశాం.
- స్కూల్ డ్రాపౌట్స్‌ను తగ్గించి జీఈఆర్‌ను మెరుగుపరచడానికి జగనన్న విద్యా కానుక కింద ప్రభుత్వ, ప్రభుత్వేతర ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి చదివే 47.4 లక్షల మంది విద్యార్థులకు బూట్లు, బ్యాగ్‌లు, పుస్తకాలు, ఇతర వస్తువులతో కూడిన కిట్‌ల పంపిణీకి 2020–21 నుంచి రూ.2,368 కోట్ల మొత్తాన్ని ఖర్చు చేశాం.

- జగనన్న గోరుముద్ద కింద రూ.3,239 కోట్లతో 43.26 లక్షల మంది విద్యార్థులకు పోషకాహారం
- 2020–21 నుంచి యాక్టివిటీ ఆధారంగా పాఠ్య పుస్తకాల రీ డిజైన్. సీబీఎస్ఈ గుర్తింపు
- ప్రతి మండలంలో కనీసం రెండు జూనియర్ కళాశాలలు. ఇందులో ఒకటి బాలికలది
- జగనన్న విద్యా దీవెన కింద 24.75 లక్షల మంది విద్యార్థులకు రూ.9,249 కోట్లు చెల్లింపు
- జగనన్న వసతి దీవెన కింద 18.77 లక్షల మంది విద్యార్థులకు రూ.3366 కోట్ల సాయం
- కొత్తగా ఇంజినీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, 14 డిగ్రీ కళాశాలల ఏర్పాటు
- తొలిసారిగా వైద్య, దంత వైద్య కోర్సులలో 50 శాతం ప్రభుత్వ కోటా. ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లోని అన్ని ఇతర కోర్సుల్లో 35 శాతం ప్రభుత్వ కోటా ఏర్పాటు.

### ఆరోగ్యకరమైన సమాజం

- డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ప్రొసీజర్‌లు 2,446 నుంచి 3,255కు పెంపు. రాష్ట్రంలో 1.41 కోట్ల కుటుంబాలకు (95 శాతం కుటుంబాలు) వర్తింపు
- ఆరోగ్య ఆసరా కింద 15.65 లక్షల మందికి రూ.971.28 కోట్ల సాయం
- రాష్ట్రంలో సమర్థవంతంగా మాతా, శిశు సంరక్షణ సేవల అమలు
- గ్రామీణ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం
- వైఎస్సార్ టెలిమెడిసిన్ కింద 2.83 కోట్ల కన్సల్టేషన్ల నమోదు. ఇది దేశంలో 35 శాతం వాటా
- నాడు–నేడు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధి. 17 వైద్య కళాశాలల ఏర్పాటు. వచ్చే విద్యా సంవత్సరంలో 5 కళాశాలలు ప్రారంభం. వైద్య ఆరోగ్య శాఖలో 48,639 పోస్టుల భర్తీ

### సామాజిక భద్రతలో విప్లవం

- వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకాల ద్వారా 35.7 లక్షల మంది గర్భిణిలు, పాలిచ్చే తల్లులు, పిల్లల పోషకాహారం కోసం రూ.6,141 కోట్ల ఖర్చు
- నవ రత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకం కింద 30.65 లక్షల మంది మహిళలకు ఇళ్ల స్థలాలు.. వీరిలో 21.25 లక్షల మందికి గృహాల మంజూరు. 4.4 లక్షల గృహాల నిర్మాణం పూర్తి. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.32,909 కోట్ల ఖర్చు
- వైఎస్సార్ పింఛన్ కానుక కింద 64.45 లక్షల మందికి రూ.66,823.79 కోట్లు .
- వైఎస్సార్ నేతన్న నేస్తం కింద 81,783 మందికి రూ.788.5 కోట్ల సాయం
- వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద .20 లక్షల మందికి రూ.422 కోట్లు
- జగనన్న చేదోడు కింద 3.30 లక్షల మంది రజకులు, నాయీ బ్రాహ్మణులు, దర్జీలకు రూ.927.49 కోట్లు
- వైఎస్సార్ బీమా కింద మృతుల కుటుంబాలు, క్షతగాత్రులకు రెండేళ్లలో రూ.512 కోట్లు
- వైఎస్సార్ వాహనమిత్ర కింద 2.74 లక్షల మంది డ్రైవర్‌లకు రూ.1,041 కోట్ల సాయం
- వైఎస్సార్ లా నేస్తం ద్వారా 4,248 మంది జూనియర్ లాయర్లకు రూ.35.4 కోట్లు
- జగనన్న తోడు కింద 15.31 లక్షల వీధి వ్యాపారులకు రూ.2,470.3 కోట్ల మేర సాయం
- స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించేలా చట్టం. అన్ని నామినేటెడ్ పోస్టులు, నామినేటెడ్ పనుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు
- 2019 ఏప్రిల్ 11 నాటికి 78.74 లక్షల మంది ఎస్ఎస్‌జీ మహిళలు బ్యాంక్‌లకు బకాయిపడ్డ రుణ మొత్తంలో రూ.12,758 కోట్లు చెల్లింపు
- వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద 1.02 కోట్ల మంది ఎస్‌హెచ్‌జీ మహిళలకు రూ.3,615 కోట్ల సాయం
- వైఎస్సార్ చేయూత కింద బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలు 26.7 లక్షల మందికి మూడు విడతల్లో రూ.14,129 కోట్ల చెల్లింపు
- వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద మూడు విడతల్లో 3.94 లక్షల మందికి రూ.595.86 కోట్లు
- వైఎస్సార్ కాపు నేస్తం కింద 3.56 లక్షల మందికి రూ.1,518 కోట్లు
- వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అల్ప సంఖ్యాక వరాల్లోని యువతుల పెళ్లికి ఆర్థిక సాయం
- వైఎస్సార్ స్వేచ్ఛ పథకం కింద రూ.25.33 కోట్ల ఖర్చు
- ఆపదలో ఉన్న మహిళలను రక్షించేలా దిశ యాప్. 1.36 కోట్ల డౌన్‌లోడ్‌లు

### ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో బెస్ట్

- పరిశ్రమల స్థాపన, నిర్వహణ కోసం 21 రోజుల్లో సింగిల్ డెస్క్ సిస్టమ్ ద్వారా అన్ని అనుమతుల మంజూరు. ఇతరత్రా సహకారం ద్వారా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మూడేళ్ల పాటు వరుసగా ఏపీకి మొదటి స్థానం.
- ఈ నెల 3, 4 తేదీలలో విశాఖపట్నంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతంగా నిర్వహణ. రూ.13.42 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 378 అవగాహన ఒప్పందాలు. 16 కీలక రంగాల్లో 6 లక్షల ఉద్యోగావకాశాలు. రాష్ట్ర పారిశ్రామిక కేంద్రంగా విశాఖపట్నం నగరాన్ని తీర్చిదిద్దడానికి ప్రణాళిక. రాష్ట్రంలో కొత్తగా 69 భారీ, మెగా పరిశ్రమలు.
- వైఎస్సార్ నవోదయం కింద ఎంఎస్ఎంఈల బలోపేతానికి తోడ్పాటు. రూ.19,115 కోట్ల పెట్టుబడితో 1.52 లక్షల యూనిట్లు. 13.63 లక్షల మందికి ఉపాధి. ఎంఎస్ఎంఈ రీస్టార్ట్ కింద 23,236 ఎంఎస్ఎంఈలకు రూ.2,086 కోట్ల ప్రోత్సాహకాలు.
- ఏపీ లాజిస్టిక్ హబ్‌గా, ఆగ్నేయ ఆసియాకు గేట్‌వేగా రాష్ట్రం. 6 నిర్వాహక ఓడరేవులు ఉండగా, రామాయపట్నం, భావనపాడు, కాకినాడ, మచిలీపట్నంలో కొత్తగా ఏర్పాటు. రెండు దశల్లో తొమ్మిది ఫిషింగ్ హార్బర్లు నిర్మాణం. వైజాగ్–చెన్నై, చెన్నై– బెంగళూరు, హైదరాబాద్– బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌ల అభివృద్ధి.

- 2021–22 నుంచి 'జెండర్' బడ్జెట్

### సుస్థిర వ్యవసాయానికి భరోసా

- 2020–21లో వ్యవసాయ రంగంలో 11.3 శాతం, ఉద్యానవన రంగంలో 12.3 శాతం, పశు సంవర్ధక రంగంలో 11.7 శాతం, మాంసం ఉత్పత్తిలో 10.3 శాతం వృద్ధి రేటు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సుపరిపాలన సూచికలో (జీజీఐ) మొదటి స్థానం.
- వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ యోజన కింద రైతులకు ఐదేళ్లలో రూ.67,500 కోట్లు. 10,778 రైతు భరోసా కేంద్రాలు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద 44.55 లక్షల మంది రైతులకు రూ.6,872 కోట్ల బీమా చెల్లింపు.
- 147 వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు, జిల్లా స్థాయిలో 11 ప్రయోగశాలలు, జోనల్ స్థాయిలో 4 రీజనల్ కోడింగ్ కేంద్రాల ఏర్పాటు. 73.88 లక్షల మంది రైతులకు రూ.1,834.55 కోట్ల సున్నా వడ్డీ. 22.22 లక్షల మంది రైతులకు రూ.1,911.78 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ. శీతల గిడ్డంగులు, ప్రాసెసింగ్ యూనిట్లు. రూ.27,800 కోట్ల విలువైన ఉచిత విద్యుత్. 10 ఎకరాల లోపు ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ కింద రూ.2,647 కోట్లు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా రూ.7 లక్షలకు పెంపు. దశల వారీగా, ప్రాధాన్యత క్రమంలో నీటి పారుదల ప్రాజెక్టుల పూర్తి.

మరిన్ని అంశాల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగలరు

# అభివృద్ధికి అద్దం పట్టిన గవర్నర్ ప్రసంగం

- వైఎస్సార్‌సీపీ నేతలు వెల్లడి
- చంద్రబాబు అసెంబ్లీకి రావాలని ఆహ్వానం

**సాక్షి, అమరావతి:** ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగం రాష్ట్రాభివృద్ధికి అద్దం పడుతోందని అధికార వైఎస్సార్‌సీపీ నేతలు చెప్పారు. వారు మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. ప్రతిపక్ష టీడీపీ ఏనాడూ నిర్మాణాత్మకంగా వ్యవహరించలేదని విమర్శించారు. గవర్నర్ ప్రసంగం మధ్యలోనే టీడీపీ వాకౌట్ చేయడాన్ని ఖండించారు.

### ఏ అంశం పైనైనా చర్చకు ప్రభుత్వం సిద్ధం: ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



ప్రతిపక్షం లేవనెత్తే ఏ అంశం పైనైనా చర్చకు ప్రభుత్వం సిద్ధం. టీడీఎల్‌పీ ఉపనేత అచ్చెన్నాయుడు ఇచ్చిన అంశాలపైనా చర్చించేందుకు సిద్ధం. ప్రతిపక్ష నేత చంద్రబాబు కూడా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు రావాలి. సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని బడ్జెట్ ప్రవేశపెడతాం. సభ హుందాగా, మంచి చర్చతో జరుగుతుంది. చంద్రబాబు, లోకేశ్, టీడీపీ ఎమ్మెల్యేలు పబ్లిక్ మీటింగ్‌లలో కాకుండా సభకు వచ్చి చర్చించాలి.

### సీఎం పథకాలను గవర్నర్ అభినందించారు: ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్



ఇన్ని సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్న ప్రభుత్వం దేశంలో ఏపీ ఒక్కటేనని గవర్నర్ ప్రసంగం ద్వారా మరోసారి స్పష్టమైంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవడాన్ని గవర్నర్ అభినందించారు. పేదలకి సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ ఈ ప్రభుత్వం రావాలి.

### లోకేశ్‌ను నిలబెట్టాల్సింది: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాస్



గెలవలేని సీట్లలో మాత్రమే బీసీలను, బడుగువర్గాలను అభ్యర్థులుగా టీడీపీ నిలబెడుతోంది. అక్కడ వారికి బదులు లోకేశ్‌ను నిలబెట్టవచ్చుకదా. గవర్నర్ తన ప్రసంగంలో అన్నీ వాస్తవాలే చెప్పారు. గవర్నర్ ప్రసంగాన్ని టీడీపీ బహిష్కరించటం సరికాదు. గవర్నర్ పట్ల టీడీపీకి ఎలాంటి మర్యాద ఉందో చెప్పడానికి ఇదే నిదర్శనం. ప్రతిపక్ష పార్టీ నిర్మాణాత్మకంగా ఎప్పుడూ వ్యవహరించలేదు. వచ్చే ఎన్నికల్లో వారు ఎలాగూ గెలవలేరు. అందుకే భయపడుతున్నారు. మూడు రాజధానుల అంశంపై ఇప్పటికే సీఎం స్పష్టత ఇచ్చారు. మూడు ప్రాంతాల అభివృద్ధే మా లక్ష్యం. విశాఖ రాజధాని కాకుండా టీడీపీ, జనసేన, వామపక్షాలు రాక్షసుల్లా ప్రయత్నిస్తున్నాయి. వారి కుయుక్తులను సీఎం జగన్ ఛేదిస్తారు.

### ప్రసంగంలో స్పష్టత లేదు : పీడీఎఫ్ ఎమ్మెల్సీలు బాలసుబ్రహ్మణ్యం, కేఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, షేక్ షాబ్జీ



గవర్నర్ ప్రసంగంలో స్పష్టత లేదు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలనే చదివారు. రాష్ట్ర సమస్యలను ప్రస్తావించలేదు. కరోనా తరువాత ప్రజానీకానికి ఏం భరోసా ఇస్తారో చెప్పలేదు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రిగ్గింగ్ చేసి, రీపోలింగ్ జరపడం ఇదే తొలిసారి. రాష్ట్రంలో తగ్గిపోయిన ఆహార ధాన్యాల విస్తీర్ణాన్ని ఎలా పెంచుతారో చెప్పలేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వ్యవస్థాగత మార్పులు, ప్రాజెక్టులు ఎప్పుడు పూర్తవుతాయో లేదు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ప్రకటన చేయించలేదు. ప్రసంగం నిస్సారంగా ఉంది. గిట్టుబాటు ధర, కౌలు రైతులు, జాబ్ క్యాలెండర్ ప్రస్తావన లేదు.డీఎస్సీ ఊసెత్తలేదు.

## ఈనెల 24 వరకు అసెంబ్లీ



బీఏసీ సమావేశంలో పాల్గొన్న సీఎం జగన్, తదితరులు

**సాక్షి, అమరావతి :** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 24 వరకు నిర్వహించాలని బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) సమావేశం మంగళవారం నిర్ణయించింది. ఈ దఫా 9 రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు జరగనుండగా.. ఈ నెల 16న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. అంతకుముందు.. మంగళవారం ఉదయం శాసన సభ సమావేశాలు ప్రారంభం కాగా.. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. ఆ తర్వాత సభ బుధవారానికి వాయిదా పడింది. అనంతరం అసెంబ్లీ ప్రాంగణంలోని స్పీకర్ కార్యాలయంలో స్పీకర్ తమ్మినేని అధ్యక్షతన బీఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎం వైఎస్ జగన్, చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజుతో పాటు మంత్రులు బుగ్గన, పెద్దిరెడ్డి, జోగి రమేష్, విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, టీడీఎల్‌పీ ఉపనేత అచ్చెన్నాయుడు హాజరయ్యారు. 20 అంశాలపై చర్చించాలని అచ్చెన్నాయుడు కోరారు. సీఎం జగన్ వెంటనే జోక్యం చేసుకుని ఏ అంశంపై అయినా చర్చించేందుకు తాము సిద్ధమని, సభా సమయాన్ని బట్టి చర్చిద్దామని స్పష్టంచేశారు.

**బడ్జెట్ సమావేశాలు ఇలా..**

■ 15 తేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం, చర్చ. ■ 16న 2023–24 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్. ■ అనంతరం వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి. అంతకుముందు.. మరణించిన శాసనసభ్యులకు నివాళులు అర్పించనున్న అసెంబ్లీ. ■ 17, 18, 19, 20 తేదీల్లో బడ్జెట్‌పై చర్చ. శని, ఆదివారాలు కూడా సమావేశాలు జరగనున్నాయి. ■ ఉగాది పురస్కరించుకుని 21, 22 తేదీల్లో శాసనసభ సమావేశాలకు సెలవు. ■ 23న ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ. ■ 24న ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం.. అదే రోజున ముగియనున్న శాసనసభ సమావేశాలు ■ ఇలా మొత్తం 9 రోజుల పాటు శాసనసభా సమావేశాల నిర్వహణ.

# గవర్నర్ ప్రసంగం మధ్యలోనే టీడీపీ వాకౌట్

**సాక్షి, అమరావతి:** ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ సభా సంప్రదాయాలను అపహాస్యం చేసింది. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తుండగా రన్నింగ్ కామెంట్రీతో ఆటంక పరిచే ప్రయత్నం చేసింది. గవర్నర్ ప్రసంగం మధ్యలోనే వాకౌట్ చేసి టీడీపీ సభ్యులు వెళ్లిపోయారు. మంగళవారం బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా సంప్రదాయం ప్రకారం గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ప్రసంగానికి ఉపక్రమించారు. 20 నిమిషాలపాటు గవర్నర్ ప్రసంగం సాఫీగా సాగింది. అనంతరం ప్రతిపక్ష సభ్యులు గవర్నర్ ప్రసంగానికి పదేపదే రన్నింగ్ కామెంట్రీతో ఆటంకం కలిగించారు. టీడీపీ సభ్యుల్లో ముఖ్యంగా పయ్యావుల కేశవ్, బుచ్చయ్య చౌదరి, నిమ్మల రామానాయుడు, డోలా వీరాంజనేయులు వారి స్థానాల్లో కూర్చునే ప్రసంగ అంశాలపై కామెంట్లు చేస్తూ సభలో గందరగోళం సృష్టించారు. దీంతో గవర్నర్ తన ప్రసంగాన్ని పలుమార్లు కొద్ది క్షణాల పాటు ఆపి, మళ్లీ కొనసాగించారు. మహిళా సాధికారత, మహిళా రక్షణ, పేదలందరికీ ఇళ్లు, రాజకీయ, సామాజిక న్యాయం, వ్యవసాయ రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి వంటి కీలకాంశాలపై గవర్నర్ ప్రసంగం సాగుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు అంతరాయం కలిగించారు. జలయజ్ఞం కింద రాష్ట్రంలోని ప్రాజెక్టులను వేగంగా ప్రభుత్వం పూర్తి చేస్తోందని, పోలవరంతో పాటు వెలిగొండ, రాయలసీమ కరువు నివారణ ప్రాజెక్టు పనులు పురోగతిలో ఉన్నాయని గవర్నర్ చెప్పగానే ప్రతిపక్ష సభ్యులు 'రాష్ట్రంలో నో ఇరిగేషన్' అంటూ సీట్లలో నుంచి లేచి నినాదాలు చేశారు. పోలవరం ప్రాజెక్టు గురించి వివరిస్తుండగా వాకౌట్ చేసి సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. సభలో ప్రతిపక్ష సభ్యుల తీరును అధికార పక్షం సభ్యులు తీవ్రంగా తప్పుబట్టారు. విపక్ష సభ్యుల చర్య సంప్రదాయాన్ని కించపరిచే విధంగా ఉందని విమర్శించారు.

**క్లుప్తంగా...**

## గవర్నర్ ప్రసంగం హర్షణీయం

**898వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు**



**రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు**

**తాడికొండ:** గవర్నర్ తన ప్రసంగంలో వికేంద్రీకరణ అభివృద్ధికి సోపానమని పేర్కొనడం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 898వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి తీసుకోని సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూ సంక్షేమంతో పాటు అభివృద్ధిని పేద వర్గాలకు చేరువ చేసిన సీఎం వైఎస్ జగన్ పాలన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని చెప్పారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాలకు వెళుతున్న సీఎం వైఎస్ జగన్... మూడు రాజధానులకు మద్దతుగా కొనసాగుతున్న దీక్షా శిబిరం వద్దకు రాగానే తన వాహన శ్రేణి వేగం తగ్గించి చేతులు జోడించి బహుజన పరిరక్షణ సమితి నాయకులకు అభివాదం చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, పెరికే వరప్రసాద్, ఈపూరి ఆదాం, పులి దాసు, ఇందుపల్లి సుభాషిణి, పల్లె బాబు పాల్గొన్నారు.

## అధికారంలోకి వస్తే బీసీలకు ప్రత్యేక చట్టం

**యువగళం పాదయాత్రలో నారా లోకేశ్**

**బి.కొత్తకోట:** టీడీపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీలకు అమలవుతున్న చట్టం మాదిరి బీసీల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకువస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర మంగళవారం అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని అమరనారాయణపురం నుంచి నాయనబావి పంచాయతీ గుట్టపాళ్యం వరకు సాగింది. మొగసాలమర్రి వద్ద బీసీలు, మహిళలతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. దాడుల నుంచి బీసీలను రక్షించేందుకు, దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పాలఏకరి కులస్తులకు బీసీ సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. మదనపల్లె కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలపై పన్నుల భారం తగ్గిస్తామన్నారు.

# వస్తున్నాయ్.. మరిన్ని ఇ-బస్సులు

**ఆగస్టు నాటికి వెయ్యి విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టనున్న ఆర్టీసీ**

**సాక్షి, అమరావతి :** రాష్ట్రంలో మరిన్ని విద్యుత్ బస్సులు (ఇ-బస్సులు) ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) సన్నద్ధమవుతోంది. పర్యావరణ పరిరక్షణ, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కల్పించే లక్ష్యంతో కొత్తగా వెయ్యి ఇ-బస్సులను ప్రవేశపెట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల ఆర్టీసీకి అనుమతినిచ్చారు. ఈ బస్సులతో ఏటా కనీసం 51 వేల మెట్రిక్ టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించవచ్చని అంచనా వేశారు. ఆర్టీసీ తిరుమల-తిరుపతి ఘాట్ రోడ్డులో గత ఏడాది ఇ-బస్సులను ప్రవేశపెట్టింది. ఈ మార్గంలో 100 బస్సులను ప్రవేశపెడుతోంది. రెండో దశ కింద రాష్ట్రంలో ఇతర నగరాల్లో వెయ్యి విద్యుత్ బస్సులను అందుబాటులోకి తీసుకురానుంది. ఏయే ప్రాంతాల్లో వీటిని ప్రవేశపెట్టాలో నిర్ణయించేందుకు ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. తొలుత విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలులో ప్రవేశపెట్టాలని ఆర్టీసీ సూత్రప్రాయంగా నిర్ణయించింది. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరులో సిటీ సర్వీసులతో పాటు దూరప్రాంత, అంతర్రాష్ట్ర సర్వీసులుగా ప్రవేశపెట్టనున్నారు. మిగతా మూడు నగరాల నుంచి దూరప్రాంత సర్వీసులు నడపాలన్నది ఆర్టీసీ ఉద్దేశం. దీనిపై త్వరలోనే తుది నిర్ణయం తీసుకోనుంది. అనంతరం టెండర్ల ప్రక్రియ చేపడుతుంది. ఈ ఏడాది ఆగస్టుకు ఇ-బస్సులను అందుబాటులోకి తేవాలని ఆర్టీసీ భావిస్తోంది.



### ఆ తర్వాత దశలో మరో 3 వేల బస్సులు

ఇకపై విద్యుత్ బస్సులనే కొనాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. డీజిల్ బస్సులను అద్దె ప్రాతిపదికన మాత్రమే ప్రవేశపెడతారు. ప్రస్తుతం ఆర్టీసీలో ఉన్న 11,214 డీజిల్ బస్సుల స్థానంలో దశలవారీగా ఇ-బస్సులను ప్రవేశపెడతారు. అందుకోసం రానున్న మూడేళ్లలో దశలవారీగా 4 వేల ఇ-బస్సుల ప్రతిపాదనను ప్రభుత్వం గత ఏడాది ఆమోదించింది. అందులో భాగంగానే ప్రస్తుతం వెయ్యి బస్సులను ప్రవేశపెడుతున్నారు. అనంతరం మరో మూడు దశల్లో 3 వేల బస్సులను అందుబాటులోకి తేనున్నారు. ఇవి కూడా వస్తే తిరుమల-తిరుపతి ఘాట్ రోడ్డు సర్వీసులతో కలిపి మొత్తం 4,100 ఇ-బస్సులు అందుబాటులోకి వస్తాయి. దాంతో మొత్తం మీద వాతావరణంలో ఏటా 2.10 లక్షల మెట్రిక్ టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించవచ్చని ఆర్టీసీ భావిస్తోంది. ఒకసారి చార్జింగ్ చేస్తే ఒక ఇ-బస్సు ఒక రూట్‌లో రానుపోనూ ప్రయాణించవచ్చని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి.

**డిస్కంలతో కలిసి చార్జింగ్ స్టేషన్లు**

విద్యుత్ బస్సుల కోసం సొంతంగా చార్జింగ్ స్టేషన్లు కూడా ఆర్టీసీ ఏర్పాటు చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు డిస్కంలతో కలసి వీటిని ఏర్పాటు చేయనుంది. మొదటి దశలో రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోల్లో వీటిని ఏర్పాటు చేస్తారు. రెండో దశలో జిల్లా కేంద్రాల్లోని ఆర్టీసీ బస్ స్టేషన్లలో, మూడో దశలో డివిజన్ కేంద్రాలు, రాష్ట్ర సరిహద్దుల్లోని పట్టణాల్లో ఉన్న బస్ స్టేషన్లలో చార్జింగ్ స్టేషన్లు నెలకొల్పుతారు.

# బీసీలపై చంద్రబాబు కపట ప్రేమ

**సాక్షి, అమరావతి:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచే అవకాశం లేకపోయినా బీసీ మహిళా నేత పంచుమర్తి అనూరాధను పోటీకి దించి చంద్రబాబు మరోసారి తన మార్కు రాజకీయానికి తెరలేపారు. అధికారంలో ఉన్నప్పుడు ఆమెకు మొండిచేయి చూపించి.. ఇప్పుడు గెలవలేని సీటు ఇచ్చి ఆమెను బలి చేసేందుకు సిద్ధమయ్యారు. ఎమ్మెల్యేల కోటాలో ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా వైఎస్సార్‌సీపీకి ఉన్న సంఖ్యాబలంతో వాటిన్నింటినీ చేజిక్కించుకోవడం దాదాపు ఖాయమైంది. ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని గెలుచుకోవాలంటే కనీసం 22 మంది ఎమ్మెల్యేలు అవసరం. టీడీపీ నుంచి గెలిచింది 23 మంది ఎమ్మెల్యేలైనా, అందులో నలుగురు ఆ పార్టీకి దూరంగా ఉన్నారు. మిగిలింది 19 మంది మాత్రమే. వారి ఓట్లతో టీడీపీ అభ్యర్థి గెలవడం అసాధ్యం అని అందరికీ తెలుసు. అలాంటి ఎన్నికల్లో బీసీ మహిళను నిలబెట్టడం అంటే ఆ వర్గాన్ని అవమానించడమేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక, అనూరాధ ఎమ్మెల్సీగా తనకు అవకాశం ఇవ్వాలని పలుమార్లు కోరినా చంద్రబాబు పట్టించుకోలేదు. ఇప్పుడు ఓడిపోయే సీటును మాత్రం బీసీల కోటాలో ఆమెకు ఇవ్వడంపై టీడీపీలోనే అసహనం వ్యక్తమవుతోంది.



## మొదటి నుంచీ ఇదే తీరు

- అధికారంలో ఉన్నప్పుడు సొంత వర్గానికి మాత్రమే పదవులు కట్టబెట్టిన చంద్రబాబు.. అప్పట్లో బీసీలు, దళిత నేతలను చాలా అవమానాలకు గురిచేశారు. 2020లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ప్రస్తుతం అనూరాధకు ఎమ్మెల్సీ సీటు కేటాయించినట్టే, పార్టీ సీనియర్ నేత వర్ల రామయ్యకు రాజ్యసభ సీటు కేటాయించారు. ఆ ఎన్నికల్లోనూ రాష్ట్రానికి వచ్చే నాలుగు రాజ్యసభ స్థానాల్లో సంఖ్యా బలం రీత్యా వైఎస్సార్‌సీపీ గెలవడం లాంఛనమేనని తెలిసినా చంద్రబాబు దళిత నేతను పోటీకి దింపి ఆ వర్గాన్ని బలి చేశారు.
- 2014 నుంచి ఆరేళ్లలో మూడుసార్లు టీడీపీ నాయకుల్ని రాజ్యసభకు పంపే అవకాశం వచ్చినప్పుడు తన కోటరీలోని ముఖ్యులు, సొంత సామాజిక వర్గం వారికి మాత్రమే ప్రాధాన్యం ఇచ్చి.. దళితులు, బీసీ నాయకుల్ని మాత్రం పట్టించుకోలేదు.
- 2014, 2016, 2018లో ఏడుగురిని రాజ్యసభకు పంపే అవకాశం వచ్చినప్పుడు చంద్రబాబుకు బీసీలు, దళితులు గుర్తుకు రాలేదు. అప్పుడు తన సొంత సామాజికవర్గ నేతలు, తన కోటరీకి చెందిన వారు, సన్నిహితులకు అవకాశం ఇచ్చారు.
- గరికపాటి మోహనరావు, సీఎం రమేష్, సుజనా చౌదరి వంటి నేతలను రాజ్యసభకు పంపారు. మిగిలిన సీట్లలోనూ సామాజిక సమీకరణలు, పార్టీ అవసరాల పేరుతో టీజీ వెంకటేష్, తోట సీతారామలక్ష్మి, కనకమేడల రవీంద్రకుమార్, సురేష్ ప్రభు వంటి నేతలకు ఇచ్చారు.
- 2016లో దళిత నేత జేఆర్ పుష్పరాజ్‌కు సీటిస్తానని తన ఇంటికి పిలిపించుకుని ఒక రోజంతా కూర్చోబెట్టి, ఆ తర్వాత లేదని చెప్పి అవమానించి పంపారు. 2018లో దళిత నేత వర్ల రామయ్యకు రాజ్యసభ సీటు ఇస్తానని చెప్పి అంతా సిద్ధమయ్యాక చివరి నిమిషంలో కనకమేడల రవీంద్రకుమార్‌కు ఆ సీటు ఇచ్చారు.
- ఇప్పుడు అధికారం కోల్పోయి, ఎమ్మెల్యేల సంఖ్యాబలం లేని స్థితిలో ఓడిపోతామని తెలిసి కూడా ఆ సీటులో బీసీ మహిళను నిలబెట్టడం ద్వారా చంద్రబాబు మరోసారి బలహీన వర్గాలను మోసం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ స్థానాల్లో తన కుమారుడు లోకేశ్, ఇతర ముఖ్య నాయకులను ఎందుకు నిలబెట్టలేదనే ప్రశ్నలు సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్నాయి.

## పేదలకు నాణ్యమైన వైద్యమే లక్ష్యం

- జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ప్రారంభించిన మంత్రి విడదల రజిని



**విద్యార్థులకు ఆల్‌బెండోజెల్ ట్యాబ్లెట్లు పంపిణీ చేస్తున్న మంత్రి విడదల రజిని**

**మంగళగిరి:** పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరు జిల్లా చినకాకానిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఆమె ప్రారంభించారు. విద్యార్థులకు ఆల్‌బెండోజెల్ ట్యాబ్లెట్లు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 1.7 కోట్ల మందికి ట్యాబ్లెట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ప్రభుత్వం విద్యార్థులందరికీ చక్కటి పౌష్టికాహారం అందిస్తుందన్నారు. ఆరోగ్యశ్రీలో 3,250 జబ్బులను చేర్చారని చెప్పారు. కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డైరెక్టర్ రామిరెడ్డి, తెనాలి సబ్-కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎంటీఎంసీ కమిషనర్ హేమామాలిని, డీఈవో శైలజ, తహసీల్దార్ రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

## సంప్రదాయ వైద్య రంగాన్ని బలోపేతం చేయాలి

**సీఎం జగన్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు లేఖ**

**సాక్షి, అమరావతి:** ఆయుర్వేదం, సిద్ధ, యునానీ, హోమియోపతి, నేచురోపతి వంటి సంప్రదాయ వైద్య విధానాల అమలు కోసం రాష్ట్రంలో ఆయా శాఖలను బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం సీఎం వైఎస్ జగన్‌కు లేఖ రాశారు. వైరస్‌ల వల్ల ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, అన్ని రకాల వైద్య విధానాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

**పవన్‌కు సోము వీర్రాజు శుభాకాంక్షలు**

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోము వీర్రాజు ట్విట్టర్ ద్వారా పవన్‌కళ్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 'ప్రజా సమస్యల పరిష్కారమే పునాదులుగా రాష్ట్ర రాజకీయాల్లో నిర్మాణాత్మక శక్తిగా అవతరించిన జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌కు, నాయకులకు, కార్యకర్తలకు శుభాకాంక్షలు' అని సోము వీర్రాజు ట్వీట్ చేశారు.

**తెలంగాణ**

## 'జూబ్లీహిల్స్' స్థలంపై స్టేటస్ కో

**తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు**

**సాక్షి, హైదరాబాద్:** జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ స్థల విక్రయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన కేసులో హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలిచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 25కు వాయిదా వేసింది. జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ పరిధిలో ఖాళీగా ఉన్న 595 గజాల స్థలాన్ని సినీ నటుడు చిరంజీవికి విక్రయించడాన్ని సవాల్ చేస్తూ జూబ్లీహిల్స్‌కు చెందిన జంపాల శ్రీకాంత్‌బాబుతోపాటు మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాస్తవంగా ఈ భూమిని జీహెచ్‌ఎంసీకి కేటాయించాల్సి ఉందని.. ఆ మేరకు ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున రోహిత్ పోగుల వాదనలు వినిపించారు. జీహెచ్‌ఎంసీకి కేటాయించాల్సిన భూమిని మేనేజింగ్ కమిటీ ఇతరులకు విక్రయించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఆ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా, ఇతరులకు విక్రయించకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. స్టేటస్ కో ఉత్తర్వులు ఇస్తూ, విచారణను వాయిదా వేశారు.



మానవ జీవితారణ్యంలో సురక్షితమైన
మనుగడకు జ్ఞానకాంతి, ధర్మమార్గం అవసరం.
- బౌద్ధ ధర్మం



సాక్షి

బుధవారం, మార్చి, 15

# ప్రపంచానికి పెద్దన్న కావాలని...

కొన్నిసార్లు మౌనం, మరికొన్నిసార్లు మాటలు కీలకం. బాహ్య అర్థానికి మించిన సందేశాన్ని అవి బట్వాడా చేయగలవు. సోమవారం నాటి చైనా వార్షిక పార్లమెంటరీ సమావేశంలో ఆ దేశాధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ముగింపు ప్రసంగంలోని మాటలు అలాంటివే. ఆయన ఇచ్చిన సందేశం ఒకటే – చైనా ఈజ్ బ్యాక్! కనివిని ఎరుగని రీతిలో మూడోసారి మరో అయిదేళ్ళ పాటు చైనా దేశాధ్యక్ష పీఠాభిషిక్తుడైన షీ మాటలు జోరుగా సాగాయి. చైనా భద్రత, అభివృద్ధి, సార్వభౌమాధికారాల్ని పరిరక్షించేలా సైన్యాన్ని 'గ్రేట్ వాల్ ఆఫ్ స్టీల్'లా తయారుచేస్తామని చెబుతూ, ప్రపంచ పాలనలో బీజింగ్ 'క్రియాశీలక పాత్ర పోషిస్తుంద'ని ప్రకటించారు. సంఖ్యాపరంగా ప్రపంచంలో అతి పెద్దదైనా ఏటా ఒకసారి, రెండువారాలే అంతా కలిసే చైనా పార్లమెంట్‌లో 3 వేల మంది సభ్యుల్లో ఉత్సాహం నింపారు. మరోపక్క బద్ధశత్రువులైన సౌదీ అరేబియా– ఇరాన్‌ల మధ్య ఒప్పందం కుదిర్చి, ఊహించని దౌత్యవిజయం సాధించారు. ఈ మాటలు, చేతలు చూస్తే షీ తనను తాను ప్రపంచ రాజనీతిజ్ఞుడిగా చిత్రించుకొంటున్నారన్న మాట. విశ్వవేదికకు చైనాయే సారథి అని చెబుతున్నారన్న మాట.

గత కొన్ని తరాల్లో షీ లాంటి నేత చైనాలో కనిపించరు. నిజానికి, చైనా ప్రభుత్వ పాలనా వ్యవస్థలో అధ్యక్షుడి పనులు లాంఛనప్రాయమే. కానీ, 69 ఏళ్ళ షీ అధికారమంతా ఇటు కమ్యూనిస్ట్ పార్టీ జనరల్ సెక్రటరీగా, అటు కేంద్ర మిలిటరీ కమిషన్ (సీఎంసీ) ఛైర్మన్ హోదాల ద్వారా సంక్రమించినవే. గత అక్టోబర్‌లో పార్టీ మహాసభలో ఆయనకు ఆ రెండు హోదాలూ దక్కాయి. దేశంలోకెల్లా అత్యంత శక్తిమంతమైన ఏడుగురు సభ్యుల పొలిట్‌బ్యూరో స్థాయీ సంఘంలో మొత్తం తన విధేయులతో నింపేశారు. అప్పుడే దేశాధ్యక్షుడిగా మూడోసారి ఆయన బాధ్యతలు చేపడతారని ఊహించారు. మావో లాంటి నేతలు సైతం పదవిలో రెండుసార్లే ఉండగా, ఆ ఆంక్షను 2018లో మార్చివేసిన షీ ఆ దిగ్గజాలను అధిగమించేశారు. జీరోకోవిడ్ విధానం నుంచి దేశం బయట కొస్తున్న వేళ, షీ తన పాలనాధికారాన్ని పటిష్ఠం చేసుకుంటున్నారు. బలోపేతుడైన తన సారథ్యంలో పార్టీలో అధికార కేంద్రీకరణ అనేక సమస్యలకు పరిష్కారమని భావిస్తున్నారు. అందుకే, రాగల కొన్నేళ్ళలో చైనా దశ, దిశను తెలిపే సందర్భమని తాజా వార్షిక పార్లమెంటరీ సమావేశం (నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్), చైనీస్ పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ (సీపీపీసీసీ)లను అంతా ఆసక్తిగా చూశారు.

అక్కడే షీ తనకు దీర్ఘకాలిక మిత్రుడూ, కమ్యూనిస్ట్ పార్టీలో రెండో అతిపెద్ద స్థానంలో ఉన్న లీ చియాంగ్‌ను కొత్త ప్రీమియర్‌గా కూర్చోబెట్టారు. జీరో–కోవిడ్ అంటూ మూడేళ్ళ పాటు ప్రపంచానికి దూరంగా గడిపిన చైనా దౌత్యవేత్తలతో పాటు షీ ఇక సరిహద్దులు దాటి, అంతర్జాతీయ సదస్సులకు హాజరయ్యేందుకు సిద్ధమవుతున్నారు. వరుస పర్యటనలతో వివిధ దేశాలతో సంబంధాలను పెంచు కోవాలని చూస్తున్నారు. అదే సమయంలో మరో అగ్రరాజ్యం అమెరికాతో మాటలకు దూరం జరుగుతున్నారు. చైనా రక్షణశాఖ కొత్త మంత్రిగా లీ షాంగ్‌ఫూను నియమించడం ఒక రకంగా అలాంటి పనే. నిజానికి, రష్యా రక్షణ రంగంతో అంటకాగుతున్నారంటూ 2018 నుంచి సదరు లీ మీద అమెరికా ఆంక్షలు పెట్టింది. తీరా ఇప్పుడు అదే వ్యక్తిని రక్షణ మంత్రిని చేయడంతో – అమెరికా, చైనాల మధ్య సైనిక చర్చలు మరింత కష్టమవుతాయి. గత ఆగస్టులో అమెరికా స్పీకర్ నాన్సీ పెలోసీ తైవాన్ సందర్శన నుంచి– ఇరు దేశాల మధ్య సైనిక చర్చలు నిలిచిపోయాయి.

అయితే రష్యాతో అనుబంధాన్ని కాపాడుకోవడమే షీ లక్ష్యం. మాస్కోకు మిత్రుడైన లీ నియామకంతో ఆ మాట చెప్పకనే చెప్పారు. రష్యా – ఉక్రెయిన్‌ల యుద్ధంలో తటస్థంగా ఉన్నామని డ్రాగన్ పైకి చెబుతోంది. కానీ, ఆంతరంగికంగా రష్యాకు చైనాధిపతి మద్దతు బహిరంగ రహస్యమే. గత నెలలోనే చైనా అగ్ర దౌత్యవేత్త వాంగ్ యీ మాస్కో వెళ్ళి పుతిన్‌ను కలిసి, చైనా – రష్యాల అనుబంధాన్ని 'ఏ మూడో పార్టీ శాసించలేదు' అనడమే అందుకు సాక్ష్యం. ఇప్పుడిక షీ స్వయంగా రష్యా వెళ్ళి పుతిన్‌ను కలవనున్నారు. అమెరికా ప్రపంచ పెద్దన్న పాత్రకు అడ్డుకట్ట వేసి, ఆ స్థానాన్ని దక్కించుకోవాలన్న డ్రాగన్ వ్యూహం అనూహ్యమేమీ కాదు. సోవియట్ యూనియన్ పతనానంతరం మూడు దశాబ్దాలకు మళ్ళీ స్పష్టంగా ముందుకొచ్చిన ద్విధ్రువ ప్రపంచపు ఉద్రిక్తతలూ అనివార్యమే. భౌగోళిక రాజకీయాల్లోని ఈ మార్పుల్ని పొరుగున్న భారత్ గమనించాలి. స్వీయ భద్రత చూసుకోవాలి.

ప్రపంచంలోని రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను ముందుకు నడుపుతున్న షీ సైతం అభివృద్ధికి పునాది భద్రత అనీ, సౌభాగ్యం వెల్లివిరియాలంటే స్థిరత్వం ఉండాలనీ ప్రస్తావించారు. ఆ స్ఫూర్తితో భౌగోళిక ప్రాబల్య విస్తరణ, తైవాన్, భారత్ ప్రాదేశిక వివాదాల లాంటివాటి జోలికి పోకుండా, సౌదీ అరేబియా – ఇరాన్ ఒప్పందం లాంటి అనూహ్య దౌత్య విజయాలతో విశ్వవేదికపై డ్రాగన్ తన ఇమేజ్‌ను పెంచుకుంటే మంచిదే. కానీ, ఎగిరే బెలూన్ల గూఢచర్యం లాంటివి మానాలి. షింజియాంగ్, హాంగ్‌కాంగ్ లాంటి చోట్ల మానవ హక్కులపై పాశ్చాత్య దేశాల ఆందోళనల్ని పోగొట్టాలి. సరిహద్దు తగాదాల కన్నా ఆర్థిక పురోగతికి ప్రాధాన్యమిస్తూ, చైనా అడుగు ముందుకేస్తేనే అది ఆశిస్తున్న ప్రాబల్య పాత్ర సాధ్యమేమో! ఆర్థికంగా పోటీ ఉండవచ్చేమో కానీ, సరిహద్దు ఘర్షణలతో ఎవరికీ సౌభాగ్యం సాధ్యం కాదు. పదేళ్ళ క్రితం అవినీతిపై పోరు అంటూ ముందుకు దూసుకొచ్చి, పెరిగిన నిరుద్యోగ రేటు, తగ్గిన కొనుగోళ్లతో అస్తుబిస్తవుతూ, ఇప్పటికే జనంలో ప్రతిష్ఠ దెబ్బతిన్న షీ జిన్‌పింగ్‌కు తన లక్ష్యంతో పాటు ఆ సంగతి తెలియదనుకోలేం!

# స్వీయ దిద్దుబాటుపైనే జాతి భవిష్యత్తు!

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

బ్రిటిష్ పాలనకు ముందు భారతదేశ జనాభాలో 70 శాతం మంది విద్యావంతులేనని మోహన్ భాగవత్ పేర్కొన్నారు. 70 శాతం మంది విద్యావంతులని ప్రకటించడం అంటే సంస్కృతం బోధించే బ్రాహ్మణీయ గురుకులాల్లో శూద్రులు, దళితులు చదువుకునేవారనే అర్థం వస్తోంది. భారతదేశంలో అన్ని కులాలు, వృత్తులకు చెందిన పిల్లలకు బోధించిన బ్రాహ్మణ లేదా హిందూ సంస్థలు ఉండేవా? నేడు దేశంలో ప్రధాన ఓటర్లుగా ఉంటున్న శూద్రులు, ఓబీసీలు, దళితులు, ఆదివాసీ ప్రజారాసులకు అవాస్తవ గాథలను వల్లించడం ద్వారా జాతీయవాదాన్ని స్థాపించలేరు. గత తప్పిదాలను ఆమోదించడం ద్వారానే జాతీయ స్ఫూర్తిని ప్రజల్లో నింపవచ్చు. అసత్యాలతో కాకుండా నిజాయితీ, స్వీయ దిద్దుబాటుపైనే జాతి భవిష్యత్తును నిర్మించవచ్చు.


ఆరెస్సెస్ సర్‌సంచాలక్ మోహన్ భాగవత్ కొంతకాలంగా అసాధారణ ప్రకటనలు చేస్తున్నారు. దేవుడు కులాన్ని సృష్టించలేదనీ, పండిట్లు (పూజారులు) కులాన్ని సృష్టించారనీ అన్నారు. శాస్త్రాలు మౌఖికంగా బదిలీ అయినంతకాలం బాగుండేవనీ, వాటిని ఎప్పుడైతే రాయడం జరిగిందో తప్పుడు విషయాలు పొందుపరుస్తూ వచ్చారని కూడా అన్నారు. ఈ రెండు ప్రకటనలు కొత్త సంస్కరణ తత్వంతో ఉన్నాయి.

'2023 మార్చి 5న మోహన్ భాగవత్ బ్రిటిష్ పాలనకు ముందు భారతదేశ జనాభాలో 70 శాతం విద్యావంతులేనని పేర్కొన్నారు. అప్పట్లో దేశంలో నిరుద్యోగమనేది లేదని కూడా చెప్పారు'. ఆయన ఈ ప్రకటనకు మీడియా విస్తృత ప్రచారం కల్పించింది.

సావిత్రీబాయి పూలే జయంతి నేపథ్యంలో 2023 మార్చి 7న 'పుణేకర్ న్యూస్'లో కేమిల్ పార్థే 1824లో బాంబేలో మొట్టమొదటి బాలికా పాఠశాలను ప్రారంభించిన అమెరికన్ మిషనరీ మహిళ సింథియా ఫరార్ గురించి ఒక ఆసక్తికరమైన కథనం రాశారు. పుణేలో బాలికల పాఠశాలను ప్రారంభించడానికి మహాత్మా జ్యోతిరావు పూలేకు ఫరార్ ఆదర్శంగా నిలిచారు. ఈ పాఠశాలలోనే సావిత్రీబాయి, ఫాతిమా బాలికలకు పాఠాలు చెప్పేవారు. జాతీయవాద దృష్టితో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రీబాయిని దేశం పరిగణిస్తోంది. నిజానికి సింథియా ఫరార్‌ను మొదటి మహిళా టీచర్‌గా భావించాలి. సింథియా పెళ్లి చేసుకోలేదు. భారతదేశంలో బాలికా విద్య కోసం తన జీవితాంతం కృషి చేశారు. అహ్మద్‌నగర్‌లో 1862లో మరణించారు. ''ముంబై, అహ్మద్‌నగర్‌లలో అనేక బాలికా పాఠశాలలు, బాలికల బోర్డింగ్ స్కూల్స్‌ను ప్రారంభించిన ఘనత సింథియా ఫరార్‌దే'' అంటారు పార్థే. చరిత్రలో ఏ కాలంలోనైనా భారత్‌లో హిందూ బ్రాహ్మణ మిషనరీలు అలాంటి బాలికా పాఠశాలలను ప్రారంభించడం జరిగిందా?

70 శాతం మంది భారతీయులంటే, అందులో శూద్రులు, గ్రామాల, పట్టణాల చివర నివసిస్తున్న దళితులకు విద్యాహక్కు ఉండాలి. బ్రిటిష్ పూర్వ భారతదేశం అంటే మొఘలాయి పాలన గురించి ఆయన మాట్లాడుతున్నారని అర్థం. ముస్లిం పాలనాకాలంలో 70 శాతం మంది భారతీయులు చదువుకున్నవారేనన్న అర్థాన్ని ఇస్తోంది మోహన్ భాగవత్ ప్రకటన. అదే నిజమైతే, ముస్లింల పాలన ఎందుకు చెడ్డది? మొఘలుల పాలనాకాలంలో భారత్‌లో 70 శాతం మంది ముస్లింలు లేరు. ముస్లిం పాలకులు శూద్రులను, దళితులను విద్యావంతుల్ని చేశాక కూడా వాళ్లు ఇటీవలి కాలం వరకూ నిరక్షరాస్యులుగానే ఎందుకు ఉండిపోయినట్లు?

మోహన్ భాగవత్ ప్రకటన సాధారణంగా ఆరెస్సెస్ వాస్తవికతను ప్రతిబింబిస్తుంది. కులం, మహిళల అసమానత్వం అనేవి సంస్కృత శాస్త్రాల్లోకి తదనంతర రచయితలు ప్రవేశపెట్టారని ఆరెస్సెస్ చెబుతున్నట్టయితే– ఆరెస్సెస్/బీజేపీ ప్రభుత్వం ఒక సమీక్షా కమిటీని ఏర్పర్చి శాస్త్రాల్లో కులం, మహిళల అసమానత్వం గురించిన ప్రస్తావనలను తొలగించవచ్చు. శాస్త్రాలు, పురాణాల్లో దేవతలకు కూడా కులం అంటగట్టేశారు. ఉదాహరణకు రాముడిని క్షత్రియుడిగా, కృష్ణుడిని యాదవుడిగా పేర్కొంటారు. శూద్ర, చండాల వంటి కుల బృందాలను అత్యంత హీనంగా శాస్త్రాలు పేర్కొన్నాయి. అదే బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్య సామాజిక వర్గాలను అత్యంత గౌరవనీయమైన రీతిలో పేర్కొన్నారు. పైగా శూద్రులు, చండాలురు వీరిని సేవించాలన్నారు. శాస్త్రాల్లో అలాంటి భాషను మార్చడాన్ని ఎవరూ ఆపరు.



హిందువులుగా తమను పరిగణించుకునే అన్ని వృత్తి బృందాలకు అర్చక విద్య పొందే హక్కును కల్పించాలి. 'దేవుడు కులాన్ని సృష్టించలేదు' అని ఆరెస్సెస్ అధినేతగా భాగవత్ చెబుతున్నందున ఇది అవసరమైన చర్యే. ఆధ్యాత్మిక విద్యలో సమాన అవకాశాలపైన ఆధ్యాత్మిక సమానత్వం ఆధారపడి ఉంటుంది. హిందూ పిల్లలందరికీ హిందూ ఆధ్యాత్మిక విద్యను ఆరెస్సెస్, బీజేపీ కూటమి ప్రారంభించవచ్చు. ఇటీవలి కాలం వరకూ హిందూ ఆధ్యాత్మిక గ్రంథాలను చదివే హక్కు శూద్రులకు, దళితులకు ఉండేది కాదని తెలిసిన విషయమే. ఈ పుస్తకాల్లోనే వీరి జీవితాన్ని పశువులతో సమానంగా చిత్రించారు. 'రామచరిత్ మానస్'లో అలాంటి భాష గురించి ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో జరిగిన చర్చ అందరికీ తెలిసిందే.

ఆరెస్సెస్, బీజేపీ పాలిస్తున్నప్పుడు అన్ని రంగాల్లో సమానమైన వాతావరణంలో విద్యా హక్కుకు హామీ ఉండేలా చూడాలి. భారతీయ వృత్తిజీవులందరి హుందాతనాన్ని నిలబెట్టేలా పాఠ్యప్రణాళిక ఉండాలి. ఏ కాలంలో, ఏ సమాజమైనా వ్యవసాయం, పశుపోషణ, చేతి వృత్తులు లేకుండా మనుగడ సాగించలేదు. కానీ రుగ్వేదం నుంచి రామాయణ, మహాభారతాల వరకు ఈ వృత్తులను దైవికం కానివిగా చూశాయి. అందువల్ల అవి శూద్ర లేదా చండాలమైనవి. కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో చదువుకుంటున్న ఆధునిక యువత ఇలాంటి భాషను ఆమోదించలేదు. కాబట్టి మార్పు అవసరం.

బ్రిటిష్ పూర్వ భారతదేశంలో 70 శాతం మంది విద్యావంతులని ప్రకటించడం అంటే సంస్కృతం బోధించే బ్రాహ్మణీయ గురుకులాల్లో శూద్రులు, దళితులు, మహిళలు చక్కగా చదువుకునే వారనే అర్థం వస్తోంది. దీనికి రుజువు ఉందా? ప్రాచీన, మధ్య యుగాల్లో అంటే బ్రిటిష్ వారు అడుగుపెట్టేంతవరకూ విద్యావిధానం నుంచి శూద్రులు, దళితులు, మహిళలను దూరం పెట్టాలని శాస్త్రాలే స్వయంగా చెబుతున్నప్పుడు బ్రిటిష్ పూర్వ భారతదేశంలో 70 శాతం మంది భారతీయులు చదువుకున్నారని మోహన్ భాగవత్ అనడంలో అర్థం ఉందా?

భారతదేశంలో అన్ని కులాలు, సామాజిక బృందాల పిల్లలకు సూత్రరీత్యా విద్యను అందించేందుకు ఆమోదించిన మొట్టమొదటి పాఠశాలను విలియం కేరీ అనే బ్రిటిష్ మిషనరీ 1817లో కలకత్తాలో రాజా రామ్‌మోహన్ రాయ్ సహకారంతో ప్రారంభించారు. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు మొట్టమొదటి బాలికల పాఠశాలను 1824లో బాంబేలో అమెరికన్ మరాఠీ మిషన్ ప్రారంభించింది. ఆ మిషన్ తరఫున భారత్ వచ్చిన సింథియా ఫరార్ అన్ని కులాల మహిళలకు, పిల్లలకు బోధించడానికి తన జీవితాన్ని అంకితం చేశారు.

ముస్లిం పాలనా కాలంలో కానీ, అంతకుముందు కానీ భారతదేశంలో అన్ని కులాలు, వృత్తులకు చెందిన పిల్లలకు బోధించిన బ్రాహ్మణ లేదా హిందూ సంస్థలు ఉండేవా? అలాంటి విద్యాసంస్థలు లేకుండా దేశంలోని 70 శాతం మంది పిల్లలకు ఎవరు విద్య నేర్పారు? ఏ రాజరిక ప్రభుత్వమూ పాఠశాలలను నడపలేదు. బ్రాహ్మణులు (ప్రధానంగా బ్రాహ్మణులు, క్షత్రియ విద్యావంతులు) ఆ పని చేసి ఉండాల్సింది. కానీ దానికి శాస్త్రాలు వారిని అనుమతించలేదు.

మొఘలుల కాలంలో కూడా పర్షియా భాషలో అన్ని కులాల కోసం పాఠశాలలను ఏర్పర్చలేదు. సార్వత్రిక విద్యకు వ్యతిరేకులైన బ్రాహ్మణ పండితుల సూచన ప్రకారమే అక్బర్‌తో సహా మొఘల్ పాలకులు నడుచుకున్నారు. మొఘలుల పాలనాకాలంలో విషాదకరమైన విషయం ఏమిటంటే – ఇస్లాంలోకి మతం మార్చుకున్న కింది కులాల వారికి ఉన్నత కులాల ముల్లాలు, పఠాన్లు లేదా మొఘల్ జాతి వారు విద్య నేర్పలేదు. నేడు దళిత అక్షరాస్యత కంటే కిందికులాలకు చెందిన ముస్లింల నిరక్షరాస్యత ఎక్కువగా ఉండటానికి ఇదే కారణం.

70 శాతం అక్షరాస్యత గణాంకాలకు ఆరెస్సెస్ అధినేతకు ఆధారం ఏమిటి? నేడు దేశంలో ప్రధాన ఓటర్లుగా ఉంటున్న శూద్రులు, ఓబీసీలు, దళితులు, ఆదివాసీ ప్రజారాసులకు అవాస్తవ గాథలను వల్లించడం ద్వారా జాతీయవాదాన్ని స్థాపించలేరు. గతంలోని తప్పిదాలను ఆమోదించడం ద్వారానే జాతీయ స్ఫూర్తిని ప్రజల్లో నింపవచ్చు. అసత్యాలతో కాకుండా నిజాయితీ, స్వీయ దిద్దుబాటుపైనే జాతి భవిష్యత్తును నిర్మించవచ్చు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### చివరి వరకూ!



పీటీఐ హిందీ వార్తా సంస్థ 'భాష' వ్యవస్థాపకులు వేద్ ప్రతాప్ వైదిక్ (79) మరి లేరు! సార్క్ దేశాల ప్రజలకు నిజమైన స్నేహితుడిగా ఉన్న వేద్ ప్రతాప్ భాషా రాజకీయాలపై అనేక వ్యాసాలు రాశారు. ఈ రోజు కూడా హిందీ వార్తాపత్రికల్లో ఆయన కాలమ్ వచ్చింది!

– సీమా భట్, కాలమిస్ట్

### కరెన్సీ షాక్



ఏడాదికి రూ.4 లక్షల జీతం వచ్చే పశ్చిమ బెంగాల్ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ మాజీ ఉద్యోగి, టీఎంసీ నేత అయిన శాంతనూ బెనర్జీ నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రూ.350 కోట్ల ఆస్తిని స్వాధీనం చేసుకుంది. ఈడీని ద్వేషించడానికి అధికార పార్టీకి తగిన కారణమే!

– రిషీ బాగ్రీ, టాక్స్ పేయర్

### వెనకొచ్చిన కొమ్ములు



హిందువులు తమ దేశంలో రెండవ శ్రేణి పౌరులుగా ఎందుకు మిగిలిపోయారనే దానికి అనేక కారణాలు ఉన్నాయి. ఒక కారణం: వక్ఫ్ చట్టం. తమిళనాడులోని 1500 ఏళ్ల నాటి ఒక దేవాలయం ఉన్న ప్రదేశం ఇస్లాంకు చెందిన భూమి అని వక్ఫ్ ఎలా తీర్మానిస్తుంది? ఇస్లాం వయసే 1300 ఏళ్లు కదా!

– ఆనంద్ రంగనాథన్, రచయిత

### విలువైన కాలం



ప్రశ్నోత్తరాల సమయమైనా లేకుండానే లోక్‌సభ మళ్లీ వాయిదా పడింది! సభ నిర్వహణలో ప్రతి నిమిషానికీ అయ్యే ఖర్చు రూ.2.5 లక్షలు. ఇదంతా పన్ను చెల్లింపుదారుల డబ్బే. స్పీకర్ మౌనంగా ఉండటానికి బదులు ఏమైనా పరిష్కారం వెదకాల్సింది.

– రాజ్‌దీప్ సర్దేశాయ్, జర్నలిస్టు

### మహానుభావులు



యూఎస్‌లో మార్చి 14 'పై' డే. గణితంలో 'పై' విలువ 3.14 (3/14) కావడం వల్ల. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ (1879) జయంతి : కార్ల్‌మార్క్స్ (1883), స్టీఫెన్ హాకింగ్ (2018) వర్ధంతి కూడా ఇదే.

– రాజీవ్ చంద్రశేఖర్, కేంద్రమంత్రి

# ...అంతా కిల్'బిల్'పాండేలే!

సారాంశం

సరికొండ చలపతి

కాళిదాసు కవిత్వం కొంత, మన పైత్యం కొంత అన్న సామెత ఉంది. మనం చెప్పిన దానికి కాసింత కాళిదాసు లాంటి పెద్దవాళ్ల పేరు జోడించి వారి అకౌంట్‌లో వేయడం జరుగుతుంటుంది. తద్వారా చెప్పిన దానికి మరింత ప్రాచుర్యం వస్తుందని..

**అలాంటిదే ఒకటి చూద్దాం..**

అనగనగా ఆ కాలంలో ఓ ఆకతాయి యువకుడు ఉండేవాడు. ఆ ఆకతాయి వీధిలో వెళ్తున్న ఓ అమ్మాయిని చూసి రావే.. రావే అని కామెంట్ చేశాడు.. ఆ అమ్మాయికి ఒళ్లు మండి న్యాయాధికారికి ఫిర్యాదు చేసింది. ఇప్పటిలా ఎంపీలకైనా సమన్లు జారీ చేసి 'ముద్దు ముచ్చట్ల'కు జవాబు చెప్పండి అని ఆదేశించే మహిళా కమిషన్లు అప్పట్లో లేవు. ఎమ్మెల్యేలు వేధిస్తున్నారని ప్రెస్ మీట్లు పెట్టి చెప్పడానికి మీడియా కూడా లేదు. పైగా ధైర్యం ఉన్న ఇప్పటి 'నవ్య' తరం కూడా కాదు. ఆడియో, వీడియోలు షేర్ చెయ్యడానికి సోషల్ మీడియా కూడా లేదు. అప్పట్లో న్యాయాధికారి, ఆపై మహారాజు గారే యాక్షన్ తీసుకోవాలి. న్యాయాధికారి విషయాన్ని సీరియస్‌గానే తీసుకుని విచారణకు రమ్మని ఆకతాయిని ఆదేశించాడు.

ఇది తెలిసిన ఆకతాయి తండ్రి కంగారు పడిపోయాడు. ఇంట్లోనే ఆకతాయికి దేహశుద్ధి చేశాడు. కానీ, రాజదండన నుంచి ఎలా తప్పించడమో పాలు పోలేదు. ఆయనకు తెలిసిన కవి ఒకరు రాజు గారి ఆస్థానంలో ఉన్నారు. కవి గారి దగ్గరికి వెళ్లి గోడు వెళ్లబోసుకున్నాడు. కవి సాంతం విని, కొడుకును దార్లో పెట్టుకుంటానని తండ్రి వద్ద గట్టిగా మాట తీసుకుని ఓ ఐడియా చెప్పాడు. ''నేను ఓ శ్లోకం చెబుతా, న్యాయవిచారణ సమయంలో మీ కొడుకును చెప్పమను..'' అంటూ, దానితో పాటు ముందుగా బాధితురాలైన అమ్మాయి ఇంటికి వెళ్లి క్షమాపణ చెప్పండి అని సలహా ఇచ్చాడు. తండ్రి ఆయన చెప్పినట్టుగా చేసి ఆకతాయితో శ్లోకం బట్టీ పట్టించాడు. న్యాయవిచారణ జరుగుతున్నపుడు.. 'నేను రావే రావే అని ఊరికే అనలేదు, నేను అప్పుడు చదివిన శ్లోకంలో భాగమే అది..' అని కవి చెప్పిన శ్లోకం చదివాడు.

గేహే గేహే జంగమా హేమవల్లీ
వల్ల్యాం వల్ల్యాం పారణశ్చంద్రబింబః
బింబే బింబే కోకిలా మంజురావః
రావే రావే జాయతే పంచబాణః

(ప్రతి ఇంట్లోనూ ఒక కదిలే బంగారు తీగ ఉంది. ప్రతి తీగలోనూ ఒక పూర్ణ చంద్రబింబం ఉంది. ప్రతీ చంద్ర బింబంలోనూ ఒక కోకిల స్వరం ఉంది. ఆ ప్రతీ ధ్వనిలోనూ మన్మథుడు ఉన్నాడు.)

ఈ శ్లోకం చదువుతుండగా ఆమెకు రావే రావే అని మాత్రమే వినిపించిందని వివరణ ఇచ్చాడు. అంతకు ముందే ఇంటికి వెళ్లి క్షమాపణ చెప్పిన కారణంగా ఆ అమ్మాయి కూడా మరింత రెట్టించ లేదు.

ఇప్పటి 'నవ్య 'తరంలాగా.. ''మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే తాట తీస్తా, కిరోసిన్ పోసి నిప్పంటిస్తా...'' అని ఘాటుగా హెచ్చరించలేదు గానీ బుద్ధిగా ఉండమని సూచించింది.

కథ కంచికి వెళ్లింది. అందరూ ఇంటికి వెళ్లారు.

ఈ శ్లోకం రాసిచ్చిన కవి 'కాళిదాసే' అని ప్రచారం.

.........

ఇది కాళిదాసు కవిత్వమా, ఎవరిదైనా పైత్యమా అన్న విషయం వదిలేస్తే.. ఆ కాలం నుంచీ అమ్మాయిలంటే చులకనగా చూసే ఆకతాయిలున్నారు, విచారణలున్నాయి, క్షమాపణలున్నాయి. ఇప్పటికీ పరిస్థితేం పెద్దగా మారలేదు. మెడికోలైనా, ఎమ్మెల్యేలైనా, ఎంపీలైనా.. ఎవరయినా అంతే.

.........

పైన చెప్పుకున్న దానికి.. కింద మనం మాట్లాడుకోబోయే విషయానికి క్లోజ్ రిలేషన్ ఉందా.. బాదరాయణ సంబంధమేనా..? మీరే తేల్చుకోండి.

ఈ నెలలోనే మహిళా దినోత్సవం వచ్చింది. మళ్లీ మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రస్తావనా వచ్చింది. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో మహిళా సాధికారత కోసం ఢిల్లీలో దీక్ష...దీని వెనుక వేరే కారణాలున్నాయని విమర్శలున్నాయనుకోండి. కాసింత చర్చయితే అయ్యింది.

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆశలు సాకారమైతే, వారి సాధికారతవైపు సమాజం అడుగులు వేస్తే... మహిళలపై వివక్ష తగ్గితే.. గౌరవం పెరిగితే పైన చెప్పుకున్న సంఘటనలు లాంటివి తగ్గుముఖం పట్టే అవకాశం ఉందన్న ఆశలు కనిపించాయి. కానీ, ప్రతి మహిళా దినోత్సవం రోజు అన్ని పార్టీలు, సంఘాలు, ప్రముఖులు మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రస్తావించడం. కుదిరితే కాసిన్ని దీక్షలు.. ఆ తర్వాత మరిచి పోవడం.. అంతే, ఒకటి కాదు రెండు కాదు 26 ఏళ్లుగా ఇదే తంతు.



.........

**..ఎందుకంటే పైన మనం చెప్పుకున్న కామెంట్లూ, కథలూ కంచికిపోలే.. మన మధ్యే ఉన్నాయి. ఇవి ఆకతాయిల మాటలు కాదు.. మీరే చూడండి.**

– ఓ రోజు మహిళా బిల్లుపై సీరియస్ చర్చ జరుగుతోంది. సమర్థించే వారు గొంతు చించుకుంటున్నారు. ఇంతలో పార్లమెంట్ బయట తిరుగుతున్న ఎంపీని 'మహిళా రిజర్వేషన్ బిల్లుపై మీ అభిప్రాయం ఏమిటి..' అని మీడియా అడిగితే ఆయన సమాధానం... 'మా ఆవిడ చేస్తున్న షాపింగ్ బిల్లు మీద తప్ప నాకే బిల్లుపై ఆసక్తి, ధ్యాసా లేవు..' అని

– ఆ తర్వాత ఓ రోజు..'మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌కు ఏం తెస్తుంది..? బ్యూటీపార్లర్‌లకు వెళ్లే బాబ్ హెయిర్ మహిళలనా...' మహిళా బిల్లుపై లాలూప్రసాద్ రియాక్షన్.

చట్టసభల్లో కూర్చుని మన రాత రాసే నేతల ధోరణి ఇలా ఉంటే.. బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో ఓ టీవీ చానల్ కామన్ పీపుల్‌తో పిచ్చాపాటిగా మాట్లాడింది.. వినండి.

– పార్లమెంట్‌లో అంత చర్చ జరుగుతోందిగా, ఈ బిల్లుపై మీ అభిప్రాయం ఏమిటని అడిగితే.. వారిలో కొందరి సమాధానాలు ఇవీ.

– 'అవునవును నేను కూడా విన్నాను. మా ఆవిడ కూడా అడిగింది. మరీ రచ్చ బాగా చేస్తున్నారు.. బిల్లు ఎక్కువ అయ్యిందా అని..' (జోక్ ?)

– 'నాకు బిల్ క్లింటన్ మాత్రమే తెలుసు ఈ బిల్ గురించి ఐడియా లేదు..' (లైట్?)

– ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఎప్పుడొస్తుంది..?

'వారికి అధికారం వచ్చేసిందిగా.. క్రెడిట్ కార్డ్‌ల రాకతో' (వెటకారం?)

**మనమే కాదు.. అంతటా అంతే**

ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం తాజా నివేదిక చూడండి

- ప్రపంచవ్యాప్తంగా మంత్రి పదవుల్లో ఉన్న మహిళలు 22.8 శాతమే. కేవలం 13 దేశాల్లోని కేబినెట్లలో మాత్రమే 50%, ఆపైన మహిళా మంత్రులు ఉన్నారు.
- మహిళలు మంత్రులుగా ఉన్నా వారికి కేటాయిస్తున్న శాఖల ప్రాధాన్యత తక్కువే.
- ప్రజలు నేరుగా ఎన్నుకునే దిగువ సభల్లో (లోక్‌సభ తరహాలో) మహిళా పార్లమెంటేరియన్లు 26.5 శాతమే. అయితే ఇది 1995లో 11%గానే ఉండగా ప్రస్తుతం కొంత మెరుగుపడింది.
- దిగువ సభలో 50%, అంతకన్నా ఎక్కువ మంది ఎంపీలున్న దేశాలు ఆరు మాత్రమే. రువాండాలో 61%, క్యూబాలో 53%, నికరాగ్వాలో 52%, మెక్సికో, న్యూజిలాండ్, యూఏఈలలో 50% మహిళా ఎంపీలున్నారు. ఈ ఆరింటితోపాటు మరో 17 దేశాల్లో 40% పైన మహిళా ఎంపీలు ఉన్నారు. 22 దేశాల్లో మహిళా ఎంపీలు 10% కన్నా తక్కువే.

– ఉమెన్ రిజర్వేషన్ వస్తుందా..?

'లాలూ రైల్వే కోచ్‌లలో మహిళలకు కొన్ని కేటాయించాడుగా..'(సరదా?)

– చట్టసభల్లో మహిళల కోటా గురించి చెప్పండి.

'ఇప్పుడు ఇంట్లో అంతా వారి పెత్తనం.. ఇక రెండు సభల్లో వారిదే పెత్తనం అవుతుంది. దేశాన్ని వారే నడుపుతారు..' (తేలిక భావం?)

బిల్లు తేవాల్సిన చట్టసభల్లో నాయకులకూ, బయట సాధారణ ప్రజలకూ ఒకే రకమైన భావజాలం ఉన్నాక, 26 ఏళ్లే కాదు ఎన్నేళ్లయినా అలాగే ఉంటుంది. మహిళా దినోత్సవం రోజో, ఎన్నికల మేనిఫెస్టోల్లోనో, ఖాళీ దొరికినప్పుడు మాట్లాడుకోవడానికో ఓ సబ్జెక్ట్ అవుతుంది.

.........

'రాజ్యసభ నుంచి లోక్ సభకు నడిచి వెళ్లడానికి ఐదు నిమిషాలు పడుతుంది. కానీ, రిజర్వేషన్ బిల్లుకు మాత్రం ఇన్నేళ్లయినా (రాజ్యసభ ఆమోదించిన 2010 నుంచి) లోక్ సభకు చేరనే లేదు..'

– ఇది బృందా కారత్ ఆవేదన.

పైన చెప్పుకున్నట్టుగా మన పరిస్థితి ఇలాగే ఉంటే, ఎన్నాళ్లయినా బిల్లు లోక్‌సభ వైపు నడుస్తూనే ఉంటుంది.

# కలసి ఉంటే కలదు సుఖం

పాండవులతో యుద్ధం వద్దని ధృతరాష్ట్రుడు ఎంత చెప్పినా దుర్యోధనుడు వినలేదు. తనకు తోడుగా దుశ్శాసనుడు, కర్ణుడు ఉండగా యుద్ధంలో పాండవులను వధించటం సులువైన పని అని ప్రగల్భాలు పలికాడు. ఆ సమయంలో విదురుడు కల్పించుకొని జ్ఞాతి వైరం అనర్థ హేతువనీ, సంధి శ్రేయస్కరమనీ చెబుతాడు. తన మాటలకు బలం చేకూర్చటానికి పెద్దలు చెప్పగా తాను విన్న కథనొక దానిని జోడించి చెబుతాడు. ఆ కథ వ్యాసభారతం ఉద్యోగ పర్వంలో ఉన్నది.

వేటగాడొకడు పక్షులను పట్టుకోవటానికి నేల మీద వలను వేసి ఉంచాడు. ఒకటిగా కలిసి తిరిగే రెండు పక్షులు ఆ వలలో పడి చిక్కుకొన్నవి. అపుడా పక్షులు ఆ వలను ఎత్తుకొని ఆకాశానికి ఎగిరిపోయాయి. వేటగాడు నిరాశ చెందక ఆ పక్షులు ఆకాశంలో ఎటుపోతే అతడు కూడా అటే భూమి మీద పరిగెత్తుతూ పోతున్నాడు. ఇది చూచిన ఒక మునీశ్వరుడు అతడిని, 'ఆకాశంలో ఎగిరే పక్షులను భూమి మీద అనుసరిస్తూ పోయే నీకు వాటిని చేజిక్కించుకొనటం సాధ్యమేనా?' అని అడిగాడు. అందుకు వేటగాడు, 'ఆ రెండు పక్షులు కలిసి ఉన్నాయి కాబట్టి వలను ఎత్తుకొని పోగలుగుతున్నాయి. ఎప్పుడైతే అవి కలహించుకొంటాయో అప్పుడు ఆ వల కిందపడి అవి నా చేతికి చిక్కుతాయి' అని చెప్పాడు. అతడు అలా అన్న కొద్ది సేపటికే ఆ రెండు పక్షులకు చావు రాసి పెట్టి ఉండటం చేత వాటి బుద్ధి వక్రించి పరస్పరం కలహించుకొని కిందపడ్డాయి. వెంటనే వేటగాడు వాటి వద్దకు వెళ్ళి వాటిని బంధించాడు.




ఈ కథ చెప్పి విదురుడు, ''ఆ విధంగానే కుటుంబంలోని వారు ధనం కోసం పరస్పరం కలహించుకొని, ఆ పక్షుల మాదిరిగా శత్రువుల బారిన పడతారు. ఒక చోట కూర్చొని భోజనం చెయ్యటం, ప్రేమతో ఒకరినొకరు పలకరించుకొనటం, ఒకరి కష్ట సుఖాలు మరొకరు పంచుకోవటం, ఎల్లవేళలా కలిసిమెలిసి ఉండటం – ఇవి బంధువులు, సోదరులు మరువకుండా చేయవలసిన పనులు. అలా కాకుండా తమలో తాము విరోధించడం తగని పని. అప్పుడప్పుడు పెద్దలను కలుసుకొంటూ వారు చెప్పే హితవచనాలను ఆచరణలో పెడుతూ ఉండే పరిశుద్ధ హృదయులు, సింహ రక్షితమైన వనం వలె ఇతరుల ఆక్రమణకు గురి కారు. శత్రువులు అట్టి వారి వద్దకు రావటానికి ధైర్యం చెయ్యరు. ఒక కుటుంబం వారు పరస్పరం కలహించుకొని విడివిడిగా ఉంటే అసమర్థులవుతారు. కలిసి ఒకటిగా ఉన్నప్పుడు బలపరాక్రమవంతులై సుఖపడతారు'' అని హితవు చెబుతాడు.

విదురుడు చెప్పిన ఈ హిత వచనాలు త్రికాల సత్యాలు గదా!

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బ.అష్టమి ప.3.19 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: మూల రా.3.19 వరకు, తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: ప.12.09 నుండి 1.40 వరకు, తిరిగి రా.1.46 నుండి 3.19 వరకు, దుర్ముహూర్తం: ప.11.44 నుండి 12.34 వరకు, అమృతఘడియలు: రా.9.13 నుండి 10.44 ; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 6.13, సూర్యాస్తమయం: 6.06.

## క్లుప్తంగా...

### ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీతో వేగంగా గదుల కేటాయింపు

- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి



తిరుమల: శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తులు ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీతో 5 నుంచి 10 నిమిషాల వ్యవధిలో గదులు పొందుతున్నట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దళారీ వ్యవస్థను నిర్మూలించేందుకు ఈ టెక్నాలజీ చక్కగా ఉపయోగపడుతోందన్నారు. ఒకసారి తమ ఆధార్ కార్డుతో గదులు పొందిన భక్తులు మళ్లీ 30 రోజుల తర్వాతే గదులు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అడ్వాన్స్ బుకింగ్, కరెంటు బుకింగ్‌లో కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నట్లు చెప్పారు. తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో వసతి కోసం పేర్ల నమోదు కౌంటర్లను ప్రయోగాత్మకంగా త్వరలో సీఆర్‌వో వద్దకు మార్చనున్నట్లు తెలిపారు. కాగా, తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. సోమవారం అర్ధరాత్రి వరకు 68,365 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. దర్శన టికెట్లు లేని వారికి దర్శనానికి 24 గంటల సమయం పడుతోంది.

### సూక్ష్మ బంగారు 'ఆస్కార్'



సాయి తయారు చేసిన సూక్ష్మ ఆస్కార్ అవార్డు ప్రతిమ

పెద్దాపురం: నాటు నాటు పాటతో ఆస్కార్ అవార్డు దక్కించుకున్న ఆర్‌ఆర్‌ఆర్ సినిమా బృందానికి అభినందనలు తెలుపుతూ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ అవార్డు గ్రహీత, కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణానికి చెందిన బంగారు శిల్పి తాళాబత్తుల సాయి సూక్ష్మ ఆస్కార్ అవార్డు ప్రతిమ రూపొందించారు. ఒక గ్రాము బంగారం వినియోగించి 15 మిల్లీ మీటర్ల పొడవుతో ఈ ప్రతిమను రెండు గంటల సమయంలో తయారు చేసి అందరి మన్ననలూ అందుకున్నారు.

### త్వరలో శ్రీశైలంలో మహాకుంభాభిషేకం

- విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి



విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అధికారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో త్వరలో మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ తెలిపారు. దీనిపై దేవస్థానం అధికారులు, అర్చకులు, వేద పండితులు సలహాలు కోరారని చెప్పారు. మంగళవారం శ్రీశైలం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను స్వాత్మానందేంద్ర సరస్వతి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇటీవల విశాఖ శారదాపీఠం పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి పర్యవేక్షణలో హరియాణా రాష్ట్రం కురుక్షేత్రలో లక్ష చండీ యజ్ఞాన్ని పూర్తి చేసుకుని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. శ్రీశైలంలో మహాకుంభాభిషేకం ఏవిధంగా జరగాలనే విషయంపై సోమవారం రాత్రి పండితులతో సమావేశం నిర్వహించామని తెలిపారు. వారి సలహాలు, అర్చకుల సూచనల మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. దేవాలయాలపై దాడులు చేయడంపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, పోలీసులతో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని దేవదాయశాఖ మంత్రిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని వివరించారు.

## థింపులో గ్రౌండ్ స్టేషన్ ప్రారంభం



గ్రౌండ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్, భూటాన్ మంత్రి తదితరులు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): రిమోట్ సెన్సింగ్ శాటిలైట్స్‌కు సంబంధించి భారత్–భూటాన్ సంయుక్తంగా భూటాన్‌లోని థింపు ప్రాంతంలో నిర్మించిన గ్రౌండ్ స్టేషన్‌ను సోమవారం ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్, భూటాన్ విదేశాంగ మంత్రి లియోన్‌పో తాండి దోర్జీ ప్రారంభించారు. ఈ విషయాన్ని ఇస్రో మంగళవారం తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. భూటాన్ దేశానికి చెందిన ఉపగ్రహాలను ఇస్రో తన రాకెట్ల ద్వారా ప్రయోగిస్తున్న విషయం తెలిసిందే. ఆ ఉపగ్రహాల నుంచి వచ్చే సమాచారం కూడా భారతదేశానికి చెందిన గ్రౌండ్ స్టేషన్ ద్వారా తీసుకునేవారు. ఇక నుంచి థింపులో నిర్మించిన గ్రౌండ్ స్టేషన్ ద్వారా భూటాన్ ఉపగ్రహాల సమాచారాన్ని ఆ దేశ శాస్త్రవేత్తలే నేరుగా తీసుకుంటారు. థింపులో గ్రౌండ్ స్టేషన్ నిర్మాణానికి ఇస్రో శాస్త్రవేత్తలు సహకరించడంతోపాటు డేటా సేకరణపై భూటాన్ వారికి శిక్షణ కూడా ఇస్తున్నారు.

## 'మార్గదర్శి'పై ఈడీ విచారణ చేపట్టాలి

- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్



సాక్షి, రాజమహేంద్రవరం: మార్గదర్శి చిట్స్‌కు సంబంధించి గతంలో రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ తనకిచ్చిన సమాచారాన్ని సీఐడీ అధికారులకు పంపుతున్నానని.. ఆ వివరాలను ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్)కు పంపి విచారణ చేపట్టాలని తాను కోరుతున్నట్లు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తెలిపారు. రాజమహేంద్రవరంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీ చిట్‌ఫండ్ 14(2) యాక్ట్ ప్రకారం చిట్‌ఫండ్స్ ద్వారా సేకరించిన మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేయాల్సి ఉన్నా.. మార్గదర్శిలో అలా జరగడంలేదని.. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టారని, ఇతర వ్యాపారాలకూ వినియోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈనాడు పత్రిక సైతం చిట్‌ఫండ్స్ డబ్బుతోనే నడుస్తోందన్నారు.

**ఇది వ్యవస్థలను తప్పుదోవ పట్టించడం కాదా?**

ఇక మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు, రామోజీరావుకు సంబంధం ఏమిటని ప్రశ్నిస్తూ తనపై వేసిన రూ.50 లక్షల పరువునష్టం దావాకు సంబంధించిన అఫిడవిట్లో సంతకం చేసిన రాజాజీ.. ఇప్పుడు అదే చిట్‌ఫండ్స్‌కు చైర్మన్ రామోజీయేనని తెలంగాణ హైకోర్టులో తాజాగా వేసిన అఫిడవిట్లో పేర్కొన్నారని.. ఇది వ్యవస్థలను తప్పుదోవ పట్టించడం కాదా? అని ఉండవల్లి ప్రశ్నించారు. రామోజీరావు తప్పుచేశాడని తాను నిరూపిస్తానని.. ఆధారాలతో సహా చర్చకు వస్తా, చేసిన తప్పు ఒప్పుకునే ధైర్యం రామోజీకి ఉందా? అని ప్రశ్నించారు. ఇదే ప్రశ్న తాను 17 ఏళ్లుగా అడుగుతున్నా ఇప్పటిదాకా స్పందించలేదని ఉండవల్లి ఎద్దేవాచేశారు. నిజానికి.. మార్గదర్శి ఫైనాన్స్ షేర్‌పై తాను కేసు పెట్టే సమయానికి కంపెనీ రూ.1,360 కోట్ల నష్టాల్లో ఉందని, రామోజీ ఒక సెలబ్రిటీ కాబట్టి ఇప్పటివరకు ఆయనపై చర్యలు తీసుకోలేదన్నారు.

**తప్పు రామోజీది.. బాధ్యులు ఫోర్‌మెన్లా?**

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో అవకతవకలపై ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని.. అధికారులకు సంస్థ ఎలాంటి పత్రాలూ ఇవ్వడంలేదని ఉండవల్లి ఆరోపించారు. చిట్‌ఫండ్స్‌లో రామోజీరావు తప్పులు చేస్తే.. వాటికి మార్గదర్శి బ్రాంచుల్లో పనిచేసే ఫోర్‌మన్లను బాధ్యుల్ని చేసి ఆయన తప్పించుకుంటున్నారన్నారు. తాను తప్పుచేశానని ఏనాడు రామోజీ ఒప్పుకోలేదని, ఎన్ని కేసులు వేసినా తాను ట్రయల్ కోర్టుకు వచ్చిన దాఖలాల్లేవన్నారు. రామోజీ ఏమైనా చట్టానికి అతీతుడా? అని ఉండవల్లి ప్రశ్నించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై ఎవరు ఫిర్యాదు చేశారని కొందరు విలేకరులు సీఐడీ అధికారులను ప్రశ్నిస్తున్నారని.. అలాగే, రామోజీరావును ఇబ్బంది పెట్టేందుకే ప్రభుత్వం మార్గదర్శి వ్యవహారాన్ని రచ్చచేస్తోందని ఆరోపిస్తున్నారని.. అలా అనుకుంటే తాము తప్పుచేయలేదని రామోజీ ఎందుకు చెప్పడంలేదని ఉండవల్లి సూటిగా ప్రశ్నించారు.

## నాయీబ్రాహ్మణులకు ఇదొక శుభ దినం

- మా తలరాత మార్చిన దేవుడు సీఎం జగన్
- నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్య

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని నాయీబ్రాహ్మణులకు ఎవ్వరూ చేయలేని మేలును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేశారని రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్దవటం యానాదయ్య చెప్పారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా నాయీబ్రాహ్మణులకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాల య పాలకవర్గాలలో సభ్యులుగా, దేవాలయ కళ్యాణకట్ట క్షురకులకు ఉద్యోగ భద్రత కలిప్తిస్తూ జీవో ఇచ్చి, మంత్రి మండలిలో ఆమోదించడం చారిత్రక విషయమని తెలిపారు. ఇదొక శుభ దినమన్నారు. మంత్రి మండలి నిర్ణయంపై నాయీబ్రాహ్మణులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని, సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని చెప్పారు. నాయీబ్రాహ్మణుల తలరాత మార్చిన దేవుడు సీఎం జగన్ అని కొనియాడారు.



### నేడు 2 కేంద్రాల్లో రీ పోలింగ్

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తిరుపతిలోని రెండు కేంద్రాల్లో బుధవారం రీ పోలింగ్ నిర్వహించనున్నారు. తిరుపతి చిన్నబజారు వీధి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల 229 పోలింగ్ కేంద్రంలో, సత్యనారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 233 పోలింగ్ కేంద్రంలో బుధవారం రీపోలింగ్ నిర్వహిస్తారు.

## భార్య, అత్తను కడతేర్చిన అల్లుడు

- మామకు తీవ్ర గాయాలు
- కర్నూలు జిల్లా కల్లూరులో దారుణం
- పెళ్లయ్యి రెండు వారాలు గడవకముందే భార్యపై అనుమానం
- చంపేందుకు కుట్ర.. తండ్రితో కలిసి భార్య, అత్తామామపై కత్తులతో విచక్షణారహితంగా దాడి



రుక్మిణీ దేవి (ఫైల్)



హత్యకు గురైన రమాదేవి



కత్తిపోట్లకు గురైన వెంకటేశ్వర్లు



శ్రావణ్‌కుమార్ తండ్రి ప్రసాద్



శ్రావణ్‌కుమార్ తల్లి కృష్ణవేణి



హత్యలకు పాల్పడిన శ్రావణ్‌కుమార్

కర్నూలు: పెళ్లయ్యి రెండు వారాలు కూడా గడవకముందే భార్యపై అనుమానం పెంచుకున్న ఓ వ్యక్తి.. ఆమెను అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. తండ్రితో కలిసి అత్త, మామపైనా కత్తులతో దాడి చేశాడు. ఈ ఘటనలో అత్త కూడా చనిపోగా.. మామకు తీవ్రగాయాలయ్యాయి. ఈ దారుణం కర్నూలు జిల్లా కల్లూరులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. తెలంగాణలోని వనపర్తికి చెందిన వెంకటేశ్వర్లు, రమాదేవి దంపతుల కుమార్తె రుక్మిణీ దేవి(19)కి, కల్లూరులోని సుబ్బలక్ష్మినగర్‌కు చెందిన ప్రసాద్, కృష్ణవేణి దంపతుల కుమారుడు శ్రావణ్‌కుమార్‌కు ఈనెల 1వ తేదీన వనపర్తిలో వివాహం జరిగింది. శ్రావణ్‌కుమార్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు బ్యాంకు కాల్ సెంటర్‌లో పనిచేస్తుండగా.. అతని తల్లిదండ్రులు కల్లూరులో తోపుడు బండిపై ఇడ్లీలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. శ్రావణ్, రుక్మిణీకి వివాహమైన మూడు రోజుల తర్వాత శోభనం జరగ్గా.. మూత్రనాళంలో ఇన్ఫెక్షన్ రావడంతో శ్రావణ్ హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరి వైద్యుల సూచన మేరకు శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఇదే సమయంలో రుక్మిణీ వనపర్తికి చెందిన రాఘవేంద్రతో మాట్లాడిన వాయిస్ రికార్డ్‌ను శ్రావణ్ విన్నాడు. అతనితో భార్యకు వివాహేతర సంబంధం ఉందని అనుమానించిన శ్రావణ్.. ఆస్పత్రిలోనే ఆత్మహత్యకు ప్రయత్నించబోయాడు. ఈ విషయం తెలిసిన తండ్రి ప్రసాద్.. 'నువ్వెందుకురా చావడం.. నీ భార్యను, అత్తమామను చంపేద్దాం' అంటూ కొడుకుతో కలిసి హత్యలకు కుట్ర పన్నాడు. ఈ నేపథ్యంలో కుమార్తెను తీసుకొని రమాదేవి, వెంకటేశ్వర్లు మంగళవారం కల్లూరుకు వచ్చారు. ఆ తర్వాత కొంతసేపటికే రెండు కుటుంబాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అప్పటికే ఇంట్లో దాచిపెట్టిన కత్తులు తీసుకున్న శ్రావణ్‌కుమార్, ప్రసాద్ ఆవేశంతో ఊగిపోతూ 'మమ్మల్ని మోసం చేస్తారా' అంటూ పడక గదిలో ఉన్న రుక్మిణీ దేవితో పాటు పై అంతస్తులో ఉన్న ఆమె తల్లి రమాదేవిపై విచక్షణా రహితంగా దాడి చేసి చంపేశారు. వెంకటేశ్వర్లుపైన కూడా దాడి చేస్తుండగా.. స్థానికులు అక్కడకు చేరుకొని అతడిని కాపాడారు. తీవ్రగాయాలపాలైన వెంకటేశ్వర్లు ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కర్నూలు డీఎస్పీ కె.వి.మహేశ్, సీఐలు శంకరయ్య, శ్రీనివాసులు, తహసీల్దార్ రమేశ్ తదితరులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. శ్రావణ్‌తో పాటు అతని తండ్రి ప్రసాద్, తల్లి కృష్ణవేణిని నాల్గవ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని.. విచారిస్తున్నారు.

## ఆధ్యాత్మిక ప్రవచన చక్రవర్తి సముద్రాల మృతి

- అనారోగ్యంతో తుది శ్వాస
- వాచస్పతి, మహామహోపాధ్యాయ బిరుదులు అందుకున్న లక్ష్మణయ్య
- టీటీడీకి పలు రకాలుగా సేవలందించిన పండితుడు
- పలువురు విద్యా, సాహితీవేత్తల నివాళులు



సముద్రాల లక్ష్మణయ్య (ఫైల్)

తిరుపతి కల్చరల్: సాహిత్య నిధిని పంచిన ఆధ్యాత్మిక వేత్త, ప్రవచనకర్త, గ్రంథ పరిష్కర్త, ఆధ్యాత్మిక చక్రవర్తి మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య (84) తుది శ్వాస విడిచారు. అనారోగ్యంతో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. సముద్రాల లక్ష్మణయ్య 1939 జూన్ 8న ఏర్పేడు మండలం కాట్రకాయల గుంట గ్రామంలో జన్మించారు. ఏర్పేడులోని మలయాలస్వామి ఆశ్రమంలో చదువుకున్నారు. ఎస్వీ యూనివర్సిటీ నుంచి ఎంఏ సంస్కృతంలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. టీటీడీ ప్రాచ్యకళాశాలలో అధ్యాపకుడిగా, ధర్మప్రచార పరిషత్ కార్యదర్శిగా, పురాణ ఇతిహాసాల ప్రాజెక్టు ప్రత్యేకాధికారిగా విశేష సేవలందించారు. టీటీడీ ప్రచురించిన అనేక గ్రంథాలను సరిదిద్దడంలో కృషి చేశారు. టీటీడీ ప్రచురణలకు సంపాదకుడిగా, భగవద్గీత ప్రాజెక్టు ప్రత్యేకాధికారిగా పని చేశారు. శ్రీమలయాళ యతీంద్ర ఉపదేశామృతం, శ్రీమలయాళస్వామి జీవిత చరిత్ర, రఘువంశం, దశకుమార శతకం, అమరవాణి యోగవాసిష్టము వంటి అనేక గ్రంథాలు రచించారు. రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం నుంచి వాచస్పతి, మహామహోపాధ్యాయ బిరుదలను అందుకున్నారు. తెలుగు కవి గుర్రం జాషువా సాహిత్యమంటే ఆయనకు ఇష్టమనే వారు. కాషాయం ధరించని రుషిగా ఆయన్ని పిలిచేవారు. యువ రచయితలు, కవులకు, అవధానులకు దిక్సూచిగా నిలిచిన సాహితీ నిధి సముద్రాల. ప్రముఖ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, రచయిత మౌని, ప్రవచనకర్త గరికపాటి రమేష్‌బాబు, సుఖబ్రహ్మ ఆశ్రమం స్వామిజీ, పలువురు కవులు, రచయితలు, సాహితీవేత్తలు, విద్యావేత్తలు, కళాకారులు, భాషాభిమానులు మంగళవారం యశోద నగర్‌లోని ఆయన స్వగృహంలో ఆయన పార్థివదేహాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు. నిరంతరం సాహితీ సేవలందించడంతో పాటు పలువురు రచయితల పుస్తకాలను ముందుమాట అందించి ప్రోత్సహించే సముద్రాల లక్ష్మణయ్య మృతి సామితీ లోకానికి తీరని లోటని వారు చెప్పారు. బుధవారం ఉదయం 10 గంటలకు సముద్రాల లక్ష్మణయ్య అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

## మిర్చి రైతు 'పంట' పండింది..

- క్వింటా ధర గరిష్టంగా రూ.48,299
- కర్నూలు మార్కెట్‌లో ధర పైపైకి



కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు మార్కెట్ యార్డులో మంగళవారం ఎండుమిర్చి ధర భారీగా పెరిగింది. గరిష్టంగా క్వింటాకు రూ.48,299 ధర లభించింది. మిర్చిలో బాడిగ రకాలు నాణ్యతకు పెట్టింది పేరు. ఈ మిర్చి ఎర్రగా నిగనిగలాడుతుంది. కలర్స్‌కు ఎక్కువగా వినియోగిస్తారు. తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పండించిన మిర్చి కర్నూలు మార్కెట్ యార్డుకు ఎక్కువగా వస్తున్నది. కోనేరు బుక్కాపురం గ్రామానికి చెందిన నరసింహారెడ్డి అనే రైతు 3.62 క్వింటాళ్ల మిర్చి మార్కెట్‌కు తీసుకురాగా.. ఈ–నామ్ ద్వారా క్వింటాకు రూ.48,299 ధర లభించడం విశేషం. మార్కెట్‌కు 380 మంది రైతులు 606 క్వింటాళ్ల మిర్చి తీసుకురాగా.. కనిష్ట ధర రూ.2,507, గరిష్ట ధర రూ.48,299.. మోడల్ ధర రూ.20,589గా నమోదయింది. కర్నూలు మార్కెట్ చరిత్రలో మిర్చికి లభించిన ధర ఇదే అత్యధికం. జిల్లాలో పండించిన మిర్చి 90 శాతం గుంటూరు మిర్చి యార్డుకి తరలుతున్నది. కర్నూలు మార్కెట్‌కు జిల్లాలో పండించిన మిర్చి అంతంతమాత్రం వస్తుండగా.. తెలంగాణ నుంచి ఎక్కువగా రావడం గమనార్హం.

# మేటి మృగం జీవన వైవిధ్యం

పులి.. ఈ పేరు వింటేనే అందరికీ హడల్. ఇది వన్యమృగం.. అయినా సౌమ్యం వీటి సొంతం. అయితే నల్లమల పులి జీవనం వైవిధ్యం. పులులు సంఘజీవి కావు. ఒంటరిగా బతికేందుకు ఇష్టపడుతాయి. ఇతర జంతువులతో కలవడం చాలా అరుదు. ఇవి ఆహారం కోసం వన్యప్రాణులను వేటాడడం.. పిల్లల్ని కనడం.. వాటికి జీవన మెళకువలు నేర్పడం.. ఆ తర్వాత అరణ్యంలో బతికేందుకు వదిలేయడం అంతా విభిన్నంగా ఉంటుంది. సువిశాల విస్తీర్ణంలో నెలకొన్న ఎన్ఎస్‌టీఆర్ (నాగార్జున సాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వు ఫారెస్ట్)లో ఉంటే పులులతో పాటు ఇతర టైగర్ ఫారెస్ట్‌ల్లో ఉండే వాటికంటే చాలా సౌమ్యంగా ఉంటాయి. బఫర్ ఏరియాలను దాటి జనారణ్యంలోకి తరుచూ వచ్చినా మనుషులపై దాడులు చేసిన ఘటనలు అరుదు. ఇక్కడ ఉండే పులులు సాధువుగా ఉంటాయని అంటున్నారు వన్యప్రాణుల పరిశోధకులు.



నల్లమలలో నాగులూటి బీటు వద్ద..

- జనారణ్యంలోకి వచ్చినా సౌమ్యత
- నల్లమలలో 75కి పైగా పులులు
- ఇవి మనుషులపై దాడులు చేయడం చాలా అరుదు
- 600 మంది సిబ్బందితో పులులపై అటవీ శాఖ నిరంతర నిఘా
- ప్రారంభమైన పులుల గణన
- వేసవిలో నీటి కోసం 120 సాసర్ పిట్ల ఏర్పాటు

సాక్షి, ఒంగోలు డెస్క్: జీవ వైవిధ్యానికి నెలవుగా ఉండే నల్లమల అభయారణ్యం 3,700 చదరపు కిలో మీటర్ల మేర ఎన్ఎస్‌టీఆర్ విస్తరించి ఉంది. దేశంలోనే అతి పెద్ద టైగర్ రిజర్వు ఫారెస్ట్ ఇది. దీని చుట్టూ వందలాది గిరిజన గూడేలు ఉన్నాయి. ఇక్కడ నివశించే పులి నల్లమల రాజుగా పేరొందింది. అంతరించిపోతున్న వీటి సంరక్షణకు, వీటి సంతతిని పెంచేందుకు అటవీశాఖ అధికారులు ఎన్నో రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అధికారికంగా 75 పులులు ఉన్నాయని గుర్తించినా అనధికారికంగా 100కు పైగా ఉన్నాయని అంచనా. ఈ ఏడాది కూడా పులుల గణన ప్రారంభమైంది. ఏప్రిల్ నెల చివరి వరకూ వివిధ దశల్లో వీటిని లెక్కింపు చేస్తారు.

### వన్య మృగం కాదిది.. సాధువు

సాధారణంగా అటవీ ప్రాంతానికి సమీప గిరిజన గూడేలకు మధ్య బఫర్ ఏరియా ఉంటుంది. వన్యప్రాణులు, మృగాలు జనావాసాల వైపు రాకుండా ఉండేలా ఒక అంచనా వేస్తూ బఫర్ ఏరియాలను నిర్ణయించారు. అయితే మనుగడ కోసం గిరిజన ప్రాంతాల్లోని వారు బఫర్ ఏరియాలను దాటి ముందుకు వచ్చేశారు. దీంతో తరుచూ వన్యప్రాణులు జనారణ్యంలోకి వస్తున్నాయి. నల్లమల రాజుగా పేరొందిన పులులు ఇతర టైగర్ ఫారెస్టుల్లో ఉన్న పులులు కంటే చాలా సాధుగుణం కలిగి ఉంటాయి. తెలంగాణ, మహారాష్ట్ర బోర్డర్‌లో ఉన్న తడోబా టైగర్ ఫారెస్టులోని పులులు నిత్యం మనుషులపై దాడులు చేస్తుంటాయి. నెలకు ఒకరిద్దరిని పొట్టన పెట్టుకుంటుంటాయి. ఇలా ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే ఎన్ఎస్‌టీఆర్‌లో మాత్రం పులులు తరుచూ జనారణ్యంలోకి వచ్చినా మనుషులపై దాడులు చేయడం చాలా అరుదు. మిగతా ప్రాంతాలతో పోల్చుకుంటే 0.001 శాతం మాత్రమే దాడి చేసి ఉంటాయని వన్యప్రాణి నిపుణులు అంటున్నారు. ఎన్ఎస్‌టీఆర్‌లో ఒక పులి సంచరించేందుకు 30 నుంచి 40 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణం ఉంటుంది. ఇతర వన్యప్రాణులను వేటాడుతూ.. లేదా నీళ్ల కోసం బఫర్ ఏరియాలను దాటి గూడేల వైపు ఇవి వస్తుంటాయి. గత నెలలో గిద్దలూరు అటవీ డివిజన్ పరిధి మాగుటూరు, లక్ష్మీపురం, వెలగలపాయ, శంకరాపురం, కాకర్ల తదితర గ్రామాల పరిధిలోనూ, మార్కాపురం అటవీ డివిజన్ పరిధిలోని యర్రగొండపాలెం మండలం కొలుకుల గ్రామం పరిధిలో పులి సంచరించినట్లు అధికారులు గుర్తించారు. వీటి దాడిలో ఎద్దులు సైతం మృతి చెందాయి. పులుల సంచారాన్ని గుర్తించేందుకు అధికారులు ట్రాప్ కెమెరాలు అమర్చారు. పెద్దపులి దాడి చేసిన ఎద్దు మృతదేహం వద్దకు వచ్చి కళేబరాన్ని తింటుండటం కెమెరాలో నిక్షిప్తమైంది. ఒక పులి తన పిల్లలతో వచ్చినట్టు కూడా గుర్తించినట్టు సమాచారం.



### పులుల సంతతి పెరిగేందుకు..

ఎన్ఎస్‌టీఆర్‌లో పులుల సంతతి పెరిగేందుకు ఆగస్టు, సెప్టెంబర్ రెండు నెలల పాటు పర్యాటకుల రాకపోకలను నిషేధించారు. ఆ సమయంలో పులులు స్వేచ్ఛగా తిరిగేందుకు అవకాశం కలుగుతుంది. మగ పులి, ఆడపులి కలిసేందుకు అది అనుకూలమైన సమయంగా అధికారులు గుర్తించారు. పులులకు సూపర్ సెన్స్ ఉంటుంది. ఆడపులి రాకను మగపులి 30 కిలో మీటర్ల దూరం నుంచే గుర్తిస్తుంది. ఆడపులి ఒక చెట్టును బరకడం, మూత్ర విసర్జన చేస్తుంది. ఆ సమయంలో విడుదలైన రసాయనాల వాసనను మగపులి గుర్తిస్తుంది. ఆడపులితో మేటింగ్ తర్వాత వారం రోజులు ఉండి మగ పులి అక్కడి నుంచి వెళ్లిపోతుంది. గర్భం దాల్చిన ఆడపులి 103 రోజుల తర్వాత పిల్లలకు జన్మనిస్తుంది. వాటిని ఇతర వన్యమృగాల బారిన పడకుండా అత్యంత రహస్య ప్రదేశంలో ఉంచి ఆహారానికి వెళుతుంది. అవి కళ్లు తెరిచే వరకు అత్యంత జాగ్రత్తగా ఉంటాయి. ఒక నెల తర్వాత వేటాడడం నేర్పుతోంది. ఇలా 18 నెలల పాటు వాటికి అన్ని రకాల మెళకువలు నేర్పి వదిలేస్తోంది. అలా తల్లి నుంచి వేరైన పులులు సొంతంగా సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుంటాయి. పిల్లలు తనతో ఉన్నంత వరకు మగపులిని మేటింగ్‌కు ఆహ్వానించదు. అవి పిల్లలతో ఆహారం నిమిత్తం పొరపాటున జనారణ్యంలోకి వచ్చిన సమయంలో పులి కూనలను మనుషులు తాకితే ఇక వాటిని తల్లి పులి దగ్గరకు రానివ్వదు. ఇటీవల నంద్యాల జిల్లాలో పిల్లలతో కలిసి జనారణ్యంలోకి పులి వచ్చింది. నాలుగు కూనలు ఆరు బయట ఉండడంతో వాటిని స్థానికులు పట్టుకుని అటవీశాఖ అధికారులకు వివరాలు అందించారు. ఈ సమయంలో వాటిని మనుషులు ముట్టుకోవడంతో వాటి కోసం తల్లి పులి రాలేదని తెలుస్తోంది.

### పులుల సంరక్షణకు..

నల్లమల అభయారణ్యంలో నాలుగు డివిజన్లు, 16 నుంచి 20 రేంజ్‌లు ఉన్నాయి. అటవీ సమీపంలో ఉండే చెంచులకు అభయారణ్యంలోని జంతువుల గురించి పూర్తిగా తెలుసు. పెద్ద పులి ఎక్కడ ఉంది.. అది ఏం చేస్తుందనేది దూరం నుంచే పసిగడతారు. మనకంటే వారికే ఎక్కువగా తెలుసు. కొన్ని సందర్భాల్లో అటవీశాఖ సిబ్బందినే గైడ్ చేస్తారు. అందుకే వారిని ప్రొటెక్షన్ వాచర్లుగా, స్ట్రైక్ ఫోర్సులుగా నియమించారు. మొత్తం 600 మందికి ఉద్యోగాలు ఇచ్చి రక్షణగా నియమించారు. వేసవిలో వన్యప్రాణులకు నీటిఎద్దడి లేకుండా అవసరమైన చోట్ల సాసర్‌పిట్‌లు ఏర్పాటు చేసి వాటిని ఎప్పటికప్పుడు నీటితో నింపుతున్నారు.



సాసర్ పిట్ వద్ద నీటి కోసం పులి..



ట్రాక్ కెమెరా ఏర్పాటు చేస్తున్న అటవీ సిబ్బంది

### పక్కాగా గణన



పులుల గణన పక్కాగా సేకరిస్తున్నాం. ఎక్కడికక్కడ ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశాం. ఎన్ఎస్‌టీఆర్‌లో పులుల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ప్రొటెక్షన్ వాచర్లను నియమించాం. వేసవిలో వాటికి నీటి అవసరాల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. 120 సాసర్ పిట్లు ఏర్పాటు చేసి వాటి నిర్వహణకు ప్రత్యేక బృందాలను ఉంచాం.

– మహ్మద్ హయత్, ఎఫ్ఆర్ఓ, బయోడైవర్శిటీ కేంద్రం, శ్రీశైలం

### పులుల గణన ప్రారంభం

ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా పులుల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్ఎస్‌టీఆర్‌లో ఉండే పులులు శేషాచలం అడవులకు వెళ్లి వస్తున్నాయని అధికారులు గుర్తించారు. వివిధ దశల్లో 80 రోజుల పాటు డేటాను సేకరిస్తారు. ఫిబ్రవరి 20 నుంచి 20 రోజుల పాటు నంద్యాల, పోరుమామిళ్ల, లంకలమల, శేషాచలం కారిడార్‌లో వివరాలు సేకరించారు. మార్చి 11 తర్వాత మిగతా ఏరియాలో కెమెరాలను బిగించి మరో 20 రోజుల పాటు మార్చి 31 వరకు డేటాను సేకరిస్తున్నారు. ఏప్రిల్ 1 నుంచి 20 వరకు ఆత్మకూరు, మార్కాపురం డివిజన్‌లో ఏప్రిల్ 21 నుంచి మే 10 వరకూ డేటాలను సేకరిస్తారు. వీటి ఆధారంగా పులుల సంఖ్యను లెక్కిస్తారు.

## క్లుప్తంగా...

### అమెరికా డ్రోన్‌ను ఢీకొట్టిన రష్యా యుద్ధ విమానం

**కీవ్:** రష్యా యుద్ధ విమానం నల్ల సముద్రంపై అమెరికా నిఘా డ్రోన్‌ను ఢీకొట్టింది. మంగళవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. దీంతో అమెరికా సైన్యం తమ డ్రోన్‌ను కిందకు దించింది. తమ హెచ్చరికలను లెక్కచేయకుండా ఉక్రెయిన్‌పై దండయాత్ర కొనసాగిస్తున్న రష్యాపై అమెరికా ఇప్పటికే ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అమెరికా–రష్యా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా డ్రోన్‌ను రష్యా ఫైటర్ జెట్ ఢీకొట్టడం సంచలనాత్మకంగా మారింది. తాజా సంఘటన గురించి అమెరికా జాతీయ భద్రతా సలహాదారు అధ్యక్షుడు జో బైడెన్‌కు తెలియజేశారు. నల్ల సముద్రంపై అంతర్జాతీయ ఎయిర్ స్పేస్‌లో రష్యాకు చెందిన రెండు ఎస్‌యూ–27 ఫైటర్ జెట్లు ఎలాంటి రక్షణ లేకుండా విన్యాసాలు చేపట్టాయని, అందులో ఒక విమానం అమెరికాకు చెందిన ఎంక్యూ–9 డ్రోన్‌ను ఢీకొట్టిందని యూఎస్ యూరోపియన్ కమాండ్ ఒక ప్రకటనలో వెల్లడించింది.

### రైల్లో ప్రయాణికురాలిపై... టీటీఈ మూత్ర విసర్జన

**లక్నో/న్యూఢిల్లీ:** ప్రయాణికుల మూత్ర విసర్జన ఘటనలు విమానాలను దాటుకుని రైళ్లకూ పాకుతున్నాయి. మార్చి 13న కోల్‌కతా–అమృత్‌సర్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికురాలిపై ఓ ప్రబుద్ధుడు మూత్ర విసర్జన చేశాడు! అతను రైల్వే టీటీఈగా పని చేస్తుండటం విశేషం! బాధితురాలు బిహార్‌లోని కియుల్ నుంచి పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు భర్తతో కలిసి వెళ్తోంది. అర్ధరాత్రి వేళ పై బెర్త్‌లో ఉన్న మున్నా కుమార్ ఆమె తలపై మూత్రం పోశాడు. భర్త ఫిర్యాదు మేరకు మున్నాను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. దీన్ని తీవ్రంగా తీసుకున్న రైల్వే శాఖ అతన్ని సస్పెండ్ చేసింది. అతను మద్యం మత్తులోనే ఈ పని చేసినట్టు ఒక పోలీసు ఉన్నతాధికారి చెప్పారు.

### తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసిన... ఇమ్రాన్ అరెస్టు యత్నం

**లాహోర్:** తోషాఖానా కేసులో పాకిస్తాన్ పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను అరెస్ట్ చేయడానికి మంగళవారం పోలీసులు విఫలయత్నం చేశారు. ఈ సందర్భంగా లాహోర్‌లోని నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఇమ్రాన్ మద్దతుదారులు వేలాదిగా బైఠాయించి రాళ్లు రువ్వడంతో పోలీసులు గాయపడ్డారు. ఆందోళనకారులపైకి టియర్ గ్యాస్, వాటర్ కెనన్‌లు ప్రయోగించారు. ''నన్ను అరెస్ట్ చేస్తే ప్రశాంతంగా ఉండొచ్చనుకుంటున్నారు. అది తప్పని నిరూపిస్తాం'' అని ఇమ్రాన్ అన్నారు.

# ఏనుగమ్మా ఏనుగు

ఏనుగుకి, మనిషికి మధ్య ఉండే భావోద్వేగ బంధం ప్రపంచాన్ని కదిలించింది. విశ్వవేదికపై ఏనుగు ఘీంకారం ఆస్కార్ కుంభస్థలాన్ని కొట్టింది. డాక్యుమెంటరీలు తీసే వారికి ఎలిఫెంట్ విస్పరర్స్ వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చింది. మనిషికి, జంతువుకి, ప్రకృతికి మధ్య ఉండే గాఢానుబంధం మరోసారి చర్చకు వచ్చింది. మన దేశంలో ఏనుగుల పరిస్థితి ఏమిటి? ఏనుగుల సంరక్షణ ఏ విధంగా ఉంది?

ఏనుగంటే మనకి ఒక జంతువు కాదు. అంతకంటే ఎక్కువే. గణనాథుడి మారురూపంగా గజరాజుల్ని పూజిస్తాం.. ఏనుగమ్మా ఏనుగు మా ఊరొచ్చింది ఏనుగు మంచినీళ్లు తాగింది ఏనుగూ అంటూ ఏనుగు మనకెంత ముఖ్యమైనదో చిన్నప్పట్నుంచి ఉగ్గుపాలతో నేర్పిస్తాం. చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు ఏనుగుని చూడడమంటే అదొక సంభ్రమం. కానీ ఏనుగుల్ని కాపాడుకోవడంలో మనం అంతగా శ్రద్ధ కనబరచడం లేదనే చెప్పాలి. ఏనుగు దంతాల కోసం వాటిని వేటాడడం, ఏనుగుల ఆవాసాలైనా కారిడార్లను ఆక్రమించుకోవడం, ఏనుగుల కారిడార్లలోనే వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణం వంటి చర్యలతో ఏనుగుల సంరక్షణ ప్రశ్నార్థకంగా మారింది.

### సంరక్షణకి ఏం చేస్తున్నాం?

జీవవైవిధ్యానికి అత్యంత కీలకమైన ఏనుగుల్ని కాపాడుకోవడానికి 1992లో ఏర్పాటు చేసిన ఎలిఫెంట్ రిజర్వ్ ప్రాజెక్టు 30 ఏళ్లవుతున్నప్పటికీ అతీగతీ లేకుండా ఉంది. ఏనుగుల్ని కాపాడుకోవడానికి మనకి ప్రత్యేకంగా చట్టాలేమీ లేవు. వన్యప్రాణుల సంరక్షణ చట్టం పరిధిలోకే ఏనుగులూ వస్తాయి. దీంతో ఏనుగులు ఆవాసం ఉండే కారిడార్లు, వాటి సంరక్షణకు ఏర్పాటు చేసిన రిజర్వ్‌ల నిర్వహణలన్నీ తూతూ మంత్రంగా జరిపిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో ఏనుగులెంత కీలకమో గ్రహించిన కేంద్రం 2010లో ఏనుగుని జాతీయ వారసత్వ జంతువుగా గుర్తించింది. ఏనుగుల సంరక్షణ విధానాలను సమీక్షించడానికి ఎలిఫెంట్ టాస్క్ ఫోర్స్ (ఈటీఎఫ్)ని ఏర్పాటు చేసింది. వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని మార్చాలని, ఏనుగుల సంరక్షణ కోసం జాతీయ ఏనుగుల పరిరక్షణ అథారిటీని ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. అయితే నిధుల కొరతతో ఆ చర్యలేవీ కేంద్రం తీసుకోలేదు. ప్రతీ ఏడాది ఏనుగుల సంరక్షణ కోసం రూ.30–35 కోట్ల నిధుల్ని మాత్రమే కేటాయిస్తున్నారు. 2020లో వన్యప్రాణుల సంరక్షణ చట్టంలో ఏనుగుల రిజర్వ్‌లను చేరుస్తూ సవరణలు చేశారు. 2022, ఆగస్టు 2న సవరణ బిల్లుని లోక్‌సభ ఆమోదించింది. అంతకు మించి ఏనుగుల రక్షణకు ప్రత్యేకంగా చర్యలేవీ తీసుకోలేదు..

### ఏనుగులు, మనుషులకి మధ్య ఘర్షణ



ఏనుగులకి, మనుషులకి మధ్య నిత్యం ఒక ఘర్షణ నెలకొని ఉంటుంది. మనిషి ఎప్పుడైతే అడవుల్ని కూడా ఆక్రమించడం మొదలుపెట్టాడో ఏనుగులు గుంపులు గుంపులుగా పంట పొలాలపైకి పడడం, రైతుల్ని తమ కాళ్ల కింద పడి తొక్కేసి ప్రాణాలు తీయడం వంటివి చేస్తున్నాయి. దీంతో రైతులు ఏనుగుల బారి నుంచి పంటల్ని కాపాడడానికి విద్యుత్ కంచెలు , కందకాలు ఏర్పాటు వంటివి చేయడంతో అవి చనిపోతున్నాయి. ఇక ఏనుగు దంతాలకు అంతర్జాతీయ మార్కెట్‌లో భారీగా డిమాండ్ ఉండడంతో వాటిని అక్రమంగా వేటాడుతున్న వారూ ఉన్నారు. ఏనుగుల కారిడార్లలో రైల్వే ట్రాక్‌లు ఉండడంతో అవి బలైపోతున్నాయి. 1987–2017 మధ్య కాలంలో రైల్వే ట్రాక్‌ల కింద పడి 265 ఏనుగులు మరణించాయి. ఏనుగులు జరిపే దాడుల్లో ఏడాదికి సగటున 500మంది ప్రాణాలు కోల్పోతూ ఉంటే, ప్రజల చేతుల్లో ఏడాదికి సగటున 100 గజరాజులు మరణిస్తున్నాయి. ఏనుగుల్ని మరింత సంరక్షించాలంటే, అవి ప్రజలు, పంట పొలాల జోలికి రాకుండా ఉండాలంటే ఏనుగులుండే కారిడార్లను పటిష్ట పరచాల్సి ఉంది. దేశంలో 110 ఏనుగు కారిడార్లు ఉన్నప్పటికీ 70% మాత్రమే వినియోగంలో ఉన్నాయి. 29% కారిడార్లు ఆక్రమణకి లోనయ్యాయి. 66% కారిడార్లలో జాతీయ రహదారుల వెంబడి వెళుతున్నాయి. 22 కారిడార్లలో రైల్వే లైన్లు ఉన్నాయి. ఏనుగుల తినే తిండి ఎక్కువ కావడంతో అవి ప్రతీ రోజూ చాలా దూరం ప్రయాణిస్తూ ఉంటాయి. అవి సంచరించే మార్గాల్లో జాతీయ రహదారులు, రైల్వే ట్రాక్‌లు, మైనింగ్ తవ్వకాలు, కాలువలు, ఫెన్సింగ్‌లు ఉండడం వాటికి దుర్భరంగా మారింది. రైళ్లు, వాహనాల కింద పడి ప్రమాదవశాత్తూ మరణిస్తున్నాయి. అందుకే ఏనుగులు సంచరించే కారిడార్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు చెబుతున్నారు. ఇప్పుడు కొత్తగా నిర్మిస్తున్న జాతీయ రహదారుల్లో ఏనుగుల సంచారం కోసమే ప్రత్యేకంగా వంతెనలు నిర్మించడం విశేషంగా చెప్పుకోవాలి



**29,964** 2017లో ఏనుగుల గణన జరిగినప్పుడు మన దేశంలో ఉన్న ఏనుగులు.

ఆసియాలో ఉన్న ఏనుగుల్లో మన దేశంలోనే ఉన్నవి **60%**


**32** ఏనుగుల సంరక్షణ కోసం ఉన్న రిజర్వ్‌ల సంఖ్య


14 రాష్ట్రాల్లో ఏనుగుల రిజర్వ్‌లు 7,775 చదరపు కిలో మీటర్లు ప్రాంతంలో విస్తరించి ఉన్నాయి


**50** మైళ్లు ఆహారం కోసం ఏనుగులు రోజుకి ప్రయాణించే దూరం

ఆసియా ఏనుగులు 7 నుంచి 10 అడుగుల ఎత్తు, 2 వేల నుంచి 5 వేల కేజీల వరకు బరువు ఉంటాయి

సాక్షి, నేషనల్ డెస్క్




### 'భోపాల్' బాధితులకు... అదనపు పరిహారం కుదరదు

**కేంద్రం విజ్ఞప్తిని తోసిపుచ్చిన సుప్రీంకోర్టు**

**న్యూఢిల్లీ:** 30 ఏళ్ల క్రితం దేశాన్ని కుదిపేసిన భోపాల్ గ్యాస్ దుర్ఘటన ఉదంతంలో బాధితులకు అదనంగా రూ.7,844 కోట్ల నష్టపరిహారం అందేలా ఆదేశాలు ఇవ్వాలన్న కేంద్రం విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. మూడువేలకుపైగా మరణాలు, విష వాయువు విడుదలతో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిన ఈ ఘటనకు ప్రధాన కారకనన యూనియన్ కార్బైడ్ కార్పొరేషన్ (యూసీసీ) కొత్త యాజమాన్యం నుంచి ఈ అదనపు నష్టపరిహారం ఇప్పించాలని కేంద్రం పిటిషన్‌లో కోరింది. జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం ఈ పిటిషన్‌ను కొట్టేసింది.

**తీవ్ర బాధ్యతారాహిత్యం**

బాధితులకు కేంద్ర ప్రభుత్వం కనీసం బీమా రక్షణ కల్పించకపోవడం తీవ్ర బాధ్యతారాహిత్యమని కోర్టు విమర్శించింది. ''ప్రజా సంక్షేమం ప్రభుత్వ కనీస విధి అని గతంలో సమీక్ష సందర్భంగానే నాటి ధర్మాసనం సూచించింది. ఆ బాధ్యతను విస్మరించిన కేంద్రం ఇప్పుడు మరింత నష్టపరిహారం కోరజాలదు. బాధితులకు నష్టపరిహారంపై రెండు దశాబ్దాల క్రితమే సెటిల్మెంట్ జరిగింది. ఇప్పుడొచ్చి ఆ అంశాన్ని లేవనెత్తడంలో హేతుబద్ధత లేదు. 'బాధితులకు అందాల్సిన మొత్తాల్లో ఇంకా ఏవైనా పెండింగ్‌లో ఉంటే వాటిని ఆర్‌బీఐ వద్ద ఉంచిన రూ.50 కోట్ల నుంచి సర్దుబాటు చేయండి' అని కేంద్రాన్ని ఆదేశించింది.

**విష వాయువు విలయం...**

1984 డిసెంబర్ రెండో తేదీ రాత్రి భోపాల్‌లో యూనియన్ కార్బైడ్ కర్మాగారం నుంచి లీకైన మిథైల్ ఐసోసైనేట్ విషవాయువు పీల్చి 3,000 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. 1 లక్షల మందికిపైగా తీవ్ర అనారోగ్యం బారినపడ్డారు. 1989లో 47 కోట్ల డాలర్లు నష్టపరిహారంగా యూసీసీ యాజమాన్యం చెల్లించింది. 1989లో 47 కోట్ల డాలర్లు అంటే ఆనాటి డాలర్ రూపాయి మారకం విలువతో పోలిస్తే రూ.715 కోట్లుకాగా, ప్రస్తుతం ఆ మొత్తం రూ.3,870 కోట్లకు సమానం.

### కేంద్రం, న్యాయవ్యవస్థ మధ్య సమన్వయం ఉంది: రిజిజు

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం, న్యాయవ్యవస్థ ఒక బృందంలా కలిసి పని చేస్తున్నాయని కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. అయితే దేశంలో కొందరు మహా నటులు రెంటింటి మధ్య విభేదాలున్నాయని చిత్రీకరించడానికి ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. లోక్‌మత్ జాతీయ సదస్సులో మంగళవారం పాల్గొన్న కిరణ్ రిజిజు ప్రతిపక్ష నేతల్ని వేధించడానికి కేంద్ర దర్యాప్తు సంస్థల్ని ప్రయోగిస్తోందన్న ఆరోపణల్ని కొట్టి పారేశారు. బీజేపీ పార్టీ అవినీతిని సహించదని, అందుకే విపక్షకి తావే ఉండదన్నారు. అవినీతి పట్ల రాజీపడే ప్రసక్తే లేకపోవడం మోదీ ప్రభుత్వ విధానమని గుర్తు చేశారు. కేంద్రానికి, న్యాయవ్యవస్థకి మధ్య అద్భుతమైన సమన్వయం ఉందని, అయినా కొందరు పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని రిజిజు నిందించారు.

## ఆస్కార్ విజేతలకు పార్లమెంట్ జేజేలు

**మీ ఖాతాలో వేసుకోకండి • బీజేపీ, మోదీలపై ఖర్గే చెణుకులు**



**న్యూఢిల్లీ:** విశ్వ వేదికపై తెలుగు బావుటా ఎగరేసిన ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటు నాటు పాట, ది ఎలిఫెంట్ విస్పరర్స్ డాక్యుమెంటరీ ఆస్కార్ అవార్డులు సాధించినందుకు పార్లమెంట్ జేజేలు పలికింది. భారతీయ సినిమా ఖ్యాతికి ఈ విజయాలు మరింతగా వన్నెతెచ్చాయంటూ మంగళవారం రాజ్యసభలో చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రస్తుతించారు. ''ది ఎలిఫెంట్ విస్పరర్స్ డాక్యుమెంటరీ ఇద్దరు మహిళల ఉత్కృష్ట పనితనాన్ని ఎలుగెత్తి చాటింది. భారతీయ మహిళలకు అంతర్జాతీయంగా దక్కిన అపురూప గౌరవమిది'' అని రాజ్యసభ నాయకుడు, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రశంసించారు. ఆర్‌ఆర్‌ఆర్ రచయిత వి.విజయేంద్రప్రసాద్ రాజ్యసభ సభ్యుడేనని గుర్తు చేశారు.

**సభలో నవ్వులు పూయించిన ఖర్గే**

రెండు దక్షిణాది సినిమాలు ఆస్కార్ దక్కడం గర్వించాల్సిన గొప్ప విషయమని రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే అన్నారు. ఈ సందర్భంగా బీజేపీనుద్దేశిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు పూయించాయి. 'అధికార పార్టీని నేను కోరేదొక్కటే. ఈ రెండు సినిమాలకు దర్శకత్వం వహించింది, పాట రాసింది మేమేనంటూ మోదీజీ గానీ, బీజేపీ సర్కార్ గానీ ఆస్కార్ ఘనతను తమ ఖాతాలో వేసుకోవద్దు. ఇది దేశం సాధించిన ఘనత' అన్నారు. దాంతో సభ్యులు బిగ్గరగా నవ్వేశారు. ఆస్కార్ గెలిచిన దేశ ప్రతినిధుల గురించి పార్లమెంట్‌లో చర్చించడం ఆనందంగా ఉందని మాజీ నటి, ఎస్పీ ఎంపీ జయా బచ్చన్ అన్నారు.

### 10 కోట్ల ఏళ్లనాటి నత్త



పసుపు రంగులో కనిపిస్తున్నది 9.9 కోట్ల ఏళ్ల నాటి ఒక చెట్టు జిగురు ముద్ద. లోపల కన్పిస్తున్న జిగురు ముద్దగా మారుతుండగా చిక్కుకున్న ఓ నత్త. అది శిలాజంగా మారి ఇన్నేళ్లుగా ఇలా భద్రంగా ఉండిపోయింది.

## రెండో రోజూ అదే తీరు

**పార్లమెంట్‌లో కొనసాగిన గందరగోళం**

- రాహుల్ వ్యాఖ్యలపై క్షమాపణలకు బీజేపీ పట్టు
- అదానీపై జేపీసీ ఏర్పాటు చేయాల్సిందేనన్న విపక్షాలు
- ఉభయ సభలు వాయిదా

**న్యూఢిల్లీ:** భారత్‌లో ప్రజాస్వామ్యం గురించి బ్రిటన్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై పార్లమెంట్ ఉభయ సభలు వరుసగా రెండో రోజు మంగళవారం సైతం స్తంభించాయి. రాహుల్ క్షమాపణకు అధికార బీజేపీ సభ్యులు పట్టుబట్టగా, అదానీ వ్యవహారంపై తక్షణమే జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని విపక్ష సభ్యులు మరోసారి డిమాండ్ చేశారు. వాగ్వాదాలు, నినాదాల నడుమ లోక్‌సభ, రాజ్యసభ బుధవారానికి వాయిదా పడ్డాయి.

**మరి ప్రధాని మాట్లాడిందేమిటి?**

ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే రాహుల్ వెంటనే క్షమాపణ చెప్పాలంటూ బీజేపీ సభ్యులు నినాదాలకు దిగారు. ప్రధాని మోదీ కూడా విదేశాల్లో దేశ ప్రతిష్టను దిగజార్చేలా మోదీ మాట్లాడారని విపక్ష సభ్యులు ఎదురు దాడికి దిగారు. విదేశీ పర్యటనల్లో చేసిన ఆయన వ్యాఖ్యలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. కొందరు వెల్‌లోకి దూసుకొచ్చారు. అదానీ అంశంపై జేపీసీ ఏర్పాటు చేయాలప్రశ్నోత్తరాలు ప్రారంభించేందుకు స్పీకర్ ఓం బిర్లా ప్రయత్నించారు. నినాదాలాపాలని విజ్ఞప్తి చేశారు. ప్రశ్నోత్తరాల తర్వాత మాట్లాడేందుకు అవకాశం ఇస్తానన్నా విపక్ష సభ్యులు వినకపోవడతో మధ్యాహ్నం 2 గంటల దాకా సభను వాయిదా వేశారు. మళ్లీ ప్రారంభమైన తర్వాత గందరగోళం మధ్యే స్టాండింగ్ కమిటీ నివేదికలను ప్రభుత్వం సభకు సమర్పించింది.

**పార్లమెంట్‌ను అగౌరవపర్చారు**

రాజ్యసభలోనూ ముందుగా కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ రాహుల్ అంశాన్ని లేవనెత్తారు. దేశ ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలన్నారు. కాంగ్రెస్, విపక్ష సభ్యులు ఎదురుదాడికి దిగారు. నినాదాలు, అరుపులు కేకలతో గందరగోళం నెలకొనడంతో సభను మధ్యాహ్నం 2 గంటల వరకూ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వాయిదా వేశారు. మళ్లీ ప్రారంభమైన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌కు వచ్చి, క్షమాపణ చెప్పాల్సిందేనని పీయూష్ గోయెల్ పట్టుబట్టారు. రాహుల్‌తో క్షమాపణ చెప్పించాలని కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ అన్నారు. ప్రతిష్టంభనను తొలగించడానికి అన్ని పార్టీల సభాపక్ష నేతలతో సమావేశం అవుతానని చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ చెప్పారు. సభ అదుపులోకి రాకపోవడంతో బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అదానీపై చర్చించాలంటూ కె.కేశవరావు (బీఆర్‌ఎస్), సంజయ్ సింగ్ (ఆప్) ఇచ్చిన నోటీసులను ధన్‌ఖడ్ తిరస్కరించారు.



**ప్రభుత్వ తీరును ఎండగడదాం...**

కాంగ్రెస్, డీఎంకే, సీపీఎం, జేడీయూ, ఆర్జేడీ, ఎన్సీపీ, సమాజ్‌వాదీ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ, సీపీఐ, జేఎంఎం, ఎండీఎంకే, నేషనల్ కాన్ఫరెన్స్, కేరళ కాంగ్రెస్ తదితర 16 పార్టీల నేతలు మంగళవారం ఉదయం కాంగ్రెస్ ఎంపీ మల్లికార్జున ఖర్గే చాంబర్‌లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అదానీ వ్యవహారంపై ప్రభుత్వ తీరును పార్లమెంట్‌లో ఎండగట్టాలని నిర్ణయించుకున్నారు. అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీ గ్రూప్‌ను కాపాడేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విపక్ష ఎంపీలు ధ్వజమెత్తారు. ఈ సమావేశానికి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరు కాలేదు. పార్లమెంట్ ప్రాంగణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నేత సోనియా గాంధీ ఇతర నాయకులతో సమావేశమ్యారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై పార్లమెంట్ ఉభయ సభల్లో బీజేపీ సభ్యులు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు.

### నక్సల్స్ హింస 77% తగ్గుముఖం: కేంద్రం

**న్యూఢిల్లీ:** ''దేశంలో గత 12 ఏళ్లలో నక్సల్స్ హింస 77% మేర తగ్గింది. మరణాలు, సంబంధిత ఘటనలు 90% మేర పడిపోయాయి'' అని కేంద్రం తెలిపింది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ మంగళవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ''2010లో దేశవ్యాప్తంగా 96 జిల్లాల్లోని 465 పోలీస్‌స్టేషన్లలో మావోయిస్టుల హింసాత్మక ఘటనలు నమోదు కాగా, 2022లో 45 జిల్లాలు, 176 పోలీస్‌స్టేషన్లకు పరిమితమయ్యాయి. జార్ఖండ్‌లో మావోయిస్టుల హింసాత్మక ఘటనలు 82% తగ్గాయి. 2010లో నక్సల్స్ దాడుల్లో 1,005 మంది భద్రతా సిబ్బంది, పౌరులు చనిపోగా 2022లో ఇది 98కు తగ్గింది'' అన్నారు.

### పర్యాటకానికి దారులు తెరిచిన చైనా

**హాంకాంగ్:** దాదాపు మూడేళ్ల తర్వాత చైనా పర్యాటకులకు ద్వారాలు తెరుస్తోంది. కరోనా మహమ్మారితో దెబ్బతిన్న పర్యాటక, ఆర్థిక రంగాల ఊతానికి బుధవారం అన్ని రకాల వీసాలను జారీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆ దేశ దౌత్య కార్యాలయాల వెబ్‌సైట్లలో నోటిఫికేషన్‌ను ఉంచింది. పర్యాటకులను వీసాల్లేకుండానే హైనాన్ ద్వీపంలోకి, షాంఘై నౌకాశ్రయంలోకి వచ్చే క్రూయిజ్ షిప్‌లనూ అనుమతిస్తామంది. విదేశీయులు 2020 మార్చి 28కి ముందు పొందిన వీసాలు కూడా చెల్లుబాటవుతాయని వివరించింది. విదేశీయులు హాంకాంగ్, మకావోల మీదుగా వీసా అవసరం లేకుండానే గ్వాంగ్‌డాంగ్‌లోకి ప్రవేశించవచ్చని పేర్కొంది.

### రాహుల్ బాధ్యతగా మాట్లాడాలి: ఆరెస్సెస్

**సమల్ఖా (హరియాణా):** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరింత బాధ్యతాయుతంగా మాట్లాడాలని ఆరెస్సెస్ పేర్కొంది. ప్రజల్లో ఆరెస్సెస్‌కు లభిస్తున్న వాస్తవిక ఆదరణను గమనించాలని సంస్థ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలే అన్నారు. హరియాణాలోని సమల్ఖాలో ఆరెస్సెస్ అఖిల భారతీయ ప్రతినిధి సభ సమావేశాల జరుగుతున్నాయి. సమావేశాల చివరి రోజైన మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశాన్ని జైలులా మార్చిన వారికి ప్రజాస్వామ్యంపై మాట్లాడే హక్కు లేదన్నారు. కేవలం ఇద్దరు స్త్రీ, పురుషుల మధ్య జరిగేదే వివాహమని, స్వలింగ వివాహాలపై కేంద్రం వైఖరిని సమర్థిస్తున్నామన్నారు. ముస్లిం మేధావులు, ఆధ్యాత్మిక నేతల ఆహ్వానం మేరకే సంఘ్ నేతలు వారితో చర్చలు జరుపుతున్నారని వివరించారు.

### మోదీకి 'ఆప్' భయం: కేజ్రీవాల్

**భోపాల్:** బీజేపీకి కంచుకోట అయిన గుజరాత్‌లోనూ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ 13 శాతం ఓట్లు సాధించడంతో ప్రధాని మోదీకి 'ఆప్' భయం పట్టుకుందని ఆ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. మధ్యప్రదేశ్ విస్తరించే వ్యూహంలో భాగంగా ఆప్ మంగళవారం భోపాల్‌లో భారీ ర్యాలీ జరిపింది. అందులో కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ప్రసంగించారు. 'పులికి తన స్థావరంలోనే సవాలు విసిరాం. లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆప్‌తో ఇబ్బందులు తప్పవని మోదీ భయపడుతున్నారు' అని కేజ్రీవాల్ అన్నారు. 'కాంగ్రెస్, బీజేపీల పాలనతో విసిగిన మధ్యప్రదేశ్ ప్రజలకు ఆప్ ఆశాకిరణమన్నారు.

## అదానీకి దోచిపెట్టడమే విదేశాంగ విధానమా?

**మోదీపై మరోసారి రాహుల్ ధ్వజం**

**న్యూఢిల్లీ:** పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీని కుబేరుడిని చేయడమే మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానమా? అని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ వీడియో విడుదల చేశారు. నరేంద్ర మోదీ గత తొమ్మిదేళ్లుగా దేశాన్ని భ్రమల్లోనే ఉంచుతున్నారని, తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రపంచంలో మోదీ ఎక్కడికెళ్లినా అదానీని సైతం వెంట తీసుకెళ్లారని గుర్తుచేశారు.

**ప్రతిష్టంభనకు ప్రభుత్వమే కారణం: జైరాం**

పార్లమెంట్‌లో ప్రతిష్టంభనకు ముమ్మాటికీ మోదీ ప్రభుత్వమే కారణమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ట్విట్టర్‌లో ధ్వజమెత్తారు. కీలకమైన అంశాలపై ప్రజల దృష్టిని మళ్లించడం ప్రధాని మోదీకి, ఆయన సహచరులకు ఒక అలవాటుగా మారిందన్నారు. రాహుల్ విమర్శలను కేంద్ర మంత్రి, బీజేపీ నేత గిరిరాజ్ సింగ్ ఖండించారు. కాంగ్రెస్ హయాంలోనే అదానీ వ్యాపారావేత్తగా ఎదిగారన్నారు. ''గుజరాత్ కాంగ్రెస్ సీఎం చిమన్‌భాయ్ పటేల్ తనకు మొదటి బ్రేక్, రాజీవ్ గాంధీ రెండో బ్రేక్ ఇచ్చారని అదానీ స్వయంగా చెప్పారు. ప్రధాని మోదీని దూషించడమే ప్రతిపక్షాల ఉద్దేశం. అంబానీ–అదానీ సాకులే. యూపీఏ ప్రభుత్వ పదేళ్ల పాలన వివాదాలమయం. మోదీ సర్కారు వచ్చాకే అభివృద్ధి జరుగుతోంది'' అన్నారు.

**ప్రమాదంలో భావప్రకటనా స్వేచ్ఛ: ఖర్గే**

మాట్లాడే స్వాతంత్ర్యం, నిజాలు రాసే స్వేచ్ఛ ప్రమాదంలో చిక్కుకున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం లోక్‌మత్ జాతీయ సదస్సులో ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులు మీడియాను అణచివేస్తున్నారని ఆరోపించారు. ఓ వర్గం మీడియా వారికి లొంగిపోయిందని ఆక్షేపించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంబ్రిడ్జి అరుపులు, లండన్ అబద్ధాలు ఆపాలని సదస్సులో పాల్గొన్న కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ హితవు పలికారు. విపక్ష నేతలను వేధించేందుకే దర్యాప్తు సంస్థలను కేంద్రం ప్రయోగిస్తోందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ధ్వజమెత్తారు.

## ఆస్ట్రేలియాకు అమెరికా సబ్‌మెరైన్లు



ఆకస్ సదస్సులో అల్బనీస్, బైడెన్, సునాక్

**వాషింగ్టన్:** ఆసియా పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడుకు కళ్లెం వేసేందుకు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియాల 'ఆకస్' కూటమి మరో అడుగు ముందుకేసింది. ఆసియా పసిఫిక్ ప్రాంత స్వేచ్ఛా, సంరక్షణ కోసం అణు జలాంతర్గాముల ప్రాజెక్ట్‌పై ఏకాభిప్రాయానికి వచ్చినట్లు ఈ మూడు దేశాలు ప్రకటించాయి. ఇందుకు సోమవారం అమెరికాలోని శాన్ డీగోలో జరిగిన ఒక కార్యక్రమం వేదికైంది. ఈ కార్యక్రమంలో అమెరికా అధ్యక్షుడు బైడెన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్ పాల్గొన్నారు. ఆకస్ ఒప్పందంలో అంతర్భాగమైన అణు జలాంతర్గామి ప్రాజెక్టులో భాగంగా ఆస్ట్రేలియాకు అమెరికా 2030దశకం తొలినాళ్లలో దశలవారీగా మూడు అణుఇంధనంతో పనిచేసే జలాంతర్గాములను అందించనుంది. 'వచ్చే ఐదేళ్లలో అమెరికా జలాంతర్గాముల నిర్మాణ సామర్థ్యం పెంపు, వర్జీనియా శ్రేణి సబ్‌మెరైన్ల నిర్వహణ కోసం మొత్తంగా 460 కోట్ల డాలర్లు వినియోగిస్తాం. 'వర్జీనియా' జలాంతర్గాములతో దశాబ్దకాలం ముందుగానే ఆస్ట్రేలియా జలాంతర సామర్థ్యం ద్విగుణీకృతం అవుతోంది' అని సునాక్, అల్బనీస్‌ల సమక్షంలో బైడెన్ ప్రకటించారు. బ్రిటన్ జలాంతర్గామి టెక్నాలజీ, అమెరికా సాంకేతికతల మేలిమి కలయికగా అణుఇంధనంతో నడిచే సంప్రదాయక ఆయుధాలు అమర్చిన జలాంతర్గామి తయారుకాబోతోంది' అని బైడెన్ చెప్పారు. మూడు దేశాల మైత్రిలో కొత్త అధ్యాయం మొదలైందని ఈ సందర్భంగా అల్బనీస్ వ్యాఖ్యానించారు. హిందూ మహాసముద్రం, పశ్చిమ, మధ్య పసిఫిక్ సముద్రం, దక్షిణ చైనా సముద్రాలు ఉన్న ఇండో–పసిఫిక్ ప్రాంతం భౌగోళికంగా, అంతర్జాతీయ జలరవాణాకు కీలకమైన ప్రాంతం. దక్షిణ చైనా సముద్ర జలాలపై హక్కులు తనకే చెందుతాయని చైనా వాదిస్తుండటంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం తెల్సిందే.



డ్రోన్ తరహాలో కనువిందు చేస్తున్న ఈ ఎయిర్‌క్రాఫ్ట్‌ను అమెరికాకు చెందిన లిఫ్ట్ అనే సంస్థ రూపొందించింది. మంగళవారం జపాన్‌లో తీసిందీ ఫొటో.

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

బుధవారం : 15 : మార్చి : 2023


**కొంగ–మొసలి భాయి భాయి**



మండ్య జిల్లా రంగనతిట్టు పక్షిధామంలో మంగళవారం అరుదైన దృశ్యం. ఒకే బండపై కొంగలు, మొసలి కాలక్షేపం

## న్యూస్‌రీల్

### ఘనంగా తాయమ్మదేవి జాతర



**మండ్య:** మండ్య తాలూకాలోని హోళలు గ్రామంలో వెలసిన గ్రామ దేవత అయిన శ్రీ దొడ్డమ్మతల్లి జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం తెల్లవారుజామునే అమ్మవారికి మహిళలు ఊరేగింపుగా పూల హారాలు తీసుకువచ్చారు. దొడ్డమ్మదేవితో పాటు ముద్దమ్మ దేవి, మారమ్మ దేవివార్లకు హారాలు సమర్పించి పూజలు నిర్వహించారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల పల్లెల నుంచి భక్తులు తరలివచ్చారు. కోళ్ళు, మేకలు, పొట్టేళ్లను బలి ఇచ్చి మాంసాహారం వంటకాలను భుజించారు.

### ఐఫోన్లతో పరారు, డెలివరీ బాయ్స్ అరెస్ట్

**బనశంకరి:** ఐఫోన్ల పార్శిల్‌తో పారిపోయిన ఇద్దరు డెలివరి బాయ్‌లను మంగళవారం కేంద్ర విభాగ సీఈఎన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ. 6.5 లక్షల విలువైన ఆరు ఐఫోన్లు, రెండు యాపిల్ వాచీలు, ల్యాప్‌టాప్, నాలుగు మొబైల్స్, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 5న సుణకల్ పేటే దుకాణంలో ఆరు ఐఫోన్లు, ఒక యాపిల్ ఫోన్ తస్లీం అనే వ్యక్తి కొనుగోలు చేసి విజయనగర ఇంటి అడ్రస్‌కు పంపడానికి ఓ ఆన్‌లైన్ డెలివరిని ఆశ్రయించాడు. అరుణ్ పాటిల్ అనే పేరుతో పార్శిల్ చేశారు. అయితే కొద్ది సమయం అనంతరం నయన్ అనే వ్యక్తి ఫోన్ చేసి పార్శిల్ తనకు అందిందని, కొద్ది నిమిషాల్లో పార్శిల్ తీసుకువస్తానని తస్లీంకు ఫోన్ చేశారు. అనంతరం ఫోన్ స్విచాఫ్ వచ్చింది. దీంతో తస్లీం సీఈఎన్‌ను పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేసి బసవరాజ, మాళప్ప అనే ఇద్దరిని అరెస్ట్ చేసి మొబైళ్లను స్వాధీనం చేసుకున్నారు.

### మాడాళ్‌కు సుప్రీంలోనూ ఊరట

- ముందస్తు బెయిలుకు ఓకే

**యశవంతపుర:** తన నివాసంలో దొరికిన కోట్లాది రూపాయల నగదు కేసులో చన్నగిరి బీజేపీ ఎమ్మెల్యే మాడాళ్ విరూపాక్షప్ప మంగళవారం లోకాయుక్త ముందు విచారణకు హాజరయ్యారు. తన న్యాయవాదితో కలిసి హాజరైన మాడాళ్‌ను లోకాయుక్త అధికారులు నగదు, ఇతరత్రా అంశాలపై విచారించి పంపారు.

ఇక మాడాళ్ హైకోర్టుకెళ్లి ముందస్తు బెయిలును పొందడం తెలిసిందే, దీనిని సవాల్ చేస్తూ లోకాయుక్త సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా మంగళవారం మధ్యాహ్నం కేసును విచారించిన సుప్రీం.. హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను సమ్మతించింది. దీనితో ఎమ్మెల్యే విరూపాక్షప్పకు అరెస్టు భయం తగ్గింది. లంచం, ఇంట్లో భారీగా నగదు కేసులో మాడాళ్ తనయుడు, బెంగళూరు జలమండలి చీఫ్ అకౌంటింగ్ ఆఫీసర్ మాడాళ్ ప్రశాంత్ అరెస్టయి జైలులో ఉన్నాడు. ఎమ్మెల్యే బెయిల్‌ను రద్దు చేయాలని లోకాయుక్త సుప్రీంకోర్టుకు వెళ్లడం అందరినీ ఆశ్చర్యపరచింది.

### లగేజీ రుసుము వివాదం

- వదిలేసి వెళ్లిన విద్యార్థి




**దొడ్డబళ్లాపురం:** లగేజీకి విధించిన అధిక రుసుము చెల్లించలేని ఒక విద్యార్థి వాటిని ఎయిర్‌పోర్టులోనే వదిలి మలేషియాకు వెళ్లిపోయిన సంఘటన కెంపేగౌడ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. బెళగావికి చెందిన సూరజ్ పాటిల్ అనే ఈ విద్యార్థి బెంగళూరు నుంచి మలేషియాకు వెళ్లాల్సి ఉంది. అక్కడ అతడు ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఎయిర్ ఏషియా వెబ్‌సైట్లో ప్రతి కేజీ అదనపు లగేజీకి రూ.500 రుసుము వసూలు చేస్తామని పేర్కొన్నారు. కానీ ఆ సంస్థ గ్రౌండ్ సిబ్బంది మాత్రం కేజీ లగేజీకి విద్యార్థికి రూ.2000 చెల్లించాలని డిమాండు చేసారు. దీంతో విద్యార్థి అంత డబ్బు తన వద్ద లేదని ఆహారం, దుస్తుల లగేజీని ఎయిర్‌పోర్టులో వదిలి మలేషియాకు వెళ్లిపోయాడు. అక్కడకు వెళ్లాక ఆన్‌లైన్ ద్వారా సదరు సంస్థపై ఫిర్యాదు చేశాడు. కాగా తమ సిబ్బంది తప్పేమీ లేదని సంస్థ చెప్పడం గమనార్హం.

# పెళ్లి చేసుకోమంటే.. అంతు చూశాడు

- అపార్టుమెంటు నుంచి పడి ఎయిర్‌హోస్టెస్ మృతి కేసులో వీడిన మిస్టరీ
- టెక్కీ ఆదేశ్ అరెస్టు

**బనశంకరి:** డేటింగ్ యాప్ ద్వారా మొదలైన ప్రణయం ఆమె పాలిట ప్రాణాంతకంగా మారింది. కోరమంగలలో 4 వ అంతస్తుపై నుంచి పడి ఎయిర్‌హోస్టెస్ మృతి చెందిన ఘటనలో మంగళూరు కు చెందిన ఆమె ప్రియుడు ఆదేశ్‌ను మంగళవారం కోరమంగళ పోలీసులు అరెస్ట్‌చేశారు. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన అర్చనా దీమన్ (28) మృతురాలు. కోరమంగల 8 వ బ్లాక్ రేణుకారెసిడెన్సీ అపార్టుమెంట్ 4 వ అంతస్తులో శుక్రవారం అర్ధరాత్రి ఆమె పై నుంచి కిందపడడంతో మరణించింది.



వివరాలు.. అర్చన ఒక అంతర్జాతీయ విమానయాన కంపెనీలో ఎయిర్‌హోస్టస్‌గా పనిచేసేది, ఆమె ప్రియుడు ఆదేశ్ బెంగళూరులో టెక్కీ. ఆరునెలల క్రితం డేటింగ్‌యాప్‌లో ఇద్దరికీ పరిచయం కుదిరింది, ఇది కాస్తా స్నేహంగా మారి ప్రేమకు దారితీసింది. ప్రేమను పెళ్లిగా మార్చుకోవాలని అర్చన నిర్ణయించింది. దుబాయ్‌లో ఉన్న అర్చనా కొన్నిరోజుల కిందట బెంగళూరుకు చేరుకుంది. నాలుగురోజుల పాటు ఇద్దరూ కలిసి ఉన్నారు. ఫోరం మాల్‌లో సినిమా చూసుకుని ఆదేశ్ ఫ్లాట్‌కు వచ్చారు. ఇద్దరూ మద్యం పార్టీ చేసుకున్నారు, పెళ్లి చేసుకోవాలని ఆమె ఒత్తిడి తీసుకురాగా, ఆదేశ్ అంగీకరించలేదు. దీంతో గొడవ జరిగింది. మద్యం మత్తులో బిల్డింగ్ పై నుంచి కిందపడిందని మృతురాలి తండ్రికి ఆదేశ్ ఫోన్‌చేశాడు. పోలీసులకు కూడా ఇదే చెప్పాడు.



4వ అంతస్తు నుంచి తోసేసి హత్య!



టెక్కీ ఆదేశ్, ఎయిర్‌హోస్టెస్ అర్చన

**పెళ్లి కోసం వేధించిందని వాంగ్మూలం**

ఆదేశ్, అర్చనాను బిల్డింగ్ పై నుంచి తోసేశాడని ఆమె తండ్రి దేవరాజ్ కోరమంగల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆదేశ్‌ను పోలీసులు అరెస్ట్‌చేసి తమదైనశైలిలో విచారించగా, ఆమెను తానే తోసేసినట్లు ఒప్పుకున్నాడు. పెళ్లి చేసుకోవాలని మూడునెలలుగా అర్చనా పీడిస్తోందని, మరోవైపు ఇంట్లో తనకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారని చెప్పాడు. 11వ తేదీ రాత్రి ఇదే గొడవ తీవ్రస్థాయికి చేరింది, నన్ను పెళ్లి చేసుకోకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తానని ఆమె హెచ్చరించింది. దీంతో కోపోద్రిక్తుడైన ఆదేశ్, అర్చనా ను బిల్డింగ్ పై నుంచి కిందికి తోసేయడంతో ఆమె ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది.

# నకిలీ ఎస్పీ ముసుగులో కోట్లు టోకరా

- మోసగాని కోసం గాలింపు

**బనశంకరి:** పోలీసు అధికారి ముసుగులో రూ. కోట్ల వంచనకు పాల్పడిన ఓ వ్యక్తిపై తలఘట్టపుర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నకిలీ ఐపీఎస్ శ్రీనివాస్ నగరంలో కొన్ని పోలీస్‌స్టేషన్లుకు వెళ్లి నేను మీ స్టేషన్‌కు డీసీపీ, ఎస్పీగా వస్తానని అబద్ధాలు చెప్పాడు. ఇతని చేతిలో వెంకటనారాయణ అనే వ్యక్తి మోసపోయాడు.

**ల్యాండ్ డీలింగ్ పేరుతో వంచన :**

వెంకటరమణప్ప అనే వ్యక్తి ద్వారా వెంకటనారాయణకు నకిలీ ఎస్పీ శ్రీనివాస్ పరిచయయ్యాడు. ఇది కాస్త స్నేహంగా మారడంతో విశ్రాంత ఏఎస్ఐ ముత్తేగౌడతో కలిసి వెంకటనారాయణ తిరుపతి విహారయాత్రకు వెళ్లారు. ఈ సమయంలో శ్రీనివాస్ తాను బెంగళూరు నగరంలో ఎస్పీగా పనిచేస్తున్నాను అని తెలిపారు.

మాటల మధ్య మైసూరులో భూవివాదం ఉంది, రెవెన్యూ పనిమాత్రం పెండింగ్ ఉంది. రూ.450 కోట్లు డీలింగ్ కేసులో రూ.250 కోట్లు డీల్ అవుతుంది అని శ్రీనివాస్ నమ్మించాడు. ఇందుకు రూ.2.5 కోట్లు అవసరం ఉంది ఎక్కడైనా సర్దుబాటు చేయండి అని శ్రీనివాస్ కోరాడు. కొద్దిరోజులు అనంతరం మళ్లీ వెంకటనారాయణ స్నేహితుడు వెంకరమణప్ప దుకాణానికి శ్రీనివాస్ యూనిఫారంలో ఇన్నోవా కారులో వచ్చాడు.



నకిలీ ఎస్పీ శ్రీనివాస్

ఇతను ఐపీఎస్ అధికారి అని వెంకటనారాయణ నమ్మాడు. వెంకటనారాయణ తన స్నేహితులు ద్వారా కూడా దశలవారీగా రూ.2.5 కోట్లు నగదు శ్రీనివాస్‌కు అందజేశారు. డబ్బు చేతికి అందగానే నకిలీ ఎస్పీ మొబైల్ స్విచ్చాఫ్ చేసుకుని అదృశ్యమయ్యాడు. దీంతో కంగారుపడిన బాధితుడు తలఘట్టపుర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కొందరు పోలీస్ అధికారులు వద్దకు వెళ్లి అడగ్గా ఇతను నకిలీ పోలీస్ అని వెలుగులోకి వచ్చింది. అతని కోసం గాలిస్తున్నారు.

# మైసూరు ఎక్స్‌ప్రెస్ వేపై టోల్ నిరసనలు

- కాంగ్రెస్, జేడీఎస్ ధర్నాలు

**బనశంకరి:** బెంగళూరు–మైసూరు ఎక్స్‌ప్రెస్ హైవేలో టోల్ వసూలు మంగళవారం నుంచి ప్రారంభమైంది. రోడ్డు పనులు పూర్తికాక ముందే టోల్‌ఫీజు వసూలు చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. పలుచోట్ల జేడీఎస్, కాంగ్రెస్, కన్నడ పర సంఘాలు కార్యకర్తలు ధర్నాకు దిగి టోల్ సేకరణ కేంద్ర గేట్‌లను ధ్వంసం చేశారు. బెంగళూరు–మైసూరు రోడ్డులో పటిష్టభద్రత మధ్య టోల్‌ఫీజు వసూలు ప్రారంభమైంది. టోల్‌ఫీజు వసూలు చేయడాన్ని ఖండిస్తూ రోడ్డు మధ్య పాల క్యాన్లు పట్టుకుని ధర్నాకు దిగారు. ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పనులు పూర్తయిన తరువాత టోల్ వసూలు చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

**టోల్ గొడవ ఎన్‌హెచ్‌కు సీఎం సూచన**

బెంగళూరు–మైసూరు ఎక్స్‌ప్రెస్ హైవే టోల్‌ఫీజు వసూలు చేయడంపై వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో దీనిపై దృష్టి సారించాలని జాతీయ రహదారి ప్రాధికారకు సూచించామని సీఎం బసవరాజ బొమ్మై తెలిపారు. ఏదైనా రోడ్లు నిర్మించినప్పుడు టోల్‌ఫీజు ప్రారంభమైనప్పుడు ధర్నాలు, వ్యతిరేకత వ్యక్తం చేయడం సహజం. దీనిపై పూర్తి సమాచారం సేకరించి ప్రజలకు సర్దిచెప్పాలని జాతీయ రహదారి ప్రాధికార అధికారులకు సూచించామన్నారు.



టోల్‌గేట్ వద్ద కాంగ్రెస్ నేతల ధర్నా

# నిష్పక్షపాతంగా పోలీస్ విధులు



మాట్లాడుతున్న కమిషనర్ ప్రతాప్‌రెడ్డి



పాల్గొన్న పోలీసు అధికారులు

- నగర పోలీస్ కమిషనర్ ఆదేశం

**బనశంకరి:** శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జవాబుదారీగా విధులు నిర్వహించడంతో పాటు నిష్పక్షపాతంగా శాంతిభద్రతలు కాపాడాలని నగరపోలీస్ కమిషనర్ సీహెచ్.ప్రతాప్‌రెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనరేట్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అసాంఘిక ఘటనలకు అవకాశం ఇవ్వకుండా విధులు నిర్వహించాలని సూచించారు. సీఐలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీల కార్యకలాపాలపై దృష్టిసారించి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అడ్డుకట్ట వేయాలన్నారు.

ఎలాంటి చిన్న ఘటన జరిగినా తక్షణం ఘటనాస్థలానికి వెళ్లి సమస్యను పరిష్కరించాలని సీపీ సూచించారు. రాజకీయ పార్టీలు నిర్వహించే ఊరేగింపులు, సభలు, సమావేశాలు సమయంలో పూర్తిస్థాయిలో భద్రత కల్పించడం ద్వారా అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. గత శుక్రవారం భారత ఎన్నికల కమిషనర్ నగర పోలీస్ అధికారులు, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో పోలీస్ కమిషనర్ ఈ సమావేశం జరిపి ఆదేశాలిచ్చారు.

### రౌడీల కార్యకలాపాలపై నిఘా

**మైసూరు:** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, మైసూరు నగరంతో పాటు జిల్లాలోని రౌడీల కార్యకలాపాలపై పోలీసు నిఘా ఉందని, మైసూరు జిల్లా అధికారి కేవీ రాజేంద్ర అన్నారు. మంగళవారం ఆయన నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, అధికారులు, ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. ఎన్నికలకు తక్కువ సమయం ఉన్నందున, ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో పేరు చెక్ చేసుకోవాలని అన్నారు.

# బంగారం దోపిడీ కేసులో ఇద్దరు నిర్బంధం

- రైల్వే పోలీసులుగా అనుమానం

**శివాజీనగర:** ఈ నెల 11న రాత్రి బెంగళూరులో బంగారు బిస్కెట్లు, ఆభరణాలతో వెళ్తున్న ఇద్దరు రాయచూరువాసులను పోలీసులమని బెదిరించి రూ.1.21 కోట్ల విలువచేసే 2.2 కేజీల బంగారం దోపిడీ కేసులో దుండగులు రైల్వే పోలీసులు అనే అనుమానం వ్యక్తమైంది. నగర పోలీసులు సంఘటన జరిగిన చుట్టుపక్కల సీసీ కెమెరాలను పరిశీలించి అందులో కనిపించిన నిందితుల పోలికలను బట్టి రైల్వే విభాగానికి చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

రాయచూరులో బంగారు షాపుల్లో పనిచేసే అబ్దుల్ రజాక్, మల్లయ్యలను ఆనందరావు సర్కిల్ వద్ద ఉన్న గ్రీన్‌లైట్ ట్రావెల్స్ కార్యాలయం సమీపంలో పోలీసులని చెప్పి వారిని ఆటోలో తీసుకెళ్లి బంగారం, కొంత నగదును లాక్కుని దుండగులు ఉడాయించారు. వీరిద్దరి వద్ద భారీ మొత్తంలో బంగారం ఉందని తెలిసి నిఘా పెట్టి దోపిడీకి పాల్పడడం మామూలు వ్యక్తులకు సాధ్యం కాదని అనుమానాలున్నాయి. ఉప్పారపేట పోలీస్ స్టేషన్ పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని కూపీ లాగుతున్నారు.

# బీజేపీలోనే ఉంటా, టికెట్ ఇస్తే పోటీ చేస్తా

- మంత్రి సోమణ్ణ

**శివాజీనగర:** నేను ఎక్కడికీ వెళ్లను, బీజేపీలోనే కొనసాగుతా. టికెట్ ఇస్తే పోటీ చేస్తానని మంత్రి వీ సోమణ్ణ చెప్పారు. మంగళవారం కావేరి భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన ప్రధాని మోదీ మంచి పరిపాలన అందిస్తున్నారు, రాష్ట్రంలోని ఉన్న వివాదాలకు చరమగీతం పాడాలి. బీజేపీలోనే కొనసాగుతాను. పార్టీ చెబితే ఎన్నికల్లో పోటీ చేస్తాను, లేకపోతే పార్టీ పనిలో ఉంటానని చెప్పారు.

మాజీ సీఎం యడియూరప్ప, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు బీవై విజయేంద్రపై తన కుమారుడు అరుణ్ సోమణ్ణ ధ్వజమెత్తిన విషయమై స్పందిస్తూ, నా కుమారుడు డాక్టర్, ఆయనకు 47 సంవత్సరాల వయస్సు. చిన్న పిల్లాడేం కాదు, రాజకీయంలో ఎవరికి ఎవరూ శత్రువులు కాదు, బీజేపీలో ఎలాంటి గందరగోళం లేదు అని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన తన గురించి చెప్పుకుంటూ కన్నీరు కార్చారు. బెంగళూరుకు వచ్చి ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చానని, ఆత్మాభిమానానికి భంగం కలిగితే తాను మౌనంగా ఉండనని అన్నారు.



పురవీధుల్లో కొనసాగుతున్న తేరు సంబరం


### సర్వధర్మ రథోత్సవం

**హొసపేటె:** స్థానిక శ్రీ జగద్గురు కొట్టూరుస్వామి సర్వధర్మ రథోత్సవం మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. బసవలింగ మహాస్వామీజీ రథోత్సవాన్ని ప్రారంభించారు. స్థానిక వడకరాయ దేవస్థానం నుంచి ప్రారంభించి పాదగట్టి ఆంజనేయ దేవస్థానం వరకు తేరును లాగారు. పట్టణ ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో రద్దీ నెలకొంది. వాయిద్య మేళాలు, కళా ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

# పులి వాహనంపై మలె మహదేశుడు



గతంలో నిర్మాణంలో ఉన్నప్పుడు ఇలా కనిపించేది



నిర్మాణం పూర్తి చేసుకున్న బృహత్ విగ్రహం

- కొండపై సిద్ధమైన బృహత్ విగ్రహం
- రూ. 20 కోట్లతో నిర్మాణం
- 18న ప్రారంభోత్సవం

**మైసూరు:** చామరాజనగర జిల్లాలోని హనూరు తాలూకాలో ప్రఖ్యాతి చెందిన మలెమహాదేశ్వర కొండ పైన వెలసిన మహదేశ్వర ఆలయానికి ఏటా లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. రాష్ట్రంలో ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటిగా పూజలందుకుంటోంది. ఈ నేపథ్యంలో కొండపైన మలెమహాదేస్వర స్వామి వారి 108 అడుగుల ఎత్తైన విగ్రహం నిర్మాణం పూర్తి చేసుకుంది. కొండ మీద దీపదగిరి ఒడ్డుపై పులి పైన కూర్చొని ఉన్న మలె మహాదేశ్వర స్వామి సుందరమైన విగ్రహాన్ని మార్చి 18వ తేదీన సీఎం బసవరాజు బొమ్మై ప్రారంభిస్తారు. కొండ కింద ఏ వైపు నుంచి చూసినా విగ్రహం కనిపించడం ప్రత్యేకం.

**గతంలో ప్రతిపాదనలు**

మలెమహాదేశ్వరకొండ పుణ్యక్షేత్రమే కాదు, మంచి పర్యాటక ప్రాంతం కూడా. ఇక్కడకు పర్యాటకులు, ట్రెక్కర్లు తరలివస్తుంటారు. కొండపైన స్వామివారి విగ్రహం, కింది భాగంలో మలె మహదేశ్వర మ్యూజియం నిర్మాణం చేయాలని 2016లో చామరాజనగర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హెచ్‌ఎస్.మహాదేవ ప్రసాద్ నిర్ణయించి ఇందుకోసం సుమారు రూ. 20 కోట్లను కేటాయించారు.

# టిప్పు వారసులకు తెల్లదొరల పింఛన్

- మండ్య బీజేపీ నేత ఆరోపణలు

**మండ్య:** మైసూరు పులి టిప్పు సుల్తాన్ వంశానికి చెందినవారు బ్రిటిష్ వారి వద్ద నుంచి సుమారు 60 సంవత్సరాల పాటు పెన్షన్ తీసుకున్నారు, ఇందుకు సాక్ష్యాలు ఉన్నాయని ఓ బీజేపీ నాయకుడు ప్రకటించారు. మరాఠా స్వాతంత్ర్య సమరయోధుడు వీర సావర్కర్ బ్రిటిష్‌వారితో ఒడంబడిక చేసుకుని పింఛన్ తీసుకున్నారని కాంగ్రెస్ ఆరోపణలు చేస్తున్న సమయంలో బీజేపీ నాయకులు ఈ ఆరోపణలు చేశారు. టిప్పు సుల్తాన్ 12వ కుమారుడు అయిన గులామ్ మహ్మద్ బ్రిటిష్ వారికి రాసిన లేఖను, ఆయన పింఛన్ పొందారనే పత్రాలను బీజేపీ మండ్య జిల్లా నేత సిటి మంజునాథ్ మంగళవారం మీడియా ముందు విడుదల చేశారు. విక్టోరియా రాణికి గులామ్ మహ్మద్ లేఖ రాశారని చెప్పారు. తద్వారా టిప్పు వంశస్తులు 60 సంవత్సరాలకు పైగా బ్రిటిష్ వారి వద్ద పింఛన్ తీసుకున్నట్లు ఇవే ఆధారాలని చెప్పారు. టిప్పు సుల్తాన్ తన రాజ్యాన్ని కాపాడుకోవడానికి యుద్ధం చేశాడు తప్ప భారత స్వాతంత్ర్యం కోసం కాదని అన్నారు. టిప్పును హత్య చేసింది బ్రిటిష్‌వారు కాదు, ఊరి గౌడ, దొడ్డనంజెగౌడ అయి ఉంటారని పేర్కొన్నారు.



బీజేపీ నేత విడుదల చేసిన కాగితాలు

### 7 శాతం కమీషన్ కావాలంటున్నారు

**శివాజీనగర:** అభివృద్ధి పనులను పూర్తిచేసి రెండు సంవత్సరాలు గడిచినా కాంట్రాక్టర్లకు బకాయిలు విడుదల చేయలేదని, వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు డీ.కెంపణ్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ప్రజాపనుల శాఖ, జలవనరుల, బీబీఎంపీలో అధికంగా పనులు జరుగుతున్నాయని, నిధుల విడుదలలో సీనియారిటీని పాటించటం లేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ అధికారులు సూచించేవారికి మాత్రం పెండింగ్ బకాయిలు విడుదల చేస్తున్నారని, మొత్తం రూ. 22 వేల కోట్లు విడుదల చేయాల్సి ఉందన్నారు. 7 శాతం కమీషన్ ఇస్తే బిల్లు రాస్తామని అధికారులు చెబుతున్నారు. అదే ధారవాడ ఇతర జిల్లాల్లో 10 శాతం ఇస్తే బిల్లు చేస్తామని నేరుగా చెబుతున్నారని ఆరోపించారు.

# పక్క చూపులకు కట్టడెలా?

- నేతలు చేజారకుండా యడ్డి, బొమ్మై చర్చలు
- ఎన్నికల ముందు అధికార పార్టీ దిద్దుబాటు చర్యలు

**శివాజీనగర:** ఎంతో ముఖ్యమైన విధానసభ ఎన్నికలు రాబోతున్న సమయంలో కొందరు సీనియర్లు పక్క చూపులు చూస్తున్నారని వార్తలు రావడం బీజేపీ హైకమాండ్‌కు గుబులుగా ఉంది. ఈ తరుణంలో సీఎం బసవరాజ బొమ్మై, మాజీ సీఎం యడియూరప్ప రహస్య భేటీ నిర్వహించారు. యడ్డిని సీఎం కలిసి 40 నిమిషాల పాటు చర్చలు జరిపారు. కర్ణాటకలో మరోసారి కమలం వికాసానికి ప్రధాని మోదీ, అమిత్ షా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అభివృద్ధి పథకాల ప్రారంభం పేరుతో గత నెల రోజుల్లో ఐదారుసార్లు కన్నడనాట పర్యటించారు. అయితే కొందరు బలమైన నాయకులు అసంతృప్తితో ఉన్నట్లు బయటకు రావడంతో హైకమాండ్ నివారణ చర్యలు చేపడుతోంది.

**మంత్రి కొడుకు టికెట్ రగడ**

నగరంలోని ఓ మంత్రి కొడుకు చామరాజనగరలో టికెట్ కావాలని కోరినట్లు తెలిసింది. అయితే ఒకే కుటుంబంలో ఇద్దరికి టికెట్‌లు కష్టసాధ్యమని నాయకత్వం వెల్లడించింది. దీంతో అలిగిన ఆ మంత్రి కుమారుని రాజకీయ భవిష్యత్ కోసం హస్తం వైపు చూస్తున్నారని ఊహాగానాలు వెలువడ్డాయి. ఆ మంత్రిని సీఎం బొమ్మై, సహచర మంత్రులు బుజ్జగింపు మాటలు చెప్పారు. ఆ మంత్రిని పార్టీలో చేర్చుకోవాలని కేపీసీసీ నేత డీకేశి ప్రయత్నాలు చేయగా, కొందరు సీనియర్లు వ్యతిరేకించినట్ల సమాచారం.

## క్లుప్తంగా

### పథకాల లబ్ధి పొందాలి

రాయచూరు రూరల్: సమాజంలో దివ్యాంగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందాలని బీహెచ్ఈఎల్ కంపెనీ మేనేజర్ ఆర్పీ మోహన్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం వ్యవసాయ వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంపెనీలు ఉచితంగా అందించే దివ్యాంగ పరికరాలను ఉపయోగించుకుని ఆరోగ్య పరంగా అభివృద్ధి చెందాలన్నారు. జిల్లాలో 19,100 మంది దివ్యాంగులున్నారన్నారు. సమావేశంలో జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, జెడ్పీ సీఈఓ శశిధర్, డీడీపీఐ వృషబేంద్రయ్య, వ్యవసాయ శాఖాధికారిణి దేవిక, ఆరోగ్య అధికారి సురేంద్రబాబు, మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి చేతన్ కుమార్‌లున్నారు.

### వేడుకలకు వెళ్లి అనుమానాస్పద మృతి

మైసూరు: యువకుడు ఒకరు అనుమానస్పద మృతి చెందిన సంఘటన మైసూరు జిల్లాలోని హుణసూరు తాలూకాలోని కట్టెమళలవాడి గ్రామంలో చోటు చేసుకుంది. వినయ్ (22) రెండు రోజుల క్రితం చిలకుంద గ్రామంలో బంధువుల ఇంటిలో పుట్టినరోజు వేడుకలకు తల్లి వద్ద నుంచి రూ. వెయ్యి తీసుకుని వెళ్లాడు. సోమవారం అర్ధరాత్రి వరకు కూడా మద్యం తాగారు. మంగళవారం ఉదయం ఇంటికి తిరిగి రాకపోవడంతో వెళ్లి గాలించగా మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని ఇంటికి తీసుకుని వచ్చి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా దేహం పైన గాయాలు కనిపించాయి. దీంతో హత్యగా అనుమానించి హుణసూరు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేయంతో వారు వచ్చి పరిశీలించి కేసు నమోదు చేశారు.

### సిడ్నీ ఆటల పోటీల్లో పతకాలు


పతకాలతో బిళియప్ప, మాచమ్మ, బోపయ్య

మైసూరు: ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జరుగుతున్న మాస్టర్ గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో కొడగుకు చెందిన ముగ్గురు క్రీడాకారులు 5 బంగారు పతకాలను గెలుపొందారు. గోణికొప్ప, కదనూరు గ్రామాలకు చెందినవారు పాలెకండ బిళియప్ప, పాలెకండ బోపయ్యలు మాస్టర్ గేమ్స్‌లో నిపుణులు. వీరిద్దరూ అన్నదమ్ములే. బోపయ్య జావెలిన్ త్రో, బిళియప్ప డిస్కస్ త్రోలో ప్రతిభ చూపి పతకాలను పొందారు. మాస్టర్స్ క్రీడా సమాఖ్య సంఘం అధ్యక్షురాలు మారమడ మాచమ్మ కూడా పాల్గొని ఒక మెడల్ సంపాదించారు.

### ఫోన్లో మాట్లాడుతూ యువకుడు మృతి

యశవంతపుర: ఇటీవలి కాలంలో యువకులు, బాలలు గుండెపోటుతో క్షణాల్లో మరణించడం ఆందోళన కలిగిస్తోంది. మొబైల్‌ఫోన్లో మాట్లాడుతుండగా గుండెపోటు వచ్చి యువకుడు మృతి చెందిన ఘటన హాసన్ జిల్లా హొళెనరసిపురలో జరిగింది. కార్యాలయం లేబొట్‌కు చెందిన విరోపాక్ష (37) మంగళవారం ఉదయం అంగడి ముందు నిలబడి ఫోన్లో మాట్లాడుతున్నాడు. అంతలోనే గుండెపోటు వచ్చి అక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

### కళారత్న ప్రశస్తి ప్రదానం


నాగరత్నమ్మను ప్రశస్తితో సత్కరిస్తున్న దృశ్యం

కంప్లి: కళాకారిణి కే.నాగరత్నమ్మ 1978 నుంచి బయలాట రంగస్థలంలో అభినయిస్తూ కళను భావితరాల వారికి గుర్తుండేలా చేయడంలో ప్రముఖ పాత్ర వహించారని సణాపుర వీరభద్రేశ్వర సేవా సమితి ట్రస్ట్ అధ్యక్షులు పీ.మూకయ్య స్వామి తెలిపారు. సణాపురలో ఇటీవల జరిగిన ఉద్భవ వీరభద్రేశ్వర జాతర సందర్భంగా గిరిజా కల్యాణ బయలాట ప్రదర్శన జరిగింది. బయలాటలో పోషించిన పాత్రకు వన్నె తెచ్చారన్నారు. నాగరత్నమ్మ జీవనశ్రేష్ఠకళను గౌరవించి కళారత్న ప్రశస్తితో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ట్రస్ట్ పదాధికారులు పాల్గొన్నారు.

# ఇంటి నుంచే ఓటుకు కసరత్తు

- 80 ఏళ్లు దాటిన వారికి సౌలభ్యం
- రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో శ్రీకారం





సాక్షి బెంగళూరు: ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ ముఖ్యమైనదే. కానీ కాలు కదపలేని వయోవృద్ధులు పోలింగ్ కేంద్రానికి రావాలంటే అనేక ఇబ్బందులు ఉంటాయి. ఈ నేపథ్యంలో 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, పోలింగ్ కేంద్రానికి రాలేని దివ్యాంగులు ఇంటి నుంచి ఓటు వేయవచ్చు. ఓట్ ఫ్రం హోం విధానాన్ని ఈసీ తొలిసారిగా రానున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో అమలు చేయనుంది.

**ఫార్మ్- 12డీ ద్వారా దరఖాస్తు**

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన ఐదు రోజుల్లో ఫార్మ్-12డీ అనే ఒక దరఖాస్తు అందుబాటులో ఉంటుంది. ఈ ఫారం-12డీ అవసరమైన వారు సమాచారం ఇస్తే ఎన్నికల సంఘం బృందాలు నేరుగా ఓటర్ ఇంటికి వెళతాయి. ఈ ఫార్మ్-12డీ ని తీసుకెళ్లి ఓటర్‌కు అందిస్తాయి. 80 ఏళ్ల వయసు దాటి, పోలింగ్ కేంద్రానికి రాలేని వారు ఈ ఫార్మ్-12డీ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు ఈ పూర్తి ప్రక్రియను వీడియో రికార్డు కూడా చేస్తారు. రాష్ట్రంలో 12.15 లక్షల మంది ఓటర్లు 80 ఏళ్ల పైబడిన వారు ఉన్నారు. వీరిలో 16,976 మంది శతాధికులు.

**దివ్యాంగులకు వాహన వసతి**

ఇక దివ్యాంగుల కోసం సక్షమ్ అనే మొబైల్ యాప్‌ను ఎన్నికల సంఘం పరిచయం చేసింది. దివ్యాంగులకు యాప్ సహాయంతో ఇంటి నుంచి పోలింగ్ కేంద్రానికి తిరిగి అక్కడి నుంచి ఇంటికి రవాణా సౌకర్యం లభిస్తుంది. దివ్యాంగులకు వీల్ చైర్, ప్రయారిటీ ఓటింగ్, అంధ ఓటర్ల కోసం బ్రెయిలీ బ్యాలెట్ పేపర్ వంటి సౌకర్యాలను కూడా ఈ ఎన్నికల్లో కల్పించనున్నారు. 5.55 లక్షల మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారు.

# డబుల్ ఇంజిన్ సర్కార్లతోనే ప్రగతి

- రెండో రోజు బీజేపీ విజయసంకల్ప యాత్రకు భారీ స్పందన
- హాజరైన అసోం సీఎం, మాజీ సీఎం, పలువురు మంత్రులు


మంగళవారం బళ్లారి జిల్లాలో చేపట్టిన బీజేపీ విజయ సంకల్పయాత్రలో పాల్గొన్న నేతలు

సాక్షి,బళ్లారి: డబుల్ ఇంజిన్ సర్కార్లతోనే కర్ణాటక ప్రగతి సాధిస్తుందని బీజేపీ నేతలు పేర్కొన్నారు. వారు మంగళవారం జిల్లాలోని కురుగోడు నుంచి చేపట్టిన విజయ సంకల్పయాత్రలో మాట్లాడుతూ మోదీ, బొమ్మై పాలనతో కర్ణాటక అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు వీలైందన్నారు. అన్ని స్థానాల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, మాజీ సీఎం జగదీష్ శెట్టర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నళిన్ కుమార్ కటీల్, మంత్రులు శ్రీరాములు, ఆనంద్‌సింగ్, భగవంత్ ఖూబా, అరవింద లింబావళి, ఎంపీ దేవేంద్రప్ప, ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి, మాజీ ఎంపీలు జే.శాంత, సన్న పక్కీరప్ప, జిల్లా బీజేపీ అధ్యక్షుడు మురహరగౌడ, రాష్ట్ర జవళి నిగమ అధ్యక్షుడు విరుపాక్షిగౌడ, మాజీ ఎమ్మెల్యే టీ.హెచ్ సురేష్‌బాబు, బీజేపీ నాయకులు రామలింగప్ప, కే.ఎస్.అశోక్ పాల్గొన్నారు.

**రోడ్‌షోకు జననీరాజనం**

త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం బీజేపీ చేపట్టిన విజయ సంకల్పయాత్రకు జిల్లాలో రెండో రోజు విశేష స్పందన లభించింది.

**కురుగోడులో..**

కంప్లి: మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు ఆధ్వర్యంలో కురుగోడు పట్టణానికి రాష్ట్ర, జాతీయ నాయకుల రాకకు ఘనస్వాగతం పలికారు. అనంతరం గాదిలింగప్ప దేవస్థానం నుంచి ప్రారంభమైన విజయ సంకల్ప యాత్ర నాడగౌడర సర్కిల్ గుండా దొడ్డబసవేశ్వర దేవస్థానం వరకు సుమారు 2 కిలోమీటర్ల మేర రోడ్ షో అంగరంగ వైభవంగా నిర్వహించారు.

**బీజేపీతోనే సర్వతోముఖాభివృద్ధి**

కేజీఎఫ్ : అన్ని వర్గాల అభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమని రాష్ట్ర ఉన్నత విద్యా శాఖా మంత్రి అశ్వర్థ నారాయణ తెలిపారు. మంగళవారం నగరంలో నిర్వహించిన విజయసంకల్ప యాత్రలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌ను పెంచిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. ఎంపీ మునిస్వామి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని 6 నియోజకవర్గాల్లోను బీజేపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. బెంగళూరు సెంట్రల్ ఎంపీ పీసీ మోహన్, ఎమ్మెల్సీ సీ. నారాయణస్వామి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

### నేడు విజయ సంకల్పయాత్ర

హొసపేటె: నగరంలో బుధవారం విజయసంకల్ప యాత్రను ఘనంగా నిర్వహిస్తున్నట్లు బీజేపీ నేత అనంతపద్మనాభ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. యాత్రలో మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్, మాజీ సీఎం జగదీశ్ శెట్టర్‌తో పాటు పార్టీ నాయకులు పాల్గొంటారన్నారు. కవితా ఈశ్వర్‌సింగ్, అయ్యాళి తిమ్మప్ప, జీవరత్నం, అనురాధ పాల్గొన్నారు.

# ఓరిమితో పోరాటం..మహిళ జన్మ సార్థకం


మాట్లాడుతున్న సీడీపీఓ జలాలప్ప

సిరుగుప్ప: పుట్టినప్పటి నుంచి మరణించే వరకు సమాజంలో ప్రతి దశలో వివక్ష, అసహనం, హింస, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఓర్పు, సహనంతో పోరాడి జీవితాన్ని సరిదిద్దుకునే మహిళ జన్మ సార్థకమని సీడీపీఓ జలాలప్ప తెలిపారు. ఆయన మంగళవారం సీడీపీఓ కార్యాలయ సభాంగణంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం జేఎంఎఫ్‌సీ ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శారద మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా పని చేస్తున్నారన్నారు. టీపీ ఈఓ ఎం.బసప్ప మాట్లాడుతూ మహిళలు తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సహాయక శిశు అభివృద్ధి అధికారి మోహన్ కాళాపుర, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రిమ్స్ డైరెక్టర్‌ను బదిలీ చేయండి

రాయచూరు రూరల్: రాయచూరు వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్) డైరెక్టర్ బసవరాజ్ హీరాపూర్‌ను బదిలీ చేయాలని కర్ణాటక దళిత సంఘర్ష సమితి జిల్లా సంచాలకులు ప్రకాష్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత రైతులకు మందుల కొనుగోలుకు చీటీలు రాసి బయట మందులు దుకాణంలో తీసుకోవాలంటున్నారన్నారు. వివిధ పరీక్షలకు ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపి కమీషన్లు గుంజుతున్న ఆయనను బదిలీ చేయాలని కోరారు.

### సమస్యలు పరిష్కరించాలి

రాయచూరు రూరల్: సాంఘీక సంక్షేమ శాఖలో పని చేసే బిసిఊట కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కర్ణాటక దళిత సంఘర్ష సమితి జిల్లా సంచాలకులు మహదేవప్ప డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలన్నారు. పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు.

### ఎస్ఐపై ఎమ్మెల్యే కుమారుని వీరంగం

- అప్పు విగ్రహావిష్కరణలో అపశ్రుతి

రాయచూరు రూరల్: జిల్లాలోని సింధనూరులో నూతన రంగమందిర ప్రారంభోత్సవంలో అపశ్రుతి దొర్లింది. మంగళవారం టౌన్‌హాల్ సభాంగణంలో పునీత్ రాజకుమార్ విగ్రహ ప్రతిష్టాపన విషయంలో జేడీఎస్ కార్యకర్తలు, పోలీసులు, అభిమానుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే వెంకట్రావ్ నాడగౌడ పుత్రుడు, జేడీఎస్ యువ నేత అభిషేక్ గౌడ ఆధ్వర్యంలో అప్పు అభిమానులు ట్రాక్టర్‌లో ఊరేగిస్తుండగా పోలీసుల అనుమతి లేకుండా విగ్రహ ప్రతిష్టాపనకు అవకాశం లేదని, ర్యాలీ చేపట్టడం తగదని ఎస్ఐ మణికంఠ వారిని చెదరగొట్టడానికి ప్రయత్నిస్తున్న తరుణంలో మాటల మధ్య గొడవ జరిగింది. ఎమ్మెల్యే పుత్రుడు అభిషేక్‌గౌడ ఎస్ఐ మణికంఠపై దాడి చేశారు. వాదోపవాదాల మధ్య కార్యకర్తలు, అభిమానులు పోలీస్ స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు.

# అందరికీ సమన్యాయం అందించాం

- జిల్లా స్థాయి లబ్ధిదారుల సమ్మేళనంలో సీఎం బసవరాజ్ బొమ్మై


ప్రారంభిస్తున్న సీఎం బసవరాజ్ బొమ్మై

గంగావతి: అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేకూర్చేలా పాలన అందించామని రాష్ట్ర ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై పేర్కొన్నారు. ఆయన మంగళవారం అంజనాద్రి బెట్ట వద్ద ప్రభుత్వం విడుదల చేసిన రూ.125 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన నెరవేర్చిన అనంతరం గంగావతి నగర క్రీడామైదానంలో లబ్ధిదారుల జిల్లా స్థాయి సమ్మేళనాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులకు తమ ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించామన్నారు. కోట్లాది రూపాయల ప్రత్యేక నిధులను కేటాయించి ఆర్థికాభివృద్ధికి కృషి చేశామన్నారు. రూ.2 లక్షల బీమా పథకాన్ని అందించేందుకు రూ.180 కోట్ల ప్రీమియాన్ని బీమా పథకానికి చెల్లించామన్నారు. 9 పథకాలను ప్రవేశ పెట్టి తాగునీటి సౌకర్యాన్ని దాదాపు 5 లక్షల ఎకరాలకు పైగా సాగునీరు అందించామని తెలిపారు. యువతకు రూ.5 లక్షల వరకు స్వయం ఉపాధికి రుణాలిచ్చామన్నారు. రైతులకు జీరో వడ్డీతో రుణ మొత్తాన్ని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచామని తెలియజేశారు. లబ్ధిదారులకు నేరుగా ప్రభుత్వ పథకాలను అందజేశామన్నారు. తిరిగి తమ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఓటర్లు సంపూర్ణంగా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మంత్రులు హాలప్ప ఆచార్, ఆనంద్‌సింగ్, మునిరత్న, ఎంపీ కరడి సంగణ్ణ, ఎమ్మెల్యేలు పరణ్ణ మునవళ్లి, బసవరాజ్ ధడేసూగూరు, ఎమ్మెల్సీ హేమలతా నాయక్, టౌన్ ప్లానింగ్ కమిటీ చైర్మన్ రాఘవేంద్ర శెట్టి, డీఐజీ లోకేష్‌కుమార్, జిల్లాధికారి సుందరేశ్‌బాబు, ఎస్పీ యశోద, జెడ్పీ సీఈఓ రాహుల్ రత్నపాండే పాల్గొన్నారు.

### కుంటు మారెమ్మకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

సాక్షి,బళ్లారి: గ్రామీణ నియోజకవర్గంలోని జోళదరాశి సమీపంలో జాతీయ రహదారి పక్కన వెలసిన కుంటు మారెమ్మ ఆలయంలో ఎమ్మెల్యే నాగేంద్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వందలాది మంది అభిమానులు, కార్యకర్తలకు శాకాహార, మాంసాహార విందు భోజనాలు ఏర్పాటు చేశారు. వేలాదిగా జనం తరలిరావడంతో జాతీయ రహదారి వాహనాలతో నిండిపోయింది. ఎమ్మెల్యే నాగేంద్ర మాట్లాడుతూ బాగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని, అందరికీ మంచి జరగాలని తన ఇష్టదైవమైన అమ్మవారి ఆలయంలో పూజలు చేయించానన్నారు. ఏపీ కార్మిక శాఖ మంత్రి జయరాం తనయుడు ఈశ్వర్, సోదరుడు శ్రీనివాసులు, మాజీ మంత్రి అల్లం వీరభద్రప్ప, మాజీ ఎమ్మెల్యే నారా సూర్యనారాయణరెడ్డి, మాజీ జెడ్పీ మెంబర్లు నారా భరత్‌రెడ్డి, అల్లం ప్రశాంత్, కార్పొరేటర్లు, నాగేంద్ర అన్న వెంకటేశులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆధ్యాత్మిక భావనలు అనుసరణీయం


మాట్లాడుతున్న కొట్టూరు బసవలింగ స్వామీజీ

హొసపేటె: ఆధ్యాత్మిక మనోభావాన్ని అలవరచుకొని ఉత్తమ మార్గంలో నడుచుకోవాలని జగద్గురు కొట్టూరు బసవలింగ మహాస్వామీజీ తెలిపారు. సోమవారం రాత్రి జగద్గురు కొట్టూరు స్వామి సంస్థానమఠంలో సర్వధర్మ సమన్వయ మహారథోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన జానపద గీత సంభ్రమ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నగరంలోని జగద్గురు కొట్టూరు స్వామి సంస్థానమఠంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం శ్రీశైల హుద్దార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జానపద పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విరక్తమఠం పంచమసిద్ధలింగ మహాస్వామి, గవిమఠం శాంతవీర స్వామి, గురుపాద దేవరమఠం మల్లికార్జున శివాచార్య మహాస్వామి, కరేగుడ్డ మహాంతలింగ శివాచార్య మహాస్వామి తదితరులు పాల్గొన్నారు.

### మద్యపానం నిషేధించాలి

రాయచూరు రూరల్: రాష్ట్రంలో మద్యపానం నిషేధించాలని మద్య నిషేధ ఆందోళన సమితి జిల్లా సంచాలకురాలు మోక్షమ్మ సూచించారు. మంగళవారం పాత్రికేయుల భవనంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, జేడీఎస్, కాంగ్రెస్ పార్టీలు పేద కుటుంబాలను మద్యానికి బానిసలను చేసి నాశనం చేశాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు మద్యపానం నిషేధిస్తామని హామీనిచ్చే పార్టీలకు ఓట్లు వేయాలన్నారు. ఈ విషయంలో తమ సమితి తరఫున నారీమణులు ఇంటింటికెళ్లి ప్రచారం చేపడుతారన్నారు.

### నకిలీ కులధ్రువీకరణ పత్రంపై కేసు నమోదు


హేమలత

రాయచూరు రూరల్: నగర సభ కౌన్సిలర్ హేమలత కుల ధ్రువీకరణ పత్రంపై మంగళవారం నగరంలోని సదర్ బజార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నకిలీ కులధ్రువీకరణ పత్రాలతో ఎన్నికల్లో పోటీ చేశారని విచారణలో తేలడంతో ఆమె సభ్యత్వం రద్దు చేశారు. 19వ వార్డు సభ్యురాలు హేమలత 2013, 2018ల్లో నగరసభ సభ్యురాలిగా గెలిచారు. 2017లో అధ్యక్ష పదవిని అలంకరించారు. హేమలత తెలంగాణలో క్రిస్టియన్‌గా కులధ్రువీకరణ పత్రాన్ని పొంది రాయచూరులో ఎస్సీగా నగరసభ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందడంపై రాజకీయ ప్రత్యర్థులు ఆమెపై ఫిర్యాదు చేశారు.

### గ్యారెంటీ కార్డుల పంపిణీ

కంప్లి: ఎమ్మిగనూరులో మంగళవారం కాంగ్రెస్ ప్రముఖులు రామసాగర బీ.నారాయణప్ప కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ కార్డులను ఇంటింటా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఈ సందర్భంగా చౌడప్ప, మెట్రి కరిబసప్ప, గాదిలింగప్ప, తిమ్మప్ప, మరిలింగనగౌడ, శ్రీనివాస రెడ్డి, హొసకోటె జగదీష్, ఎం.రాఘవేంద్ర, అల్తాఫ్, నాగరాజ్, శేఖరప్ప, రామాంజిని, కిషోర్, చౌడమ్మ, జడెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కోలారు వార్తలు...

# పాల డెయిరీ భవనం ప్రారంభం


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంజేగౌడ తదితరులు

మాలూరు : మాస్తి గ్రామంలో రూ.1.25 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాన్ని మంగళవారం ఎమ్మెల్యే కెవై నంజేగౌడ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాస్తి ఫిర్కాలోని చిక్కతిరుపతి, టేకంజి, శివారు పట్టణ ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామన్నారు. మాస్తిలో డాక్టర్ మాస్తి వెంకటేష అయ్యంగార్ వసతి నిలయాన్ని రూ.25 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. శివారు పట్టణంలో రూ.10 కోట్ల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా గత ఐదేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టానన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ తనను గెలిపించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. డీసీసీ బ్యాంకు డైరెక్టర్ చెన్నరాయప్ప, డిప్యూటీ మేనేజర్ ఎం.పి.చేతన్, ఏపీఎంసీ మాజీ అధ్యక్షుడు కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు వడ్డీలేని రుణాలు


చెక్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే రూపా తదితరులు

కేజీఎఫ్ : కెంపాపుర వ్యవసాయ సేవా సహకార సంఘం నుంచి వేయి మంది చిన్న, సన్నకారు రైతులకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని సహకార సంఘం కార్యదర్శులకు ఎమ్మెల్యే రూపా శశిధర్ సూచించారు. మంగళవారం కెంపాపుర వ్యవసాయ సేవా సహకార సంఘం నుంచి 38 మంది రైతులకు రూ.52 లక్షల రుణాలను అందించి మాట్లాడారు. భవిష్యత్తులో బ్యాంకు నుంచి ప్రతి రైతుకు రుణాలు అందిస్తామన్నారు. జీపీ అధ్యక్షుడు జయరామరెడ్డి, కార్యదర్శి శ్రీరామరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### సవితా సమాజాభివృద్ధికి శ్రమిస్తా

కోలారు : సవితా సమాజ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ప్రతియేటా రూ.5 లక్షలను ఎమ్మెల్సీ నిధుల నుంచి కేటాయిస్తానని ఎమ్మెల్సీ ఇంచర గోవిందరాజులు తెలిపారు. మంగళవారం నగరంలోని గోల్డెన్ ప్యాలెస్‌లో నిర్వహించిన జేడీఎస్ సవితా సముదాయ సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడారు. తన అవధి ఇంకా మూడేళ్లు ఉందని, మూడేళ్ల ప్రతియేటా రూ.5 లక్షలు ఇస్తానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జేడీఎస్ అభ్యర్థి సీఎంఆర్ శ్రీనాథ్‌ను బలపరచి గెలిపించాలని కోరారు. కోచిముల్ డైరెక్టర్ వడగూరు డీవీ హరీష్, జెడ్పీ మాజీ సభ్యుడు బాలాజీ చెన్నయ్య, సీఎంఆర్ శ్రీనాథ్, బణకనహళ్లి నటరాజ్ పాల్గొన్నారు.

### అక్రమంగా తరలిస్తున్న బెడ్‌షీట్లు స్వాధీనం



బెడ్‌షీట్ల లారీని పట్టుకున్న పోలీసులు

కోలారు : బెంగళూరు నుంచి బంగారుపేటకు అక్రమంగా బెడ్‌షీట్లను తరలిస్తున్న లారీని తాలూకాలోని రామసముద్రం గేట్ వద్ద అడ్డుకున్న పోలీసులు అందులోని 1980 బెడ్‌షీట్లను స్వాధీనం చేసుకున్నారు. బెడ్‌షీట్లు బంగారుపేటలోని శేషు అనే వ్యక్తికి చెందినవని, వీటిని ఎన్నికల సమయంలో ఓటర్లకు పంచడానికి తీసుకు వెళుతున్నట్లు తెలిసింది. వీటి విలువ రూ.5 లక్షలుంటుందని పోలీసులు తెలిపారు. కోలారు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

### కొత్త పింఛన్ పద్ధతికి స్వస్తి పలకాలి

రాయచూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం అమలు చేసే కొత్త పింఛన్ పద్ధతికి స్వస్తి పలకాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి జిల్లాధ్యక్షుడు తాయరాజ్ మాట్లాడారు. పాత పింఛన్ పద్ధతిని కొనసాగించాలని, 17 శాతం వేతనం పెంచాలని, ఏడో వేతన సవరణ చేపట్టాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

### సమయాన్ని వృథా చేయకండి



విద్యార్థులతో మాట్లాడుతున్న దృశ్యం

కోలారు : టెన్త్ పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా శ్రద్ధగా చదవాలని జిల్లా విద్యా పరిశోధన సంస్థ సీనియర్ ఉపన్యాసకుడు బాలాజీ పిలుపునిచ్చారు. మంగళవారం తాలూకాలోని అరాభికొత్తనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల మార్గదర్శనం చేసి మాట్లాడారు. తెల్లవారుజామున 5 గంటలకే లేచి ఏకాగ్రతతో చదివే అలవాటు చేసుకోవాలన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా ఉపాధ్యాయుల వద్ద పరిష్కరించుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీఎన్ ప్రదీప్ కుమార్, ఉపాధ్యాయులు సిద్దేశ్వరి, సీఎల్ శ్రీనివాస్‌లున్నారు.

### పాఠశాలకు మైక్‌సెట్ వితరణ


మైక్‌సెట్‌ను విరాళంగా అందించిన దృశ్యం

శ్రీనివాసపురం : విద్యార్థులు తల్లిదండ్రులపై పూజ్యభావం కలిగి ఉండాలని తాలూకా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు అశ్వర్థ నారాయణ్ తెలిపారు. మంగళవారం తాలూకాలోని రాజకల్లహళ్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మాతృవందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలన్నారు. పెద్ద వారైన తరువాత తల్లిదండ్రులను ప్రేమతో చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. దాత ధర్మేష్ పాఠశాలకు మైక్ సెట్‌ను విరాళంగా అందించారు. కార్యక్రమంలో బీఆర్పీ మల్లికార్జున్, సుబ్రమణి, సీఆర్పీ చంద్రశేఖర్, ఉపాధ్యాయుడు మంజునాథ్ పాల్గొన్నారు.









### వలస పక్షుల రంగనతిట్టు

పక్షి కాశిగా పేరుపొందిన మండ్య జిల్లాలోని రంగనతిట్టులో దేశ విదేశాల నుంచి వచ్చిన వలస పక్షులు కనువిందు చేస్తున్నాయి. రష్యా, యూరప్ దేశాల్లో అతి శీతల వాతావరణాన్ని తట్టుకోలేక వేలాది పక్షులు వలస వస్తుంటాయి. ఇక్కడ కొంత కాలం గడిపి తరువాత తిరిగి వెళ్తాయి. సంతాన వృద్ధి కూడా ఇక్కడే జరుగుతుంది. మంగళవారం పలు జాతులకు చెందిన కొంగలు, పక్షులు ఇలా కెమెరాకు చిక్కాయి. నీటి పాయల మధ్య చేపలను ఆరగిస్తూ, చెట్లపై గూళ్లు కట్టుకుని నివసిస్తున్నాయి. పర్యాటకులు పడవలో విహరిస్తూ పక్షులను వీక్షించారు.

– మండ్య

## క్లుప్తంగా

### కన్నడ పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలు విడుదల చేస్తున్న అతిథులు

బొమ్మనహళ్లి: బెంగళూరు నగర జిల్లా పరిధి ఆనేకల్ పట్టణంలో రెండు రోజులపాటు నిర్వహించిన గీతోత్సవం-2023వ వేడుకల్లో భాగంగా మంగళవారం చివరి రోజు కన్నడ రచయిత్రి జంబె హెచ్.ఎస్. భాగ్యలక్ష్మి రచించిన జగత్ సారథి శ్రీకృష్ణ, సహోదరియుల సేడు అనే పుస్తకాలను విడుదల చేశారు. ఈ పుస్తకాలను సరిహద్దు ప్రాధికార అధ్యక్షుడు డాక్టర్.సి. సోమశేఖర్, సమ్మేళనం అధ్యక్షుడు ఎన్.ఎస్. ప్రసాద్, పరిషత్ అధ్యక్షుడు వై.కే. ముద్దు కృష్ణ, గాయకుడు శ్రీనివాస్ ఉడుప పాల్గొని విడుదల చేశారు.

### ధార్మిక బృందం సభ్యులకు సన్మానం



సన్మానించిన దృశ్యం

బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి వార్డు యోగా భవనంలో ప్రతివారం నిర్వహించే ధార్మిక కార్యక్రమాలతో పాటు శుభకార్యాలు, ఆలయాలు, ధార్మిక కార్యక్రమాల్లో తమ భక్తి గీతాలతో ఆకట్టుకునే మహిళా బృంద సభ్యులకు మంగళవారం బొమ్మనహళ్లి బీజేపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ మంజునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ ఎం.సతీష్ రెడ్డి పాల్గొని మహిళలకు పసుపు కుంకుమలను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో మంజునాథ,రెడ్డి, అనిల్ కుమార్, చంద్రారెడ్డి, ఎం.వి.శ్రీనివాస్ గౌడ తదితరులు పాల్గొన్నారు.

### ఫొటోగ్రాఫర్ బసవణ్ణకు రెండు బంగారు పతకాలు


మైసూరు: మైసూరు సీనియర్ పత్రిక ఫొటోగ్రాఫర్, జిల్లా విలేకరుల సంఘం ఉపాధ్యక్షుడు ఎం.ఎస్. బసవణ్ణ (అనురాగ్ బసవ రాజ్) తీసిన వేటాడే చిరుత ఫొటోకు పశ్చిమ బెంగాల్ హెలిస్ సర్క్యూట్, ఫొటోగ్రఫీ సొసైటీ ఆఫ్ అమెరికా సంయుక్తంగా పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఛాయాచిత్ర పోటీలలో రెండు బంగారు పతకాలు, ఒక వెండి పతకం లభించింది. ఈ పోటీలో అమెరికా, ఉక్రెయిన్, హాంకాంగ్, కెనడా, కొరియా, జపాన్, ఇటలీ దేశాలతో పాటు 30కి పైగా దేశాల ఫొటోగ్రాఫర్లు తాము తీసిన ఐదు విభాగాల్లో 3500 పైగా ఛాయాచిత్రాలను ప్రదర్శించారు. ఇందులో వన్యజీవుల విభాగంలో నాగరహోళె అరణ్యంలో పులి అడవి పందిని వేటాడే దృశ్యానికి వెండి పతకం లభించింది.

### యోగి నారాయణ యతీంద్రుల జయంతి



కృష్ణరాజపురం: హొసకోటె పట్టణంలోని తాలూకా కార్యాలయంలో మంగళవారం కాలజ్ఞాని శ్రీయోగి నారాయణ యతీంద్రుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తాలూకా కార్యాలయంలో గ్రేడ్-2 తహసీల్దార్ ప్రభాకర్ వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ, తాలూకా వైద్యాధికారి డాక్టర్ వీణ, పశువైద్యశాఖ అధికారి డాక్టర్ మంజునాథ్, తాలూకా అధికారులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ఇంటింటా ప్రచారం



తుమకూరు: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని తుమకూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఆతీక్ అహ్మద్ ఆధ్వర్యంలో నగరంలోని హెచ్‌ఎంఎస్ షాదీ మహల్ రోడ్డులో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

### రట్టిహళ్లిలో రగడ

యశవంతపుర: సంగొల్లి రాయణ్ణ విగ్రహం ఊరేగింపు విషయంపై రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. హావేరి జిల్లా రట్టిహళ్లిలో మంగళవారం ఊరేగింపుపై గొడవ కారణంగా హిందూ కార్యకర్తల ఇళ్లు, మసీదుపై రాళ్లు విసిరారు. బైక్, ఆటోను ధ్వంసం చేశారు. దీంతో రట్టిహళ్లిలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. రట్టిహళ్లి చుట్టు పక్కల గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఘటనకు సంబంధించి తనకు ఎలాంటి సమాచారం లేదని వ్యవసాయశాఖ మంత్రి బీసీ పాటీల్ తెలిపారు. తప్పు చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు.

# భార్యా కూతుళ్లపై పెట్రోలు పోసి నిప్పు



రామాంజినప్ప దంపతులు, పిల్లలు (ఫైల్)



ఘటన జరిగిన ఇల్లు



సజీవ దహనమైంది ఇక్కడే



- కుటుంబ కలహాలతో ఓ భర్త ఘాతుకం
- భార్య మృతి, పిల్లలకు తీవ్ర గాయాలు
- తుమకూరు జిల్లాలో కిరాతకం

తుమకూరు: అర్ధరాత్రి నిద్రపోతున్న సమయంలో భగభగమంటూ మంటలు. చుట్టూ చీకటి. తలుపు తీసి తప్పించుకుందామంటే బయట తాళం వేసి ఉంది. అటు తల్లి, ఇటు పిల్లలు మంటల్లో కాలిపోతున్నారు. కాపాడుకోవడానికి ఏ దారీ లేకపోయింది. మంటల్లో సమిధలా తల్లి ఆహుతైపోయింది. ఆర్థిక ఇబ్బందుల వల్ల భార్యతో గొడవ పడిన భర్త ఆగ్రహం పట్టలేక భార్య పిల్లలు పడుకొని ఉన్న సమయంలో వారి పైన పెట్రోల్ పోసి నిప్పు పెట్టి ఇంటికి తాళం వేసి పరారయ్యాడు. భార్య అక్కడికక్కడే సజీవ దహనం కాగా, ఆడపిల్లలు తీవ్రగాయాలపాలయ్యారు. ఈ అమానుష సంఘటన తుమకూరు జిల్లాలోని మధుగిరి తాలూకాలోని ముద్దనెరళెకెరె గ్రామంలో జరిగింది.

**భోజనం ముందు గొడవ..**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పుట్టపర్తి జిల్లా హిందూపురం తాలూకా పరిగి మండలం బిసగానపల్లికి చెందిన రామాంజినప్ప సుమారు 15 సంవత్సరాల క్రితం ముద్దనెరళెకెరె గ్రామానికి చెందిన శాంతమ్మను పెళ్లి చేసుకొని ఇక్కడే కాపురం పెట్టాడు. వీరికి 7 నుంచి 12 ఏళ్ల వయసు గల ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఇతడు ట్రాక్టర్, బస్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. 8 నెలల క్రితం స్కూల్ బస్సును ప్రమాదానికి గురి చేయడంతో స్కూల్ యాజమాన్యం అతనికి రెండు నెలల జీతం ఇవ్వలేదు. దాంతో ఆర్థిక ఇబ్బందు పాలైన రామాంజినప్ప ఇంట్లో రోజూ భార్యతో గొడవ పడేవాడు. సోమవారం రాత్రి భోజనం చేయడానికి ముందు రగడ జరిగింది. తరువాత భోజనం తిని పడుకున్నారు.

**అర్ధరాత్రి నిప్పుపెట్టి పరారీ ..**

అర్ధరాత్రి సమయంలో రామాంజినప్ప లేచి పెట్రోల్ తీసుకొని వచ్చి భార్య పిల్లల మీద పోసి నిప్పు అంటించి ఇంటికి తాళం వేసి వెళ్లిపోయాడు. మంటల్లో చిక్కుకుని తల్లీ కూతుళ్లు ఆర్తనాదాలు చేయసాగారు. వారి అరుపులు విన్న చుట్టుపక్కల వారు వచ్చి తాళం పగలగొట్టి నీళ్లు చల్లి మంటలను ఆర్పివేశారు. నలుగురినీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శాంతమ్మ తీవ్రంగా కాలి ప్రాణాలు విడిచింది. ఇద్దరు బాలికలు తమకూరు జిల్లా ఆస్పత్రిలో, మరో బాలిక బెంగళూరు విక్టోరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మిడగెశి పోలీసులు గాలింపు జరిపి కిరాతకుడు రామాంజినప్పను అరెస్టు చేశారు.

### పంచవర్ణాల శోభితం



బొమ్మనహళ్లి: నగరంలోని బన్నేరుఘట్ట రోడ్డు బిళ్లెకహళ్లిలో వెలసిన శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు చేశారు. గురూజీ రవీంద్రనాథ ఆధ్వర్యంలో స్వామివారికి పంచవర్ణాలతో అలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

### మైసూరులో భారీ రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దృశ్యం

మైసూరు: పవర్‌స్టార్ డాక్టర్. పునీత్ రాజ్‌కుమార్ జ్ఞాపకార్థం మైసూరు నగరంలో ఏర్పాటు చేసిన భారీ రక్తదాన శిబిరంలో మంగళవారం 400 మందికి పైగా రక్తదానం చేశారు. ఒంటికొప్పల్, గోకులం యువకుల సంఘం బ్లడ్ ఆన్ కాల్ క్లబ్ మైసూరు, జీవధార రక్తనిధి కేంద్రం, సంయుక్తంగా మైసూరు నగరంలోని ఒంటికొప్పలులో ఉన్న శ్రీరామ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సుమారు 400 మందికి పైగా మంది పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాన శిబిరాన్ని జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ జయంత్ ప్రారంభించారు.

## విజయపుర అభివృద్ధికి కృషి చేస్తాం

విజయపుర (బెంగళూరు గ్రామీణ): విజయపుర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పురసభ నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన విమలా బసవరాజు అన్నారు. మంగళవారం పురసభ సమావేశం హాల్లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఆమె విజయం సాధించారు. ఈ సందర్భంగా విమలా మాట్లాడుతూ...పురసభ సభ్యులు మద్దతుతో అధ్యక్షురాలిగా ఎన్నికయ్యాయని, నగర అభివృద్ధికి పార్టీలకతీతంగా పనిచేస్తానని చెప్పారు.



కొత్త అధ్యక్షురాలు, సభ్యులకు సన్మానం

## ఎమ్మెల్యే నిసర్గపై లోకాయుక్తకు ఫిర్యాదు

దొడ్డబళ్లాపురం: దేవనహళ్లి ఎమ్మెల్యే నిసర్గ నారాయణస్వామి, ఐదుగురు అధికారులపై సామాజిక కార్యకర్త జగదీష్ లోకాయుక్తకు ఫిర్యాదు చేసాడు. 7వ వేతన కమిషన్ చేసిన సిఫారసును అమలు చేయాలని డిమాండు చేస్తూ మార్చ్ 1వ తేదీన ప్రభుత్వ ఉద్యోగులు విధులు బహిష్కరించి పోరుబాట పట్టారు. అదే రోజు ఎమ్మెల్యే హోదాలో నిసర్గ నారాయణస్వామి తమ వ్యక్తిగత పని కోసం దేవనహళ్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రవేశించి బయటి నుంచి తాళం వేసుకుని కీలక డాక్యుమెంట్లు దిద్దారని ఫిర్యాదులో ఆరోపించడం జరిగింది. అంతేకాకుండా ఎమ్మెల్యే ప్రభుత్వ భూములు, రాజకాలువలు ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎమ్మెల్యే డీసీ, ఏసీ, సర్వే సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్, దేవనహళ్లి తహసీల్దార్, డెప్యూటీ తహసీల్దార్‌లపై లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు.

### పోటీకి ఎవరు వస్తారో రండి



జ్యోతి వెలిగిస్తున్న దృశ్యం

తుమకూరు: తనపై పోటీకి ఎవరు వచ్చిన భయపడేది లేదని మాజీ డీసీఎం, ఎమ్మెల్యే పరమేశ్వర్ అన్నారు. మంగళవారం తుమకూరు జిల్లా కొరటిగెరె పట్టణంలోని ఓ కల్యాణ మంటపంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులతో పరమేశ్వర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తుమకూరు ఎంపీగా ఐదేళ్లు ఉన్న వారు ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ అవినీతి తాండవిస్తోందని అన్నారు.

### రెండు విడతల్లో పౌర కార్మికులను పర్మినెంట్ చేస్తాం

మైసూరు: రాష్ట్రంలో మొదటి విడతలో నేరుగా జీతం తీసుకుంటున్న దాదాపు 11,133 మంది పౌర కార్మికులను పర్మినెంటు చేయడం కోసం చర్యలు తీసుకుంటామని, రాష్ట్ర సఫాయి కర్మాచారి కమిషన్ అధ్యక్షుడు ఎం.కోటి శివణ్ణ తెలిపారు. మంగళవారం మైసూరు నగరంలోని జిల్లాధికారి కార్యాలయంలో అధికారుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ...రెండవ విడతలో 12,867 మంది పౌర కార్మికులను పర్మినెంట్ చేయడానికి చర్యలు చేపడుతామన్నారు. ఈ విషయంపై ఇప్పటికే ముఖ్యమంత్రితో చర్చలు జరిపామని, అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

### చరిత్రలో కలిసి పోతున్న లక్ష్మీ థియేటర్





కూల్చి వేస్తున్న దృశ్యం

మైసూరు: మల్టీప్లెక్స్‌లు రాజ్యమేలుతున్న తరుణంలో థియేటర్లకు కాలం చెల్లిపోతోంది. దీంతో రాచనగరిలో ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన థియేటర్లు ఒక్కొక్కటిగా కనుమరుగవుతున్నాయి. తాజాగా లక్ష్మీ థియేటర్ వంతు వచ్చింది. ఇప్పటికే శాంతల, నాగరాజు, తిబ్బాదేవి థియేటర్లు కనుమరుగయ్యాయి. ఇప్పుడు లక్ష్మీ థియేటర్ నేలమట్టమవుతోంది. మంగళవారం నుంచి కూల్చివేత పనులు జరుగుతున్నాయి.

### అధికారం బీజేపీదే



ర్యాలీగా వెళుతున్న దృశ్యం

చింతామణి: త్వరలో జరగబోయే శాసనసభ ఎన్నికల్లో బీజేపీ అధిక స్థానాలు కైవసం చేసుకుని అధికారం చేపడుతుందని మంత్రి ఆర్. అశోక్ అన్నారు. చింతామణి పట్టణంలో మంగళవారం విజయ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలు రెండు ఒక్కటేనని, అన్ని రంగాలు అభివృద్ధి చెందాలంటే బీజేపీ ద్వారానే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మంత్రి సుధాకర్, ఎంపీ మునిస్వామి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### డ్రగ్స్ విక్రేతలు అరెస్ట్

శివమొగ్గ: మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ముగ్గురిని సాగర పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం ఉదయం మంగళూరు నుంచి కారులో ఓ వ్యక్తి మత్తు పదార్థాలను తీసుకుని శివమొగ్గ జిల్లా సాగర పట్టణానికి వస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు నిఘా ఉంచి ముగ్గురిని పట్టుకున్నారు. నిందితులు మంగళూరుకు చెందిన సృజన్ శెట్టి, అతని వద్ద నుంచి మత్తు పదార్థాలు తీసుకోవడానికి వచ్చిన సాగర పట్టణానికి చెందిన మహ్మద్, శ్రీధర్ నగరకు చెందిన మహ్మద్ యాసిఫ్‌లుగా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### గుడిసెలు దగ్ధం



తుమకూరు: గుడిసెలకు నిప్పంటుకుని అందులోని వస్తువులు, ధాన్యం పూర్తిగా కాలిపోయిన ఘటన తుమకూరు తాలూకా గుళిగేనహళ్లి సమీపంలో ఉన్న జీవనహళ్లి గ్రామంలో చోటు చేసుకుంది. జనవహళ్లి గ్రామానికి చెందిన మహాలింగప్ప అనే వ్యక్తికి చెందిన గుడిసెలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇంటిలోని వస్తువులు, దుస్తులు, ధాన్యం మొత్తం కాలి బూడిదైంది. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ మంటలతో సమీపంలోని మరో రెండు గుడిసెలు కూడా కాలి బూడిదయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

### జేసీబీతో ఇల్లు కూల్చివేత



కూల్చి వేసిన ఇంటి వద్ద బాధితులు

కృష్ణరాజపురం: బెంగళూరు గ్రామీణ జిల్లా పరిధి హొసకోటె తాలూకా నందగుడి హొబ్లి సమీపంలో ఉన్న హెచ్ క్రాస్ వద్ద ఉన్న చిక్కండళ్ళి గ్రామానికి చెందిన అంజినప్ప అనే వ్యక్తి ఇంటిని వెంకటేశ్ అనే వ్యక్తి జేసీబీతో ధ్వంసం చేశాడు. ఈ ఘటన మంగళవారం జరిగింది. ఇంటిలోని బీరువాలో ఉన్న నగదు, బంగారు కనిపించలేదని బాధితులు వాపోయారు. పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తమవుతోంది. వెంకటేశ్‌పై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

### వక్కలిగలపై బీజేపీ వక్రదృష్టి

దొడ్డబళ్లాపురం: జేడీఎస్ కోట మండ్యలో ప్రధాని నరేంద్రమోదీ రోడ్‌షో చేపట్టాక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి బీజేపీపై వక్కలిగ అస్త్రం ప్రయోగించారు. ఈమేరకు మంగళవారం వరుస ట్వీట్‌లు చేసిన ఆయన చరిత్రను వక్రీకరించి, కపోల కల్పిత పాత్రలు సృష్టించి, మతవిద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల మనసుల్లో విషబీజాలు నాటుతున్న పార్టీ ఏదైనా ఉంటే అది బీజేపీ పార్టీ. ఇప్పుడు వక్కలిగుల చెవిలో పువ్వు పెడుతూ కొత్త అబద్ధాల కథ అల్లుతున్నారని, తద్వారా చరిత్రను, సత్యాన్ని సమాధి చేస్తున్నారన్నారు. టిప్పును చంపారని చెబుతూ చరిత్రలో లేని ఉరిగౌడ, నంజేగౌడ అనే కల్పిత పాత్రలను సృష్టించి ప్రధాని రోడ్‌షో మహాద్వారం వద్ద ఇద్దరి కటౌట్లు పెట్టడం వక్కలిగులకు చేసిన అవమానం అన్నారు.

### కానిస్టేబుల్ సస్పెండ్

బనశంకరి: చోరీకి సహకరించాడనే ఆరోపణలతో బనశంకరి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ యల్లప్ప సస్పెండ్‌కు గురయ్యారు. బనశంకరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీకి పాల్పడిన గ్యాంగ్‌ను పోలీసులు పట్టుకున్నారు. విచారణ సమయంలో కానిస్టేబుల్ యల్లప్ప సహాయం చేశారని గ్యాంగ్ నోరువిప్పారు. ప్రాథమిక విచారణలో కానిస్టేబుల్ పాత్ర పట్ల ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అతన్ని సస్పెండ్ చేశారు.

**హోసూరు వార్తలు..**

## అడవుల్లో జీవులకు నీటి తొట్టెల తోడు



తొట్టీలకు నీరునింపుతున్న అటవీశాఖ సిబ్బంది



దాహం తీర్చుకొంటున్న నెమలి



నీటి తొట్టెల వద్ద అడవి దున్నలు

- సీసీ కెమెరాలతో జంతువుల నమోదు

కెలమంగలం: వేసవికాలం ఎండలు మొదలైన నేపథ్యంలో అటవీప్రాంతంలో వన్య ప్రాణుల దాహం తీర్చేందుకు అటవీ శాఖ చర్యలు చేపట్టింది. హోసూరు అటవీశాఖ డివిజన్‌లోని హోసూరు, రాయకోట, అంచెట్టి, క్రిష్ణగిరి, డెంకణీకోట, తళి, ఉరిగం, జవుళగిరి తదితర అటవీ ప్రాంతాలున్నాయి. ఇందులో వందలాది ఏనుగులు, చిరుతలు, జింకలు, పక్షులు నివసిస్తున్నాయి. ఎండాకాలంలో నీటి కొరత ఉంటుంది కాబట్టి అటవీసిబ్బంది నీటి తొట్టెలను ఏర్పాటు చేసి వన్యప్రాణుల దాహార్తి తీరుస్తున్నారు. తొట్టెలో నీరు అయిపోగానే మళ్లీ ట్యాంకర్లను వేసుకెళ్లి భర్తీ చేస్తారు. వన్యజీవులు నీటి తొట్టెల వద్దకెళ్లి నీటిని తాగి దాహం తీర్చుకొంటున్నాయి. వన్య ప్రాణుల సంచారాన్ని గుర్తించేందుకు అటవీసిబ్బంది ఈ తొట్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నెమలి, ఏనుగులు, అడవి ఎద్దులు, నీల్ గాయ్ వంటి అనేక అడవి జంతువులు ఈ కెమెరాలలో చిక్కాయి.



నీరు తాగుతున్న ఏనుగులు

## పశువు దాడిలో అటవీ ఉద్యోగికి గాయాలు

కెలమంగలం: పశువు దాడిలో అటవీ ఉద్యోగికి తీవ్ర గాయాలేర్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాల మేరకు జవుళగిరి అటవీ ప్రాంతంలోని సావరబత్తం అటవీ ప్రాంతంలో 10 ఏనుగుల మంద మకాం వేశాయి. అటవీశాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ఏనుగుల మందను మళ్లించేందుకు యత్నిస్తుండగా దొడ్డి ప్రాంతానికి చేరుకొన్న ఏనుగుల మంద నుంచి ఓ ఏనుగు విడిపోయి పశువుల కొట్టంపై దాడి చేసింది. కొట్టంలో ఉన్న ఒక పశువు భయపడి పరుగెత్తుకొంటూ వచ్చి ఉద్యోగి సునీల్(25)పై దూసుకెళ్లింది. ఈ ఘటనలో తీవ్రగాయాలేర్పడిన అతన్ని చికిత్స కోసం డెంకణీకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితున్ని అటవీశాఖాధికార్లు పరామర్శించారు.

### భారీగా గుట్కా స్వాధీనం

హోసూరు: నిషేధిత గుట్కా తరలిస్తున్న ఉత్తర భారతీయున్ని సిఫ్‌కాట్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు సోమవారం రాత్రి హోసూరు- బెంగళూరు జాతీయ రహదారి జూజువాడి చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో ఆ మార్గంలో వచ్చిన కారును తనిఖీ చేయగా రూ. 4.21 లక్షల విలువ చేసే గుట్కా బయటపడింది. డ్రైవర్‌ను రాజస్థాన్‌కు చెందిన బలవందరం (23)గా గుర్తించారు. కర్ణాటక నుంచి సేలంకు తరలిస్తున్నట్లు తెలిసింది. నిందితున్ని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

## అధికారులు సహకరించాలి



మాట్లాడుతున్న జౌళి శాఖ మంత్రి ఆర్.గాంధీ, అధికారులు

హోసూరు: జిల్లాలో జరుగుతున్న పథక పనులపై అన్ని శాఖల అధికార్లతో జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టర్ కార్యాలయంలో జౌళి శాఖ మంత్రి ఆర్. గాంధీ సమావేశమయ్యారు. మంత్రి మాట్లాడుతూ క్రిష్ణగిరి జిల్లా అభివృద్ధికి 57 శాఖలకు చెందిన అధికారులు సహకరించాలని, రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ప్రజలకందజేసిన వాగ్దానాలను ముఖ్యమంత్రి పూర్తి చేస్తూ వస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా 318 మంది లబ్ధిదారులకు రూ. 2.2 కోట్ల సంక్షేమ ఫలాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దీపక్‌జేకబ్, ఎమ్మెల్యేలు వై. ప్రకాష్, బర్గూరు మదియళగన్, డీఆర్‌వో రాజేశ్వరి, అదనపు కలెక్టర్ వందనకార్గ్ పాల్గొన్నారు.

### ఏనుగు దాడిలో సీఆర్‌పీఎఫ్ జవాను మృతి



బనశంకరి: అడవి ఏనుగు దాడిలో సీఆర్‌పీఎఫ్ జవాను మృతి చెందిన ఘటన బన్నేరుఘట్ట కగ్గలిపుర మెయిన్‌రోడ్డు సీఆర్‌పీఎఫ్ డాగ్ స్క్వాడ్ కేంద్రం వద్ద సోమవారం ఉదయం జరిగింది. ఈ ఘటనలో యూపీకి చెందిన నారాయణ్ సింగ్ (33) అనే జవాన్ మృతి చెందాడు. సోమవారం ఉదయం సేవా కేంద్రంలో సహచరులతో కలిసి నారాయణసింగ్ వాకింగ్ చేస్తున్న సమయంలో అడవి ఏనుగు దాడి చేసింది. సహచరులు తప్పించుకుని పారిపోగా ఏనుగు నారాయణ్ సింగ్‌పై దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు, అటవీ అధికారులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

క్రిష్ణగిరి: సూళగిరి యూనియన్‌లో పలు అభివృద్ధి పనులకు యూనియన్ చైర్‌పర్సన్ లావణ్యమధు మంగళవారం భూమిపూజ చేశారు. రూ. 20 లక్షలతో యూనియన్‌లోని అత్తిముగం, ఏ.శెట్టిపల్లి, అంకొండపల్లి గ్రామ పంచాయతీల్లో రోడ్లు, డ్రైనేజీల పనులకు నాంది పలికారు. పుష్పా శ్రీనివాస్, చిక్కబ్బయ్య, వెంకటేష్, బాబు, జగదీషన్, భాస్కర్, ఆనంద్ పాల్గొన్నారు.

### ప్లస్‌టూ విద్యార్థిని ఆత్మహత్య

హోసూరు: అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ప్లస్‌టూ విద్యార్థిని ఉరివేసుకొని ప్రాణాలు తీసుకుంది. సింగారపేట సమీపంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన అన్బళగన్ కూతురు అశ్విని (17). అదే ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్లస్‌టూ చదువుతోంది. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈమె పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఫలితం లేకపోవడంతో విరక్తి చెంది సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. సింగారపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

### కరెంటు స్తంభం నుంచి పడి కార్మికుడు మృతి

క్రిష్ణగిరి: మద్యం మత్తులో బ్యానర్ కట్టేందుకు విద్యుత్ స్తంభం ఎక్కిన కూలికార్మికుడు జారిపడి మృతి మృతి చెందాడు. జిల్లా కేంద్రంలోని రైల్వే కాలనీకి చెందిన కార్మికుడు బాలాజీ (24). ఇతనికి తాగుడు అలవాటుంది. సోమవారం సాయంత్రం అదే ప్రాంతంలో బ్యానర్ కట్టేందుకు విద్యుత్ స్తంభం ఎక్కాడు. అదుపు తప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలతో మరణించాడు. పోలీసులు శవాన్ని స్వాధీనపరుచుకొని కేసు నమోదు చేశారు.

### టోల్ వసూలు సరికాదు

మైసూరు: బెంగళూరు-మైసూరు నడుమ పది లేన్ల రోడ్డు పనులు పూర్తి కాకున్నా టోల్ వసూలు చేయడం సరికాదని బీజేపీ మండలి సభ్యుడు హెచ్ విశ్వనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మైసూరు నగరంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ...పదిలేన్ల రోడ్డు నిర్మాణానికి తానే మూల కారణమని ఎంపీ ప్రతాప్ సింహ అంటున్నారని, 2014లో తాను, ధృవనారాయణ ఎంపీలుగా ఉన్నామని, మొదట నాలుగు లేన్ల రోడ్డు ఉండగా ఎస్ఎం కృష్ణ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జాతీయ రహదారిగా ఆమోదం వచ్చిందని, ఇప్పుడు వచ్చిన ఎంపీ ప్రతాప్ సింహకు ఏమి సంబంధం లేదని మండిపడ్డారు.

## క్లుప్తంగా...

### 'కృష్ణా జలాల'పై సుప్రీంలో విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా జలాల పంపకానికి సంబంధించి ట్రిబ్యునల్ ఇచ్చిన అవార్డుపై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఏపీ, కర్ణాటక దాఖలు చేసిన పిటిషన్లు మంగళవారం జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం ముందుకొచ్చాయి. సీజేఐతో చర్చించి తదుపరి విచారణ తేదీని నిర్ణయిస్తామని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. వీలైనంత త్వరగా తేదీని ఖరారు చేయాలని న్యాయవాదులు కోరగా న్యాయమూర్తి అందుకు అంగీకరించారు.

### మనీలాండరింగ్ ద్వారా 'స్కిల్' కుంభకోణం: ఈడీ

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో కుంభకోణంలో రూ.241 కోట్లను షెల్ కంపెనీల ద్వారా కొల్లగొట్టినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నిర్ధారించింది. అందులో రూ.70 కోట్లు ఎక్కడికి చేరాయో గుర్తించినట్టు తెలిపింది. మిగిలిన మొత్తం ఎక్కడికి చేరిందన్న దిశగా దర్యాప్తు కొనసాగిస్తున్నామని పేర్కొంది. మనీలాండరింగ్ చేస్తూ అక్రమాలకు పాల్పడినట్టు తమ విచారణలో వెల్లడైందని ఈడీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టు చేసిన సౌమ్యాద్రి శేఖర్ బోస్ అలియాస్ సుమన్ బోస్ (సీమెన్స్ కంపెనీ మాజీ ఎండీ), వికాస్ ఖన్విల్కర్ (డిజైన్ టెక్ కంపెనీ ఎండీ), ముకుల్‌చంద్ర అగర్వాల్ (స్కిల్లర్ కంపెనీ ప్రతినిధి), సురేశ్ గోయల్(చార్టెడ్ అకౌంటెంట్)లను కోర్టు ఆదేశాలతో విచారణ కోసం ఏడురోజుల కస్టడీకి తీసుకున్నట్టు పేర్కొంది.

### సీబీఐ విచారణకు ఎంపీ అవినాశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కేసు దర్యాప్తులో భాగంగా ఎంపీ అవినాశ్‌రెడ్డి మంగళవారం సీబీఐ విచారణకు హాజరయ్యారు. ఈ మేరకు మంగళవారం ఉదయం సీబీఐ కార్యాలయం లోపలికి వెళ్లిన ఎంపీ మధ్యాహ్నం 3.30 గంటలకు బయటికి వచ్చారు. సీబీఐ ఎస్పీ రాంసింగ్ నేతృత్వంలోని సీబీఐ అధికారుల బృందం ఎంపీని నాలుగు గంటలపాటు ప్రశ్నించింది. న్యాయవాది నాగార్జున సమక్షంలోనే సీబీఐ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది.

### 'జూబ్లీహిల్స్' స్థలంపై స్టేటస్ కో హైకోర్టు ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ స్థల విక్రయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన కేసులో హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలిచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 25కు వాయిదా వేసింది. జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ పరిధిలో ఖాళీగా ఉన్న 595 గజాల స్థలాన్ని సినీ నటుడు చిరంజీవికి విక్రయించడాన్ని సవాల్ చేస్తూ జూబ్లీహిల్స్‌కు చెందిన జంపాల శ్రీకాంత్‌బాబుతో పాటు మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాస్తవంగా ఈ భూమిని జీహెచ్‌ఎంసీకి కేటాయించాల్సి ఉందని.. ఆ మేరకు ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున రోహిత్ పోగుల వాదనలు వినిపించారు. జీహెచ్‌ఎంసీకి కేటాయించాల్సిన భూమిని మేనేజింగ్ కమిటీ ఇతరులకు విక్రయించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. స్టేటస్ కో ఉత్తర్వులు ఇస్తూ, విచారణను వాయిదా వేశారు.

# అవ్వాతాతలకు 3న పింఛన్లు..

▶ మొదటి పేజీ తరువాయి

వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం ప్రజాభ్యుదయానికి దోహదం చేసే పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంది. పలు ముసాయిదా బిల్లులకు ఆమోదం తెలిపింది. ఇటీవల విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు ఘన విజయం వెనుక ముఖ్యమంత్రి జగన్ కృషిని మంత్రివర్గం కొనియాడింది. ప్రభుత్వ విశ్వసనీయత, పనితీరుకు ఈ సదస్సు అద్దం పట్టిందని ప్రశంసించారు. సీఎం జగన్‌ను అభినందిస్తూ రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని హర్షధ్వానాలతో ఆమోదించారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను మంత్రివర్గం అభినందించింది. నూతన పారిశ్రామిక విధానం 2023–27ను కేబినెట్ ఆమోదించింది. మంత్రివర్గ నిర్ణయాలను సమాచార, బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మీడియాకు వెల్లడించారు.



మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- సంక్షేమ వసతి గృహాల్లో (హాస్టళ్లు) విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, వసతుల కల్పన, సూక్ష్మస్థాయిలో పర్యవేక్షణకు అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ల సేవలను మరింత విస్తృతంగా వినియోగించుకోవాలని నిర్ణయం. సంక్షేమ శాఖల్లో ప్రస్తుతం ఉన్న అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్లను (సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్) క్లస్టర్ల వారీగా నియమించేందుకు గ్రీన్ సిగ్నల్. మూడు మండలాలను ఒక క్లస్టర్‌గా నిర్ణయించి ఏడాది కాలపరిమితితో అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ నియామకం ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం.
- ప్రభుత్వ హైస్కూళ్లలో నైట్ వాచ్‌మెన్ల నియామకానికి కేబినెట్ ఆమోదం. మొత్తం 5,388 హైస్కూళ్లలో పేరెంట్స్ కమిటీల ద్వారా వాచ్‌మెన్ల నియామకం. ఒక్కొక్కరికి నెలకు రూ.6 వేల చొప్పున టీఎంఎఫ్ నుంచి గౌరవ వేతనం చెల్లింపు.

## పలు ముసాయిదా బిల్లులకు ఆమోదం

- ఆంధ్రప్రదేశ్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబల్ యాక్ట్ –2019 (యాక్ట్ నెంబర్ 30 ఆఫ్ 2020) సవరణలకు సంబంధించిన డ్రాఫ్ట్ బిల్లుకు కేబినెట్ ఆమోదం.
- ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ సబ్ ప్లాన్ అండ్ ట్రైబల్ సబ్‌ప్లాన్ (ఆర్థిక వనరుల ప్రణాళిక, కేటాయింపు మరియు వినియోగానికి సంబంధించి) యాక్ట్ –2013 సవరణల డ్రాఫ్ట్ బిల్లుకు కేబినెట్ ఆమోదం.
- ఆంధ్రప్రదేశ్ స్టేట్ షెడ్యూల్డ్ క్యాస్ట్ కమిషన్ చైర్మన్, సభ్యుల పదవీకాలానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ స్టేట్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ క్యాస్ట్ యాక్టు 2019 (యాక్టు 9 ఆఫ్ 2021) సవరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం. చైర్మన్, సభ్యుల పదవీకాలాన్ని మూడు సంవత్సరాల నుంచి రెండేళ్లకు మార్పు చేస్తూ తీసుకున్న నిర్ణయానికి కేబినెట్ ఆమోదం. పదవీకాలం ముగిసిన తర్వాత అదనంగా మరో రెండేళ్లు పొడిగించేలా తీసుకున్న నిర్ణయానికి ఆమోదం.
- ఆంధ్రప్రదేశ్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కమిషన్ పదవీ కాలానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ స్టేట్ కమిషన్ ఫర్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ యాక్టు 2019 (యాక్టు 19 ఆఫ్ 2019) సవరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం. కమిషన్ పదవీ కాలాన్ని మూడేళ్ల నుంచి రెండేళ్లకు మార్పు చేస్తూ తీసుకున్న నిర్ణయానికి కేబినెట్ ఆమోదం. పదవీకాలం ముగిసిన తర్వాత అదనంగా మరో రెండేళ్లు పొడిగించేలా మార్పు చేస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోదం.
- ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీస్ కమిషన్ యాక్ట్ 1998 సవరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం. కమిషన్ పదవీ కాలాన్ని మూడేళ్ల నుంచి రెండేళ్లకు మార్పు చేస్తూ తీసుకున్న నిర్ణయానికి కేబినెట్ ఆమోదం. పదవీకాలం ముగిసిన తర్వాత అదనంగా మరో రెండేళ్లు పొడిగించేలా మార్పు చేస్తూ తీసుకున్న నిర్ణయానికి గ్రీన్ సిగ్నల్.
- కేంద్ర ప్రభుత్వ మార్గదర్శక నియమావళిని అనుసరించి వక్ఫ్ రూల్స్ సవరణకు కేబినెట్ ఆమోదం.
- ఏపీ మహిళా కమిషన్ పదవీ కాలానికి సంబంధించి ఏపీ వుమెన్ కమిషన్ యాక్ట్ –1998 సవరణలకు కేబినెట్ ఆమోదం. మహిళా కమిషన్ పదవీ కాలాన్ని ఐదు సంవత్సరాల నుంచి రెండేళ్లకు మార్పు చేస్తూ తీసుకున్న నిర్ణయానికి కేబినెట్ ఆమోదం.
- గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాలు 2022 ఆర్డినెన్స్‌కు బదులుగా ఏపీ గ్రామ సచివాలయం, వార్డు సచివాలయాల 2023 బిల్లు ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం.
- ఏపీ కార్ల్– పులివెందులలో అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ సైన్స్ కళాశాలల ఏర్పాటుకు ఆమోదం.
- ది మిల్క్ ప్రొక్యూర్‌మెంట్ (ప్రొటెక్షన్ ఆఫ్ ఫార్మర్స్) అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సేఫ్టీ ఆఫ్ మిల్క్ స్టాండర్డ్స్ బిల్లు 2023 ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం. బిల్లు ద్వారా పాడి రైతులు, వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడమే లక్ష్యం.
- ఆంధ్రప్రదేశ్ మీడియా అక్రిడిటేషన్ రూల్ 2019కు మార్పులు చేస్తూ సమగ్ర నూతన విధానానికి సంబంధించిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం.
- జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ లైబ్రరీస్ యాక్ట్ 1960 సవరణ. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ లైబ్రరీస్ అమెండ్‌మెంట్ ఆర్డినెన్స్ 2022 ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం.
- ఎయిడెడ్, ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో బోధన, బోధనేతర సిబ్బంది పదవీ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ యాక్ట్ 1982 స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ ఆర్డినెన్స్ 2022 ప్రతిపాదనలకు ఆమోదం.
- ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ డెలివరీ గ్యారంటీ ఆర్డినెన్స్ 2022 స్థానంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ డెలివరీ గ్యారెంటీ బిల్లు 2023కు కేబినెట్ ఆమోదం.
- వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్‌కు నీటి సరఫరా పైప్‌లైన్ కోసం 29.67 ఎకరాలను కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయానికి కేబినెట్ ఆమోదం. దీంతోపాటు నాలుగులైన్ల రహదారి నిర్మాణానికి అవసరమైన 78.46 ఎకరాల భూమిని కూడా కేటాయింపు ప్రతిపాదనలకు ఆమోదం.
- ఆంధ్రప్రదేశ్ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ బిల్లు 2023 ప్రతిపాదనలకు ఆమోదం.
- మున్సిపల్ యాక్ట్ సవరణలకు సంబంధించి అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టేందుకు అవసరమైన సవరణలకు కేబినెట్ ఆమోదం.
- అమలాపురం కేంద్రంగా అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు ప్రతిపాదనకు ఆమోదం. రెండు పట్టణ స్థానిక సంస్థలు, 120 రెవెన్యూ గ్రామాలతో కూడిన 11 మండలాలతో కలిపి మొత్తం 896.16 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఏర్పాటు కానున్న అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ.
- ఏపీ లెజిస్లేచర్ సెక్రటేరియట్‌లో సెక్రటరీ జనరల్ పోస్టు భర్తీకి కేబినెట్ ఆమోదం. లోక్‌సభ, రాజ్యసభలో పదవీ విరమణ చేసిన లేదా ప్రస్తుతం సర్వీసులో ఉన్న సెక్రటరీ జనరల్ ఈ పోస్టుకు అర్హులు.
- అనపర్తి, పిడుగురాళ్ల, మైదుకూరు, మైలవరం, ఉదయగిరి, నిడదవోలు మండలాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ భర్తీకి కేబినెట్ ఆమోదం. 18 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్.
- ఆంధ్రప్రదేశ్ అడ్వొకేట్ వెల్ఫేర్ ఫండ్ యాక్ట్ 1987 సవరణలకు ఆమోదం.
- రిజిస్ట్రేషన్ సేవలకు ఇ–స్టాంపింగ్ విధానాన్ని ప్రవేశపెడుతూ తీసుకున్న నిర్ణయానికి ఆమోదం. తప్పుడు రిజిస్ట్రేషన్లను నివారించేలా రిజిస్ట్రేషన్ యాక్ట్ 1908 సవరణకు కేబినెట్ ఆమోదం.
- ఎక్సైజ్ చట్టం సవరణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్.
- ఆంధ్రప్రదేశ్ చారిటబుల్, హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్స్ యాక్ట్ 1987 ప్రకారం అన్ని దేవస్థానాల బోర్డుల్లో నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని సభ్యుడిగా నియమించాలన్న ప్రతిపాదనకు ఆమోదం. దేవాలయాల్లో క్షురకర్మలు నిర్వహించే నాయీ బ్రాహ్మణులకు నెలకు కనీసం రూ.20 వేలు కచ్చితంగా కమిషన్ అందించాలన్న ప్రతిపాదనలకు ఆమోదం. కనీసం వంద పనిదినాలు నమోదైన వారికి ఇది వర్తింపు.
- పట్టాదార్ పాస్‌బుక్స్ ఆర్డినెన్స్ 2023 సవరణకు కేబినెట్ ఆమోదం.
- ఆంధ్రప్రదేశ్ డాటెడ్ ల్యాండ్స్ (అప్‌డేషన్ ఇన్ రీసెటిల్మెంట్ రిజిస్ట్రేషన్) ఆర్డినెన్స్ 2022లో సవరణలకు కేబినెట్ ఆమోదం.
- మచిలీపట్నంలో 220 గజాల స్థలం మదర్సాకు కేటాయించేందుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్.

### ఆర్‌ఆర్‌ఆర్ బృందానికి అభినందనలు

అంతర్జాతీయంగా ఉర్రూతలూగించిన నాటు.. నాటు పాట ద్వారా ఆస్కార్ అవార్డు సాధించిన 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్ర యూనిట్‌ను మంత్రివర్గం అభినందించింది. సంగీత దర్శకుడు కీరవాణి, గీత రచయిత చంద్రబోస్, దర్శకుడు రాజమౌళి, హీరోలు జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్, నృత్య దర్శకుడు ప్రేమ్ రక్షిత్, గాయకులు రాహుల్ సిప్లిగంజ్, కాలభైరవ బృందానికి కేబినెట్ అభినందనలు తెలియచేసింది.

## ఏపీ ఇన్ పార్లమెంట్

**రాజ్యసభ**

### బల్క్ డ్రగ్ పార్కుకు రూ.వెయ్యి కోట్ల సాయం

#### ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో ఏర్పాటు చేయదలచిన బల్క్ డ్రగ్ పార్కులో ఉమ్మడి మౌలిక వసతుల కల్పన కోసం రూ.1,000 కోట్ల ఆర్థిక సాయానికి ఆమోదం తెలిపినట్టు రసాయన, ఎరువుల శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖుబా తెలిపారు. బల్క్ డ్రగ్ పార్కులో మౌలిక వసతులు కల్పించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంగళవారం లిఖితపూర్వక సమాధానం తెలిపారు. బల్క్ డ్రగ్ పార్కు ద్వారా దేశీయ వినియోగంతోపాటు, ఎగుమతులకు అవసరమైన మందుల తయారీకి అనువైన వాతావరణ పరిస్థితులు కల్పించడమే దీని ఉద్దేశమని మంత్రి వివరించారు.

**కర్నూలు కేన్సర్ ఆస్పత్రికి రూ.72 కోట్లు**

కర్నూలు మెడికల్ కాలేజీలో రాష్ట్ర ప్రభుత్వం రూ.120 కోట్లతో ఏర్పాటు చేస్తున్న కేన్సర్ ఆస్పత్రి నిమిత్తం కేంద్రం రూ.72 కోట్లు ఇస్తున్నట్టు కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ తెలిపారు. విజయసాయిరెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. కర్నూలు కేన్సర్ ఆస్పత్రి కోసం ఇప్పటివరకు రూ.54 కోట్లు అందించామన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌లో సర్జికల్ ఆంకాలజీ, రేడియో థెరపీ సేవలను 2021లోనే ప్రారంభించగా.. ఎయిమ్స్‌లోని మెడికల్, సర్జికల్ స్పెషలిస్టులు అందరూ కేన్సర్‌కు చికిత్స అందిస్తున్నారని వెల్లడించారు.

**5.40 మిలియన్ టన్నుల బొగ్గు దిగుమతి**





వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో దేశీయ బొగ్గు సరఫరా కొరత తీర్చడానికి ఎన్టీపీసీ తన గ్రూపు స్టేషన్ల నిమిత్తం సుమారు 5.40 మిలియన్ టన్నుల బొగ్గును దిగుమతి చేసుకోవాలని యోచిస్తోందని విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. కాగా, వైఎస్సార్‌సీపీ సభ్యుడు పరిమళ్ నత్వానీ ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ సమాధానమిస్తూ.. ఏపీలో అవయవ దానం చేస్తామని ప్రతిజ్ఞ చేసిన 23,555 మంది వివరాలు రిజిస్టర్ అయ్యాయని తెలిపారు.

**లోక్‌సభ**

**ఆ సమాచారం ప్రత్యేకంగా ఉండదు**



కులాంతర వివాహం చేసుకునే వారిపై నేరాలకు సంబంధించి నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వద్ద ప్రత్యేకంగా సమాచారం ఉండదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ అడిగిన ప్రశ్నకు మంగళవారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిస్తూ.. పౌరుల భద్రత, నేరాల నిర్మూలనకు సంబంధించి తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచనలు చేస్తున్నట్లు వివరించారు.

**ఎస్‌హెచ్‌జీల్లో 89.29 లక్షల ఇళ్లు**



ఏపీలో 8,53,122 స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) ఉండగా.. వాటిలోని 89,29,363 మందికి ఇళ్లు ఉన్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు సంజీవ్‌కుమార్ అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన–నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్‌లో భాగంగా 21 ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లు, 34,063 మంది ఉమెన్ ప్రొడ్యూసర్ మెంబర్స్ కూడా ఉన్నారని వివరించారు.

**మత్స్యయోజన కింద రూ.186.59 కోట్లు**





ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై)లో భాగంగా ఏపీకి రూ.186.59 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాలా తెలిపారు. రూ.2121.02 కోట్లు కేటాయించగా.. రూ.544.88 కోట్లు కేంద్ర వాటాలో భాగంగా ఆ మొత్తం విడుదల చేశామని వైఎస్సార్‌సీపీ సభ్యులు చింతా అనూరాధ, మాగుంట శ్రీనివాసులురెడ్డి అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. కాగా, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు గత మూడేళ్లలో రాష్ట్రంలో 120 శిక్షణ కార్యకలాపాలకు నిధులు విడుదల చేసినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.



**విశాఖకు ఎన్‌సీబీ జోనల్ కార్యాలయం**



ఏపీలో నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ)ను పటిష్టం చేయడంలో భాగంగా మధురై జోనల్ కార్యాలయాన్ని విశాఖపట్నానికి తరలించామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

**బ్యాటరీ మార్పు విధానంతో నమ్మకం**





ఎలక్ట్రికల్ వెహికల్స్(ఈవీ)ల్లో బ్యాటరీ మార్పు విధానం వల్ల వినియోగదారుల్లో ఈవీల పట్ల నమ్మకం పెరుగుతుందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి కృషన్‌పాల్ గుర్జర్ తెలిపారు. బ్యాటరీ మార్పిడి సాధారణంగా రెండు వోల్టులు, మూడు వోల్టుల చిన్నవాహనాలకు ఉపయోగిస్తారని వైఎస్సార్‌సీపీ సభ్యులు గోరంట్ల మాధవ్, బీవీ సత్యవతి అడిగిన ప్రశ్నకు ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

# అమిత్ షాతో విజయసాయిరెడ్డి భేటీ



అమిత్ షాతో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి. విజయసాయిరెడ్డి భేటీ అయ్యారు. షాను ఆయన నివాసంలో మంగళవారం రాత్రి కలిసిన విజయసాయిరెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. అంతేకాక.. విభజన చట్టం ప్రకారం ఏపీకి రావాల్సిన నిధులు తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

**వందలాదిమంది కృషి ఫలితమే ఆస్కార్**

ఒక వ్యక్తి లేదా ఇద్దరు వ్యక్తుల వల్ల ఆస్కార్ సాధ్యం కాలేదని.. వందలాదిమంది టెక్నీషియన్లు, ఆర్టిస్టులు, సినిమాకు పనిచేసిన వారి వల్లే సాధ్యమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి చెప్పారు. మన దేశం నుంచి రెండు ఆస్కార్ అవార్డులు గెల్చుకున్న సందర్భంగా వారిని మంగళవారం రాజ్యసభలో ఆయన అభినందించారు. ఆస్కార్ వచ్చిన వారికి అందించే ప్రశంసలు సందర్భానుసారంగా సినిమాకు లేదా డాక్యుమెంటరీకి పనిచేసిన ప్రతి ఒక్కరికీ చెందాలన్నారు. భాషతో సంబంధం లేకుండా, కులమతాలకు అతీతంగా కళాకారులు ప్రతిచోటా ఉన్నారు కాబట్టి.. ఈ ప్రాంతీయ భావాలు లేదా ఉపప్రాంతీయ భావాలు లేదా భాషా భావాలు అభినందించేటప్పుడు ఉండరాదని ఆయన సూచించారు.

**తెలుగువారికి గుర్తింపు: జీ.వి.ఎల్**

'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు లభించడం తెలుగువారికి, తెలుగు సినిమాకు ప్రత్యేక గుర్తింపు అని ఎంపీ జీ.వి.ఎల్.నరసింహారావు అభివర్ణించారు. ఆయన మంగళవారం రాజ్యసభలో మాట్లాడుతూ ఆస్కార్ అవార్డులు భారతీయ సినిమాకు.. ముఖ్యంగా తెలుగువారికి ఒక చారిత్రాత్మక గుర్తింపు అని పేర్కొన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ చిత్రం వాస్తవానికి తెలుగు చిత్రమని, ఆస్కార్ అవార్డు పొందిన 'నాటు నాటు' పాట తెలుగుపాట అని రాజ్యసభ సభ్యులందరికీ గుర్తుచేశారు. ఆస్కార్ గెలుచుకున్న ఆర్‌ఆర్‌ఆర్ టీంను ఎంపీలు కె.కేశవరావు, జయాబచ్చన్, సుధాంశు త్రివేది, మనోజ్‌కుమార్ ఝా సహా పలువురు అభినందించారు.

# ఎర్రకాలువ జలాశయానికి మహర్దశ



- ప్రాజెక్టు ఆధునికీకరణకు ఆదేశం
- రూ.75.80 కోట్లతో ప్రతిపాదనలు

జంగారెడ్డిగూడెం కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయం

జంగారెడ్డిగూడెం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటూ వారికి పెద్ద పీట వేస్తోంది. రైతుకు కావాల్సిన అన్ని రకాల సాగునీటి ప్రాజెక్టులను ఏర్పాటు చేయడమే కాకుండా పాత ప్రాజెక్టులకు మరమ్మతులు చేపట్టింది. ఇందులో భాగంగా జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం కేకేఎం ఎర్రకాలువ జలాశయం ఆధునికీకరణ పనులకు సంబంధించి ప్రతిపాదనలు చేయాలని ప్రభుత్వం ఉన్నతాధికారులను ఆదేశించింది. గత టీడీపీ ప్రభుత్వంలో ఆధునికీకరణ పనులు అటుంచి కనీసం అవసరమైన మరమ్మతులు కూడా చేపట్టలేదు. ఎర్రకాలువ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 4.28 టీఎంసీలుగా నిర్దేశించారు. ప్రాజెక్టు ఆక్రమణలకు గురికావడంతో 3.5 టీఎంసీలకు మించి నిల్వ చేయలేకపోతున్నారు. ఆధునికీకరణ పనుల మరమ్మతులకు తాజాగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**రూ. 75.80 కోట్లతో ప్రతిపాదనలు**

కేకేఎం ఎర్రకాలువ ప్రాజెక్టు ఆధునికీకరణ, మరమ్మతులకు జలవనరుల శాఖాధికారులు రూ.75.80 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. వీటిలో 2018లో తుఫాన్ వల్ల కొట్టుకుపోయిన ప్రధాన కాలువ రిటైనింగ్ వాల్, జనరేటర్లు, ఎర్త్‌డ్యామ్ పటిష్టం, నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు ఎర్త్ డ్యామ్ రోడ్ ఏర్పాటు, భవనాల ఆధునికీకరణకు ప్రతిపాదించారు.

**ప్రతిపాదనలు**

- ఎర్త్‌డ్యామ్, స్పిల్‌వే బలోపేతం చేయడానికి రూ.60 కోట్లతో ప్రతిపాదించారు.
- ప్రాజెక్టు గేట్లు, సాంకేతిక పరికరాలు, మరమ్మతు పనులు, పునరుద్ధరణకు రూ. 43.20 లక్షలు
- 2018లో వరద తాకిడికి కొట్టుకుపోయిన ప్రధాన కాలువ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ. 4.50 కోట్లు
- ప్రాజెక్టు ఎర్త్‌డ్యామ్‌కు లోపలి భాగంలో కాంక్రీట్ వేసేందుకు రూ. 4.21 కోట్లు
- ఎర్త్ డ్యామ్ మరమ్మతులకు రూ.1.39 కోట్లు
- ప్రాజెక్టుకు వరదల సమయంలో వరద ఉధృతిని ఎప్పటికప్పుడు తెలిపేందుకు రిమోట్ వాటర్ లెవల్ సెన్సార్లు అమర్చేందుకు రూ.50 లక్షలతో ప్రతిపాదించారు.
- డ్యామ్ చుట్టూ జంగిల్ క్లియరెన్స్, గ్రావెల్ ఫిల్లింగ్ తదితర పనులకు రూ. 27లక్షలు, డ్యామ్‌కు యాక్సిస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా సీసీ రోడ్డు నిర్మించేందుకు రూ.3 కోట్లు
- ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద ఉన్న భవనాల మరమ్మతులు, ఆధునీకరణకు రూ.5 లక్షలతో ప్రతిపాదనలు
- ప్రాజెక్టు వద్ద కంట్రోల్‌రూమ్ నిర్మాణానికి రూ.20 లక్షలు, ఫెన్సింగ్ ఏర్పాటుకు రూ.30 లక్షలు డ్యామ్ పరిసర ప్రాంతంలో విద్యుదీకరణకు రూ.5 లక్షలు
- ప్రస్తుతం ఉన్న జనరేటర్‌కు అదనంగా స్టాండ్‌బైగా మరో 70 కేవీఏ జనరేటర్ ఏర్పాటుకు రూ.20 లక్షలు కేటాయించారు. అలాగే ఎర్రకాలువ ప్రాజెక్టు ఫోర్‌షోర్ ఏరియా ఆక్రమణలకు గురికావడంతో రీసర్వే చేసి ఆక్రమణలు తొలగించేందుకు రూ. 20 లక్షలతో అంచనా వేశారు.

# బాబు సమర్థుడు

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన మాట్లాడారు. 'తెలుగుదేశం పార్టీతో పొత్తు ఉండాలా లేదా.. అన్న దానిపై ఇంత వరకు మాట్లాడలేదు. మీకు చేతులెత్తి మొక్కుతున్నా. నమ్మండి' అని వ్యాఖ్యానించారు. అదే సమయంలో చంద్రబాబు అంటే తనకు గౌరవం ఉందని, ముఖ్యమంత్రిగా ఆయన సమర్థుడు అంటూ కొనియాడారు. ఈ సభలో పవన్ ఇంకా ఏమన్నారంటే..

**వైసీపీ తొడలు బద్దలు కొడతాం..**

- మీరు పెట్టరు, నన్ను తిననివ్వరు. తెలంగాణలో పోటీ చేస్తానంటే కొంత మంది బీజేపీ నాయకులు నువ్వు ఆంధ్రావాడివి అనడం బాధేసింది. ఆంధ్రా వాళ్ల ఓటు కావాలి కానీ, ఆంధ్రవాళ్లు పోటీ చేయకూడదంటే ఎలా?
- నేను బీజేపీతో పొత్తు పెట్టుకున్నప్పుడు అనుకున్న ప్లాన్ అమలు చేసి ఉంటే ఇప్పుడు టీడీపీ అవసరం లేని స్థాయికి ఎదిగే వాళ్లం. రాష్ట్రంలో లాంగ్ మార్చ్ పెట్టుకుందామంటే ఆ పార్టీ నేతలు ఢిల్లీలో ఒప్పుకొని, రాష్ట్రానికి వచ్చి వద్దన్నారు.
- ఒంటరిగా పోటీ చేసినా కూడా జనసేన గెలుస్తుందని నాకు సంపూర్ణ నమ్మకం వచ్చినప్పుడు అలానే పోటీ చేయడానికి వెనుకాడం. అయితే, అది ఎంత వరకు సాధ్యమన్నది నేను రాష్ట్రమంతటా తిరిగాక తెలుస్తుంది. దమ్ముంటే 175 స్థానాల్లో పోటీ చెయ్యండని వైసీపీ నేతలు మదం ఎక్కి తొడలు కొడుతున్నారు.. వారి రెండు తొడలు బద్దలు కొడతాం.

**ఇంకా కోపం రాకపోతే ఎలా?**

- 'రాష్ట్రంలో అనేక అరాచకాలు జరుగుతుంటే, ఇంకా మీకు కోపం రాకపోతే ఎలా? ఎంత కాలం మా కులం, మా వాడని వదిలేస్తారు.. అపార్ట్‌మెంట్‌లో ఉన్న వారు, డిగ్రీ చేసిన వారు కూడా ఓటును అమ్ముకుంటే మార్పు ఎప్పుడు వస్తుంది?
- చాలా మంది పార్టీ పెట్టి ఏడాది.. రెండు మూడేళ్లలో వదిలేశారు. అలాంటిది రెండు చోట్ల ఓడిపోయి కూడా నేను పదేళ్లుగా రోడ్లపై తిరుగుతున్నా. ఒక రోజు జనసేన ప్రభుత్వాన్ని స్థాపిస్తాం. కాపులు ఎవరూ మా కులం నుంచి ముఖ్యమంత్రి అవ్వలేదు అని అనుకుంటున్నారుగా.. మీరు ఓటేయండి, నేను సీఎం అయి చూపిస్తా.
- రాష్ట్రంలో ఒక కులం పెత్తనం ఆగిపోవాలి. అన్ని పదవులు ఒక సామాజిక వర్గం వారికి ఇస్తే మిగతా కులాల వారు ఏమనుకోవాలి? తెలంగాణ సీఎం నాకు రూ.వెయ్యి కోట్లు ఆఫర్ చేశారంట. ఆ వెయ్యి కోట్లు ఎక్కడ ఉన్నాయని వెతుక్కుంటున్నా. అంతకు ముందు ప్యాకేజీ తీసుకున్నారన్నారు. అప్పుడే చెప్పు చూపించా. ఇంకొకసారి పిచ్చిపిచ్చిగా వాగితే గట్టి దెబ్బ పడుద్ది.

# అది దూషణల సభ

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన ఆరోపించారు. తన పార్టీని అభిమానించే వారందరినీ చంద్రబాబుకు పవన్ ఓటేయమంటున్నారని, చంద్రబాబు మేలు కోసమే పవన్ పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. ఇప్పటం సభకు, మచిలీపట్నం సభకు పెద్ద తేడాలేదని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, తనను, కాపు నాయకులను దూషించడమే పవన్ పని అని ఆయన తేల్చిచెప్పారు. వైఎస్సార్‌సీపీలో ఉన్న కాపు నేతలను అడ్డగోలుగా బూతులు తిట్టడానికే పవన్ సభ పెట్టారని నాని అన్నారు. కాపులను చంద్రబాబు దగ్గర తాకట్టు పెట్టడానికే పవన్ తాపత్రయపడుతున్నారని, పవన్ ఎప్పటికీ మారడని పేర్ని తేల్చిచెప్పారు. సాధారణంగా సినిమాలు ఫ్లాప్ అయితే నష్టాలొస్తాయని.. కానీ, ఫ్లాప్ అయిన సినిమాకు కూడా పవన్‌కు లాభాలొచ్చేది ఈ సభలోనేనన్నారు. ప్యాకేజ్ స్టార్ అంటే పవన్‌కు కోపమొస్తుందని, ఏబీఎన్ రాధాకృష్ణ వెయ్యికోట్ల స్టార్ ప్యాకేజ్ అంటే ఆనందపడుతున్నాడని ఎద్దేవా చేశారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
బుధవారం ॥ 15-3-2023





రమాబాయి లత్‌పతే

**రమాబాయి లత్‌పతే**

**9 గజాల మహారాష్ట్ర నౌవారీ చీరలో 40 దేశాలు బైక్ మీద చుట్టి రావడానికి మార్చి 8న గేట్ వే ఆఫ్ ఇండియా నుంచి బయలుదేరింది. 365 రోజుల పాటు ప్రయాణం సాగించి వచ్చే ఏడాది మార్చి 8కి ముంబై చేరనుంది. 'భారత్ కీ బేటీ' ఏదైనా చేయగలదని నరేంద్ర మోడీ అన్న మాటలే తననీ సాహసయాత్రకు పురిగొల్పాయని చెబుతోంది.**



● భారత్ కీ బేటీ

# చీర కట్టులో బైక్‌పై వరల్డ్ టూర్

బైక్ యాత్రలు చేసిన మహిళలు చాలా మందే ఉన్నారు. కాని చీర మీద బైక్ నడుపుతూ ప్రపంచ దేశాలు చుట్టి రావాలనే కోరిక మాత్రం రమాబాయి లత్‌పతేకే వచ్చింది.

పుణెకు చెందిన రమాబాయి అంట్రప్రెన్యూర్. కాని బైక్ మీద విహారాలు ఆమెకు ఇష్టం. ఆ విహారాల కోసమే ప్రత్యేకమైన బైక్ ఏర్పాటు చేసుకుంది. ఇటీవల 'జీ20' సమ్మిట్‌లో భాగంగా ప్రధాని నరేంద్ర మోడి 'భారతీయ స్త్రీలు అద్భుతమైన విజయాలు సాధిస్తున్నారు' అని చేసిన వ్యాఖ్య రమాబాయి లత్‌పతేను ఇన్‌స్పైయిర్ చేసింది. 'నా డిక్షనరీలో భయం అనే మాటకు విలువ లేదు. బాల్యం నుంచి నేను చాలా ధైర్యంగా నా జీవితంలో ముందుకు సాగాను. ఆ ధైర్యంతోనే ప్రపంచ యాత్ర చేయాలనిపించింది. అయితే ఆ యాత్రలో ఏ దేశంలో అడుగు పెట్టినా నేను 'భారత్ కీ బేటీ' అనిపించుకోవాలంటే మన సాంస్కృతిక చిహ్నమైన చీరలో ఉండటం అవసరం అని భావించాను. మహారాష్ట్ర స్త్రీలు ధరించే 9 గజాల నౌవారి చీర చాలా ప్రసిద్ధం. ఆ చీరలతోనే నా యాత్ర మొత్తం చేస్తాను' అంది రమాబాయి లత్‌పతే.

**మొదలైన యాత్ర**

సాధారణ జనం, మీడియా ఉత్సుకతతో చూస్తుండగా ముంబైలోని గేట్ వే ఆఫ్ ఇండియా నుంచి మార్చి 8న రమాబాయి లత్‌పతే యాత్ర మొదలైంది. ఈ యాత్ర గురించి, అందునా మహారాష్ట్ర సంస్కృతి ప్రాముఖ్యం ఉండటం గురించి తెలుసుకున్న ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఆమె యాత్రను ప్రోత్సహిస్తూ శుభాకాంక్షలు తెలియచేశారు. 'నా మొత్తం యాత్రకు కోటి రూపాయలు అవుతుంది. ఇందుకోసం నాకున్న నగలు, నా ఎస్.యు.వి అమ్మేశాను. కొంత లోటు ఏర్పడింది. నా యాత్రను ప్రోత్సహించేందుకు మనిషికి 1 రూపాయి చొప్పున చందా ఇవ్వాలని అప్పీలు చేశాను. అలా కొంత సాయం వచ్చింది. మంచి పని మొదలెడితే సాయం అదే అందుతుంది' అంది రమాబాయి లత్‌పతే.

**కఠినమైన యాత్ర**

రమాబాయి లత్‌పతే మొత్తం 80 వేల కిలోమీటర్లు ఈ యాత్రలో తన బైక్ మీద తిరగనుంది. నలభై దేశాల వాతావరణాన్ని తట్టుకోవాలి. అతి శీతల, అత్యల్ప ఉష్ణోగ్రతలు భరించాలి. భద్రత ఒక సమస్య. అలాగే ఆహారం కూడా. 'అయినా నేను వెనుకాడను' అని బయలుదేరింది రమాబాయి. ముంబై నుంచి ఆమె ఢిల్లీకి చేరుకున్నాక అక్కడి నుంచి విమానం ద్వారా ఆమె బైక్‌తో పాటుగా ఆస్ట్రేలియా చేరుకుంటుంది. ఆస్ట్రేలియాలో పెర్త్ నుంచి సిడ్నీ వరకు 1600 కిలోమీటర్లు బైక్ మీద ప్రయాణిస్తుంది. కాని ఆ దారిలో జనావాసాలు పెద్దగా ఉండవు. వాతావరణం కూడా కఠినంగా ఉంటుంది. దారి మధ్యలో ఆమె టెంట్ వేసుకుని విడిది చేయక తప్పదు. ఆ ఛాలెంజ్‌ను రమాబాయి పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆస్ట్రేలియా నుంచి ఆక్‌లాండ్ (న్యూజిలాండ్)కు, అక్కడి నుంచి శాంటియాగో (చిలీ), ఆ తర్వాత బొగోటా (కొలంబియా), ఆ తర్వాత అమెరికా అక్కడి నుంచి కెనడాలకు బైక్ మీదే ఆమె ప్రయాణం సాగుతుంది. ఆపై సముద్ర మార్గంలో బైక్‌ను లండన్‌కు చేరవేసి అక్కడి నుంచి తిరిగి బైక్ మీద పోలాండ్, రోమ్, ఫ్రాన్స్, స్పెయిన్, పోర్చుగల్, మొరాకో, టునీషియా, జోర్డాన్... ఇలా ప్రయాణించి మళ్లీ సముద్రం మీదుగా సౌదీ చేరుకుని ఆ ఎడారి దేశాలన్నీ చుట్టి గుజరాత్‌లో ప్రవేశించి వచ్చే ఏడాది మార్చి 8కి గేట్ వే ఆఫ్ ఇండియా చేరుకుంటుంది. ఈ మొత్తం యాత్రలో మిగిలిన దేశాలతోపాటు జి 20 నుంచి 12 దేశాలు ఉంటాయి.

**ప్రయాణాలు చేయండి**

'స్త్రీలు నాలుగు గోడల మధ్య ఉండటం వల్ల ప్రపంచం ఏమీ తెలియదు. ప్రయాణాలకు భయపడాల్సింది లేదు. వీలైనన్ని ప్రయాణాలు చేసి లోకం ఎంత విశాలమో తెలుసుకోండి' అంటోంది రమాబాయి.

---

బ్యూటిప్స్

## ఇంట్లోనే పెడిక్యూర్

అందమైన పాదాల కోసం పార్లర్‌కు వెళ్లలేని వారు ఇంట్లో దొరికే వస్తువులతోనే పెడిక్యూర్ చేసుకోవచ్చు.

గోరువెచ్చని నీటిలో కొంచెం ఉప్పు, హైడ్రోజెన్ పెరాక్సైడ్ లేదా డెటాల్, షాంపూ వేసి, అందులో కనీసం ఇరవై నిమిషాలపాటు పాదాలను ఉంచాలి. తరవాత ప్యూమిక్ స్టోన్ లేదా స్క్రబ్బింగ్ స్టోన్ లేదా బ్రష్‌తో మెల్లగా రుద్దాలి. ఇలా చేయటం వల్ల పాదాల మీద ఉన్న మృతకణాలు తొలగిపోతాయి.

ఆ తరవాత ఒక నిమ్మచెక్క తీసుకుని, దానిమీద కొద్దిగా గ్లిజరిన్ వేసి పాదాలను బాగా రుద్దాక, ఆలివ్ ఆయిల్‌తో కాళ్లకు, పాదాలకు మసాజ్ చేయాలి.

ముల్తానీ మట్టిలో రోజ్‌వాటర్ కలిపి పాదాలకు పూతలా పూసి, పావు గంట తరవాత కడిగి మాయిశ్చరైజర్ రాయాలి. వారానికి మూడు సార్లు ఇలా చేస్తుండటం వల్ల చర్మం మీద మృతకణాలు తొలగిపోయి, మృదువుగా మారతాయి. రోజ్ వాటర్, గ్లిజరిన్ సమపాళ్లలో తీసుకుని పాదాలకు మసాజ్ చేయాలి. మరునాడు గోరువెచ్చటి నీళ్లలో షాంపూ కలిపి కడిగితే, పాదాల మీద మురికి తొలగిపోయి పాదాలు, కాళ్లు మృదువుగా అవుతాయి



---

యూత్ పల్స్

'పలుకే బంగారమాయెనా!' అన్నట్టు నేటి యువతరం తమ సమయంలో అత్యధిక భాగం చాటింగ్‌లోనే గడిపేస్తున్నారు. రాను రాను చాటింగ్‌కు పదాలను ఏరుకోవడం కూడా తక్కువైపోతోంది. పదాల స్థానంలో జిఫ్‌లొచ్చాయి. అంటే విజువల్ లాంగ్వేజ్ అన్నమాట.




# మోర్ కనెక్టివిటీ... మోర్ క్రియేటివిటీ

మనలోని భావాలకు పదాలు అద్దం పడతాయి. ఇప్పుడా పదాలకు 'జిఫ్'లు ప్రత్యామ్నాయంగా మారాయి. అవే మౌనంగా మాట్లాడుతున్నాయి. డిజిటల్ చిట్-చాటింగ్‌లో జిఫ్(జెఫ్,గిఫ్... మొదలైన ఉచ్చారణలు కూడా ఉన్నాయి) ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. భాషా పరిమితులు, స్పీడ్ రెస్పాన్స్ సంగతి పక్కనపెడితే తమను తాము బెటర్‌గా ఎక్స్‌ప్రెస్ చేసుకోవడానికి యువతరం ఉపయోగిస్తున్న డిజిటల్ టూల్స్‌లో 'జిఫ్'లు ఒకటి.

'జిఫ్' ప్లాట్‌ఫామ్ 'టెనర్' నిర్వహించిన సర్వే ప్రకారం యూత్‌లో ఎక్కువ మంది విజువల్ ఎక్స్‌ప్రెషన్స్‌ను ఇష్టపడుతున్నారు. ఏ రకమైన 'జిఫ్'లను యూత్ ఇష్టపడుతున్నారు? అనే కోణంలో 'టెనర్' ఎప్పటికప్పుడు సర్వే చేస్తుంటుంది. ఆహ్లాదం, విషాదంలాంటి భావోద్వేగాల నుంచి దినచర్యకు సంబంధించిన భోజనం, మార్నింగ్‌వాక్, వ్యాయామం....మొదలైన వాటికి సంబంధించి కొత్త 'జిఫ్'లను అందుబాటులోకి తీసుకువస్తుంటుంది.

'జిఫ్'లలో కొందరు యూజర్‌లు తమ ఫేస్‌ను పాప్‌కల్చర్ క్యారెక్టర్‌లకు ఉపయోగించి ఆనందిస్తుంటారు.

'న్యూ ఫామ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్'గా పిలవబడుతున్నప్పటికీ జిఫ్ (గ్రాఫిక్స్ ఇంటర్‌ఛేంజ్ ఫార్మాట్) నిన్నా మొన్నటిదేమీ కాదు. అమెరికాకు చెందిన ఆన్‌లైన్ సర్వీస్ ప్రొవైడర్ 'కంప్యూసర్వ్' బృందం ఈ బిట్‌మ్యాప్ ఇమేజ్ ఫార్మాట్‌ను అప్పుడెప్పుడో డెవలప్ చేసింది.

అయితే ఇది కాలంతో పాటు కొత్త అడుగులు వేసుకుంటూ రావడం వల్ల నిత్యనూతనంగా ఉంటుంది.

విజువల్ లాంగ్వేజ్‌పై యూత్ క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకొని గురుగ్రామ్‌కు చెందిన యువబృందం 'బాబుల్ కీబోర్డ్' యాప్‌ను లాంచ్ చేసింది. దీనికి యువతరం నుంచి అనూహ్యమైన స్పందన లభించింది.

'బాబుల్'లో సైనింగ్ అప్ అయిన తరువాత, యూజర్‌కు సంబంధించిన సెల్ఫీని బాబుల్స్ ఫేస్ రికగ్నైజేషన్ టెక్నాలజీ కార్టూన్ బాబుల్ హెడ్‌గా మారుస్తుంది. యూజర్‌లు 'బాబుల్'లో మెసేజ్ టైప్ చేస్తే చాలు దీనికి దగ్గరగా ఉండే 'జిఫ్'లు కుడివైపు ప్రత్యక్షమవుతాయి.

ఎలెక్స్ చాంగ్ ప్రారంభించిన 'జిపీ' వెబ్‌సైట్ తక్కువ సమయంలోనే యువతకు దగ్గరైంది. 'జిఫ్'లకు సంబంధించిన ఈ మేకింగ్, షేరింగ్ ప్లాట్‌ఫామ్ 'జిపీ కామ్' పేరుతో సెకండ్ అప్లికేషన్‌ను కూడా లాంచ్ చేసింది. 'జిపీ' తరువాత ఇన్‌స్టాగ్రామ్ బృందంలో భాగమైపోయింది.

'బాబుల్', 'జిపీ'లు మాత్రమే కాదు రకరకాల సంభాషణలకు సరిపోయేలా, రకరకాల జిఫ్‌లను పెద్ద సంఖ్యలో తీసుకురావడానికి టెక్ కంపెనీలు కసరత్తులు చేస్తున్నాయి. యూజర్‌లు తమ కామెంట్స్‌కు 'జిఫ్' జతచేసే 'జిఫ్స్ ఫర్ కామెంట్' ఫీచర్‌ను ఫేస్‌బుక్ తీసుకువచ్చింది.

మిలీనియల్స్‌ను దృష్టిలో పెట్టుకొని కామెంట్స్‌కు 'జిఫ్'లను జత చేసే ఫీచర్ తీసుకువచ్చింది ట్విట్టర్. 'జిఫ్' అన్వేషకుల కోసం గూగుల్ కొత్త టూల్స్ తీసుకువచ్చింది. వీటి ద్వారా సెలబ్రిటీల నుంచి మొదలు ఫిక్షనల్ క్యారెక్టర్స్ వరకు, ఎమోషన్ రియాక్షన్‌కు సంబంధించి ఎన్నో రకాల 'జిఫ్'లు యూజర్‌లకు అందుబాటులోకి వచ్చాయి. విజువల్ లాంగ్వేజ్ విషయంలోనే కాదు ఇమెయిల్స్‌ను ఆసక్తికరంగా మార్చడంలోనూ యానిమేటెడ్ జిఫ్స్‌ను ఉపయోగిస్తున్నారు. తమ ఉత్పత్తులకు సంబంధించిన ప్రచారం యువత దృష్టిలో పడేలా 'జిఫ్'ను ఉపయోగించుకుంటున్నాయి చిన్న బడ్జెట్ కంపెనీలు.

కమ్యూనికేషన్‌కు సంబంధించి 'జిఫ్'లను ఉపయోగించడం ఒక కోణం అయితే, మ్యూజిక్‌కు జిఫ్‌లను జత చేయడం మరో కోణం. అమెరికన్ మల్టీ మీడియా ఇన్‌స్టంట్ ప్లాట్‌ఫామ్ 'స్నాప్‌చాట్'లో మ్యూజిక్ జిఫ్‌లు మంచి ఆదరణ పొందాయి.

'హౌ డూ ఐ మేక్ జిఫ్స్?' అనే ప్రశ్నకు 'నేను ఉన్నాను' అంటూ ఎన్నో యాప్‌లు ముందుకు వస్తాయి. 'ఎన్ని ఉన్నాయి?' అనే ప్రశ్న కంటే 'ఎలా ఉపయోగిస్తున్నారు?' అనే ప్రశ్న ముందుకు వచ్చినప్పుడు సంతృప్తికరమైన సమాధానం లభిస్తుంది. 'మోర్ కంఫర్టబుల్' 'మోర్ కనెక్టివిటీ' వరుసలో 'మోర్ క్రియేటివిటీ' కూడా వచ్చి చేరుతుంది.

---

# హస్త కళాకారులకు ఈ-మార్కెట్

**సాధారణంగా చేతివృత్తుల వారు, హస్త కళాకారులు తమ వ్యాపారాన్ని సాంకేతిక పరంగా విస్తరించుకోవడానికి దృష్టి పెట్టరు. ఇక కొండకోనలు, గ్రామీణ కళాకారుల సంగతైతే చెప్పనే అక్కర్లేదు. ఈ విషయాన్ని గమనించిన దివ్యామల్లిక్ కళాకారుల కోసం టైపోఫ్ అనే టెక్ ప్లాట్‌ఫారమ్‌ను ప్రారంభించింది. దీని ద్వారా వ్యాపారంలో ఎక్కువ మంది గ్రామీణ మహిళలు వారి బాధ్యతను వారే తీసుకునేలా సాధికారత కల్పిస్తోంది.**

భువనేశ్వర్‌లో ఉంటున్న దివ్య అక్కడే రెండేళ్ల క్రితం ఈ టెక్ సంస్థను ప్రారంభించింది. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్న దివ్య ఈ రంగంలో ఉన్న కష్టాలను అర్థం చేసుకోవడమూ కష్టమే అంటూ తను చేస్తున్న పనిని వివరిస్తుంది.

"2021, ఫిబ్రవరిలో టైపోఫ్ అనే సంస్థను ప్రారంభించాం. నిజానికి ఈ ప్రాంతం లో చాలా మంది కళాకారులు ఉన్నారు. కానీ, వారి వ్యాపారాన్ని విస్తరించుకోవడం ఎలాగో వారికి తెలియదు. ఇక సాంకేతిక పరిజ్ఞానం నామమాత్రమే. ఇలాంటి చోట మా ప్లాట్‌ఫారమ్ ద్వారా అడుగుపెట్టి వారికి సహాయం చేయగలను అనుకున్నాను.



దివ్యా మల్లిక్

**మొదట 40 మందితోనే ...**

ముందు మా ప్లాట్‌ఫారమ్ ద్వారా బొమ్మలు, చిత్రకళ, ఇతర గృహోపకరణాలు చేసే కళాకారులను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చే ప్రయత్నం చేశాను. కళలను గౌరవించే వ్యక్తిగా, కళాకారులందరినీ కలుసుకునే ప్రయత్నంలో చాలా వెతికాను. మొదట్లో 40 మంది కళాకారులు సంతకం చేయడంతో నమ్మకం వచ్చేసింది. ఆ తర్వాత ఈ మార్కెట్‌లో అపారమైన మార్కెట్ విస్తృతి ఉందని కళాకారులు మెల్ల మెల్లగా గుర్తిస్తున్నారని అర్థమైంది. ఇప్పుడు పదివేల మంది కళాకారులు సాంకేతికంగా మార్కెట్ అవకాశాలు అందుకుంటున్నారు. ఇది నాకు మంచి గుర్తింపు తేవడమే కాదు, దాదాపు పది వేల మందికి వ్యాపారశక్తి కేంద్రంగా మారింది. వారిలో అట్టడుగు స్థాయిలో మార్పు తీసుకురావడానికి ఉపయోగపడటం చాలా ఆనందంగా ఉంది. ఈ కృషికి టెక్నాలజీ సంస్థల నుంచి అవార్డులూ అందుతున్నాయి.

**దూరదృష్టి**

ఎవరైనా సరే జీవితంలో ఏ సమయంలోనైనా ఏదైనా నేర్చుకోవచ్చు. ఈ విషయాన్ని ముందు అందరం అర్థం చేసుకోవాలి. దీనిని మన చుట్టూ ఉన్నవారికి చెప్పాలి. సాధారణంగా మన చుట్టూ ఉన్న వాళ్లే మనకు కొన్ని పరిధులను గీస్తుంటారు. దానికి లోబడే జీవించాలనుకుంటారు. దీనివల్ల చాలా మంది నిరాశకు గురవుతుంటారు. ఈ టెక్నాలజీ ఉపయోగం వల్ల ఎవరు ఎక్కడ నుండైనా, ఎప్పుడైనా తమ మార్కెట్‌ను ప్రారంభించుకోవచ్చు. వారి అభిరుచికి, వయస్సుతో కూడా సంబంధం లేదు. వారి వ్యాపార నమూనా ఏమిటో, వారి దూరదృష్టి స్పష్టంగా ఉంటే చాలు కళ ఎంతదూరమైనా వెళుతుంది. చిన్న లక్ష్యాలైనా సరే గొప్పగా విస్తరిస్తాయి.

మనలో చాలా మంది సరైన సలహాదారులు లేకుండానే ఎదుగుతుంటారు. కానీ, ఇప్పుడు ఈ ఎదుగుదల దేశ సరిహద్దులను దాటుతోంది'' అని ఆనందంగా తెలియజేసే దివ్యమల్లిక్ స్థానికంగానే కాదు దేశవ్యాప్త గ్రామీణకళాకారులను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది.

---

**పరీక్ష తప్పే విద్యార్థులుంటారు, పరీక్షలను తప్పించుకోవడానికి... స్కూలు తప్పించుకునే వాళ్లూ ఉంటారు. ఎన్ని పరీక్షలనైనా తప్పించుకోవచ్చు. కానీ... జీవితం పెట్టే పరీక్ష!!! తప్పించుకోవడం ఎవరి తరమూ కాదు. మాధవిలాగ ప్రతి ఒక్కరూ... తప్పనిసరిగా రాయాల్సిందే. ఉత్తీర్ణత సాధించి తీరాల్సిందే.**



మాధవి

మహిళలకు శిక్షణనిస్తూ...

● సక్సెస్

# జీవిత చక్రం

ఆంధ్రప్రదేశ్, నెల్లూరు జిల్లా, కావలి పట్టణం. పట్టణానికి ఎక్కువ నగరానికి తక్కువ. అరకొర చదువులకు కూడా ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. కానీ జీవితంలో ఎదగాలంటే అవి సరిపోవనుకుంది పొన్నగంటి మాధవి. తనకు తానే ఉపాధి అయింది. బతుకు చక్రాన్ని గాడిలో పెట్టుకుంది. టైలరింగ్ మెషీన్ చక్రం విజయవంతంగా తిరిగింది. తన జీవితాన్ని నిలబెట్టుకుని అంతటితో సంతృప్తి చెంది ఉంటే ఆమె గురించి చెప్పుకోవడానికి పెద్దగా ఏమీ ఉండకపోయేది. వెయ్యి మంది మహిళలకు ఆసరాగా నిలిచిన మాధవి తన ప్రస్థానాన్ని 'సాక్షి'తో పంచుకుంది.

''నేను పుట్టింది కావలిలోనే. నాకు ఏడేళ్ల వయసులో హైదరాబాద్‌కి మారిపోయాం. నాన్న హైదరాబాద్‌లో ఎలక్ట్రికల్ షాప్ నడిపేవాడు. పెళ్లితో మళ్లీ కావలికి వచ్చాను. పెళ్లయిన నాలుగేళ్లకే కుటుంబ భారాన్ని మోయాల్సి వచ్చింది. ఇద్దరు పిల్లలు, అత్తగారు, నేను. ఇంటర్‌తో ఆగిపోయిన నా చదువుకి ఎంతటి ఉద్యోగాలు వస్తాయి? అయితే మా కావలిలో దుస్తుల దుకాణాలు లెక్కలేనన్ని ఉంటాయి. నాలుగైదు నెలలు ఉద్యోగం చేశాను. ఆ తర్వాత కంప్యూటర్స్‌లో ట్యాలీ నేర్చుకుని క్లాత్ ఏజెన్సీలకు అకౌంటెంట్‌గా నాలుగేళ్లు చేశాను. ఇలా సాగుతున్న నా జీవితానికి టర్నింగ్ పాయింట్ మా పాప రూపంలో వచ్చింది.

**నాదా ఉందని గుర్రం**

పెళ్లికి ముందు హైదరాబాద్‌లో ఉన్నప్పుడు మా కాలనీలో టైలరింగ్ నేర్చుకుంటున్న మహిళలు క్లాత్ కట్ చేయడం, కుట్టడం చూసి నేను ఇంట్లో చేత్తో ప్రాక్టీస్ చేసేదాన్ని. ఆ తర్వాత ఇంట్లో ఒక స్టూల్ చాలా బాగుందని మెషీన్ కావాలని అడిగాను. 'నాదా దొరికిందని గుర్రాన్ని కొనడం అంటే ఇదే'నని నవ్వుతూనే కొనిచ్చాడు నాన్న. అప్పుడు సరదాగా కుట్టిన అనుభవం ఉంది. ఆ అనుభవంతో మా పాపకి నేనే స్వయంగా గౌన్‌లు కుట్టేదాన్ని. ఆ గౌన్‌లను స్కూల్ టీచర్‌లు మెచ్చుకుని, నా గురించి వాకబు చేశారు. దాంతో నాకు ధైర్యం వచ్చింది. మగ్గం వర్క్,శారీ రోలింగ్, బంజారా మిర్రర్ వర్క్ నేర్చుకున్నాను. నాకు వచ్చిన పెయింటింగ్‌కి ప్రాక్టీస్‌తో మెరుగులు దిద్దుకున్నాను. పూర్తి స్థాయిలో టైలరింగ్ యూనిట్ పెట్టాను. ఈ రంగంలో మా పనే మాకు పబ్లిసిటీ. మన చేతిలో నైపుణ్యం ఉంటే ఆర్డర్‌లు వాటంతట అవే వస్తాయి. ఇంటి ఖర్చులకు పోగా మిగులు డబ్బు కనిపించడం మొదలైంది. ఇంట్లో ఉండి పని చేసుకునే మహిళలకు పీస్ వర్కులు ఇస్తూ యూనిట్‌ని విస్తరించగలిగాను. నా కష్టానికి ఫలితం దక్కింది. అబ్బాయి బీటెక్ చేసి బెంగళూరులో క్యాప్‌జెమినీలో ఉద్యోగం చేస్తున్నాడు, పాప బీటెక్ చేస్తోంది. నాకోసం కష్టపడ్డానింతవరకు, ఇక నాలాంటి వాళ్ల కోసం పని చేద్దాం అనిపించింది.

> **ఈ రంగంలో మా పనే మాకు పబ్లిసిటీ. మన చేతిలో నైపుణ్యం ఉంటే ఆర్డర్‌లు వాటంతట అవే వస్తాయి.**

**డబ్బున్న వాళ్లకు కాదు!**

టైలరింగ్‌లో మూడు నెలల ఉచిత శిక్షణకు మహిళలను ఎంపిక చేసుకునేటప్పుడు వాళ్ల ఆదాయస్థితిని కచ్చితంగా పట్టించుకుంటాను. భర్త ప్రభుత్వ ఉద్యోగి, వ్యాపారాల్లో బాగా గడిస్తున్న వాళ్లకు ఉచిత శిక్షణ అవసరంలేదనేది నా అభిప్రాయం. మగవాళ్ల దగ్గర ట్రైనింగ్ అంటే... అందరూ ఒకలా ఉండరు, కొంతమంది ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెడతారని చాలామంది చెప్తుంటారు. చాలామంది మహిళలు ట్రైనింగ్ మధ్యలో ఆపేయడానికి ఇలాంటి పైకి చెప్పుకోలేని కారణాలెన్నో. నా దగ్గర పని నేర్చుకుంటున్నప్పుడు చాలామంది వాళ్ల ఇంటి విషయాలు కూడా నాతో పంచుకుంటారు. ఆ మాటల్లో వాళ్ల ఆర్థిక పరిస్థితి అర్థమవుతుంది. అలాంటి వాళ్లకు మాత్రం శిక్షణ పూర్తయిన తర్వాత మెషీన్‌లు ఉచితంగా ఇప్పించే ప్రయత్నం చేస్తున్నాను. నా దగ్గర శిక్షణ తీసుకున్న వెయ్యిమందిలో మెషీన్‌లు అందుకున్న వాళ్లు రెండు వందలకు పైగా ఉన్నారు. అమెరికాలో ఉండే తెలుగువాళ్లు కొంత మంది 'చేతన ఫౌండేషన్' ద్వారా అవసరమైన వారికి సహాయం చేస్తుంటారు. మాకు పెద్ద మొత్తంలో మెషీన్‌లు ఇచ్చింది వాళ్లే. ఇక స్థానికులు కొంతమంది తమ పిల్లల పుట్టినరోజు సందర్భంగా, పెద్ద వాళ్ల గుర్తుగా ఒకటి-రెండు మెషీన్‌లు ఇస్తుంటారు. నాకు వచ్చిన పనిని నలుగురికి నేర్పించాలనే సంకల్పం ఇలా మరింత శక్తిమంతంగా ముందుకుపోతోంది. మహిళలు ఇంట్లో ఉండి పిల్లలను చూసుకుంటూ రోజుకు కనీసంగా ఆరు వందలు సంపాదించుకుంటున్నారు'' అని తన విజయగాథను వివరించారు పొన్నగంటి మాధవి.

– వాకా మంజులారెడ్డి

---

పురస్కారం

# విజ్ఞానజ్యోతి

చిన్నప్పుడు రసాయనశాస్త్ర పుస్తకాన్ని బొమ్మల పుస్తకంలా ఇష్టంగా చదువుకునేది జ్యోతిర్మయి. ఆ ఇష్టమే రసాయనశాస్త్రంలో తన కంటూ గుర్తింపు తెచ్చింది. ఎన్నో అవార్డ్‌లు స్వీకరించేలా చేసింది. తాజాగా ప్రతిష్ఠాత్మకమైన ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ ప్యూర్ అండ్ అప్లైడ్ కెమిస్ట్రీ (ఐయుపీఏసీ-యూఎస్) అవార్డ్‌కు ఎంపికైంది. ఈ అవార్డ్‌కు ఎంపికైన తొలి భారతీయ మహిళగా జ్యోతిర్మయి మొహంతీ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది....

చాలామంది పిల్లలకు లెక్కలు ఎలాగో రసాయనశాస్త్రం అలా. అయితే జ్యోతిర్మయి విషయం వేరు. స్కూల్లో టీచర్, ఇంట్లో నాన్న వల్ల రసాయనశాస్త్రంపై ఆసక్తి పెరిగింది. నాన్న వైకుంఠనాథ్ పిల్లల డాక్టర్. రసాయన శాస్త్రం విషయాలను పాఠంలా కాకుండా ఆట, కథలా ఆసక్తికరంగా చెప్పేవాడు.



జ్యోతిర్మయి మొహంతీ

ముంబై యూనివర్శిటీలో పీహెచ్‌డీ చేసిన జ్యోతిర్మయి భాభా ఆటమిక్ రిసెర్చ్ సెంటర్ (బార్క్)లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించింది. సింథటిక్ మైక్రోసైకిల్స్ నుంచి ఫొటో కెమికల్ ప్రాసెస్ వరకు ఎన్నో విషయాల మీద, ఎన్నో అంతర్జాతీయ జర్నల్స్‌లో పరిశోధనాత్మక వ్యాసాలు రాసింది. సైంటిఫిక్ అండ్ టెక్నికల్ ఎక్సలెన్స్ అవార్డ్, ది కెమికల్ సొసైటీ ఆఫ్ జపాన్ అవార్డ్‌లాంటి ఎన్నో అవార్డ్‌లు అందుకుంది. గత సంవత్సరం రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ (యూకే) అవార్డ్ అందుకుంది.

101 సంవత్సరాల చరిత్ర ఉన్న 'ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ ప్యూర్ అండ్ అప్లైడ్ కెమిస్ట్రీ' అవార్డ్‌కు ఎంపికైన సందర్భంగా తన పుట్టిన ఊరు కటక్, మెట్టిన ఊరు (భర్త రష్మీ రంజన్ మొహంతీ, సైంటిస్ట్) తితిరలోని సామాన్య ప్రజల నుంచి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వరకు జ్యోతిర్మయి మొహంతీని ప్రశంసించారు. శాస్త్రరంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నారు.



## క్వార్టర్ ఫైనల్లో మనిక-సత్యన్ జోడీ పరాజయం

ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) సింగపూర్ స్మాష్ టోర్నీలో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో మనిక బత్రా-సత్యన్ జ్ఞానశేఖరన్ (భారత్) జోడీ 9-11, 9-11, 11-8, 11-5, 7-11తో హినా హయాటా-టొమొకాజు హరిమోటో (జపాన్) ద్వయం చేతిలో ఓడిపోయింది. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో మనిక బత్రా-అర్చన కామత్ (భారత్) జోడీ 2-11, 6-11, 15-13, 12-10, 6-11తో మెంగ్ చెన్-యిది వాంగ్ (చైనా) ద్వయం చేతిలో పరాజయం పాలైంది.



## వన్డే సిరీస్‌కు శ్రేయస్ అయ్యర్ దూరం

ఆస్ట్రేలియా జట్టుతో ఈనెల 17న మొదలుకానున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు భారత బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ వెన్ను నొప్పితో దూరమయ్యాడు. ఆస్ట్రేలియాతో నాలుగో టెస్ట్ సందర్భంగా అయ్యర్‌కు వెన్ను నొప్పి తిరగబెట్టింది. ఈనెల 31న ఆరంభంకానున్న ఐపీఎల్ టోర్నీలో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు అయ్యర్ సారథ్యం వహించాల్సి ఉంది. ఐపీఎల్ టోర్నీ ఆరంభ మ్యాచ్‌లకు కూడా అయ్యర్ అందుబాటులో ఉండటం సందేహంగా మారింది.



# నేటి నుంచి 'పంచ్' సమరం

- మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు రంగం సిద్ధం
- నేడు ప్రారంభోత్సవం
- రేపటి నుంచి బౌట్‌లు
- స్వర్ణ పతక విజేతకు రూ. 82 లక్షలు ప్రైజ్‌మనీ

**న్యూఢిల్లీ:** మూడోసారి ప్రపంచ మహిళల సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల నిర్వహణకు భారత్ సిద్ధమైంది. న్యూఢిల్లీలోని కేడీ జాదవ్ ఇండోర్ స్టేడియంలో ఈ మెగా ఈవెంట్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేడు సాయంత్రం జరిగే ప్రారంభోత్సవానికి కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా విచ్చేస్తారు. గురువారం నుంచి బౌట్‌లు మొదలవుతాయి. 23న సెమీఫైనల్స్ జరుగుతాయి. 24న విశ్రాంతి దినం. 25, 26వ తేదీల్లో జరిగే ఫైనల్స్‌తో టోర్నీ ముగుస్తుంది. గతంలో 2006, 2018లలో భారత్ ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఆతిథ్యమిచ్చింది. మూడోసారీ న్యూఢిల్లీ వేదికగానే ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహిస్తుండటం విశేషం. మొత్తం 12 వెయిట్ కేటగిరీల్లో (48 కేజీలు, 50, 52, 54, 57, 60, 63, 66, 70, 75, 81, ప్లస్ 81 కేజీలు) బౌట్‌లు ఉంటాయి. 65 దేశాల నుంచి 300కుపైగా బాక్సర్లు పతకాల కోసం బరిలోకి దిగనున్నారు. పతక విజేతలకు భారీ మొత్తంలో ప్రైజ్‌మనీ ఇవ్వనున్నారు. స్వర్ణ పతక విజేతకు లక్ష డాలర్లు (రూ. 82 లక్షలు).... రజత పతక విజేతకు 50 వేల డాలర్లు (రూ. 41 లక్షలు), కాంస్య పతక విజేతలకు (ఇద్దరికి) 25 వేల డాలర్ల (రూ. 20 లక్షలు) చొప్పున ప్రైజ్‌మనీ అందజేస్తారు. గత ఏడాది టర్కీలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్ ఒక స్వర్ణం (నిఖత్ జరీన్), రెండు కాంస్య పతకాలు (మనీషా మౌన్, పర్వీన్ హుడా) సాధించింది.

**భారత బాక్సింగ్ జట్టు:** నీతూ ఘణ్‌ఘాస్ (48 కేజీలు), నిఖత్ జరీన్ (50 కేజీలు), సాక్షి చౌదరీ (52 కేజీలు), ప్రీతి (54 కేజీలు), మనీషా మౌన్ (57 కేజీలు), జాస్మిన్ (60 కేజీలు), శశి చోప్రా (63 కేజీలు), మంజు బంబోరియా (66 కేజీలు), సనామాచ చాను (70 కేజీలు), లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు), స్వీటీ బూరా (81 కేజీలు), నుపుర్ షెరాన్ (ప్లస్ 81 కేజీలు).

# ప్లే ఆఫ్స్‌కు ముంబై

- డబ్ల్యూపీఎల్‌లో వరుసగా ఐదో విజయం
- మెరిసిన హర్మన్‌ప్రీత్
- రాణించిన సీవర్, హేలీ
- 55 పరుగులతో ఓడిన గుజరాత్



హర్మన్‌ప్రీత్

**ముంబై:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఓటమెరుగని ముంబై ఇండియన్స్ జట్టు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. మంగళవారం జరిగిన పోరులో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం 55 పరుగుల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై ఘనవిజయం సాధించింది. ముంబైకిది వరుసగా ఐదో విజయం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు నష్టానికి 162 పరుగులు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (30 బంతుల్లో 51; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీ బాదింది. ఓపెనర్ యస్తిక భాటియా (37 బంతుల్లో 44; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా, గుజరాత్ బౌలర్లలో ఆష్లే గార్డ్‌నెర్ 3 వికెట్లు పడగొట్టింది. అనంతరం గుజరాత్ 20 ఓవర్లు ముగిసేసరికి 9 వికెట్లు కోల్పోయి 107 పరుగులే చేయగలిగింది. హర్లీన్ డియోల్ (23 బంతుల్లో 22; 3 ఫోర్లు), కెప్టెన్ స్నేహ్ రాణా (19 బంతుల్లో 20; 3 ఫోర్లు) కష్టంగా రెండు పదుల స్కోరు దాటారు. మిగతావారంతా చేతులెత్తేశారు. నట్ సీవర్ బ్రంట్, హేలీ మాథ్యూస్ చెరో 3 వికెట్లు తీయగా, అమెలియా కెర్‌కు 2 వికెట్లు దక్కాయి. నేడు జరిగే మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తలపడుతుంది.

### స్కోరు వివరాలు

**ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్:** యస్తిక (రనౌట్) 44; హేలీ (సి) డన్‌క్లే (బి) గార్డ్‌నెర్ 0; నట్ సీవర్ (ఎల్బీ) (బి) గార్త్ 36; హర్మన్‌ప్రీత్ (సి) హర్లీన్ (బి) గార్డ్‌నెర్ 51; అమెలియా (సి) గార్త్ (బి) కన్వార్ 19; ఇసి వాంగ్ (సి అండ్ బి) స్నేహ్ రాణా 0; హుమైరా (రనౌట్) 2; ధార (నాటౌట్) 1; అమన్‌జోత్ (సి) డన్‌క్లే (బి) గార్డ్‌నెర్ 0; కలిత (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 7, **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు)** 151. **వికెట్ల పతనం:** 1-1, 2-75, 3-84, 4-135, 5-136, 6-145. **బౌలింగ్:** గార్డ్‌నెర్ 4-0-34-3, కిమ్ గార్త్ 4-0-31-1, స్నేహ్ రాణా 4-0-17-1, తనూజ 4-0-32-1, అనాబెల్ 4-0-42-0.

**గుజరాత్ జెయింట్స్ ఇన్నింగ్స్:** సోఫియా (ఎల్బీ) (బి) నట్ సీవర్ 0; మేఘన (సి) నట్ సీవర్ (బి) హేలీ 16; హర్లీన్ (ఎల్బీ) (బి) వాంగ్ 22; అనాబెల్ (ఎల్బీ) (బి) హేలీ 0; గార్డ్‌నెర్ (సి) కలిత (బి) అమెలియా 8; స్నేహ్ (ఎల్బీ) (బి) నట్ సీవర్ 20; హేమలత (సి) వాంగ్ (బి) అమెలియా 6; సుష్మ (నాటౌట్) 18; గార్త్ (సి) హర్మన్ (బి) నట్ సీవర్ 8; తనూజ (సి) యస్తిక (బి) హేలీ 0; మాన్సి (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు)** 107. **వికెట్ల పతనం:** 1-0, 2-34, 3-34, 4-48, 5-48, 6-57, 7-85, 8-95, 9-96. **బౌలింగ్:** నట్ సీవర్ 4-0-21-3, సయిక 4-0-20-0, ఇసి వాంగ్ 3-0-19-1, హేలీ మాథ్యూస్ 4-0-23-3, అమెలియా కెర్ 4-0-18-2, అమన్‌జోత్ 1-0-6-0.

# లక్ష్య సేన్ శుభారంభం

### తొలి రౌండ్‌లో ఐదో ర్యాంకర్ చౌ తియెన్ చెన్‌పై విజయం



**బర్మింగ్‌హామ్:** ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్స్ లక్ష్య సేన్, హెచ్‌ఎస్ ప్రణయ్ శుభారంభం చేశారు. మంగళవారం మొదలైన ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో పురుషుల సింగిల్స్ విభాగంలో గత ఏడాది రన్నరప్ లక్ష్య సేన్ తొలి రౌండ్‌లో సంచలన విజయం సాధించాడు. ప్రపంచ ఐదో ర్యాంకర్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 19వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21-18, 21-19తో గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. గతంలో చౌ తియెన్ చెన్‌తో ఆడిన రెండుసార్లూ ఓడిపోయిన లక్ష్య సేన్ మూడో ప్రయత్నంలో మాత్రం పైచేయి సాధించాడు. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్, భారత నంబర్‌వన్ హెచ్‌ఎస్ ప్రణయ్ 21-19, 22-20తో జు వె వాంగ్ (చైనీస్ తైపీ)పై విజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు.

## వన్డే సిరీస్‌లోనూ స్మిత్ సారథ్యంలో...



**అహ్మదాబాద్:** భారత జట్టుతో ఈనెల 17న మొదలయ్యే వన్డే సిరీస్‌కు కూడా సీనియర్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ సారథ్యం వహిస్తాడు. రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ తన తల్లి మరణం కారణంగా ఆస్ట్రేలియాలోనే ఉండిపోయాడు. అతని తల్లి మరియా రొమ్ము క్యాన్సర్‌తో చివరిదశలో ఉండటంతో రెండో టెస్టు ముగిసిన వెంటనే కమిన్స్ ఆసీస్‌కు బయల్దేరాడు. గత శుక్రవారం ఆమె తుదిశ్వాస విడువడంతో కమిన్స్ కుటుంబంతోనే ఉండిపోవాల్సి వచ్చిందని వన్డే సిరీస్‌కూ అతను గైర్హాజరీ కానున్నాడని ఆస్ట్రేలియా హెడ్ కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ తెలిపారు. మరోవైపు డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ వన్డే సిరీస్‌లో పాల్గొనేందుకు మళ్లీ భారత్ వస్తున్నాడు. మోచేతి గాయంతో రెండో టెస్టు తర్వాత స్వదేశానికి వెళ్లిపోయాడు.



# బంగ్లాదేశ్ క్లీన్‌స్వీప్

### మూడో టి20లోనూ ఇంగ్లండ్ ఓటమి

**మిర్పూర్:** ప్రపంచ చాంపియన్ ఇంగ్లండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను బంగ్లాదేశ్ క్లీన్‌స్వీప్ చేసింది. మంగళవారం జరిగిన చివరిదైన మూడో టి20 మ్యాచ్‌లో షకీబ్ అల్ హసన్ కెప్టెన్సీలోని బంగ్లాదేశ్ 16 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించి సిరీస్‌ను 3-0తో సొంతం చేసుకుంది. మూడు మ్యాచ్‌ల ద్వైపాక్షిక టి20 సిరీస్‌ను బంగ్లాదేశ్ క్లీన్‌స్వీప్ చేయడం ఇది రెండోసారి మాత్రమే. 2012లో ఐర్లాండ్‌పై బంగ్లాదేశ్ తొలిసారి ఈ ఘనత సాధించింది. బంగ్లాదేశ్-ఇంగ్లండ్ మధ్య ద్వైపాక్షిక టి20 సిరీస్ జరగడం కూడా ఇదే ప్రథమం. మూడో టి20 మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 2 వికెట్లకు 158 పరుగులు సాధించింది. ఓపెనర్ లిటన్ దాస్ (57 బంతుల్లో 73; 10 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేయగా... నజ్ముల్ (36 బంతుల్లో 47 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం 159 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 142 పరుగులు చేసి ఓడిపోయింది. డేవిడ్ మలాన్ (47 బంతుల్లో 53; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), జోస్ బట్లర్ (31 బంతుల్లో 40; 4 ఫోర్లు, 1 సిక్స్) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. లిటన్ దాస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'... నజ్ముల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు లభించాయి.

**2** ఇంగ్లండ్ జట్టు మూడు మ్యాచ్‌ల ద్వైపాక్షిక టి20 సిరీస్‌ను 0-3తో కోల్పోవడం ఇది రెండోసారి మాత్రమే. 2014లో ఆస్ట్రేలియా చేతిలో తొలిసారి ఇంగ్లండ్ 0-3తో చేజార్చుకుంది.

# ఐపీఎల్ కోసం విలియమ్సన్, సౌతీలకు ఊరట

### న్యూజిలాండ్ వన్డే జట్టు నుంచి విడుదల




**వెల్లింగ్టన్:** న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు (ఎన్‌జడ్‌సీ) తమ ప్రధాన క్రికెటర్లు ఐపీఎల్‌లో ఆడేందుకు మార్గం సుగమం చేసింది. శ్రీలంకతో రెండో టెస్టు తదుపరి వన్డే సిరీస్ నుంచి లీగ్ కాంట్రాక్టు దక్కించుకున్న తమ కీలక ఆటగాళ్లను విడుదల చేయనుంది. కేన్ విలియమ్సన్ (గుజరాత్ టైటాన్స్), టిమ్ సౌతీ (కోల్‌కతా నైట్‌రైడర్స్), డెవాన్ కాన్వే, సాన్‌ట్నర్ (చెన్నై సూపర్ కింగ్స్)లు ఆయా ఫ్రాంచైజీలతో జట్టు కట్టేందుకు రిలీజ్ చేయాలని ఎన్‌జడ్‌సీ నిర్ణయించింది. లంకతో ఆఖరి టెస్టు ఆడిన వెంటనే వీళ్లంతా భారత్‌కు బయల్దేరతారు. మరో ముగ్గురు క్రికెటర్లు ఫిన్ అలెన్ (రాయల్ చాలెంజర్స్ బెంగళూరు), ఫెర్గూసన్ (కోల్‌కతా), గ్లెన్ ఫిలిప్స్ (సన్‌రైజర్స్ హైదరాబాద్‌లు)లకు 25న ఆక్లాండ్‌లో జరిగే తొలి వన్డే అనంతరం లీగ్‌లో ఆడేందుకు అనుమతించింది. ఈ సీజన్ ఐపీఎల్ పోటీలు మార్చి 31 నుంచి జరగనున్నాయి. ఈ లీగ్‌కు ముందు న్యూజిలాండ్-శ్రీలంక జట్ల మధ్య 17 నుంచి 21 వరకు చివరిదైన రెండో టెస్ట్ జరుగుతుంది. ఇది ముగియగానే ఈనెల 25, 28, 31 తేదీల్లో మూడు వన్డేల సిరీస్... ఏప్రిల్ 2, 5, 8 తేదీల్లో మూడు టి20ల సిరీస్ జరగనుంది.

## సినిమా



# ఆస్కార్ వీక్షకుల సంఖ్య పెరిగింది

95వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం (భారతీయ కాలమానం ప్రకారం సోమవారం) ముగిసిన విషయం తెలిసిందే. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆస్కార్ వేడుకను ఎక్కువమంది వీక్షించారు. 2021లో తక్కువగా దాదాపు 10 మిలియన్ (కోటి మంది) వ్యూయర్‌షిప్, 2022లో 16.6 మిలియన్ల వ్యూయర్‌షిప్ నమోదు కాగా ఈ ఏడాది వేడుకను 18.7 (కోటీ 87 లక్షలు) మిలియన్ల మంది వీక్షించారు. గత ఏడాదితో పోల్చితే 12 శాతం ఎక్కువ వ్యూయర్‌షిప్ నమోదైంది. అయితే ఆస్కార్ వ్యూయర్‌షిప్ విషయంలో ఇదేం పెద్ద విషయం కాదు. ఎందుకంటే 1998లో జరిగిన ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవాన్ని 57 (5 కోట్ల 70 లక్షలు) మిలియన్ల మంది వీక్షించారు. ఈసారి సోషల్ మీడియాలో కూడా ఆస్కార్ వేడుక టాప్ ట్రెండింగ్‌లోకి వచ్చింది. ఈ వేడుకకు 27.4 (27 కోట్ల 4 లక్షలు) మిలియన్ల ఇంట్రాక్షన్స్ సోషల్ మీడియాలో నమోదయ్యాయని హాలీవుడ్ గణాంకాలు చెబుతున్నాయి. ఇటు టెలివిజన్ వ్యూయర్‌షిప్ రేటింగ్స్ కూడా స్వల్పంగా పెరిగింది. కాగా ఆస్కార్ అవార్డు వేడుక అనంతరం కమిటీ గ్రాండ్‌గా 'ఆఫ్టర్ పార్టీ' నిర్వహించింది. ఈ పార్టీలో ఎన్టీఆర్, రామ్‌చరణ్, ఉపాసన, దీపికా తదితరులు పాల్గొన్నారు.



రాజమౌళి

### రాజమౌళి ఇంట్లో పార్టీ

''మేం కచ్చితంగా ఆస్కార్ గెలుస్తామని ముందు నుంచి యూనిట్ అంతా నమ్మకంగా ఉన్నాం. ఆస్కార్ అందుకోవడమా? లేదా ఆస్కార్ వేదికపై 'నాటు నాటు'ను ప్రదర్శించడమా.. ఈ రెండింటిలో ఏ క్షణాలు అపూర్వమైనవి అని నన్ను అడిగితే... ఎంచుకోవడం నాకు చాలా కష్టం. 'నాటు నాటు' పాటను వేదికపై ప్రదర్శిస్తున్నంతసేపు వీక్షకులు క్లాప్ కొడుతూ, సాంగ్ పూర్తయ్యాక స్టాండింగ్ ఒవేషన్ ఇవ్వడం అనేది నన్ను ప్రపంచంలోనే అత్యున్నత శిఖరంపై నిలబెట్టినట్లయింది. అలాగే ఆస్కార్ అవార్డు ఆయన్ను (కీరవాణిని ఉద్దేశిస్తూ..) కూడా ఆ శిఖరాగ్రాన నిలబెట్టింది'' అని పేర్కొన్న రాజమౌళి ఫుల్ జోష్‌లో ఉన్నారు. ఆ ఆనందంలో లాస్ ఏంజిల్స్‌లోని తన ఇంట్లో 'ఆర్ఆర్ఆర్' టీమ్‌కు గ్రాండ్ పార్టీ ఇచ్చారు రాజమౌళి. ఈ పార్టీని రాజమౌళి భార్య రమ, ఆయన తనయుడు కార్తికేయ హోస్ట్ చేశారు. ఈ పార్టీలో కీరవాణి పియానో ప్లే చేయగా, అక్కడ ఉన్న వారు పాట పాడారు. ఈ సెలబ్రేషన్స్‌ను రామ్‌చరణ్ వీడియో తీశారు. ఈ ఫోటోలను ఉపాసన షేర్ చేయగా వైరల్ అవుతున్నాయి.



రాజమౌళి స్వగృహంలో ఆఫ్టర్ పార్టీలో...




### టాప్‌ప్లేస్‌లో తెలుగు హీరోలు

సోషల్ మీడియా అండ్ న్యూస్ మీడియా ట్రెండ్స్‌ను విశ్లేషించే అమెరికాకి చెందిన నెట్‌బేస్ క్విడ్ కొన్ని గణాంకాలను వెల్లడించింది. ఆ లెక్కల ప్రకారం (వేడుక జరిగిన సమయంలో..) టాప్ మెన్షన్డ్ యాక్టర్స్ జాబితా తొలి స్థానంలో ఎన్టీఆర్ నిలిచారు. ఆ తర్వాతి స్థానాలు వరుసగా రామ్‌చరణ్, కి హుయ్ క్వాన్ (ఉత్తమ సహాయనటుడు), బ్రెండెన్ ఫ్రాసెర్ (ఉత్తమ నటుడు), పెడ్రోపాస్కల్ నిలిచారు. ఇక నటీమణుల విషయానికొస్తే.. మిషెల్ యో (ఉత్తమ నటి) అగ్రస్థానంలో నిలవగా, ఆ తర్వాతి నాలుగు స్థానాల్లో వరుసగా మిచెల్ యో, లేడీ గగా, ఏంజెలా బాసెట్, ఎలిజబెత్ ఒల్సెన్, జామీలీ కర్టిస్ (ఉత్తమ సహాయ నటి) నిలిచారు. కాగా సినిమాల పరంగా తొలి రెండు స్థానాల్లో భారతీయ చిత్రాలు 'రౌద్రం.. రణం.. రుధిరం' (ఆర్ఆర్ఆర్ –ఫీచర్ ఫిల్మ్), 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' (బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్) నిలిచాయి. ఆ తర్వాతి మూడు స్థానాల్లో వరుసగా 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్', 'ఆల్ క్వైట్ ఆన్ ది వెస్ట్రన్ ఫ్రంట్', 'అర్జెంటీనా 1985' చిత్రాలు నిలిచాయి.



ఎన్టీఆర్

రామ్‌చరణ్



ది ఎలిఫెంట్ విస్పరర్స్



లేడీ గగా

### భారతీయుల మనసు గెలిచిన లేడీ గగా

'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ వచ్చిందని ప్రకటించగానే.. రాజమౌళి ఆనందంతో చప్పట్లు కొట్టి, తన భార్య రమను హత్తుకున్నారు. ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లు ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. ఆ సినిమాకి సంబంధించినవారిగా ఆ విధంగా ఆనందపడటం సహజం. అయితే అమెరికన్ సింగర్, సాంగ్ రైటర్, యాక్ట్రెస్ లేడీ గగా చప్పట్లు కొడుతూ తన ఆనందాన్ని వ్యక్తం చేయడం విశేషం. 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో పోటీలో ఉన్న 'నాటు..'తో పాటు 'టాప్‌గన్: మ్యావరిక్' చిత్రం కోసం పాడిన 'హోల్డ్ మై హ్యాండ్' పాటకు లేడీ గగా నామినేషన్ దక్కించుకున్నారు. తన పాటకు కాకుండా 'నాటు..'కు వచ్చినప్పటికీ చప్పట్లతో అభినందించడం ఆమె సంస్కారానికి నిదర్శనం అని నెటిజన్లు అభినందిస్తున్నారు.



నాని

ఎట్లయితే గట్లాయే సూస్కుందాం

బతుకమ్మ పాట వినిపించిన తర్వాత 'వెన్నెలొచ్చిందిరా' అన్న నాని డైలాగ్‌తో మొదలైంది 'దసరా' మూవీ ట్రైలర్. నాని హీరోగా నూతన దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన చిత్రం 'దసరా'. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 'తాగిమర్చిపోవుడు తప్పు కాదు.. తప్పుచేసి మర్చిపోవుడు తప్పు', 'ఎట్లయితే గట్లాయే సూస్కుందాం' అన్న డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఇందులో ధరణిగా నాని, వెన్నెల పాత్రలో కీర్తి సురేశ్ నటించారు.

## కథ బాగుంటే పిల్లల చిత్రాలనూ ఆదరిస్తారు

- 'దిల్' రాజు



'దిల్' రాజు, శివమ్

''లిటిల్ సోల్జర్స్, అంజలి' వంటి పిల్లల సినిమాలంటే నాకు చాలా ఇష్టం. మంచి కథ ఉంటే చిన్న పిల్లలపై సినిమాలు తీస్తే ప్రేక్షకులు ఆదరిస్తారు. 'లిల్లీ' ట్రైలర్ బాగుంది.. సినిమా హిట్ కావాలి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. మాస్టర్ వేదాంత్ వర్మ, మాస్టర్ ప్రణీతా రెడ్డి లీడ్ రోల్స్‌లో రాజ్‌వీర్, నేహా ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'లిల్లీ'. శివమ్ దర్శకత్వంలో కె.బాబురెడ్డి, జి.సతీష్ కుమార్ నిర్మించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ను 'దిల్' రాజు విడుదల చేశారు. కె.బాబురెడ్డి, జి.సతీష్ కుమార్ మాట్లాడుతూ– ''మేం తీసిన తొలి చిత్రం 'లిల్లీ'. తమిళ్‌లో 'రంగోలి' సినిమా చేస్తున్నాం. 'లిల్లీ'ని త్వరలో రిలీజ్ చేస్తాం'' అన్నారు. ''తల్లితండ్రులు తప్పకుండా తమ పిల్లలకు మా 'లిల్లీ' సినిమా చూపించాలి'' అన్నారు శివమ్. నటుడు శివకృష్ణ తదితరులు మాట్లాడారు.

## అదే నాకు పెద్ద ప్రశంస

- ప్రియదర్శి



''నా కెరీర్‌లో 'బలగం' ఓ మైలురాయి. నేను నటించిన సినిమాలు చూసిన మా నాన్నగారు(సుబ్బాచారి) ఎప్పుడూ నన్ను అభినందించలేదు. కానీ, 'బలగం' చూసి నా భుజంపై చేయి వేసి, 'చాలా బాగా చేశావురా' అన్నారు.. అదే నాకు పెద్ద ప్రశంస'' అని నటుడు ప్రియదర్శి అన్నారు. వేణు ఎల్దండి దర్శకత్వంలో ప్రియదర్శి, కావ్యా కల్యాణ్ రామ్, సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'బలగం'. 'దిల్' రాజు ప్రొడక్షన్స్, శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మించిన ఈ మూవీ ఈ నెల 3న విడుదలైంది. ప్రియదర్శి మాట్లాడుతూ– ''బలగం' కి అందరూ కనెక్ట్ అవుతున్నారు. 'చిన్న మనస్పర్థల వల్ల మా అన్న, నేను రెండేళ్లుగా మాట్లాడుకోలేదు.. 'బలగం' చూశాక మా అన్నకి నేనే ఫోన్ చేశాను.. ఇద్దరం మాట్లాడుకున్నాం' అని ఒకతను ఫోన్ చేసి చెప్పడంతో ఎంతో ఆనందం వేసింది. ప్రస్తుతం రెండు మూడు సినిమాల్లో హీరోగా, వేరే హీరోల చిత్రాల్లో ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నాను'' అన్నారు.

## కథ డిమాండ్ మేరకే ఆ సీన్ చేశా

- మాళవిక నాయర్



''ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి' చిత్రంలో అనుపమ పాత్ర చేశాను. నా గత సినిమాలతో పోలిస్తే ఈ పాత్రలో నటనకి ఎంతో ప్రాధాన్యం ఉంది.. నాకు సంతృప్తి ఇచ్చిన పాత్ర ఇది'' అని హీరోయిన్ మాళవికా నాయర్ అన్నారు. నాగశౌర్య హీరోగా శ్రీనివాస్ అవసరాల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. టీజీ విశ్వ ప్రసాద్, పద్మజ దాసరి నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ఈ సినిమా ఈ నెల 17న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కథానాయిక మాళవికా నాయర్ మాట్లాడుతూ– ''మామూలుగా ప్రేమకథలు రెండు మూడేళ్ల వ్యవధిలో జరిగినట్లు చూపిస్తుంటారు. అయితే 'ఫలానా అబ్బాయి..'లో 18 నుంచి 28 ఏళ్ల ప్రయాణం చూపిస్తారు. ఇది రెగ్యులర్ సినిమా కాదు.. ప్రయోగమే.సహజమైన సన్నివేశాలు, సంభాషణలతో స్వచ్ఛమైన వినోదాన్ని పంచబోతున్నాం. కథ డిమాండ్ మేరకే ఈ సినిమాలో ముద్దు సీన్ చేశాను. అవసరాల చాలా సరదాగా ఉంటారు. ఆయన వల్లే నా తెలుగు మెరుగుపడింది. ప్రస్తుతం 'అన్నీ మంచి శకునములే, డెవిల్' సినిమాల్లో నటిస్తున్నాను'' అన్నారు.

## నా నుంచి ఉపేంద్రలాంటి సినిమా ఆశిస్తున్నారు

- ఉపేంద్ర



శ్రియ, ఉపేంద్ర

''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'కబ్జ'. సెంటిమెంట్ కూడా ఉంది. విజువల్ గ్రాండియర్‌గా రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని హీరో ఉపేంద్ర అన్నారు. ఆర్.చంద్రు స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కబ్జ'. ఉపేంద్ర నటించిన తొలి పాన్ ఇండియా మూవీ ఇది. శ్రియా శరణ్ హీరోయిన్. పునీత్ రాజ్‌కుమార్ జయంతి సందర్భంగా ఈ నెల 17న తెలుగు, కన్నడ, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. నిర్మాత ఎన్. సుధాకర్ రెడ్డి సమర్పణలో లక్ష్మీకాంత్ రెడ్డి తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో ఉపేంద్ర మాట్లాడుతూ– ''నా నుంచి 'ఉపేంద్ర' లాంటి సినిమా రావాలని అందరూ ఎదురు చూస్తున్నారు. నేను హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న 'యుఐ' సినిమా 'ఉపేంద్ర' లాగే ఉంటుంది'' అన్నారు. ''కబ్జ' నా మనసుకి ఎంతో దగ్గరైన చిత్రం'' అన్నారు శ్రియ. ''ఉపేంద్రగారి 'బుద్ధిమంతుడు' చిత్రాన్ని తెలుగులో నేనే విడుదల చేశాను. ఇప్పుడు మళ్లీ 'కబ్జ' తో రీ ఎంట్రీ ఇస్తున్నాం'' అన్నారు లక్ష్మీకాంత్ రెడ్డి. చిత్ర సహనిర్మాత 'ఆర్కా' సాయికృష్ణ పాల్గొన్నారు.

## వాస్తవ సంఘటనలతో...



ఆదర్శ్, చిత్రా శుక్లా

ఆదర్శ్, చిత్రా శుక్లా జంటగా ఆంథోని మట్టిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గీత సాక్షిగా'. చేతన్ రాజ్ కథ అందించి, నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ మూవీ ట్రైలర్‌ని దర్శకుడు విజయ్ కనకమేడల, నిర్మాత సతీష్ వేగేశ్న విడుదల చేశారు. ''ఈ మధ్య తెలుగు ప్రేక్షక దేవుళ్లు కంటెంట్ ఉన్న సినిమాలనే ఆదరిస్తున్నారు. అలాంటి వారికి మా 'గీత సాక్షిగా' నచ్చుతుంది'' అన్నారు ఆదర్శ్. ''మహిళా సమస్యలపై రూపొందిన చిత్రం ఇది'' అన్నారు చిత్రా శుక్ల. ''మన దేశంలో మహిళలను అమ్మగా పూజిస్తాం. అలాంటి వారిపై సమాజంలో జరుగుతున్న దురాగతాల నేపథ్యంలో ఈ సినిమా తీశాం'' అన్నారు చేతన్ రాజ్. ''వాస్తవ ఘటనలతో రూపొందిన 'గీత సాక్షిగా' అందరికీ నచ్చుతుంది'' అన్నారు ఆంథోని మట్టిపల్లి.

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▽ | 338 | 57,900 |
| నిఫ్టీ ▽ | 111 | 17,043 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 11,375 | △ | 185 |
| డోజోన్స్ | 31,958 | △ | 139 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,637 | △ | 88 |
| డాక్స్ | 15,233 | △ | 273 |
| షాంఘై | 3,245 | ▽ | 23 |
| నికాయ్ | 27,222 | ▽ | 610 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్



## జియో పోస్ట్‌పెయిడ్ ఫ్యామిలీ ప్లాన్స్




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెలికం రంగ సంస్థ రిలయన్స్ జియో కొత్త పోస్ట్‌పెయిడ్ ఫ్యామిలీ ప్లాన్స్‌ను పరిచయం చేసింది. కస్టమర్లు ఒక నెలపాటు ఉచితంగా ట్రయల్ చేయవచ్చు. ప్లాన్స్ రూ.399 నుంచి ప్రారంభం. అదనంగా మూడు సిమ్‌లను తీసుకోవచ్చు. ఒక్కొక్క సిమ్‌కు నెలకు రూ.99 చార్జీ చేస్తారు. అపరిమిత కాల్స్, ఎస్ఎంఎస్ చేసుకోవచ్చు. రూ.399 ప్యాక్‌లో నలుగురు సభ్యుల కుటుంబానికి మొత్తం చార్జీ రూ.696 ఉంటుంది. నలుగురు సభ్యులు ఒక నెలలో మొత్తం 75 జీబీ డేటాను వినియోగించుకోవచ్చు. రూ.699 ప్లాన్‌లో 100 జీబీ డేటా అందుకోవచ్చు. అలాగే నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, జియోటీవీ, జియో సినిమాస్ యాప్స్‌ను ఆస్వాదించవచ్చు. ఇండివిడ్యువల్ ప్లాన్స్‌లో రూ.299 ప్యాక్‌కు 30 జీబీ, రూ.599 ప్యాక్ అయితే అపరిమిత డేటా ఆఫర్ చేస్తోంది. సెక్యూరిటీ డిపాజిట్ ప్లాన్‌నుబట్టి రూ.375–875 ఉంది. జియోఫైబర్, కార్పొరేట్ ఉద్యోగులు, జియోయేతర పోస్ట్‌పెయిడ్ యూజర్స్, క్రెడిట్ కార్డ్ కస్టమర్లు, మంచి క్రెడిట్ స్కోర్ ఉన్నవారికి ఈ సెక్యూరిటీ డిపాజిట్ లేదు.

# భారీగా తగ్గిన టోకు ధరలు

- ఫిబ్రవరిలో 3.85%, రెండేళ్ల కనిష్టం
- తయారీ, ఇంధనం, విద్యుత్ రంగాల్లో తగ్గిన ధరల తీవ్రత
- ఆహార ధరలు మాత్రం భారమే



న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 3.85 శాతంగా నమోదయ్యింది. అంటే 2022 ఫిబ్రవరితో పోల్చితే 2023 ఫిబ్రవరిలో డబ్ల్యూపీఐ ఆధారిత బాస్కెట్ మొత్తంగా ధర 3.85 శాతమే పెరిగిందన్నమాట. గడచిన రెండేళ్లలో ఇంత తక్కువ స్థాయిలో ధరల స్పీడ్ నమోదుకావడం ఇదే తొలిసారి. సూచీలో మెజారిటీ వెయిటేజ్ ఉన్న తయారీసహా, ఇంధనం, విద్యుత్ రంగాల్లో ధరల్లో తగ్గుదల దీనికి కారణం. అయితే సూచీలో భాగమైన ఫుడ్ బాస్కెట్ ద్రవ్యోల్బణం మాత్రం పెరిగింది. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ తాజా గణాంకాలను విడుదల చేసింది. కొన్ని ముఖ్యాంశాలను పరిశీలిస్తే..

- గడచిన 9 నెలలుగా టోకు ద్రవ్యోల్బణం దిగువ ముఖంగా పయనిస్తోంది. 2023 జనవరిలో టోకు ద్రవ్యోల్బణం 4.73 శాతం ఉంటే, 2022 ఫిబ్రవరిలో 13.43 శాతంగా ఉంది.
- జనవరిలో 2.38 శాతంగా ఉన్న ఫుడ్ ఆర్టికల్స్ ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 3.81 శాతానికి పెరిగింది. కూరగాయల ధరలు మాత్రం 21.53 శాతం తగ్గాయి. ఆయిల్ సీడ్స్ విషయంలో ధర తగ్గుదల 7.38 శాతంగా ఉంది. పప్పు ధాన్యాల ధరలు మాత్రం 2.59 శాతం పెరిగాయి.
- జనవరిలో 15.15 శాతంగా ఉన్న పవర్ బాస్కెట్ ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 14.82%కి తగ్గింది.
- తయారీ రంగ ద్రవ్యోల్బణం జనవరిలో 2.99%. ఫిబ్రవరిలో 1.94%కి తగ్గింది.

# 'ఎపాక్' ఆర్థిక సంస్థలపై ప్రభావం తక్కువే

- వాటి దగ్గర పుష్కలంగా నిధులు ఉన్నాయి
- అమెరికన్ బ్యాంకుల మూసివేతపై మూడీస్ విశ్లేషణ



న్యూఢిల్లీ: ఆసియా పసిఫిక్ ప్రాంత దేశాలకు చెందిన (ఎపాక్) చాలా మటుకు ఆర్థిక సంస్థలకు మూతబడిన అమెరికన్ బ్యాంకుల్లో పెట్టుబడులు పెద్దగా లేవని మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ తెలిపింది. ఈ నేపథ్యంలో ఆయా బ్యాంకుల మూసివేత ప్రభావం వాటిపై అంతగా ఉండబోదని పేర్కొంది. డిపాజిటర్లు విత్‌డ్రాయల్స్‌కు ఎగబడటంతో అమెరికాలో రెండు రోజుల వ్యవధిలోనే సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్‌వీబీ), సిగ్నేచర్ బ్యాంకు మూతబడిన నేపథ్యంలో మూడీస్ విశ్లేషణ ప్రాధాన్యం సంతరించుకుంది. 'మూసేసిన అమెరికా బ్యాంకుల్లో చాలా మటుకు ఎపాక్ సంస్థల నిధులు ఏమీ లేవు. ఏవో అరకొర సంస్థలకు ఉన్నా అవి భారీ స్థాయిలో లేవు. మొత్తం మీద చాలా మటుకు సంస్థలకు ఎస్‌వీబీ పరంగా భారీ నష్టాలేమీ వాటిల్లే అవకాశం లేదు' అని మూడీస్ పేర్కొంది. ఎపాక్‌లోని రేటెడ్ బ్యాంకుల ఆర్థిక పరిస్థితి పటిష్టంగానే ఉందని, వాటి దగ్గర తగినంత స్థాయిలో నగదు లభ్యత ఉందని తెలిపింది. కేవలం టెక్నాలజీ రంగానికే పరిమితం కాకుండా వాటి దగ్గర వివిధ రంగాల డిపాజిట్లు ఉన్నాయని పేర్కొంది.

**ఆర్థిక శాఖ దృష్టికి స్టార్టప్‌ల కష్టాలు..**

ఎస్‌వీబీ ప్రభావిత దేశీ స్టార్టప్‌ల సమస్యలను ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. సంక్షోభం నుంచి బైటపడేందుకు వాటికి కావాల్సిన సహాయం అందించాలని కోరనున్నట్లు వివరించారు. మంగళవారం అంకుర సంస్థలతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ విషయాలు చెప్పారు. డిపాజిట్లు మొత్తం తిరిగి వస్తాయంటూ స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటలిస్టులకు అమెరికా ప్రభుత్వ వర్గాలు హామీ ఇస్తున్నప్పటికీ ఇందుకోసం ఎంత సమయం పడుతుందనే అంశంపై ఇంకా స్పష్టత లేదని మంత్రి తెలిపారు.

**ఎస్‌వీబీ మాతృసంస్థపై షేర్‌హోల్డర్ల దావా**

మూతబడిన సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్‌వీబీ)పై షేర్‌హోల్డర్లు కోర్టును ఆశ్రయించారు. ఎస్‌వీబీ మాతృ సంస్థ ఎస్‌వీబీ ఫైనాన్షియల్ గ్రూప్, సీఈవో గ్రెగ్ బెకర్, సీఎఫ్‌వో డేనియల్ బెక్‌పై కాలిఫోర్నియాలోని న్యాయస్థానంలో క్లాస్ యాక్షన్ దావా వేశారు. వడ్డీ రేట్ల పెరుగుదల వల్ల వ్యాపారానికి పొంచి ఉన్న రిస్కులను వెల్లడించడంలో కంపెనీ విఫలమైందని పిటీషన్‌లో పేర్కొన్నారు. 2021 జూన్ 16–2023 మార్చి 10 మధ్య ఇన్వెస్ట్ చేసిన వారికి పరిహారం ఇప్పించాలని కోరారు.

## జోయాలుక్కాస్ ఆభరణాల వీఏపై 50% తగ్గింపు




హైదరాబాద్: ప్రముఖ బంగారు ఆభరణాల సంస్థ జోయాలుక్కాస్ 'సంవత్సరపు సాటిలేని జ్యువెలరీ సేల్' నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆభరణాల ముజూరీ చార్జీల(వీఏ)పై 50 శాతం తగ్గింపు ఇవ్వనున్నట్లు తెలిపింది. ''ఈ మార్చి 26 వరకు అందుబాటులో ఉండే ఈ గొప్ప ఆఫర్‌తో ఇంతకు ముందు లేని విధంగా సాటిలేని జ్యువెలరీ అనుభవాన్ని ఆనందించవచ్చు'' అని జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ జాయ్ అలూక్కాస్ పేర్కొన్నారు. కొనుగోలు చేసిన అన్ని ఆభరణాలపై ఒక సంవత్సరం ఉచిత బీమా, జీవిత కాల ఉచిత నిర్వహణ, బై బ్యాక్ ఆఫర్లను పొందొచ్చని జోయాలుక్కాస్ తెలిపింది.

**బులియన్** రూ.లలో

| ముంబై | | |
|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 57,605 | ▲ 637 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 57,374 | ▲ 634 |
| వెండి (కిలో) | 66,176 | ▲ 2,510 |

# నాలుగో రోజూ నష్టాలే

- కొనసాగిన అమెరికా బ్యాంకింగ్ సంక్షోభ ప్రభావం
- ఆటో, ఐటీ, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు
- అయిదు నెలల కనిష్టానికి నిఫ్టీ
- 58వేల దిగువకు సెన్సెక్స్



ముంబై: అమెరికా బ్యాంకింగ్ సంక్షోభ ప్రభావం దేశీయ స్టాక్ మార్కెట్లను వెంటాడుతోంది. ప్రపంచ వ్యాప్తంగా వడ్డీ రేట్ల పెంపు అంచనాలు, కొనసాగుతున్న విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ ఇన్వెస్టర్లను మరింత కలవరపెట్టాయి. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు కొద్దిసేపటికి నష్టాల్లోకి మళ్లాయి. ప్రధానంగా బ్యాంకింగ్, ఐటీ, ఆటో, మెటల్ షేర్ల అమ్మకాలు వెల్లువెత్తాయి. ఇంట్రాడేలో 571 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్ చివరికి 338 పాయింట్ల పతనంతో 57,900 వద్ద స్థిరపడింది. ఒక దశలో నిఫ్టీ 17వేల స్థాయిని కోల్పోయింది. ఆఖరికి 111 పాయింట్లు నష్టపోయి 17,043 వద్ద నిలిచింది. ఈ ముగింపు స్థాయిలు అయిదు నెలల కనిష్ట స్థాయి కావడం గమనార్హం. ఫార్మా, ఎఫ్ఎంసీజీ షేర్లకు మాత్రమే స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ అరశాతం, స్మాల్ క్యాప్ సూచీ ఒకశాతం చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.3087 కోట్ల షేర్లను అమ్మేయగా.., సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2122 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 14 పైసలు క్షీణించి రూ.82.37 వద్ద స్థిరపడింది. యూఎస్ సూచీల భారీ పతనం నేపథ్యంలో ఆసియా–పసిఫిక్ మార్కెట్లు నష్టాల్లో, యూరప్ మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. ''బేర్స్ ఆధిపత్యం నాలుగోరోజూ కొనసాగింది. కేంద్ర బ్యాంకుల కఠిన ద్రవ్య విధాన వైఖరి, ద్రవ్యోల్బణం కారణంగా బాండ్లపై దిగుమతులు తగ్గేందుకు మరింత సమయం పడుతుంది. ఒక దశలో నిఫ్టీ ఆరంభ నష్టాలను భర్తీ చేసుకునేందుకు యత్నించింది. అయితే ఐటీ, బ్యాంకింగ్, ఇంధన షేర్లలో తలెత్తిన అమ్మకాలతో తేరుకోలేకపోయింది. యూఎస్ ద్రవ్యోల్బణ డేటా (మంగళవారం వెల్లడి) నేటి ట్రేడింగ్‌పై ప్రభావాన్ని చూపనుంది. ట్రేడర్లు రిస్క్ మేనేజ్‌మెంట్‌పై మరింత దృష్టి సారించాలి'' జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

**మార్కెట్లో మరిన్ని సంగతులు...**

- ఆటో ఉపకరణాల తయారీ సంస్థ దివ్‌గీ టార్క్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్స్ లిస్టింగ్ మెప్పించింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.590)తో పోలిస్తే ఐదుశాతం ప్రీమియంతో రూ.620 వద్ద లిస్టయ్యింది. లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో చివరికి రెండున్నరశాతం లాభంతో రూ.605 వద్ద స్థిరపడింది. ఎక్స్ఛేంజీలో మొత్తం 34.14 లక్షల ఈక్విటీ షేర్లు చేతులు మారాయి. మార్కెట్ ముగిసే సరికి కంపెనీ మార్కెట్ విలువ రూ.1,851 కోట్లుగా నమోదైంది.
- హిందుస్థాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ(హెచ్‌సీసీ) షేరు 4% లాభపడి రూ.15 వద్ద స్థిరపడింది. మేఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్.. నేషనల్ హై–స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ నుండి భారీ ఆర్డర్ దక్కించుకుంది.

## మరో 10,000 మందికి మెటా ఉద్వాసన




న్యూయార్క్: ఫేస్‌బుక్ పేరెంట్ కంపెనీ మెటా మరో 10,000 మందికి ఉద్వాసన పలకనున్నట్టు మంగళవారం ప్రకటించింది. అలాగే కొత్తగా 5,000 మందిని విధుల్లోకి తీసుకోవాలనుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్టు స్పష్టం చేసింది. నాలుగు నెలల్లోనే రెండవ పర్యాయం ఉద్యోగుల కోతకు నిర్ణయం తీసుకోవడం గమనార్హం. సంస్థ చరిత్రలో అత్యధికంగా 2022 నవంబర్‌లో 13 శాతం (11,000) మంది ఉద్యోగులను మెటా తొలగించిన సంగతి తెలిసిందే. ఉద్యోగాల కోత రాబోయే రెండు నెలల్లో జరుగుతుందని సంస్థ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ ఫేస్‌బుక్ వేదికగా వెల్లడించారు. 'పునర్నిర్మాణాలు, తొలగింపులను మా సాంకేతిక సమూహాలలో ఏప్రిల్ చివరలో, వ్యాపార సమూహాలలో మే నెలాఖరులో ప్రకటించాలని భావిస్తున్నాము' అని తెలిపారు. ఉద్యోగుల కోత పూర్తి అయితే మొత్తం సిబ్బంది సంఖ్య సుమారు 66,000లకు వచ్చి చేరనుంది. 2022 సెప్టెంబర్ చివరినాటికి 87,314 మంది సంస్థలో పనిచేస్తున్నారు.

## హెచ్‌సీసీ, మేఘా బుల్లెట్ ట్రెయిన్ స్టేషన్ ప్రాజెక్ట్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హిందుస్తాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ (హెచ్‌సీసీ), మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్) సంయుక్తంగా బుల్లెట్ ట్రెయిన్ స్టేషన్ ప్రాజెక్ట్‌ను చేజిక్కించుకున్నాయి. ప్రాజెక్ట్ విలువ రూ.3,681 కోట్లు. నేషనల్ హై–స్పీడ్ రైల్ కార్పొరేషన్ నుంచి ఈ కాంట్రాక్ట్‌ను దక్కించుకున్నాయి. 508.17 కిలోమీటర్ల ముంబై–అహ్మదాబాద్ హై–స్పీడ్ రైల్‌లో భాగంగా బాంద్రా కుర్లా కాంప్లెక్స్ స్టేషన్‌ను హెచ్‌సీసీ, ఎంఈఐఎల్ నిర్మిస్తాయి. ఆరు ప్లాట్‌ఫామ్స్‌ను ఏర్పాటు చేస్తారు. 16 కోచ్‌లు ఉన్న బుల్లెట్ ట్రెయిన్ నడవడానికి వీలుగా ఒక్కొక్కటి 414 మీటర్ల పొడవులో ప్లాట్‌ఫామ్‌ను నిర్మిస్తారు. మెట్రో, రోడ్డు మార్గాలకు అనుసంధానంగా బాంద్రా కుర్లా కాంప్లెక్స్ స్టేషన్ ఉంటుందని హెచ్‌సీసీ తెలిపింది. ముంబై–అహ్మదాబాద్ హై–స్పీడ్ రైల్ మార్గంలో భూగర్భంలో ఉండే ఏకైక స్టేషన్ ఇదే. నేల నుంచి 24 మీటర్ల లోపల ఏర్పాటు చేస్తారు. మూడు అంతస్తుల్లో స్టేషన్ ఉంటుంది.

---

# భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

## జాబ్ పాయింట్

### ఎస్పీడీసీఎల్‌లో 1553 జేఎల్ఎం కొలువులు

ఎలక్ట్రికల్ ట్రేడ్‌లో ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థుల కోసం తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థ నుంచి ఉద్యోగ ప్రకటన వచ్చింది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) 1553 జూనియర్ లైన్‌మెన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాత పరీక్ష, పోల్ క్లైంబింగ్ టెస్టుల ద్వారా ఎంపిక చేస్తారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

» **మొత్తం జేఎల్ఎం పోస్టుల సంఖ్య:** 1553
» మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూలు, జోగులాంబ గద్వాల, నారాయణపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, మెదక్, సిద్ధిపేట, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాల్లో ఈ పోస్టులను భర్తీ చేస్తారు.

**అర్హతలు**

» పదో తరగతితోపాటు ఐటీఐ(ఎలక్ట్రికల్ ట్రేడ్/వైర్‌మ్యాన్) లేదా ఇంటర్మీడియట్ వొకేషనల్ కోర్సు(ఎలక్ట్రికల్ ట్రేడ్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.01.2023 నాటికి 18–35 ఏళ్ల మధ్య వయసు వారై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితిలో ఐదేళ్లు సడలింపు లభిస్తుంది.
» **వేతనాలు:** ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారికి ప్రతి నెల రూ.24,340 -రూ.39,405 వరకు మూలవేతనంగా లభిస్తుంది.

**ఎంపిక ఇలా**

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రాత పరీక్ష, పోల్ క్లైంబింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ రెండు పరీక్షల్లో అర్హత సాధించిన వారిని రూల్ ఆఫ్ రిజర్వేషన్లకు అనుగుణంగా తుది ఎంపిక చేసి ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.

**రాత పరీక్ష**

ఈ పరీక్ష మొత్తం 80 ప్రశ్నలకు ఉంటుంది. ఇందులో 65 ప్రశ్నలు సంబంధిత ఐటీఐ విభాగం నుంచి అడుగుతారు. మిగతా 15 ప్రశ్నలు జనరల్ నాలెడ్జ్ విభాగానికి సంబంధించి ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. పరీక్ష సమయం 2 గంటలు. పరీక్ష తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఉంటుంది.

**సిలబస్ అంశాలు**

» **ఐటీఐ(ఎలక్ట్రికల్ ట్రేడ్):** ఈ విభాగానికి సంబంధించి 65 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో ఫండమెంటల్స్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ, బ్యాటరీస్, మ్యాగ్నటిజం, ఫండమెంటల్స్ ఆఫ్ ఏసీ, బేసిక్ ఎలక్ట్రానిక్స్, డీసీ మెషిన్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, ఏసీ మెషిన్స్, ఎలక్ట్రికల్ మెజర్‌మెంట్స్, ఎలక్ట్రికల్ పవర్ జనరేషన్ అంశాలు ఉంటాయి.
» **జనరల్ నాలెడ్జ్:** అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, కరెంట్ అఫైర్స్, కన్జ్యూమర్ రిలేషన్స్, దైనందిన జీవితంలో జనరల్ సైన్స్, హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ ఆఫ్ ఇండియా అండ్ తెలంగాణ, హిస్టరీ ఆఫ్ తెలంగాణ, తెలంగాణ మూవ్‌మెంట్, సొసైటీ, కల్చర్, హెరిటేజ్, ఆర్ట్స్ అండ్ లిటరేచర్ ఆఫ్ తెలంగాణ.
» **పోల్ క్లైంబింగ్:** రాత పరీక్షలో అర్హత సాధించిన వారికి మాత్రమే రిజర్వేషన్‌ను అనుసరించి 1:2 నిష్పత్తిలో పోల్ క్లైబింగ్ టెస్ట్‌కు షార్ట్‌లిస్ట్ చేస్తారు. పోల్ క్లైంబింగ్‌లో అర్హత సాధించిన వారిని తుదిగా ఎంపికచేసి ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.
» కళాకారులకు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి 20 మార్కుల వరకు వెయిటేజీ లభిస్తుంది.
» **క్వాలిఫయింగ్ మార్కులు:** ఓసీ/ఈడబ్ల్యూఎస్–40%, బీసీ–35%, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు 30% క్వాలిఫయింగ్ మార్కులు సాధించాలి.

**ముఖ్య సమాచారం**

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** మార్చి 28,2023
» **హాల్‌టికెట్స్:** ఏప్రిల్ 24, 2023 నుంచి
» **పరీక్ష తేదీ:** ఏప్రిల్ 30, 2023
» **వెబ్‌సైట్:** https://tssouthernpower.cgg.gov.in

### ఎన్ఐసీ, న్యూఢిల్లీలో 598 సైంటిఫిక్, టెక్నికల్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐసీ) నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన సైంటిఫిక్, టెక్నికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 598
» **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్ బి–71, సైంటిఫిక్ ఆఫీసర్/ఇంజనీర్–196, సైంటిఫిక్ టెక్నికల్ అసిస్టెంట్–331.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, ఎంఎస్సీ, ఎంసీఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. » **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.04.2023.
» **వెబ్‌సైట్:** www.calicut.nielit.in

### ఏపీఎస్, గోల్కొండలో 12 ఉద్యోగాలు

గోల్కొండలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్(ఏపీఎస్).. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
» **పోస్టుల వివరాలు:** అడ్మిన్ సూపర్‌వైజర్, ఎల్‌డీసీ, కంప్యూటర్ ల్యాబ్ అసిస్టెంట్, సైన్స్ ల్యాబ్ అసిస్టెంట్, డ్రైవర్, గార్డెనర్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్/10+2/గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఆర్మీ పబ్లిక్ స్కూల్, గోల్కొండ, ఇబ్రహీంబాగ్ పోస్ట్ ఆఫీస్, సన్ సిటీ దగ్గర, హైదరాబాద్–500031 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.03.2023.
» **వెబ్‌సైట్:** www.apsgolconda.edu.in

### బెల్ బెంగళూరులో 12 ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్).. ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
» **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్(ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)ఉత్తీర్ణులవ్వాలి. కనీసం రెండేళ్లు పని అనుభవం ఉండాలి. **వయసు:** 32ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.40,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్(హెచ్ఆర్/మిలిటరీ కమ్యూనికేషన్స్–ఎంఆర్), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, జలహళ్లి పోస్ట్, బెంగళూరు–560013 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 25.03.2023.
» **వెబ్‌సైట్:** www.bel-india.in


### బెల్ బెంగళూరులో ట్రెయినీ ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్).. ట్రెయినీ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08
» **అర్హత:** బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్(కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.30,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును మేనేజర్ హెచ్ఆర్(ఎంఎస్/హెచ్ఎల్ఎస్–ఎస్‌సీబీ), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, జలహళ్లి పోస్ట్, బెంగళూరు–560013 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 22.03.2023.
» **వెబ్‌సైట్:** www.bel-india.in

## మ్యాథ్స్ కోర్సుల్లో మేటి.. సీఎంఐ!

దేశంలో కొన్ని విద్యా సంస్థలు వినూత్న కోర్సులు అందిస్తుంటాయి. కొన్ని సబ్జెక్టుల కోసమే పలు ప్రత్యేక విద్యాసంస్థలు ఏర్పాటయ్యాయి. అలాంటి వాటిల్లో ఒకటి చెన్నై మ్యాథమెటికల్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఐ). ఈ సంస్థ మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్‌లో.. బీఎస్సీ, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీలతోపాటు ఎమ్మెస్సీ డేటాసైన్స్ కోర్సులను కూడా అందిస్తోంది. వీటిలో ప్రవేశానికి ప్రస్తుతం ప్రకటన వెలువడింది. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ కల్పిస్తారు. పేద విద్యార్థులు ఫీజులో మినహాయింపుతోపాటు ప్రతిభావంతులైన విద్యార్థులు స్టైపెండ్ రూపంలో ఆర్థిక ప్రయోజనం కూడా పొందవచ్చు.




» చెన్నై మ్యాథమెటికల్ ఇన్‌స్టిట్యూట్ అడ్మిషన్ నోటిఫికేషన్
» మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్‌లో బీఎస్సీ,ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ
» రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా ప్రవేశం

**సీఎంఐ**

మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్‌లో.. యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులను పూర్తిచేయాలి, పరిశోధనల దిశగా అడుగులు వేయాలి అని భావించే వారికి చక్కటి వేదిక.. చెన్నై మ్యాథమెటికల్ ఇన్‌స్టిట్యూట్(సీఎంఐ). కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీపాటు మరికొన్ని సంస్థలు దీనికి నిధులు అందిస్తున్నాయి. యూజీసీ 2006లో దీనికి యూనివర్సిటీ హోదాను కూడా కల్పించింది. దేశంలో ప్రసిద్ధ సంస్థలతోపాటు విదేశాల నుంచి సైతం నిపుణులు వచ్చి సీఎంఐ విద్యార్థులకు బోధిస్తారు. ఈ సంస్థలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు మెరుగైన పరిశోధన వనరులతో, ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యను అభ్యసించే అవకాశం లభిస్తుంది.

**ప్రవేశాలు ఇలా**

రాత పరీక్షలో చూపించిన ప్రతిభ ఆధారంగా సీఎంఐలో ప్రవేశాలు కల్పిస్తారు. నేషనల్ ఒలింపియాడ్‌ల్లో ప్రతిభ చూపినవారికి నేరుగా యూజీ కోర్సుల్లో అడ్మిషన్ లభిస్తుంది. పీజీ, పీహెచ్‌డీలకు ప్రవేశ పరీక్షలతోపాటు ఇంటర్వ్యూలు ఉంటాయి. ఫిజిక్స్‌లో పీహెచ్‌డీకి ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించరు. జాయింట్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్(జెస్ట్) స్కోరుతో నేరుగా ఇంటర్వ్యూకి అవకాశం కల్పిస్తారు. అలాగే మ్యాథ్స్‌లో పీహెచ్‌డీ చేయాలనుకున్నవారు నేషనల్ బోర్డు ఫర్ హయ్యర్ మ్యాథమెటిక్స్ (ఎన్‌బీహెచ్ఎం) ఫెలోషిప్పునకు ఎంపికైతే.. పరీక్ష రాయకుండానే నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చు. ఇదే మాదిరిగా జెస్ట్‌తో కంప్యూటర్ సైన్స్‌లో రీసెర్చ్ అర్హత పొందినవారు సైతం నేరుగా ఇంటర్వ్యూతో ప్రవేశం పొందవచ్చు.

**కోర్సులు-అర్హతలు**

- **కోర్సు–బీఎస్సీ ఆనర్స్:** మ్యాథ్స్ అండ్ కంప్యూటర్ సైన్స్; మ్యాథ్స్ అండ్ ఫిజిక్స్.
- **అర్హత:** ఇంటర్ ఉత్తీర్ణులు, సెకండ్ ఇయర్ చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **కోర్సు: ఎమ్మెస్సీ:** మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్.
- **అర్హత:** డిగ్రీలో మ్యాథ్స్ లేదా బీస్టాట్ లేదా బీటెక్ చదువుకున్నవారు ఎమ్మెస్సీ మ్యాథ్స్‌కు అర్హులు. కంప్యూటర్ సైన్స్ బ్యాక్‌గ్రౌండ్‌తో బీఎస్సీ, బీటెక్ కోర్సులు ఉత్తీర్ణులైన వారు ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. మ్యాథ్స్, స్టాటిస్టిక్స్ లేదా కంప్యూటర్ సైన్స్ నేపథ్యంతో అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చదివిన వారు ఎమ్మెస్సీ డేటాసైన్స్‌కు అర్హులు. సంబంధిత సబ్జెక్టులో ఫైనల్ ఇయర్ చదవుతున్న విద్యార్థులు కూడా అర్హులే.
- **కోర్సు- పీహెచ్‌డీ:** మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్.
- **అర్హత:** సంబంధిత విభాగాల్లో పీజీ/ బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. ఫైనల్ ఇయర్ వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

**ప్రవేశ పరీక్ష విధానం**

- రెండు బీఎస్సీ కోర్సులకు కలిపి ఉమ్మడి పరీక్ష 100 పాయింట్లకు నిర్వహిస్తారు. పార్ట్ ఏ–40 పాయింట్లు, పార్ట్ బీ–60 పాయింట్లు. పరీక్ష వ్యవధి 3 గంటలు. పార్ట్ ఏ స్క్రీనింగ్ పరీక్ష. ఇందులో కనీస పాయింట్లు సాధిస్తే పార్ట్ బీ మూల్యంకనం చేస్తారు. రెండు విభాగాల్లో సాధించిన పాయింట్లతో తుది ఎంపిక చేస్తారు. పార్ట్ ఏలో 10ప్రశ్నలు వస్తాయి. ఒక్కో దానికి 4పాయింట్లు. పార్ట్ బీలో 6ప్రశ్నలుంటాయి. వీటికి 60 పాయింట్లు కేటాయిస్తారు.ప్రశ్నలన్నీ ఇంటర్ స్థాయిలోని మ్యాథ్స్‌లో ఆల్జీబ్రా, జామెట్రీ, ట్రిగనోమెట్రీ, కాలిక్యులస్ విభాగాల నుంచి అడుగుతారు.
- ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ పరీక్షల్లోనూ రెండు పార్టులుంటాయి. పార్ట్ ఏలో కనీస మార్కులు సాధిస్తే, పార్ట్ బీ మూల్యాంకనం చేస్తారు. రెండు విభాగాల్లో సాధించిన మార్కులతో ప్రవేశం కల్పిస్తారు. ప్రశ్నలన్నీ సంబంధిత సబ్జెక్టుల్లో అండర్ గ్రాడ్యుయేషన్ పాఠ్యాంశాల నుంచి వస్తాయి. ఎమ్మెస్సీ డేటాసైన్స్ ప్రశ్నలు మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్ నుంచి అడుగుతారు. పాత ప్రశ్నపత్రాలు, సొల్యూషన్లు సీఎంఐ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. వాటిని పరిశీలిస్తే ప్రశ్నల స్థాయి, చదవాల్సిన అంశాలపై అవగాహన పొందవచ్చు.

**ఫీజులు-ఫెలోషిప్**

సీఎంఐ అందించే అన్ని కోర్సులు రెసిడెన్షియల్ విధానంలో ఉంటాయి. ఇక్కడ అందించే కోర్సులకు ప్రతి సెమిస్టర్‌కు ట్యూషన్ ఫీజు చెల్లించాలి. విద్యార్థులు ఎంపిక చేసుకునే కోర్సును బట్టి అన్ని కోర్సుల్లోనూ పూర్తిగా లేదా పాక్షికంగా ఫీజు మినహాయింపు లభిస్తుంది. అలాగే ప్రతిభావంతులకు యూజీ కోర్సులైతే ప్రతి నెల రూ.5000 ఫెలోషిప్ కింద చెల్లిస్తారు. ఎమ్మెస్సీ కోర్సులో చేరినవారికి నెలకు రూ.6000 అందిస్తారు. పీహెచ్‌డీ కోర్సులకు ఎంపికైన వారికి మొదటి రెండేళ్లు నెలకు రూ.31,000, ఆ తర్వాత మూడేళ్లు నెలకు రూ.35,000 చెల్లిస్తారు. పీహెచ్‌డీలో చేరి, క్యాంపస్‌లో వసతి సౌకర్యం పొందని వారు స్టైపెండ్‌లో 24శాతం హెచ్ఆర్ఏ పొందవచ్చు. వీరికి ఏటా బుక్ గ్రాంట్ రూ.10,000 ఇస్తారు.

**ముఖ్యసమాచారం**

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఏప్రిల్ 09, 2023
- **అడ్మిట్ కార్డుల అందుబాటు:** ఏప్రిల్ 30, 2023 నుంచి
- **పరీక్ష తేదీ:** మే 07, 2023
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం
- **వెబ్‌సైట్:** www.cmi.ac.in/admissions

## క్లుప్తంగా...

### 17న పీహెచ్‌డీ స్పాట్ అడ్మిషన్లు

**తిరుపతి ఎడ్యుకేషన్:** శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలోని పీహెచ్‌డీ విభాగంలో వివిధ కోర్సులకు ఈ నెల 17వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఏపీ ఆర్‌సెట్-2022లో ర్యాంకులు పొందిన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అడ్మిషన్ల డైరెక్టర్ ప్రొఫెసర్ సువర్ణలతాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు ''డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎస్‌పిఎంవివి.ఏసి.ఇన్'' వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

### 18న ఏపీఆర్ సెట్ స్పాట్ అడ్మిషన్లు

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఏపీఆర్ సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు స్పాట్ అడ్మిషన్లు ఈ నెల 18న నిర్వహించనున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. లా, ఫార్మసీ, ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు పెదవాల్తేరులోని ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని పేర్కొన్నారు. మిగుల సీట్ల భర్తీకి ఏపీ ఆర్ సెట్ 2022లో అర్హత సాధించిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

### గుంటూరు వైద్య కళాశాలకు 22 పీజీ సీట్లు మంజూరు

**గుంటూరు మెడికల్:** గుంటూరు వైద్య కళాశాలకు 22 పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు మంగళవారం నేషనల్ మెడికల్ కమిషన్ నుంచి ఉత్తర్వులు అందాయి. గుంటూరు వైద్య కళాశాలలోని పలు విభాగాల్లో పీజీ సీట్ల పెంపుపై పరిశీలన కోసం ఫిబ్రవరి 21వ తేదీన నేషనల్ మెడికల్ కమిషన్ అధికారులు తనిఖీలు చేశారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల మేరకు కళాశాలలో వసతులు ఉండటంపై తనిఖీ అధికారులు సంతృప్తి వ్యక్తంచేశారు. వారు ఇచ్చిన నివేదిక ప్రకారం పెథాలజీ విభాగంలో ఐదు, జనరల్ మెడిసిన్ విభాగంలో 13, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగంలో నాలుగు పీజీ సీట్లను మంజూరు చేస్తూ నేషనల్ మెడికల్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు మెడికల్ కాలేజీకి గత విద్యా సంవత్సరంలో ఒకేసారి 40 పీజీ సీట్లు మంజూరు కాగా, ఇప్పుడు 22 సీట్లు మంజూరు కావడంపై వైద్య కళాశాల అధికారులు, బోధనా సిబ్బంది ఆనందం వ్యక్తంచేశారు.




# లెవల్ 5 కార్లు!

- పూర్తి అటానమస్ కార్లపై దిగ్గజ కంపెనీల దృష్టి
- మానవ తప్పిదాలు, రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట
- డ్రైవర్ అవసరం లేని వాహనాలతో ఎన్నో ప్రయోజనాలు

(ఎం.విశ్వనాథరెడ్డి, సాక్షి ప్రతినిధి)

నిత్యం రోడ్డు ప్రమాదాల కారణంగా ఎన్నో నిండు ప్రాణాలు గాల్లో కలసిపోతున్నాయి. మితిమీరిన వేగం, నిద్ర మత్తు లాంటి మానవ తప్పిదాలే దీనికి ప్రధాన కారణం. వీటిని దాదాపు సంపూర్ణంగా అరికట్టడంతోపాటు వాహనం స్టార్ట్ చేసిన దగ్గర నుంచి గమ్యస్థానం వరకు ఆటోపైలట్ మోడ్‌లో పనిచేసే పూర్తి అటానమస్ కార్లను రూపొందించే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. వీటికి డ్రైవర్ల అవసరం ఉండదు. ఈ ప్రయోగాలకు ఇప్పటి వరకు అమెరికాలోనే 7,500 కోట్ల డాలర్లు ఖర్చు చేసినట్లు అంచనా. అక్కడ 30 సంస్థలు ఈ ప్రయోగాల్లో నిమగ్నమయ్యాయి. మిగతా దేశాల్లోనూ ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**లెవల్-5లో పూర్తిస్థాయి సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు**

అమెరికాలో 26 కంపెనీలు 1,174 అటానమస్ కార్లను ప్రయోగాత్మకంగా 64 లక్షల కిలోమీటర్లు రోడ్ల మీద నడిపినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. వీటిని పూర్తి సెల్ఫ్ డ్రైవింగ్ ఫీచర్లతో తయారు చేసినప్పటికీ నాలుగు కంపెనీలు మాత్రమే డ్రైవర్ లేకుండా 16 వాహనాలను దాదాపు 40 వేల కిలోమీటర్లు తిప్పి పరీక్షించాయి. అమెరికా మోటారు వెహికల్ డిపార్ట్‌మెంట్ రూపొందించిన నిబంధనల ప్రకారం 'లెవల్ జీరో నుంచి లెవల్ 5' వరకు మొత్తం ఆరు స్థాయిలుగా ఈ వాహనాలను వర్గీకరించారు. లెవల్ జీరోలో ప్రస్తుత సంప్రదాయ కార్లు ఉండగా లెవల్-5లో పూర్తిస్థాయి సెల్ఫ్ డ్రైవింగ్ కార్లుంటాయి. వివిధ కంపెనీల ప్రయోగ ఫలితాలను విశ్లేషిస్తే ప్రస్తుతం లెవల్-3 స్థాయి వరకే చేరుకున్నట్లు వెల్లడవుతోంది.

**త్వరలో సాకారం..**

సైన్స్ ఫిక్షన్‌కే పరిమితమైన సెల్ఫ్ డ్రైవ్ వాహనాలు త్వరలో రోడ్డెక్కుతాయని 'ది గ్లోబల్ స్టాండర్డ్స్ అండ్ ఇంజనీరింగ్ అసోసియేషన్ '(ఎస్ఏఈ) ఆశాభావంతో ఉంది. అటానమస్ వాహనాల తయారీ కంపెనీలకు ఈ అసోసియేషన్‌లో సభ్యత్వం ఉంది. లెవల్-4 వాహనాలు రోడ్డెక్కిన కొంత కాలం తర్వాత నిజమైన అటానమస్ వాహనాల (లెవల్ 5) స్వప్నం సాకారమవుతుందని అంచనా వేస్తోంది.

**ఉపయోగాలెన్నో..**

సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా దూసుకెళ్లే పూర్తి సెల్ఫ్ డ్రైవ్ వాహనాల కల సాకారమైతే రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. మానవ తప్పిదాలతో పోలిస్తే సాఫ్ట్‌వేర్ తప్పిదాల సంఖ్య బహు స్వల్పం. పూర్తిస్థాయి అటానమస్ వాహనాలు రోడ్డెక్కితే విలువైన ప్రాణాలను కాపాడవచ్చని నిపుణులు చెబుతున్నారు.

### డ్రైవింగ్ ఆటోమేషన్‌లో 'లెవల్స్' ఇలా

**లెవల్ జీరో:** వాహనం పూర్తిగా డ్రైవర్ నియంత్రణలో ఉంటుంది. అధిక వేగం హెచ్చరికలు, స్థిరత్వం కోల్పోతున్నప్పుడు వచ్చే 'బీప్' శబ్దాలకే ఆటోమేషన్ పరిమితం. ప్రస్తుతం రోడ్ల మీద తిరుగుతున్న వాహనాలు దాదాపు 'లెవల్ జీరో'లోనే ఉన్నాయి.

**లెవల్ 1:** డ్రైవర్‌కు సహాయకారిగా సపోర్టింగ్ వ్యవస్థ ఉంటుంది. నిర్ధారిత వేగంలో ప్రయాణించేలా క్రూజ్ కంట్రోల్, లేన్ ఫాలోయింగ్ అసిస్టెన్స్ లాంటివి ఉంటాయి. అవసరమైనప్పుడు తక్షణం స్పందించి వాహనాన్ని నియంత్రించేలా డ్రైవర్ పూర్తి అప్రమత్తంగా ఉండాలి. అధునాతన కార్లలో ఈ సదుపాయాలున్నాయి.

**లెవల్ 2:** డ్రైవర్ నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిందే కానీ.. అడ్వాన్స్‌డ్ డ్రైవింగ్ అసిస్టెన్స్ సిస్టం(ఏడీఏఎస్) ద్వారా బ్రేకింగ్, వేగం పెంచడం, స్టీరింగ్ నియంత్రణ తదితర పనులు డ్రైవర్ ప్రమేయం లేకుండా జరుగుతుంటాయి. 'టెస్లా ఆటోపైలట్' ఫీచర్ ఈ స్థాయి కిందకు వస్తుంది.

**లెవల్ 3:** ఈ స్థాయి కార్లకు అత్యవసర పరిస్థితుల్లో స్పందించడానికి డ్రైవర్ అవసరమే కానీ డ్రైవింగ్ చేయాల్సిన అవసరం ఉండదు. అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు, వ్యవస్థ విఫలమైనప్పుడు డ్రైవర్ అవసరం ఉంటుంది. సాధారణ సందర్భాల్లో కృత్రిమ మేధ(ఏఐ) సాయంతో వాహనమే డ్రైవింగ్ ప్రక్రియ పూర్తి చేస్తుంది. హోండా ట్రాఫిక్ జామ్ పైలట్, మెర్సిడెస్-బెంజ్ డ్రైవ్ పైలట్ తదితర కార్లు మాత్రమే ఈ స్థాయిలో ఉన్నాయి.

**లెవల్ 4:** స్టీరింగ్, పెడల్స్ లేకుండా నడిచే కారు ఈ స్థాయి కిందకు వస్తుంది. పరిమిత వేగం, నిర్దేశిత ప్రాంతాల్లో మాత్రమే ఇది నడుస్తుంది. వ్యవస్థ విఫలమయినా, అత్యవసర పరిస్థితి తలెత్తినా వాహన వేగం నెమ్మదించి ఆగిపోతుంది. సెల్ఫ్ డ్రైవ్ ట్యాక్సీలకు ఇది బాగా ఉపయోగపడుతుంది. దీని అనుమతుల కోసం కొన్ని కంపెనీలు దరఖాస్తు చేసుకున్నా ఇంకా పూర్తిస్థాయి ఆమోదం లభించలేదు.

**లెవల్ 5:** పూర్తిస్థాయి సెల్ఫ్ డ్రైవ్ కార్లు ఈ స్థాయిలో ఉంటాయి. గమ్యస్థానాన్ని సెట్ చేసి నింపాదిగా కూర్చోవడమే మనుషుల పని. పేపర్ చదువుకుంటూ, సినిమా చూస్తూ కూర్చుంటే కారు గమ్యస్థానానికి చేరుస్తుంది. మానవ ప్రమేయం అవసరమే ఉండదు. వేగానికి పరిమితులు ఉండవు. ఏ ప్రాంతంలో అయినా, ఎలాంటి పరిస్థితుల్లో అయినా సురక్షితంగా ప్రయాణించగల అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఈ స్థాయి వాహనాల సొంతం. ఇవి ఇంకా ప్రయోగాల దశ దాటలేదు. వీటిని అభివృద్ధి చేయడానికి విస్తృతంగా ప్రయోగాలు జరుగుతున్నాయి.

### మద్రాస్ ఐఐటీలో ఆంధ్రా విద్యార్థి ఆత్మహత్య

విచారణకు కమిటీ ఏర్పాటు

**సాక్షి, చెన్నై:** మద్రాస్ ఐఐటీలో చదువుతున్న ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ జిల్లాలకు చెందిన పుష్పక్ శ్రీసాయి (22) అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. వైఎస్సార్ జిల్లాకు చెందిన పుష్పక్ శ్రీసాయి మద్రాస్ ఐఐటీలో బీ.టెక్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. అతను హాస్టల్‌లోని తన గదిలో మంగళవారం మధ్యాహ్నం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలిసి కోట్టూరుపురం పోలీసులు హాస్టల్‌కు వచ్చి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై విచారణ కోసం మద్రాస్ ఐఐటీ యాజమాన్యం కూడా కమిటీని నియమించింది.

## నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

**సాక్షి, అమరావతి:** ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు-2023 బుధవారం (నేడు) నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 15 నుంచి ప్రథమ సంవత్సరం, 16 నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమవుతాయి. ఏప్రిల్ 4 వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. మొత్తం 10,03,990 మంది పరీక్ష రాయనున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 4,84,197 మంది కాగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,19,793 మంది ఉన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,489 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందుకు ఇంటర్మీడియెట్ బోర్డు, పాఠశాల విద్యాశాఖ పటిష్ట ఏర్పాట్లు చేశాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా పరీక్షలు ముగిసేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలను నిర్వహిస్తారు. ప్రశ్నపత్రాల లీకేజీ, మాల్ ప్రాక్టీస్ వంటి వదంతులను సృష్టించకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి పరీక్షలపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎంవీ శేషగిరిబాబు దగ్గరుండి అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



**పరీక్ష వేళల్లో ఆర్టీసీ బస్సులు..**

విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవడానికి వీలుగా ఆర్టీసీ బస్సులను ఎక్కువగా తిప్పనున్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పరీక్షల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించేలా ఇప్పటికే బాధ్యతలు అప్పగించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సదుపాయంతో పాటు ఫస్ట్ ఎయిడ్ కిట్లతో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నారు. ప్రతి 20 నుంచి 25 పరీక్ష కేంద్రాలకు కలిపి ఒక 108 అంబులెన్సును సిద్ధంగా ఉంచారు. పరీక్షలను సజావుగా నిర్వహించడానికి వీలుగా ఎక్కడ ఏ సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించేలా రాష్ట్ర స్థాయిలో కంట్రోల్ రూమును ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు పహారాతో పాటు ప్రత్యేక మొబైల్ పెట్రోలింగ్ బృందాల ద్వారా పర్యవేక్షణ చేయనున్నారు.

**సెల్‌ఫోన్లు, సహా డిజిటల్ పరికరాలపై నిషేధం**

పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, డిజిటల్ వాచ్, బ్లూటూత్, ట్యాబులు సహా అన్ని రకాల డిజిటల్ పరికరాలను పరీక్ష కేంద్రాల్లోకి తీసుకువెళ్లకుండా నిషేధం విధించారు. పరీక్ష కేంద్రాల పరిధిలో జిరాక్స్ కేంద్రాలను మూసివేస్తారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేయనున్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్య తలెత్తినా పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 18004257635ని ఇంటర్ బోర్డు ఏర్పాటు చేసింది. విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు సకాలంలో చేరుకోవాలని ఇప్పటికే ఇంటర్ బోర్డు పలు సూచనలు జారీ చేసిన సంగతి తెలిసిందే. నిర్ణీత సమయం దాటాక ఎవరినీ లోపలకు అనుమతించే అవకాశం లేదని వెల్లడించింది.

### విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకపోతే చర్యలు

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి



**ఒంగోలు సబర్బన్:** పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు సకాలంలో హాల్ టికెట్లు ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి హెచ్చరించారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రైవేటు స్కూళ్లు, ఇంటర్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులు ఫీజులు చెల్లించలేదంటూ హాల్‌టికెట్లు ఇవ్వడం లేదని కమిషన్‌కు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ విషయంలో ఆయా జిల్లాల కలెక్టర్లను కూడా అప్రమత్తం చేశామన్నారు. హాల్‌టికెట్లు ఇవ్వకపోతే విద్యార్థులు టోల్ ఫ్రీ నంబర్ 1800 425 7635కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

### నీట్ పీజీ ఫలితాలు విడుదల

**సాక్షి, అమరావతి:** నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)పీజీ- 2023 ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మంగళవారం విడుదల చేసింది. వైద్య విద్య పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 5న దేశవ్యాప్తంగా నీట్ పీజీ పరీక్షను నిర్వహించారు. 849 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 1,82,318 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్ష నిర్వహించిన 10 రోజుల్లోనే ఫలితాలు వెలువడ్డాయి. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 31న ఫలితాలు వెలువడాల్సి ఉంది. వ్యక్తిగత స్కోర్ కార్డును ఈ నెల 25న అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.

**కటాఫ్ ఇలా..**

| కేటగిరి | పర్సంటైల్ | స్కోర్ (800లకు) |
|---|---|---|
| జనరల్/ఈడబ్ల్యూఎస్ | 50 | 291 |
| జనరల్-పీడబ్ల్యూబీడీ | 45 | 274 |
| ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ (పీడబ్ల్యూబీడీతో కలిపి) | 45 | 257 |

## యువతకు మేలు'కొలువు'..

# భవితకు మేలిమలుపు

- వ్యవసాయంతో విజేతగా నిలిచిన శ్రీనాథ్‌రెడ్డి
- 'ఫ్యాషన్' నుంచి ప్యాషన్ వైపునకు నడక
- కొలువు వీడి.. కాడి పట్టిన డిజైనర్
- ప్రకృతి సేద్యంలో ఆదర్శరైతు
- ఐదంచెల సాగుతో రూ.లక్షల్లో ఆదాయం
- అవార్డుల పంట పండిస్తున్న యువకుడు

సాక్షి, కడప డెస్క్

'తాత ముత్తాతల కాలం నుంచి మేము వ్యవసాయం చేస్తూనే ఉన్నాం. అయినా మూడు పూటలా ఐదు వేళ్లు నోట్లోకి వెళ్లాలంటేనే కష్టంగా ఉంది. నువ్వయినా మంచి ఉద్యోగం చేసుకుని బాగు పడతావనుకున్నాను. పంటలు పండిస్తానంటూ వెనక్కొచ్చావ్. మావల్ల కానిది నువ్వేం సాధిస్తావ్' అంటూ తండ్రి ధర్మారెడ్డి అడుగుతుంటే... 'ఏం చేయగలనో చూ(పి)ద్దామనే వచ్చాను నాన్నా' అని చెప్పాడు మోపూరి శ్రీనాథ్‌రెడ్డి. తండ్రొకడే కాదు అయినవారు, తెలిసినవారు కూడా స్వానుభవంతో హెచ్చరించారు .. అయినా ఆ యువకుడు వెనుకకు తగ్గలేదు. చదువుకు, ఉద్యోగానికి.. కొలువుకు, జీవితానికి సంబంధం లేదని నిరూపించాలనుకున్నాడు. పట్టుదలతో శ్రమించాడు. ప్రకృతి సేద్యంతో పొలంలో ప్రయోగాలు చేశాడు. అందరూ వద్దన్నచోటే విజేతయ్యాడు.. కాదన్నవారి మనసులు గెలిచాడు. అన్నదాతలకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. యువతకు మేలు'కొలువు' ఇదేనంటూ చెబుతున్నాడు. భవితకు మేలిమలుపును చూపిస్తున్నాడు. అందరితోనూ శెభాష్ అనిపించుకుంటున్నాడు.




తాము పండించిన ఉత్పత్తులతో శ్రీనాథ్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

### జీవితానికి కొత్త డిజైన్

అన్నమయ్య జిల్లా రామాపురం మండలం బి.రాచపల్లికి చెందిన శ్రీనాథ్‌రెడ్డి గ్రాఫిక్ డిజైనింగ్ కోర్సు చేశాడు. ఎంబీఏ కూడా పూర్తి చేశాడు. ముంబైలో మంచి కంపెనీలో ఉద్యోగం సాధించాడు. అక్కడి వాతావరణం నచ్చక చెన్నైకు మారాడు. అదీ సరిపడక.. కొన్నాళ్లకు బెంగళూరులోని మరో కంపెనీకి మారాడు. ఐదంకెల జీతం వచ్చేది. భార్య మాధవి కూడా అసిస్టెంట్ డిజైనర్‌గా పనిచేసేది. నాలుగు చేతులా ఆదాయం. సౌకర్యవంతమైన జీవితం. కానీ ఏదో లోటు కనిపించేది. పీల్చే గాలి, తినే ఆహారం.. కలుషితంగానే అనిపించేది. ఠంఛనుగా ఆఫీసుకు వెళ్లడం, చీకటి పడ్డాక తిరిగి రావడం రొటీన్‌గా మారిపోయింది. . నీటి గలగలలు, పక్షుల కిలకిలలు.. నేలతల్లి నడకలు లేకుండాపోయాయి. ఈ నేపథ్యంలో ఆరేళ్ల క్రితం సొంతూరికి వచ్చిన శ్రీనాథ్‌రెడ్డికి ప్రకృతి వ్యవసాయంపై పద్మశ్రీ సుభాష్ పాలేకర్ 9 రోజుల శిక్షణ ఇస్తున్నట్లు తెలిసింది. గుంటూరు జిల్లా కాజ వద్ద నిర్వహించిన ఆ సదస్సుకు వెళ్లమని వ్యవసాయాధికారులు ప్రోత్సహించారు. అక్కడ పాలేకర్ పాఠాలన్నీ శ్రద్ధగా విన్నాడు. ఒడిదుడుకుల సాగు, రసాయనాల విధ్వంసం, నేలతల్లికి జరుగుతున్న నష్టం గురించి తెలుసుకున్నాడు. జీవితంలో తనేం కోల్పోతున్నాడో, భవిష్యత్‌లో తన బిడ్డలు ఎలాంటి 'విష'మ పరిస్థితులు ఎదుర్కొనున్నారో అవగాహన చేసుకున్నాడు. తన అసంతృప్తికి కారణమేంటో కనుగొన్నాడు. ఇప్పటివరకు తాము తింటున్నది విషమని గుర్తించాడు. భార్య మాధవి తోడుగా కాడి పట్టి పొలం వైపు కదిలాడు. తన తండ్రి, తోటి రైతులు, అధికారుల సహకారం తీసుకున్నాడు. మెల్లమెల్లగా బాలారిష్టాలు అధిగమించాడు. అహర్నిశలూ కృషి చేశాడు. సాధారణ వ్యవసాయంలో వస్తున్న ఆదాయం కంటే రెట్టింపు సాధించాడు.. తమ ఆరెకరాల పొలాన్ని 13 ఎకరాలకు విస్తరించాడు. ఐదంచెల సాగుతో సమగ్ర జీవ వైవిధ్య తోటను సృష్టించాడు. 7ఎకరాల్లో మామిడి సాగుచేస్తూ అద్భుత ఫలితాలు సాధిస్తున్నాడు. కుటుంబ సభ్యుల సహకారంతో శ్రీనాథెడ్డి నిర్దిష్ట పంటల ప్రణాళికను అమలు చేస్తున్నాడు. దిగుబడిలో అద్భుత ఫలితాలు అందుకుంటున్నాడు. ఫలితంగా ఆరేళ్ల వ్యవధిలో వివిధ రకాల పంటల సాగులో పట్టు సాధించడమే కాకుండా నాణ్యమైన పంటలకి చిరునామాగా మారాడు. ప్రస్తుతం ఏడాదికి ఖర్చులు పోను రూ.9 లక్షల నికర రాబడి అందుకుంటున్నాడు. వ్యవసాయం ఏ రంగానికి తీసిపోదని చాటుతున్నాడు.

### శిక్షణ సైతం..

ఒకప్పుడు ఫ్యాషన్ డిజైనర్‌గా కొందరికే తెలిసిన శ్రీనాథ్‌రెడ్డి, ఈరోజు ప్రకృతి వ్యవసాయంతో లాభాల పంట పండిస్తున్న రైతుగా ఎంతో ఖ్యాతి సాధించాడు. తెలివిగా వ్యవసాయం చేస్తే సంక్షోభం నుంచి గట్టెక్కవచ్చని నిరూపించాడు. ఉద్యోగాల కోసం ఊరొదిలి వెళ్లి నానా ఇబ్బందులు పడుతున్న యువతకు వ్యవసాయ రంగంలో ఉజ్వల భవిష్యత్తు ఉందని చెబుతున్నాడు. తోటి రైతులకు అనుభవ పాఠాలు బోధిస్తున్న ఈయన ప్రకృతి వ్యవసాయంపై వందలాది మందికి శిక్షణ ఇచ్చాడు. ఆసక్తి ఉన్నవారెవరైనా తనను 98809 37907 నంబరులో సంప్రదించవచ్చని చెబుతున్నాడు.

### ప్రకృతి నడుమ పచ్చని కుటుంబం

ఉద్యోగానికి రాజీనామా చేసి శ్రీనాథ్‌రెడ్డి వ్యవసాయం చేస్తానన్నప్పుడు ఎంతో మంది కాదన్నా, ఆయన భార్య మాధవి మాత్రం పూర్తి మద్దతునిచ్చింది. తను కూడా ఉద్యోగాన్ని వదిలి వెంట నడిచింది. ఇద్దరూ కలిసి వ్యవసాయ క్షేత్రంలోనే ఆవాసం ఏర్పాటు చేసుకున్నారు. ఇంట్లో సేంద్రియ ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. సిరిధాన్యాల వంటలు కూడా అలవాటు చేసుకుంటున్నారు. వీరి ఇద్దరు అబ్బాయిలు కూడా అక్కడే ఉంటారు. రోజూ స్కూల్‌బస్సులో 20 కి.మీ.ల దూరంలోని రాయచోటికి వెళ్లి వస్తుంటారు. ప్రకృతి నడుమ గడపడం .. పర్యావరణ, ఆరోగ్య స్పృహ అలవడటం వల్ల వీరు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారంటారు శ్రీనాథ్‌రెడ్డి దంపతులు. ఆరోగ్యకరమైన జీవనవిధానంతో మానసికంగా కూడా దృఢంగా తయారవుతారంటారు. బి.రాచపల్లెలో ఇల్లున్నా అత్యవసరమైతే తప్ప అక్కడికి వెళ్లరు. శ్రీనాథ్‌రెడ్డి తల్లిదండ్రులు రోజూ వీళ్ల దగ్గరికి వస్తూపోతూ చేదోడువాదోడుగా ఉంటారు. వీళ్ల వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించేందుకు రోజూ చాలామంది వస్తుంటారు.



వ్యవసాయ క్షేత్రంలో శ్రీనాథ్‌రెడ్డి, మాధవి

### ఇంటి వద్దే విక్రయాలు

రసాయన రహితపంటలకు మార్కెటింగ్ సమస్య ఉండదని నిరూపించాడు శ్రీనాథ్ రెడ్డి. ఈయన ఇంటివద్దే తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నాడు. పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, బియ్యం, పప్పుదినుసుల కోసం నిత్యం ఎక్కడెక్కడివారో వీరింటికి వచ్చిపోతుంటాడు. ఇక్కడి పంటలు నాణ్యంగా, రుచికరంగా ఉన్నాయని కొనుగోలుదారులు చెబుతుంటారు.

### ఏడాది పొడవునా సాగు

ఏడాదంతా పచ్చదనం, ఆదాయం కోసం శ్రీనాథ్ రెడ్డి రుతుపవన ముందరిసాగు - ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) విధానాన్ని కచ్చితంగా పాటిస్తున్నాడు. తొలుత శ్రీనాథ్‌రెడ్డి అందరిలాగే వరి, కంది, జొన్న, సజ్జ వంటి పంటలు వేసి మంచి ఆదాయం సాధించాడు. ఈ క్రమంలోనే అందరూ ఏటా ఒకటో రెండో పంటలు పండిస్తూ మిగతా కాలమంతా నేలను ఖాళీగా వదిలేస్తున్నట్లు గమనించాడు. దానివల్ల భూమాతకు నష్టం.. ఆ తరువాత అన్నదాతకూ కష్టం అని గుర్తించాడు. ఖాళీగా ఉన్న మనిషి బుర్ర దెయ్యాలగుహలా మారినట్లు, నేల ఖాళీగా ఉన్నా సారం కోల్పోతుందని భావించాడు. దీంతో ఖరీఫ్ అయ్యాక ఎండల్లో మళ్లీ పంటలకు సిద్ధమయ్యాడు. ప్రకృతి వ్యవసాయ పాఠాలు మననం చేసుకుని ముందుకు సాగాడు. పొలం పోషకాలు కోల్పోకుండా ఉండేందుకు నవధాన్య పద్ధతులు పాటించాడు. నిత్యం పొలం పచ్చగా ఉండేలా మామిడిలో అంతర పంటలుగా చిరు ధాన్యాలు వేశాడు. అందులో 2ఎకరాలు పక్షుల కోసం కోయకుండా వదిలేశాడు. రైతులకు అనుకూలం అని చెప్పడానికి ఒక ఎకరాలో చేపల పెంపకం చేపట్టాడు, పలుపంటల పద్ధతిలో వేరుశనగ , దేశి వంగడాలు, జొన్న, మొక్క జొన్న, వేరుశనగ, కంది, ఆముదం, గోంగూర, గోరుచిక్కుడు, బీర, కాకర, ఆనప, పుచ్చకాయలు, బంతి వంటి రకాలను సాగు చేశాడు. పంట చేతికొచ్చేంత వరకు ప్రకృతి వ్యవసాయ పాఠాలన్నీ పాటించాడు. ఫలితంగా పచ్చని లాభాలు పొందాడు.

### అవార్డుల పంట



శ్రీనాథ్‌రెడ్డి సేవలను ప్రకృతి సేద్య నిపుణులు సుభాష్ పాలేకర్‌తో పాటు ప్రకృతి సేద్యంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు విజయ్‌కుమార్ లాంటి ఎందరో ఉన్నతాధికారులు అభినందించారు. తన కృషికి శ్రీనాథ్ రెడ్డి అనేక అవార్డులు, రివార్డులు పొందాడు.

- ఈ నెల 8వ తేదీన ఐకార్ నుంచి ఇన్నోవేటివ్ ఫార్మర్ అవార్డునందుకున్నాడు.
- గత ఏడాది ఏపీ జీవ వైవిధ్య సంస్థ నుంచి ఉత్తమ రైతు పురస్కారం పొందాడు.
- 2021లో కిసాన్ ప్రగతి సంస్థ నుంచి ఆదర్శ రైతు అవార్డు సాధించాడు.
- 2020లో తెలంగాణ ప్రభుత్వంతో యువరైతు పురస్కారం పొందాడు.
- ఇవే కాకుండా పదుల సంఖ్యలో వివిధ సంస్థలతో అవార్డులు అందుకున్నాడు.

### సాంకేతిక సవాళ్లకు సిద్ధం కావాలి



పల్సస్ సంస్థ సీఈవో డాక్టర్ జి.శ్రీనుబాబు

**ఏయూ క్యాంపస్:** సాంకేతిక ప్రగతి, ఆవిష్కరణల నుంచి ఎదురయ్యే సవాళ్లను స్వీకరించడానికి యువత సిద్ధంగా ఉండాలని పల్సస్ సంస్థ సీఈవో డాక్టర్ జి.శ్రీనుబాబు అన్నారు. ఏయూ ఫార్మసీ కళాశాల 72వ వార్షికోత్సవం యూనివర్సిటీ అసెంబ్లీ హాలులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శ్రీనుబాబు మాట్లాడుతూ ఏయూ ఫార్మసీ కళాశాల విద్యార్థిగా చేరిన నాటి నుంచి సీఈవోగా ఎదిగిన వరకు తన ప్రస్థానాన్ని వివరించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ యువత తమ ఆలోచనలను ఆచరణలో పెట్టాలని సూచించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ ఆచార్య కేవీ రమణమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న బహుళ నైపుణ్యాలను ప్రస్ఫుటం చేయడానికి, ఆర్గనైజేషనల్ స్కిల్స్ పెంచడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ఆచార్యులు జి.గిరిజా శంకర్, ఏకేఎం పవార్, కె.ఈశ్వర్‌కుమార్, మురళీకృష్ణకుమార్, పి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ

### 'నవమి' వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

**భద్రాచలం:** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 30, 31 తేదీల్లో జరగనున్న శ్రీరామనవమి, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవ వాల్‌పోస్టర్లను దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. అంతకుముందు అర్చకులు మంత్రి దంపతులకు వేదాశీర్వచనం చేయగా, ఈవో రమాదేవి స్వామివారి ప్రసాదం, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఉత్సవ ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు పొడిచేటి సీతారామానుజాచార్యులు, సీసీ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 